
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 43
శనివారం 28-10-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గొండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'


ఉత్కంఠను దాటి....
పాకిస్తాన్‌పై దక్షిణాఫ్రికా విజయం
హోరాహోరీగా సాగిన పోరు - 13లో



మరో ఐదేళ్లు...
రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, సీఈవోగా ముకేశ్ అంబానీ - 13లో


కాంగ్రెస్ ఓ చెల్లని ఫోన్
ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీని కాలం చెల్లిన ఫోన్‌గా ప్రధానమంత్రి మోదీ 'ఇండియా మొబైల్ కాంగ్రెస్ సభలో' అభివర్ణించారు.
వివరాలు 6లో ▸


పశ్చిమ బెంగాల్ మంత్రి అరెస్ట్
రేషన్ సరుకుల కుంభకోణంలో మనీ లాండరింగ్ కేసులో పశ్చిమ బెంగాల్ అటవీ శాఖ మంత్రి మల్లిక్‌ను ఈడీ అరెస్ట్ చేసింది.
వివరాలు 6లో ▸


మా దేశం నుంచి వెళ్లిపోవాలి
తమ దేశం నుంచి భారత సైనికులు వెంటనే వెళ్లిపోవాలని మాల్దీవుల కొత్త అధ్యక్షుడు మొహమ్మద్ మొయిజ్జు వ్యాఖ్యానించారు.
వివరాలు 6లో ▸


మానవత్వం మేల్కొనేదెప్పుడు?
పాలస్తీనాలోని గాజాలో కొనసాగుతున్న రక్తపాతం, తీవ్ర హింసాత్మక ఘటనలపై కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ ఆందోళన చెందారు.
వివరాలు 6లో ▸

అభివృద్ధికి రోడ్ మ్యాప్

నగరాలు, పట్టణాల్లో రహదారుల అభివృద్ధిపై దృష్టి
ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- వర్షాకాలం ముగిసింది.. పనుల సీజన్ మొదలైంది.. ప్రత్యేక డ్రైవ్ కింద కార్పొరేషన్లలో ప్రాజెక్టులు, రోడ్ల పనులు
- నీటి సంరక్షణ పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలి
- తీర ప్రాంత పరిశ్రమల్లో డీ శాలినేషన్ చేసిన సముద్రపు నీటిని వినియోగించేలా ప్రోత్సహించాలి
- విజయవాడలో అంబేడ్కర్ స్మృతి వనం వేగంగా పూర్తి చేయాలి
- కాలువల శుభ్రత విషయంలో అత్యాధునిక యంత్రాలు వినియోగించాలి
- రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల ద్వారా టిడ్కో ఇళ్ల నిర్వహణపై పర్యవేక్షణ
- గోదావరిపై హేవ్‌లాక్ వంతెనను ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దాలి
- విశాఖ కేంద్రంగా రూ.3,592 కోట్ల మేరకు అభివృద్ధి పనులు



"రాష్ట్ర వ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలి. ఆహ్లాదకర వాతావరణం, కనువిందు చేసేలా సుందరీకరణపై ప్రధానంగా దృష్టి సారించాలి. చివరి దశలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. నగరాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ, ఇతరత్రా మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధతో ప్రణాళికలు రూపొందించాలి.
- సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నగరాలు, పట్టణాల్లోని రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. వర్షాకాలం ముగిసిన నేపథ్యంలో పనుల సీజన్ మొదలైందన్నారు. వివిధ దశల్లో కొనసాగుతున్న పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు ప్రత్యేక డ్రైవ్ ద్వారా రోడ్లను సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా నీటి సంరక్షణ పద్ధతులను పాటించడం ద్వారా తాగు నీటిని ఆదా చేయాలని చెప్పారు. ఇందులో భాగంగా తీర ప్రాంతాల్లోని పరిశ్రమలు డీ–శాలినేషన్ చేసిన సముద్రపు నీటిని వినియోగించేలా ప్రోత్సహించాలని సూచించారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, రాజమండ్రి, కర్నూలు, కడప, తిరుపతి, గుంటూరు సహా వివిధ కార్పొరేషన్లలోని అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రాజెక్టులపై
మిగతా 10వ పేజీలో ▶

శుక్రవారం తిరుపతిలో నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన అశేష జనసందోహం



ప్రతిధ్వనించిన సామాజిక సాధికారత

వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్రకు రెండో రోజు బ్రహ్మరథం పట్టిన జనం

తిరుపతి, నరసాపురం, గజపతినగరం నియోజకవర్గాల్లో యాత్ర గ్రాండ్ సక్సెస్

తిరుపతిలో 17 కిలోమీటర్ల పొడవున పాదయాత్ర.. నీరాజనం పలికిన జనం

నరసాపురంలో పోటెత్తిన జనప్రవాహం.. జనసంద్రంగా మారిన గజపతినగరం

నేడు భీమిలి, బాపట్ల, ప్రొద్దుటూరు నియోజకవర్గాల్లో సామాజిక సాధికార యాత్ర

- వివరాలు 2లో

బెయిల్ కోసం బాబు అడ్డదారులు..
'నెవర్ బిఫోర్'



- హైకోర్టులో తన ట్రేడ్‌మార్క్ అస్త్రం 'నాట్ బిఫోర్' ప్రయోగం
- తన బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ జ్యోతిర్మయి విచారణ చేయకుండా అడ్డుకునే ఎత్తుగడ
- ఆమె తప్పుకుంటే ఆయన వ్యాజ్యాలు జస్టిస్ నిమ్మగడ్డ, జస్టిస్ అడుసుమిల్లి ముందుకు..

3 లో

నన్ను చంపడానికి చంద్రబాబు
కులోన్మాదుల కుట్ర



- రంగాను హత్య చేసినట్లే నన్ను కూడా చంపాలని చూశారు
- ముద్రగడను చిత్రహింసలకు గురి చేసిన వారే నాపై దాడి చేశారు
- ఆ కులస్తుల వనభోజనాల్లో నన్ను చంపితే రూ.50 లక్షలు ఇస్తామని ప్రకటించారు
- మంత్రి అంబటి రాంబాబు

10 లో

టోఫెల్ తర్ఫీదుకు కీలక అడుగు!
5 లో

'లిక్విడ్ ఇంగ్లిష్ ఎడ్జ్'తో ఒప్పందం.. టోఫెల్‌కు విద్యార్థులను సన్నద్ధం చేయడంపై ప్రభుత్వం దృష్టి

ఆరు రోజుల నష్టాలకు బ్రేక్

స్టాక్ సూచీల ఆరు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. ఇటీవల పతనంలో భాగంగా కనిష్టాలకు దిగివచ్చిన ఆటో, ఐటీ, ఫైనాన్స్, ఇంధన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీ నుంచి సానుకూల సంకేతాలు అందాయి. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 635 పాయింట్లు పెరిగి 63,783 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 202 పాయింట్లు బలపడి 19,060 వద్ద నిలిచింది. ఉదయం భారీ లాభాలతో మొదలైన సూచీలు రోజంతా అదే జోరు కనబరిచాయి.
13 లో



ప్రకృతి రైతుకు ప్రభుత్వ దన్ను

- కనీస మద్దతు ధరపై 10 నుంచి 15 శాతం అదనంగా చెల్లింపు
- 4,750 టన్నుల వడ్లు, మినుములు, శనగలు అదనపు ధరతో కొనుగోలు లక్ష్యం
- దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా మార్క్‌ఫెడ్ ద్వారా రైతన్నల ఖాతాలకు చెల్లింపులు
- టీటీడీతో రాష్ట్ర ప్రభుత్వ అవగాహన ఒప్పందంతో ప్రకృతి సేద్యానికి ఊపు



నంద్యాల(సెంట్రల్): ఇప్పటికే ప్రతీ సీజన్‌కు ముందస్తు మద్దతు ధరలతో రైతాంగానికి భరోసానిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల్ని సైతం ప్రత్యేక సాయంతో ఆదుకుంటోంది. శ్రీవారి ప్రసాదం, అన్న ప్రసాదం తయారీ నిమిత్తం టీటీడీకి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన 10 రకాల ఉత్పత్తుల్ని సరఫరా చేసేందుకు మార్క్‌ఫెడ్ ఏర్పాట్లు చేస్తోంది. ఆయా జిల్లాల్లో ప్రధానంగా పండే పంటలు, విస్తీర్ణాన్ని బట్టి కొనుగోళ్లు చేస్తారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లా నుంచి నాచురల్ ఫామింగ్ కింద సాగు చేసే 4,750 టన్నుల శనగలు, మినుములు, కందుల్ని అదనపు ధరలతో రబీ సీజన్‌లో అధికారులు కొనుగోలు చేయనున్నారు. ఈ ఏడాది నుంచి టీటీడీనే కాకుండా మరో 12 ప్రధాన ఆలయాలు సైతం కొనుగోళ్లకు ముందుకు వచ్చాయి. వీటితో పాటు అమూల్, ఫలాదా, 24 మంత్ర తదితర ప్రైవేటు సంస్థలు కూడా ఆసక్తి చూపుతుండటంతో ఏటా ప్రకృతి ఉత్పత్తుల కొనుగోళ్లు పెరిగే అవకాశం ఉంది.

15 శాతం అదనపు ధర చెల్లింపు

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కంటే 10–15 శాతం అదనపు ధరతో రైతుల నుంచి సేకరించి సరఫరా చేయబోతున్నారు. మార్కెట్ ధర ఎమ్మెస్పీ(మద్దతు ధర) కంటే తక్కువగా ఉన్నప్పుడు ఎమ్మెస్పీ కంటే 10 శాతం అదనంగా...ఎమ్మెస్పీ కంటే మార్కెట్ ధర ఎక్కువగా ఉన్నప్పుడు మార్కెట్ ధర కంటే 15 శాతం అదనంగా ప్రీమియం ధర చెల్లించేలా ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 5,556 మంది అన్నదాతలకు చెందిన 4,750 టన్నుల ఉత్పత్తుల్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో వరి–2,500 టన్నులు, మినుములు–1,500 టన్నులు, కందులు–750 టన్నులు ఉన్నాయి. రైతుల వివరాలను సీఎం యాప్ ద్వారా ఎన్‌రోల్ చేసి ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రీమియం ధర చెల్లించి పంట ఉత్పత్తులను సేకరిస్తారు. శనగలు క్వింటాల్‌కు కనీస మద్దతు ధర 2021–22 సీజన్‌లో రూ.5230 ఉండగా..రైతుల నుంచి రూ.5753 చొప్పున చెల్లించి సేకరించారు. 2022–23 సీజన్‌లో మార్కెట్ ధర అధికంగా ఉండటంతో రైతులు కోసిన వెంటనే మంచి ధరకు అమ్ముకున్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు ఉత్పత్తుల్ని నిల్వ ఉంచుకుని, ప్రాసెసింగ్ చేసి విలువ జోడించి అమ్ముకోవటంతో జిల్లా వ్యాప్తంగా కర్నూలు సోనా, నంద్యాల సోనా క్వింటా రూ.6వేల పైనే ధరను పొందారు.

నాణ్యత పరీక్షల అనంతరం సరఫరా

ఆర్బీకేల ద్వారా సేకరించిన పంట ఉత్పత్తులను జిల్లా స్థాయిలో గుర్తించిన గోదాములు, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేస్తారు. సాగు, కోత, నిల్వ సమయాల్లో ఆయా ఉత్పత్తుల నాణ్యతను నిర్ధారించుకునేందుకు మూడు దశల్లో నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు లిమిటెడ్(ఎన్‌బీఎల్) గుర్తింపు పొందిన థర్డ్ పార్టీ ల్యాబ్‌లో తనిఖీ చేస్తారు. నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా రసాయన అవశేషాలు లేని ఫైన్ క్వాలిటీ(ఎఫ్క్యూ) ఉత్పత్తులని నిర్ధారించుకున్న తర్వాతే ప్రాసెస్ చేసి టీటీడీకి సరఫరా చేస్తారు. మరోవైపు రైతుల నుంచి సేకరించిన ఉత్పత్తులను సొంతంగా ప్రాసెస్ చేసి సరఫరా చేసేందుకు నంద్యాల మండలం రాయమల్పురం దగ్గర ఇటీవలే రూ.5 కోట్ల అంచనాతో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌కు అంకురార్పణ చేశారు.

మహిళలే నిర్ణేతలు

రాష్ట్రంలో మహిళా ఓటర్లే అధికం



- మొత్తం ఓటర్లు 4,02,21,450.. మహిళా ఓటర్లు 2,03,85,851
- పురుష ఓటర్లు 1,98,31,791
- 18, 19 ఏళ్ల ఓటర్లు 2,88,155
- 2023 తుది ఓటర్ల జాబితా కన్నా 2.36 లక్షల ఓట్లు పెరుగుదల
- ప్రకటించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా
- జనవరి 1 వరకు అర్హతలున్న వారు ఓటర్‌గా నమోదుకు అవకాశం
- డిసెంబర్ 9 వరకు నమోదు, అభ్యంతరాలకు గడువు
- జనవరి 5న తుది ఓటర్ల జాబితా

14 లో

బడుగులకు ఆత్మగౌరవం విలువ చూపించిన జగన్



నరసాపురంలో సామాజిక సాధికార బస్సు యాత్ర సభలో మాట్లాడుతున్న మంత్రులు విశ్వరూప్, అప్పలరాజు, వేణు, కారుమూరి



నరసాపురం సభకు హాజరైన అశేష ప్రజానీకం

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సమాజంలో రాజసంతో జీవించే స్థితికి తెచ్చారు
- బాబు పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఎన్నో అన్యాయాలకు గురయ్యారు
- బాబు కుల అహంకారం, అధికార మదాన్ని మరచిపోలేం
- జగన్.. ఓ మత్స్యకారుడిని మంత్రిని చేశారు.. మరొకరిని పార్లమెంటుకు పంపారు
- ఆలయాల పాలక మండలిలో నాయీ బ్రాహ్మణులను డైరెక్టర్లుగా పెడుతున్నారు
- ఇదీ నిజమైన సామాజిక సాధికారత
- నరసాపురం సామాజిక సాధికారత సభలో మంత్రి సీదిరి అప్పలరాజు

నరసాపురం: సమాజంలో బడుగు వర్గాలకు ఆత్మగౌరవం కల్పించి, ఆ విలువ చూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పారు. సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక నిర్ణయాలతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సమాజంలో రాజసంతో జీవించే స్థితికి తెచ్చారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికారత బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణంలో జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. చంద్రబాబు పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఎన్నో అన్యాయాలకు, అవమానాలకు గురయ్యారని మంత్రి అప్పలరాజు చెప్పారు. అడుగడుగునా ఆయన ప్రదర్శించిన కుల అహంకారాన్ని, అధికార మదాన్ని వెనుకబడిన కులాలవారు, దళితులు ఎప్పటికీ మరచిపోలేరని అన్నారు. సీఎం వైఎస్ జగన్ అన్ని కులాలు, అన్ని వర్గాలను ఒకేలా చూస్తున్నారని, అనేక కార్యక్రమాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి పాటు పడుతున్నారని చెప్పారు. ఓ మత్స్యకారుడిని మంత్రిని చేశారని, మరో మత్స్యకారుడు మోపిదేవి వెంకటరమణను పార్లమెంటుకు పంపారని తెలిపారు. ఆలయాల పాలక మండలిలో నాయీ బ్రాహ్మణుడిని డైరెక్టర్‌గా పెట్టాలని నిబంధన పెట్టి ఆ సామాజికవర్గం గౌరవం పెంచారన్నారు. ఇది నిజమైన సామాజిక సాధికారత అని చెప్పారు. అన్ని జిల్లాల్లో హార్బర్లు నిర్మిస్తున్నారని చెప్పారు.

టీడీపీ హయాంలో కాపులే నష్టపోయారు: మంత్రి వేణుగోపాలకృష్ణ

చంద్రబాబు హయాంలో కాపులే ఎక్కువగా నష్టపోయారని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చెప్పారు. ఇప్పుడు కాపులు పవన్ భ్రమలో పడి ఇంకా నష్టపోవడానికి సిద్ధంగా లేరన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఆర్థికంగా బలోపేతం కావడానికి, సమాజంలో ముందడుగు వేయడానికి సీఎం జగన్ అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. బడుగుల పిల్లలు ఉన్నత చదువులు చదవడానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని మరింత మెరుగుపరిచారని చెప్పారు. ఓ కల్లుగీత కార్మికుడి కొడుకు చెట్టు ఎక్కకుండా, విదేశాల్లో ఉద్యోగం కోసం విమానం ఎక్కుతున్నాడంటే కారణం వైఎస్ కుటుంబమేనని తెలిపారు. అదే చంద్రబాబు ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని సగానికి తగ్గించారని, ఆయన కులం వారి కాలేజీల్లో ఫీజులు అడ్డగోలుగా పెంచుకోవడానికి అనుమతులిచ్చారని చెప్పారు.

దళితులు, బీసీలపై జగన్‌ది నిజమైన చిత్తశుద్ధి: పినిపే

మంత్రి పినిపే విశ్వరూప్ మాట్లాడుతూ దళితులు, బీసీలు, మైనార్టీల అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ది నిజమైన చిత్తశుద్ధి అని చెప్పారు. కేబినెట్‌లో, నామినేటెడ్ పోస్టుల్లో దళితులు, బీసీలకు ప్రాధాన్యత ఇచ్చారని, ఈ ప్రాధాన్యం చంద్రబాబు పాలనలో కనిపించలేదని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలని చెప్పారు.

అవినీతి లేని పాలన: మోపిదేవి

సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా, అవినీతి అన్నది లేకుండా ప్రభుత్వ పథకాలను అందిస్తూ సీఎం వైఎస్ జగన్ జనరంజక పాలన అందిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ అన్నారు. బీసీలు వెనుకబడిన వర్గాలు కాదని, సమాజానికి వెన్నెముక లాంటివారని చెప్పడమే కాకుండా, బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్న సీఎం జగన్ అని తెలిపారు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కాకపోతే చంద్రబాబు పాలన నాటి రోజులు తప్పవని చెప్పారు.

నీ పిల్లలను మొగల్తూరులో తెలుగు మీడియం చదివించు పవన్ : పేర్ని నాని

సీఎం వైఎస్ జగన్ పేదలు, బడుగు వర్గాల కోసం ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడితే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెగ బాధపడిపోయారని, ఆయన పిల్లలను సొంతూరు మొగల్తూరులో తెలుగు మీడియం స్కూల్లో చదివించవచ్చు కదా అని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. బీసీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన చర్యలు మరెవరూ చేపట్టలేరని అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నినా వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు.

ఆశలు నిజం చేసిన నాయకుడు జగన్ : ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి

ఉన్నతంగా జీవించాలన్న అట్టడుగు వర్గాల కలలను నిజం చేస్తున్న సీఎం వైఎస్ జగన్ అని ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు చెప్పారు. నరసాపురం నియోజకవర్గంలో రూ.5 వేల కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించామని, రూ.1,500 కోట్లు సంక్షేమానికి ఖర్చు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు పోతుల సునీత, వంక రవీంద్రనాథ్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల తదితరులు పాల్గొన్నారు.

ప్రతిధ్వనించిన సామాజిక సాధికారత

సాక్షి, అమరావతి/సాక్షి, తిరుపతి/సాక్షి, నరసాపురం/సాక్షి, విజయనగరం: సామాజిక సాధికారత రాష్ట్రమంతటా ప్రతిధ్వనిస్తోంది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలితాలను ప్రజల స్పందన ప్రతిబింబిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర, సభలకు పేదలు వెల్లువెత్తుతున్నారు. జగన్ వెంటే తాము అంటూ నినదిస్తున్నారు. గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో సీఎం వైఎస్ జగన్ తమకు మంచి చేశారని ప్రశంసిస్తున్నారు. మళ్లీ జగనే రావాలి జగనే కావాలి అంటూ ఒకే గళమై నినదిస్తున్నారు. శుక్రవారం రెండో రోజు యాత్రలోనూ ఇదే చైతన్యం వెల్లువెత్తింది. రాష్ట్రంలో గత 53 నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు, అగ్రవర్ణ పేదలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మంచిని వివరించి.. పేదలందరినీ ఏకం చేయాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ చేపట్టిన ఈ యాత్ర శుక్రవారం తిరుపతి, పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం, విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గాల్లో జరిగింది. మూడు నియోజకవర్గాల్లోనూ యాత్ర సాగిన రహదారులు జనంతో కిటకిటలాడాయి. 'సామాజిక న్యాయ నిర్మాత వర్ధిల్లాలి.. జై జగన్' అన్న నినాదాలతో ప్రతిధ్వనించాయి. సీఎం వైఎస్ జగన్ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను నేతలు వివరించిన ప్రతిసారీ ప్రజలు సీఎం జగన్‌కు జేజేలు పలికారు. మళ్లీ జగనే కావాలి అంటూ నినదించారు. సామాజిక సాధికార యాత్ర మూడో రోజున రాయలసీమలో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు, కోస్తాలో బాపట్ల జిల్లా బాపట్లలో, ఉత్తరాంధ్రలో విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గాల్లో జరుగుతుంది.

తిరుపతిలో మహా పాదయాత్ర

రాష్ట్రమంతటా సామాజిక సాధికార యాత్రను బస్సు ద్వారా నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ, తిరుపతిలో మహా పాదయాత్రలా మారింది. ఈ యాత్రకు ప్రజలు వెల్లువలా రావడంతో వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి సూచనతో వైఎస్సార్‌సీపీ జైత్రయాత్రగా సాగింది. ముందుగా తిరుపతి నగరంలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నేతలు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అక్కడి నుంచి నగరంలోని 50 వార్డుల మీదుగా 17 కిలోమీటర్ల పొడవున పాదయాత్ర చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలు భారీ ఎత్తున కదలివచ్చారు. గ్రూప్ థియేటర్స్ ముందు ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం జన సముద్రంలా కనిపించింది. వైఎస్సార్‌సీపీని 175 స్థానాల్లో గెలిపిస్తాం.. వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకుంటాం అంటూ ప్రజలు నినదించారు.

నరసాపురంలో జనమే జనం

నరసాపురంలో జరిగిన సామాజిక సాధికార యాత్ర ప్రజలే నాయకత్వం వహించారా అన్నట్లుగా సాగింది. నరసాపురం నియోజకవర్గం మొగల్తూరు కాలువ గట్టు సెంటర్‌లో మంత్రులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి రామన్నపేట మీదుగా నరసాపురం వరకు సాగిన ఈ యాత్రకు జనం ఉప్పెనలా తరలివచ్చారు. 17 కిలోమీటర్ల మేర 20 గ్రామాల మీదుగా యాత్ర సాగింది. అడుగడుగునా ప్రజలు సీఎం జగన్‌కు జేజేలు పలికారు. మంత్రులకు పూలమాలలతో స్వాగతం పలికారు. సాయంత్రం 6 గంటలకు నరసాపురం పట్టణంలో నిర్వహించిన సభకు జనం పోటెత్తారు.

విజయనగరంలో బస్సు యాత్ర, బైక్ ర్యాలీ

విజయనగరం జిల్లా కేంద్రంలో సామాజిక సాధికార బస్సు యాత్ర శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. నాయకులు ప్రయాణించిన బస్సును అనుసరిస్తూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. యాత్రకు అడుగడుగునా ప్రజలు సంఘీభావం ప్రకటించారు. విజయనగరం ఆర్టీసీ జంక్షన్, ఆర్ అండ్ బీ జంక్షన్, కలెక్టరేట్ జంక్షన్, గజపతినగరం నియోజకవర్గం గొట్లాం, గజపతినగరంలో బాణసంచా కాల్చుతూ ఘనంగా స్వాగతం పలికారు. పులివేషాలు, సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. పార్టీ నేతలు గొట్లాం గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. గజపతినగరంలోని మెంటాడ రోడ్డులో బహిరంగ సభ జన సంద్రాన్ని తలపించింది.

జగన్ మామయ్యకు థ్యాంక్స్ చెప్పండి

'మా స్కూలు ఇంతకు ముందు చదువుకోవడానికి ఏమాత్రం బాగుండేది కాదు. జగన్ మామయ్య సీఎం అయ్యాక మా స్కూల్లో అన్ని సౌకర్యాలు కల్పించారు. మేము చదువుకోవడానికి అన్నీ సమకూర్చిన జగన్ మామయ్యకు థ్యాంక్స్ చెప్పండి' అంటూ విజయనగరం జిల్లా గొట్లాం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు చెప్పారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా మంత్రి బొత్స, ఇతర నేతలు శుక్రవారం గొట్లాం గ్రామం వచ్చారు. ఈ సందర్భంగా 'నాడు–నేడు మన బడి' కార్యక్రమంలో వైఎస్ జగన్ ప్రభుత్వం తీర్చిదిద్దిన గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తాము చదువుకోవడానికి అన్నీ సమకూర్చిన జగన్ మామయ్యకు థ్యాంక్స్ చెప్పండంటూ మంత్రి బొత్సకు చెప్పారు.

సకల జనుల సంక్షేమమే సీఎం జగన్ అజెండా

తిరుపతి సామాజిక సాధికారత సభలో టీటీడీ చైర్మన్ భూమన



తిరుపతి సభకు భారీగా హాజరైన జనసందోహం. (ఇన్‌సెట్‌లో) యాత్ర ప్రారంభం సందర్భంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి. చిత్రంలో విజయసాయిరెడ్డి తదితరులు

సాక్షి, తిరుపతి: సకల జనుల సంక్షేమమే అజెండాగా.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అండగా నిలిచి, వారికి రాజ్యాధికారాన్ని ఇచ్చిన నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి చరిత్రలో నిలిచిపోతారని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి చెప్పారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రంలో సామాజిక విప్లవం వచ్చిందని, బలహీన వర్గాలకు అధికారం ఇచ్చిన పార్టీగా వైఎస్సార్‌సీపీ చరిత్ర తిరగరాసిందని అన్నారు. శుక్రవారం తిరుపతిలో జరిగిన సామాజిక సాధికారత యాత్ర సభలో కరుణాకర్‌రెడ్డి మాట్లాడారు. రాజకీయాల్లోకి వచ్చి పదేళ్లలో అంచెలంచెలుగా ఎదిగి, తండ్రి రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తున్న వ్యక్తి సీఎం జగన్ అని చెప్పారు. పైరవీలతో కాకుండా సీఎం జగన్ ఫైటర్‌గా రాజకీయాల్లో గెలిచారన్నారు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలు అంటూ బడుగు వర్గాలను అక్కున చేర్చుకున్న సీఎం జగన్ అని చెప్పారు. ఏ ప్రభుత్వంలో జరగనంత సంక్షేమం ఈ నాలుగున్నరేళ్లలో జరిగిందని తెలిపారు. తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధితో 38 వేల ఎకరాలను అందుబాటులోకి తెచ్చారని, గత 40 ఏళ్లలో ఎక్కడా లేని అభివృద్ధి తిరుపతిలో చేసి చూపించారని వివరించారు. సీఎం వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలతో పేద వారిని అభివృద్ధిలోకి తెచ్చారని, బడుగులు తలెత్తుకొనేలా చేశారని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చెప్పారు. అందుకే రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలంతా సీఎం జగన్‌ను దేవుడిగా పూజిస్తున్నారని తెలిపారు.

పెత్తందారులపై యుద్ధంలో పేదలంతా జగనన్నకు తోడు: ఎంపీ గురుమూర్తి

పెత్తందారులకు, పేదవారికి జరిగే ఈ యుద్ధంలో పేదలంతా వైఎస్ జగన్‌కి అండగా ఉన్నారని తిరుపతి ఎంపీ గురుమూర్తి చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలుగన్న సమాజాన్ని వైఎస్ జగన్ నిర్మిస్తున్నారని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమం, రాజ్యాధికారం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం జగన్‌కు మనమంతా అండగా నిలవాలన్నారు.

బీసీలకు జగన్ పెద్దపీట : ఎమ్మెల్యే అనిల్

సీఎం వైఎస్ జగన్ పాలనలో బీసీలకు పెద్దపీట వేశారని మాజీ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ చెప్పారు. డిప్యూటీ సీఎం పదవులతో పాటు కార్పొరేషన్, మార్కెట్ కమిటీలు ఇతర నామినేషన్ పదవుల్లో 60 శాతం పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే ఉన్నారని చెప్పారు. స్టేజీ ఎక్కి నా బీసీ, నా ఎస్సీ, నా ఎస్టీ, నా మైనారిటీ అని చెప్పే దమ్ము ఒక్క సీఎం జగన్‌కే ఉందన్నారు.

అందరి అభ్యున్నతికి సీఎం జగన్ కృషి : భూమన అభినయ్

ఓ పార్టీ అణగారిన వర్గాలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే వాడుకొంటే.. అన్ని వర్గాలను సొంత వారిలా భావించి వారి అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం జగన్ అని తిరుపతి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ చెప్పారు. అట్టడుగున ఉన్న వారికి క్రియాశీలక రాజకీయ ప్రాధాన్యత ఇచ్చిన వ్యక్తి జగన్ అని వివరించారు.

వైఎస్ జగన్ మైనార్టీలను కడుపులో పెట్టుకుని చూసుకున్నారు

మైనార్టీలను సీఎం జగన్ కడుపులో పెట్టుకుని చూసుకుంటున్నారని వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ బాషా చెప్పారు. మైనార్టీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చంద్రబాబు మోసం చేస్తే, సీఎం జగన్ ఇచ్చిన హామీలకు అదనంగా మంచి చేశారని అన్నారు.

ముఖ్యమంత్రి జగన్ తెచ్చింది సామాజిక విప్లవం

మరో 25 ఏళ్లు జగనే సీఎం

- వైఎస్సార్‌సీపీతోనే బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు
- చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో చేసింది శూన్యం
- వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి

సాక్షి, తిరుపతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సామాజిక విప్లవం తెచ్చారని రాజ్యసభ సభ్యుడు, దక్షిణ కోస్తా జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి చెప్పారు. అన్ని వర్గాలకు సంక్షేమాన్ని అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డే మరో 25 ఏళ్ల రాష్ట్రానికి ముఖ్యమంత్రి అని తెలిపారు. రెండో రోజు సామాజిక సాధికార యాత్రలో భాగంగా శుక్రవారం విజయసాయిరెడ్డి తిరుపతిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. గత నాలుగున్నరేళ్లలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీ, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలో మరే ఇతర రాష్ట్రంలోనూ జరగలేదన్నారు. తాము చేపట్టింది సాధికారత బస్సు యాత్ర మాత్రమే కాదని, సాధికారత విప్లవ యాత్ర అని అన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలు వైఎస్సార్‌సీపీతోనే ఉన్నారని చెప్పారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదని చెప్పారు.

అవినీతి రహిత సంక్షేమాన్ని సాధ్యం చేసిన జగన్

- జగన్ పాలనలో ఇలాంటి అద్భుతాలు ఎన్నో చూస్తున్నాం
- పైసా అవినీతి లేకుండా లక్షల కోట్లు బీదల ఖాతాల్లో జమ
- టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలకు, డబ్బులిచ్చిన వారికే పథకాలు
- ఇప్పుడు అర్హులైతే చాలు.. సంక్షేమ పథకాలను అందిస్తున్నారు
- ప్రజల అవస్థలు తప్పించడానికి భూముల రీసర్వే
- ఏ రైతునూ సర్వే రాళ్లు, పాసు పుస్తకం కోసం రూపాయి కూడా అడగలేదు
- సామాజిక సాధికార సభలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



గజపతినగరంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, చిత్రంలో ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు



గజపతినగరంలో బహిరంగ సభకు హాజరైన అశేష జన సందోహం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: 'సంక్షేమ పథకాలను బీదలకు నేరుగా అందించలేకపోతున్నామని గతంలో ఓ ప్రధాన మంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యలో ఉన్న వారు తినేస్తుంటే ఏమీ చేయలేక చేతులెత్తేశారు. కానీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పైసా అవినీతి జరగకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా లక్షల కోట్లు బీదల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారు. ఇలా అవినీతి రహిత సంక్షేమాన్ని అందిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ మాత్రమే. వైఎస్ జగన్ పాలనలో ఇలాంటి అద్భుతాలు ఎన్నో చూస్తున్నాం' అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం విజయనగరం జిల్లా గజపతినగరంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అధ్యక్షతన జరిగిన సభలో ధర్మాన ప్రసంగించారు. గత టీడీపీ పాలనలో పచ్చ జెండా కట్టిన వాడికి, జన్మభూమి కమిటీలకు, డబ్బులిచ్చిన వారికే పథకాలు అందేవని మంత్రి ధర్మాన చెప్పారు. ఇప్పుడు అర్హులైతే చాలు పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని వివరించారు. ఎక్కడా ఏ అధికారీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్త నయా పైసా లంచం అడిగిన దాఖలాల్లేవన్నారు. వందేళ్ల క్రితం బ్రిటిష్ హయాంలో జరిగిన భూసర్వేతో కలుగుతున్న అవస్థల నుంచి తప్పించడానికి తమ ప్రభుత్వం రీసర్వే చేపట్టిందన్నారు. ఏ రైతునూ సర్వే రాళ్లు, పాసు పుస్తకం కోసం ఒక్క రూపాయి కూడా అడగలేదన్నారు. ఇటువంటి పరిపాలనే కదా ప్రజలు కోరుకుంటారని చెప్పారు. రైతులను, డ్వాక్రా అక్కచెల్లెమ్మలను, యువతను నమ్మించి వంచించిన చంద్రబాబు ముఠాకు ఎవరైనా ఓట్లేస్తారా అని ప్రశ్నించారు. టీడీపీ పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకోలేక, వైఎస్సార్‌సీపీ పాలనలో చూపించడానికి లోపాల్లేక.. దేశమంతా పెరిగిన కరెంట్ బిల్లులు, పెట్రోల్ ధరలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నట్లు చూపిస్తున్నారని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న మన రాష్ట్ర ప్రజలను అడిగితే వాస్తవమేమిటో చెబుతారని అన్నారు. దశాబ్దాలుగా వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంత దశాదిశా మార్చడానికి, ఇక్కడి పిల్లల భవిష్యత్తు బాగు చేయడానికి విశాఖను పరిపాలన రాజధాని చేయాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. విశాఖలో రాజధాని వద్దని చంద్రబాబుకు ఎవరు చెప్పారని ప్రశ్నించారు. తన పాలనలో ఏనాడూ ఏ ఒక్క మేలూ చేయకపోయినా ఉత్తరాంధ్ర ప్రజలు టీడీపీని ఆదరించారని, వారినే చంద్రబాబు మోసం చేస్తున్నారని అన్నారు. బాబుకు, టీడీపీకి తగిన బుద్ధి చెప్పాలని, అన్ని వర్గాల సంక్షేమ సారథి వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, పాముల పుష్ప శ్రీవాణి, కంబాల జోగులు, బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్ బాబు, ఇందుకూరి రఘురాజు, పాలవలస విక్రాంత్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ నాయకత్వాన్ని నిలబెట్టుకోవాలి : బొత్స

ప్రజల ఆర్థిక, సామాజిక పరిస్థితులను మెరుగుదిద్దుతున్న సీఎం వైఎస్ జగన్ నాయకత్వాన్ని నిలబెట్టుకోవాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స చెప్పారు. రాష్ట్రంలో సామాజిక సాధికారత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమైందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు. నిష్పక్షపాతంగా అర్హత ఒక్కటే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. చంద్రబాబు గిరిజనులకు, మైనార్టీలకు తీరని అన్యాయం చేశారని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చంద్రబాబు చేసిన మోసాన్ని మరిచిపోలేమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాతే ఈ వర్గాలకు మేలు చేకూరిందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బొబ్బిలి నియోజకవర్గంలో బీసీలకు టికెట్టు ఇచ్చే దమ్ము చంద్రబాబుకు ఉందా అని ఎమ్మెల్యే అప్పలనర్సయ్య సవాలు విసిరారు. యాత్ర సందర్భంగా మీడియాతో బొత్స మాట్లాడుతూ.. చంద్రబాబు నిత్య నయవంచకుడు అని, సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలోని అన్ని వర్గాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు.

క్లుప్తంగా...

'సిట్' కాల్ రికార్డుల పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

31న తీర్పు వెల్లడించనున్న న్యాయమూర్తి

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేసిన సిట్ అధికారుల ఫోన్ కాల్ రికార్డింగులు ఇవ్వాలన్న పిటిషన్‌పై విజయవాడ ఏసీబీ న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. న్యాయమూర్తి ఈ నెల 31న తీర్పును వెల్లడించనున్నారు. సిట్ అధికారుల ఫోన్ కాల్ రికార్డుల డేటా కావాలని చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై ఏసీబీ న్యాయస్థానంలో ఇరుపక్షాల మధ్య వాడివేడిగా సాగిన వాదనలు శుక్రవారం ముగిశాయి. చంద్రబాబును అరెస్ట్ చేసే సమయంలో శాంతిభద్రతల పరిస్థితుల దృష్ట్యా పోలీసు అధికారులు పూర్తి బందోబస్తు ఏర్పాట్లు చేశారని సీఐడీ తరఫు న్యాయవాది స్పెషల్ పీపీ న్యాయస్థానానికి వివరించారు. ఆ కాల్ రికార్డులు తీసుకోవాల్సిన అవసరం చంద్రబాబుకు లేదన్నారు. దర్యాప్తు అధికారులను వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టేందుకే ఆ కాల్ రికార్డుల డేటా కోరుతున్నారని చెప్పారు. కాబట్టి చంద్రబాబు పిటిషన్‌ను కొట్టివేయాలని న్యాయస్థానాన్ని కోరారు. చంద్రబాబు తప్పు చేయలేదని నిరూపించేందుకు కాల్ రికార్డులు కీలకమని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. అది అధికారుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగకరం కాదన్నారు.

జగన్‌పై దాడి కేసు విచారణ వాయిదా

విశాఖలీగల్: విశాఖ విమానాశ్రయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి కేసు విచారణ డిసెంబర్ 15వ తేదీకి వాయిదా పడింది. ఇప్పటికే హైకోర్టు స్టే ఇవ్వడంతో డిసెంబర్ 15వ తేదీకి విచారణ వాయిదా వేస్తున్నట్లు ఎన్ఐఏ కోర్టు న్యాయమూర్తి ప్రకటించారు.

నాకు బెయిల్ ఇవ్వండి

హైకోర్టులో జనుపల్లి శ్రీనివాసరావు పిటిషన్

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు విశాఖపట్నం విమానాశ్రయంలో ఆయనపై హత్యాయత్నానికి పాల్పడ్డ జనుపల్లి శ్రీనివాసరావు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. విశాఖలోని ఎన్ఐఏ కోర్టు తనకు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరిస్తూ జారీచేసిన ఉత్తర్వులను సవాలుచేస్తూ క్రిమినల్ అప్పీల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై శుక్రవారం న్యాయమూర్తులు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ అడుసుమిల్లి వెంకట రవీంద్రబాబు ధర్మాసనం విచారణ జరిపింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఎన్ఐఏను ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 3కి వాయిదా వేసింది.

'హెబియస్ కార్పస్' దాఖలుకు నిరాకరణ

సాక్షి, అమరావతి : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబును అక్రమంగా నిర్బంధించారని, ఆయన విడుదలకు ఆదేశాలివ్వాలని విజయవాడ కోర్టుకు చెందిన ఓ న్యాయవాది శుక్రవారం హైకోర్టును అభ్యర్థించారు. దీనిపై తాను హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయాలనుకుంటున్నానని, అందుకు అనుమతివ్వాలని కోరారు. చంద్రబాబును రిమాండ్‌కు పంపుతూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు ఎంత మాత్రం చెల్లవని, ఈ కేసులో పూర్తి వివరాలను కోర్టు ముందుంచుతానన్నారు. అయితే హెబియస్ కార్పస్ దాఖలు చేసేందుకు హైకోర్టు నిరాకరించింది.

సీఐడీ మా పార్టీ బ్యాంకు ఖాతాల వివరాలడుగుతోంది..

- సీఐడీ నోటీసులను సవాలు చేస్తూ హైకోర్టులో టీడీపీ పిటిషన్లు

సాక్షి, అమరావతి : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో 2014 జూన్ నుంచి తెలుగుదేశం పార్టీ బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలను సమర్పించాలంటూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడాలకు సీఐడీ జారీ చేసిన నోటీసులను సవాలు చేస్తూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య శుక్రవారం హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలను న్యాయవాది జీవీఎల్ మూర్తితో దాఖలు చేయించారు. వీటిపై అత్యవసర విచారణ జరపాలని రామయ్య తరఫున మరో న్యాయవాది గింజుపల్లి సుబ్బారావు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయిని కోరారు. అయితే జీవీఎల్ మూర్తి వకాలత్ దాఖలు చేసి ఉండటంతో ఆమె ఈ వ్యాజ్యాల విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. దీంతో ఈ వ్యాజ్యాలను తగిన బెంచ్ ముందుంచేందుకు చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని తెలుగుదేశం న్యాయవాదులు కోరారు. అత్యవసర విచారణకు అభ్యర్థించారు. అయితే అత్యవసర విచారణకు హైకోర్టు నిరాకరించింది.

బెయిల్ కోసం బాబు అడ్డదారులు..

'నెవర్ బిఫోర్'

హైకోర్టులో తన ట్రేడ్‌మార్క్ అస్త్రం 'నాట్ బిఫోర్' ప్రయోగం

- తన బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ జ్యోతిర్మయి విచారణ చేయకుండా అడ్డుకునే ఎత్తుగడ
- పార్టీతో, లీగల్ సెల్‌తో సంబంధం లేని మూర్తితో కన్సెంట్ వకాలత్ దాఖలు
- మూర్తి వెనుక ఓ ఎల్లో మీడియా చానెల్ ఓనర్, ఒక విశ్రాంత న్యాయమూర్తి
- నిబంధనల ప్రకారం నడుచుకునే జడ్జిగా జస్టిస్ జ్యోతిర్మయికి పేరు
- మూర్తి సతీమణి తనకు తెలిసి ఉండటంతో నైతిక విలువలకు లోబడి విచారణ నుంచి తప్పుకున్న న్యాయమూర్తి
- అందుకే ఆమె ముందు నాట్ బిఫోర్ అస్త్రం
- ఆమె నైతిక విలువలనే అవకాశంగా మలుచుకున్న చంద్రబాబు
- ఆమె తప్పుకుంటే ఆయన వ్యాజ్యాలు జస్టిస్ నిమ్మగడ్డ, జస్టిస్ అడుసుమిల్లి ముందుకు
- అయితే ఊహించని విధంగా ఉత్తర్వులు జారీ చేసిన జస్టిస్ జ్యోతిర్మయి
- సోమవారం విచారణకు వచ్చేందుకు వీలుగా ఈ కేసును సీజే ముందుంచాలని ఆదేశం
- దీంతో కంగుతిన్న చంద్రబాబు న్యాయవాదులు



సాక్షి, అమరావతి:

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచేసి జైలుపాలైన చంద్రబాబు ఇప్పుడు దాని నుంచి ఎలాగైనా బయటపడాలని బెయిల్ కోసం అన్ని అడ్డదారులు తొక్కుతున్నారు. ఇందుకోసం గతం నుంచి తాను అనుసరిస్తున్న తన ట్రేడ్‌మార్క్ అస్త్రం 'నాట్ బిఫోర్' ను ఆయన మరోసారి బయటకు తీశారు. తమ పార్టీకి, తమ లీగల్ సెల్‌కు ఏ సంబంధం లేని జీవీఎల్ మూర్తి అనే న్యాయవాదిని తెరపైకి తెచ్చారు. ఆయనతో తన తరఫున చంద్రబాబు కన్సెంట్ వకాలత్ (అప్పటికే దాఖలు చేసిన కేసులో వకాలత్ వేసిన న్యాయవాది అనుమతితో మరో న్యాయవాది కూడా వకాలత్ దాఖలు చేయడం) దాఖలు చేయించారు. చంద్రబాబు తరఫు న్యాయవాది జి.బసవేశ్వరరావు వకాలత్ వేసి ఉండగానే.. మూర్తితో వకాలత్ దాఖలు చేయించడం గమనార్హం. సాధారణంగా ఇలా వకాలత్ దాఖలు చేసిన కేసులో ఏ మాత్రం సంబంధం లేని మరో న్యాయవాది వకాలత్ దాఖలు చేసేందుకు ఏ న్యాయవాది ఒప్పుకోడు. కాగా చంద్రబాబు తరఫున వకాలత్‌లు దాఖలు చేసిన బసవేశ్వరరావు గానీ, మూర్తి గానీ వాదనలు వినిపించకపోవడం ఇందులో అసలు ట్విస్టు. శుక్రవారం జరిగిన విచారణకు మూర్తి రాలేదు కూడా. దీన్ని బట్టి చంద్రబాబు ఇక్కడ మూర్తిని ఓ నిర్దిష్ట ప్రయోజనం నిమిత్తం వాడుకోవాలని నిర్ణయించి, ఆయనతో వకాలత్ దాఖలు చేయించారని ఇట్టే అర్థమైపోతోంది.

మూర్తి వెనుక ఉంది వారే..

జీవీఎల్ మూర్తితో వకాలత్ దాఖలు చేయించడం ద్వారా నిబంధనలకు అనుగుణంగా, ముక్కుసూటిగా నడుచుకుంటారనే పేరున్న న్యాయమూర్తి జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి ముందు తన బెయిల్ పిటిషన్‌ను రాకుండా చేసేందుకు చంద్రబాబు కుట్ర పన్నారు. జస్టిస్ జ్యోతిర్మయి ముందు ఎవరు 'నాట్ బిఫోర్' న్యాయవాదులు ఉన్నారో ముందుగానే తెలుసుకుని, అందుకనుగుణంగా మూర్తితో వకాలత్ దాఖలు చేయించారు. వాస్తవానికి ఈ మూర్తిది కూడా చంద్రబాబు సామాజికవర్గమే. పెద్దగా ప్రాక్టీస్ ఉన్న న్యాయవాది కాదు. చిన్న చిన్న కేసులు, ఉద్యోగ వివాదాలకు సంబంధించిన కేసులను వాదిస్తుంటారు. ఎప్పుడూ టీడీపీ కేసులను కూడా వాదించింది లేదు. కాగా ఎల్లో మీడియాకు చెందిన ఓ న్యూస్ చానెల్ యజమానికి మూర్తి అత్యంత సన్నిహితుడు. జస్టిస్ జ్యోతిర్మయి ముందు మొత్తం నలుగురు న్యాయవాదులు 'నాట్ బిఫోర్'గా ఉన్నారు. ఈ నలుగురిలో ముగ్గురు న్యాయవాదులు తమ ఉచ్చులోకి వచ్చే పరిస్థితి లేకపోవడంతో తమవాడే అయిన మూర్తిని చంద్రబాబు అండ్ కో విజయవంతంగా తమవైపు తిప్పుకుంది. ఎల్లో మీడియా న్యూస్ చానెల్ యజమాని, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి.. ఈ విషయంలో మూర్తిని ఒప్పించారు. అంతేకాకుండా చంద్రబాబు అండ్ కో ఆయనకు భారీ మొత్తంలో ఫీజును ఆశగా చూపింది.

జస్టిస్ నిమ్మగడ్డ లేదా జస్టిస్ అడుసుమిల్లి..

ప్రస్తుతం హైకోర్టుకు దసరా సెలవులు. ఈ నేపథ్యంలో అత్యవసర కేసులను విచారించేందుకు న్యాయమూర్తులు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ అడుసుమిల్లి వెంకట రవీంద్రబాబు, జస్టిస్ జ్యోతిర్మయిలు వెకేషన్ జడ్జీలుగా వ్యవహరిస్తున్నారు. జస్టిస్ జ్యోతిర్మయి విచారణ నుంచి తప్పుకుంటే చంద్రబాబు బెయిల్ పిటిషన్, మధ్యంతర బెయిల్ పిటిషన్లు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు లేదా జస్టిస్ అడుసుమిల్లి రవీంద్ర బాబు ముందుకు వస్తాయి. చంద్రబాబు అండ్ కో కూడా ఇదే ఉద్దేశంతో మూర్తితో వకాలత్ దాఖలు చేయించి తమ ప్లాన్‌ను పక్కాగా అమలు చేసింది. అయితే జస్టిస్ నిమ్మగడ్డ లేదా జస్టిస్ అడుసుమిల్లిల్లో ఎవరికి చంద్రబాబు కేసును అప్పగించాలన్నది పూర్తిగా ప్రధాన న్యాయమూర్తి విచక్షణాధికారంపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం సెలవులు కావడంతో సీజే అందుబాటులో లేరు. సోమవారం నుంచే హైకోర్టు తిరిగి తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. ఎప్పుడైతే జస్టిస్ జ్యోతిర్మయి ఈ వ్యాజ్యాలను సోమవారం నాడు విచారణకు వచ్చేందుకు వీలుగా ప్రధాన న్యాయమూర్తి ముందుంచాలని తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారో అప్పుడే చంద్రబాబు అండ్ కో గతుక్కుమంది. అప్పటికే ఆన్‌లైన్‌లో ఉన్న చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, కోర్టు హాలులో ఉన్న మరో సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్‌లు వెంటనే జోక్యం చేసుకున్నారు. సోమవారం అనే పదాన్ని ఉత్తర్వుల నుంచి తొలగించాలని జస్టిస్ జ్యోతిర్మయిని కోరారు. కేసును తగిన బెంచ్ ముందు ఉంచేందుకు వీలుగా ఫైల్‌ను సీజే ముందు ఉంచాలని మాత్రమే ఉత్తర్వుల్లో పేర్కొనాలన్నారు. లేకపోతే రిజిస్ట్రీ ముందు తాము సీజే అనుమతి కోసం అభ్యర్థించలేమన్నారు. అయితే వారి అభ్యర్థన పట్ల న్యాయమూర్తి జోతిర్మయి సుముఖత వ్యక్తం చేయలేదు. రిజిస్ట్రీ ముందు అత్యవసర విచారణ నిమిత్తం అభ్యర్థించేందుకు 'సోమవారానికి విచారణ వాయిదా' అనేది ఎంత మాత్రం అడ్డంకి కాదని తేల్చిచెప్పారు. చట్ట ప్రకారం ఉన్న ప్రత్యామ్నాయాలను ఉపయోగించుకోవచ్చునని తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో చేసేదేమీ లేక చంద్రబాబు న్యాయవాదులు ఉసూరుమంటూ కోర్టు బయటకు వచ్చారు. ఆ వెంటనే రిజిస్ట్రార్ వద్దకు వచ్చారు. చంద్రబాబు బెయిల్‌ను మరో న్యాయమూర్తికి నివేదించేందుకు వీలుగా సీజే అనుమతి తీసుకోవాలని రిజిస్ట్రార్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చినా వారి పప్పులు ఉడకలేదు.

19 నుంచే వ్యూహానికి పదును..

కాగా వాస్తవానికి చంద్రబాబు అండ్ కో 'నాట్ బిఫోర్' అస్త్రాన్ని తన బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా ప్రయోగించాలని గతంలోనే నిర్ణయించింది. అయితే దానిని ఈ నెల 19న నుంచే అమలు చేయడం ప్రారంభించింది. 19న చంద్రబాబు బెయిల్ పిటిషన్, మధ్యంతర బెయిల్ కోసం వేసిన అనుబంధ పిటిషన్ జస్టిస్ సురేష్‌రెడ్డి ముందుకు వచ్చాయి. చంద్రబాబు అనారోగ్య కారణాలను సాకుగా చూపుతూ ఆయనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలంటూ ఆయన తరఫు సీనియర్ న్యాయవాదులు లూథ్రా, దమ్మాలపాటి గట్టిగా వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి జోక్యం చేసుకుని, సుప్రీంకోర్టు చంద్రబాబు చేసిన మధ్యంతర బెయిల్ అభ్యర్థన పట్ల సానుకూలంగా స్పందించలేదని జస్టిస్ సురేష్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ పట్ల సానుకూలంగా స్పందించని నేపథ్యంలో తాను కూడా మధ్యంతర బెయిల్ ఇవ్వలేనని జస్టిస్ సురేష్‌రెడ్డి స్పష్టంగా చెప్పేశారు. దీంతో భోజన విరామం తర్వాత వ్యూహాన్ని మార్చేసిన చంద్రబాబు న్యాయవాదులు బెయిల్ పిటిషన్, మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను వెకేషన్ కోర్టు ముందు పోస్ట్ చేయాలని న్యాయమూర్తిని కోరారు. ఇందుకు జస్టిస్ సురేష్‌రెడ్డి అంగీకరించి ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

పలుకుబడితో ముందే తెలుసుకుని..

కాగా చంద్రబాబు న్యాయవాదులు తమ వ్యూహం ఎందుకు మార్చుకున్నారంటే వెకేషన్ కోర్టుల్లో ఎవరెవరు జడ్జీలు ఉండబోతున్నారో తమ పలుకుబడిని ఉపయోగించి ముందుగానే తెలుసుకోగలిగారు. ఆ వెకేషన్ కోర్టులో జస్టిస్ జ్యోతిర్మయి కూడా ఉన్నారని నిర్ధారించుకున్నారు. వాస్తవానికి వెకేషన్ కోర్టులో ఏ న్యాయమూర్తులు ఉండబోతున్నారనది చివరి నిమిషం వరకు బయటకు వచ్చే అవకాశం ఉండదు. అయితే వ్యవస్థలను మేనేజ్ చేయగలిగిన చంద్రబాబు అండ్ కో వెకేషన్ కోర్టులో ఎవరెవరు ఉండబోతున్నారో ముందుగానే తెలుసుకుంది. దానికి అనుగుణంగానే తమ వ్యూహాలకు పదును పెట్టింది. జస్టిస్ జ్యోతిర్మయి ముందు ఎవరెవరు నాట్ బిఫోర్‌గా ఉన్నారో తెలుసుకోగలిగింది. నలుగురు న్యాయవాదులు ఉన్నట్లు తెలుసుకుని, అందులో తమ సామాజిక వర్గానికే చెందిన జీఎల్ఎన్ మూర్తితో ఆట మొదలుపెట్టింది. అయితే ఆటలో చివరకు ఓటమే ఎదురైంది.

నైతిక విలువలకు కట్టుబడ్డ జస్టిస్ జ్యోతిర్మయి

కాగా మూర్తి సతీమణి ఇందిరా ప్రియదర్శిని కింది కోర్టులో జడ్జిగా పనిచేస్తున్నారు. న్యాయాధికారి కావడంతో ఎంతో కాలంగా ఆమె జస్టిస్ జ్యోతిర్మయికి తెలుసు. తనకు మూర్తి సతీమణితో పరిచయం ఉన్న నేపథ్యంలో హైకోర్టులో మూర్తి తన ముందు దాఖలు చేసే కేసులను విచారించకూడదని నైతిక విలువలకు కట్టుబడి జస్టిస్ జ్యోతిర్మయి నిర్ణయం తీసుకున్నారు. అందుకనుగుణంగా మూర్తిని తన నాట్ బిఫోర్ జాబితాలో చేర్చారు. అయితే ఆమె నైతిక విలువలనే చంద్రబాబు ఓ అవకాశంగా మలుచుకున్నారు. ఆమె ముందు తన బెయిల్ పిటిషన్ రాకుండా చేసేందుకు మూర్తితో చంద్రబాబు విజయవంతంగా వకాలత్ దాఖలు చేయించారు. మూర్తి వకాలత్ వేస్తే ఆ పిటిషన్‌ను విచారించేందుకు జస్టిస్ జ్యోతిర్మయి నిరాకరిస్తారని తెలిసే ఆ పని చేశారు. నిబంధనల ప్రకారం వెళితే చంద్రబాబుకు బెయిల్ దొరకడం కష్టమని ఆయన తరఫు న్యాయవాదులకు బాగా తెలుసు. అందుకే తమకే సొంతమైన 'నాట్ బిఫోర్' అస్త్రాన్ని బయటకు తీశారు. మూర్తి దాఖలు చేసిన కేసును విచారించనని జస్టిస్ జ్యోతిర్మయి ఓపెన్ కోర్టులో చెప్పడంతో చంద్రబాబు అండ్ కో తమ పాచిక పారిందని సంతోషించారు. అయితే ఇంతలోనే సీజే అనుమతి తీసుకుని చంద్రబాబు బెయిల్, మధ్యంతర బెయిల్ పిటిషన్లలో విచారణను సోమవారానికి వాయిదా వేయాలని రిజిస్ట్రీని ఆదేశిస్తూ జస్టిస్ జ్యోతిర్మయి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో చంద్రబాబు అండ్ కో బిత్తరపోయింది.

మూర్తి పిటిషన్‌ను విచారించబోను

విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి

సాక్షి, అమరావతి: అనారోగ్య కారణాల రీత్యా తనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలంటూ చంద్రబాబు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ విచారణ నుంచి న్యాయమూర్తి జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి తప్పుకున్నారు. ఈ వ్యాజ్యాన్ని న్యాయవాది మూర్తి దాఖలు చేశారని.. ఆయన సతీమణి న్యాయాధికారి అని.. ఈ నేపథ్యంలో ఈ పిటిషన్‌ను తాను విచారించబోనని స్పష్టం చేశారు. శుక్రవారం చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ హైకోర్టులో విచారణకు వచ్చింది. ఆ వెంటనే అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ తాను ప్రభుత్వం తరఫున వాదనలు వినిపిస్తానని తెలిపారు. అనంతరం న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడించారు. అందుకు సంబంధించి వెంటనే ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల్లో.. 'రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) సమర్పించిన నోట్ మేరకు, ప్రధాన న్యాయమూర్తి (సీజే) ఈ బెయిల్ పిటిషన్లను రోస్టర్ ఎవరికి ఉందో వారి ముందు ఉంచాలని ఈ నెల 26న ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాలకనుగుణంగా ఈ వ్యాజ్యాలు నా ముందు విచారణకు వచ్చాయి. వాస్తవానికి ఈ వ్యాజ్యాలు న్యాయవాది జి.బసవేశ్వరరావు ద్వారా ఈ నెల 11న దాఖలయ్యాయి. రికార్డులను పరిశీలిస్తే.. బసవేశ్వరరావు ఇచ్చిన అనుమతితో ఈ నెల 19న న్యాయవాది జీవీఎల్ మూర్తి వకాలత్ దాఖలు చేశారు. బసవేశ్వరరావు తర్వాత వకాలత్ దాఖలు చేసిన న్యాయవాది (మూర్తి) ఓ న్యాయాధికారి భర్త. ఆయన కేసులను నేను విచారించబోను. ఇందుకు నా మనఃసాక్షి అంగీకరించదు. ఈ వ్యవహారంలో నేను ఇంతకంటే ఏమీ చెప్పలేను. ఈ పరిస్థితుల్లో ఈ కింది ఉత్తర్వులు జారీ చేయడం మినహా నాకు మరో అవకాశం లేదు. చంద్రబాబు ఆరోగ్యం దృష్ట్యా ఆయన తరఫున అత్యవసర విచారణ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుంటున్నా. తదుపరి పనిరోజు అయిన ఈ నెల 30న సంబంధిత బెంచ్ ముందుకు విచారణకు వచ్చేందుకు వీలుగా ఈ వ్యాజ్యాలను ప్రధాన న్యాయమూర్తి ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశిస్తున్నా' అని న్యాయమూర్తి జ్యోతిర్మయి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చంద్రబాబు న్యాయవాదుల అభ్యంతరం..

చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ జోక్యం చేసుకుంటూ.. ఈ వ్యాజ్యాలను తగిన బెంచ్ ముందు ఉంచేలా చూడాలంటూ తాము రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) ముందు అభ్యర్థిస్తామని చెప్పారు. మరో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా సైతం ఇదే కోరారు. ఈ నేపథ్యంలో 'నిబంధనల ప్రకారం తగిన బెంచ్ ముందు ఈ వ్యాజ్యాలను ఉంచేందుకు తగిన చర్యలు తీసుకునే నిమిత్తం చంద్రబాబు తనకున్న ప్రత్యామ్నాయాలను వినియోగించుకునేందుకు ఈ ఉత్తర్వులు ఎంత మాత్రం అడ్డంకి కాదు' అని జస్టిస్ జ్యోతిర్మయి పేర్కొన్నారు. అంతకు ముందు న్యాయమూర్తి.. తన ఉత్తర్వుల్లో ఈ నెల 30 అని పేర్కొనగానే, దానిపై చంద్రబాబు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. ఈ తేదీని తీసివేయాలని కోరారు. లేనిపక్షంలో తగిన బెంచ్ ముందు ఈ వ్యాజ్యాలను ఉంచాలని తాము రిజిస్ట్రార్ ముందు అభ్యర్థించలేమన్నారు. అయితే చంద్రబాబు న్యాయవాదుల అభ్యర్థనపై న్యాయమూర్తి సానుకూలంగా స్పందించలేదు. సిద్ధార్థ లూథ్రా సైతం అభ్యర్థించడంతో రిజిస్ట్రార్ ముందు విన్నవించుకునేందుకు తన ఉత్తర్వులు ఏమాత్రం అడ్డంకి కాదు అనే వాక్యాలను న్యాయమూర్తి చేర్చారు.

నన్ను అంతం చేసేందుకు మావోల కుట్ర

- విజయవాడ ఏసీబీ న్యాయస్థానం న్యాయమూర్తికి చంద్రబాబు లేఖ

సాక్షి, అమరావతి/సాక్షి, రాజమహేంద్రవరం : జెడ్ కేటగిరీ భద్రత కలిగిన తనకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లోనూ అదే తరహాలో పూర్తి భద్రత కల్పించాలని స్కిల్ స్కామ్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు న్యాయస్థానాన్ని కోరారు. సెంట్రల్ జైలు లోపల, చుట్టు పక్కలా అదే తరహాలో పటిష్ట భద్రత కల్పించాలని విన్నవించారు. విజయవాడ ఏసీబీ న్యాయస్థానం న్యాయమూర్తికి ఈ నెల 25న చంద్రబాబు రాసిన లేఖ శుక్రవారం వెలుగులోకొచ్చింది. ఇటీవల చంద్రబాబు రిమాండ్‌ను పొడిగించేందుకు విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో ఆయనను వర్చువల్‌గా ప్రవేశపెట్టినప్పుడు.. ఆయన తన భద్రతపై సందేహాలు వ్యక్తం చేశారు. ఏమైనా సందేహాలుంటే లేఖ ద్వారా తెలపాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఆ మేరకు చంద్రబాబు ఓ లేఖ రాసి జైలు అధికారుల ద్వారా న్యాయస్థానానికి పంపారు. తనను అంతం చేసేందుకు మావోయిస్టులు ప్రయత్నిస్తున్నారని ఓ గుర్తు తెలియని వ్యక్తి నుంచి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌కు ఓ లేఖ వచ్చిందని చంద్రబాబు తెలిపారు. అందుకోసం కోట్లాది రూపాయలు చేతులు మారాయన్నారు. అయినప్పటికీ పోలీసు అధికారులు దీనిపై ఎలాంటి విచారణ జరపలేదని పేర్కొన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్న 2,200 మంది ఖైదీల్లో 750 మంది గంజాయి, అక్రమ మద్యం కేసుల్లో శిక్షలు పడినవారు.. రిమాండ్ ఖైదీలే కావడంతో తన భద్రతకు ముప్పు ఉందన్నారు. సెంట్రల్ జైలు బయట నుంచి కొందరు జైల్లోకి గంజాయి పాకెట్లు విసురుతున్నారని చెప్పారు. ఎస్.కోటకుచెందిన ఓ గంజాయి కేసు రిమాండ్ ఖైదీ పెన్ కెమెరాతో జైలు లోపలి దృశ్యాలను ఫొటోలు తీస్తున్నారని పేర్కొన్నారు. సెంట్రల్ జైలు సమీపంలో కొందరు డ్రోన్ కెమెరాలు ఎగురవేసినా.. స్థానిక పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని చంద్రబాబు తెలిపారు. ప్రతిపక్ష నేతగా తాను రాష్ట్రంలో పర్యటిస్తున్నప్పుడు తనపై పలుమార్లు దాడి చేసేందుకు యత్నించారని తెలిపారు. రిమాండ్ ఖైదీగా తాను సెంట్రల్ జైల్లోకి వెళుతున్న ఫొటోలు, వీడియోలు మీడియాలో విస్తృతంగా ప్రచారమైన విషయాన్నీ లేఖలో ప్రస్తావించారు.

చంద్రబాబుకు జైల్లో పూర్తి భద్రత



మీడియాతో మాట్లాడుతున్న జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్, ఎస్పీ పి.జగదీష్

జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్, ఎస్పీ జగదీష్ స్పష్టీకరణ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): చంద్రబాబుకు సెంట్రల్ జైల్లో పూర్తి భద్రత ఉందని, దీనిపై అవాస్తవ వార్తలను నమ్మొద్దని జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్, ఎస్పీ జగదీష్ స్పష్టం చేశారు. చంద్రబాబు ఆరోగ్యం, ఆయనను చంపేస్తామంటూ మావోల పేరుతో వచ్చిన లేఖ, జైల్లో పెన్ కెమెరాలు ఉన్నాయంటూ వస్తున్న వార్తలపై సెంట్రల్ జైల్లో శుక్రవారం రాత్రి వారు మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు సెక్యూరిటీపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నామని, 24 గంటలూ సెక్యూరిటీతో పాటు అడిషనల్ సీసీ కెమెరాల ద్వారా మానిటరింగ్ చేస్తున్నామన్నారు. ఈ నెల 19న చంద్రబాబు రిమాండ్ నేపథ్యంలో ఆయనను బ్లూ జీన్ యాప్ ద్వారా న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టామని, అందులో చంద్రబాబు కొన్ని విషయాలను న్యాయమూర్తికి తెలిపారని, వాటిని లెటర్ రూపంలో తిరిగి ఆయన ఇస్తే దానిని తాము కోర్టుకు పంపామన్నారు. జైలు చుట్టూ ఐదు వాచ్‌టవర్స్ ఉన్నాయని, గంటకోసారి గార్డ్ సెర్చ్ జరుగుతోందని చెప్పారు. జైలు వాటర్ ట్యాంక్ వైపు డ్రోన్ తిరిగినట్టు నార్త్ ఈస్ట్ వాచ్‌టవర్ గార్డు నుంచి సమాచారం వచ్చిందని, అయితే ఆ డ్రోన్ క్లోజ్ జైలు వైపు రాలేదని, దీనిపై సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, విచారణ జరుగుతోందన్నారు.

మావోల పేరుతో వచ్చిన లేఖ నకిలీది..

చంద్రబాబును చంపేస్తామంటూ మావోల పేరుతో వచ్చిన లేఖ నకిలీదిగా గుర్తించినట్టు తెలిపారు. జైలు నుంచి చంద్రబాబు రాశారంటూ బయటకొచ్చిన లెటర్‌కు జైలు ముద్ర, సూపరింటెండెంట్ సంతకం లేదన్నారు. చంద్రబాబు ప్రింటెడ్ సంతకాన్ని తీసి దానిపై వేసి వైరల్ చేస్తున్నారని తెలిపారు. అలాగే జైల్లోకి వచ్చే ప్రతి ఖైదీని పూర్తిగా తనిఖీ చేశాకే లోపలికి అనుమతిస్తామన్నారు. శ్రీనివాస్ అనే ఖైదీ రిమాండ్‌కు వచ్చినప్పుడు అతని వద్ద ఒక బటన్ కెమెరా ఉన్నట్టు గుర్తించామన్నారు. జైలు లోపలికి అనుమతించే ముందు అతని దుస్తులు తనిఖీ చేస్తుంటే అది లభించిందని తెలిపారు. అందులో ఎలాంటి జైలు ఫుటేజీ లేదని, ఆ కెమెరాను స్వాధీనం చేసుకుని.. పోలీసులకు అప్పగించామని, ఆ కెమెరాను ఎందుకు తెచ్చారనే విషయంపై దర్యాప్తు జరుగుతోందన్నారు. చంద్రబాబు వచ్చిన దగ్గర నుంచి ఇప్పటివరకు గంజాయి ప్యాకెట్లు జైల్లోకి విసిరారన్నది పూర్తి అవాస్తవమన్నారు. చంద్రబాబు కుడికంటి కేటరాక్ట్ ఆపరేషన్‌కు సంబంధించి రాజమండ్రి జీజీహెచ్ వైద్యులు పరీక్షలు చేశారని, కొంతకాలం తర్వాత అయినా ఆపరేషన్ చేయించుకోవచ్చని తెలిపారని వివరించారు. ఆయన ఆరోగ్యంపై తప్పుడు రిపోర్టులు విడుదల చేయడంలేదని, వాటిని ఎప్పటికప్పుడు కోర్టుకు నివేదిస్తున్నట్టు తెలిపారు. జైల్లో చంద్రబాబును తాము కలవాలన్నా ఏడుగురు అధికారులు కలిస్తేనే.. అది సాధ్యమన్నారు. చంద్రబాబు తనకున్న ఎలర్జీలపై గతంలో ప్రభుత్వ వైద్యులకు చెప్పారని, దీనికి సంబంధించి వారి కుటుంబ సభ్యులకు రెండు లెటర్లు కూడా రాశామన్నారు. చంద్రబాబు ఆరోగ్యానికి సంబంధించి వ్యక్తిగత వైద్యుడిని సంప్రదించి ఎలాంటి చికిత్స అవసరమో తెలపాలని ఆయన భార్య భువనేశ్వరికి, ఇదే విషయాన్ని కోర్టుకూ తెలియజేసినట్టు తెలిపారు. రాజమండ్రి సెంట్రల్ జైలు బయట సైతం 24 గంటలూ డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో పకడ్బందీగా గస్తీ ఏర్పాటు చేసినట్టు రవికిరణ్, జగదీష్ వివరించారు.

చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారు: భువనేశ్వరి

రేణిగుంట(తిరుపతి జిల్లా) : చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అక్రమంగా అరెస్ట్ చేసి 49 రోజులైనా ప్రభుత్వం ఎలాంటి రుజువులు చూపలేదని ఆయన సతీమణి నారా భువనేశ్వరి చెప్పారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో 'నిజం గెలవాలి' పేరుతో శుక్రవారం సాయంత్రం బహిరంగ సభను నిర్వహించారు. అంతకుముందు ఆమె రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ ఎర్రమరెడ్డిపాళెంలో చంద్రబాబు అరెస్ట్‌ను తట్టుకోలేక మృతి చెందిన సూరా మునిరత్నమ్మ గత నెల 28న మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. అలాగే ఏర్పేడు మండలం మునగలపాలేనికి చెందిన వసంతమ్మ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు చెక్కు అందించారు.

ఈ మరణాలనూ చంద్రబాబు ఖాతాలోకి..

- ▲ వసంతమ్మ వికృతమాల డిక్సన్ కంపెనీలో కార్మికురాలు. ఆమెకు గతంలో గుండెకు సంబంధించిన సమస్యలున్నాయి. ఈనెల 15న డిక్సన్ కంపెనీలో విధులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తూ గుండెపోటుతో మృతి చెందింది. ఆ మృతిని కూడా చంద్రబాబు అరెస్ట్ ఖాతాలో వేసేశారు.



వసంతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన భువనేశ్వరి

- ▲ మునిరత్నమ్మ అనారోగ్యంతో గత నెల 28న మృతి చెందినట్టు స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ మరణాన్ని కూడా చంద్రబాబు అరెస్ట్‌కు ముడిపెట్టేశారు.

తెలంగాణ

బాబుకు 'నిజాం షుగర్స్' పాపమే కొట్టింది

- ఫ్యాక్టరీని ప్రైవేటీకరించి శిక్ష అనుభవిస్తున్నారు
- ఎన్డీఎస్ఎల్ కార్మికుల ఆగ్రహావేశాలు

బోధన్: ''లాభాల్లో నడిచే నిజాం షుగర్స్‌ను ప్రైవేటీకరించి ఇప్పుడు ఏపీలో చంద్రబాబు శిక్ష అనుభవిస్తున్నాడు, అలాంటి పరిస్థితి మీకు(ఎన్డీఎస్ఎల్ ప్రైవేట్ యాజమాన్యం) రావాలని కోరుకోవడం లేదు.. ఎన్డీఎస్ఎల్(నిజాం డెక్కన్ షుగర్స్ లిమిటెడ్) లేఆఫ్ నుంచి రావాల్సిన బకాయి వేతనాలు పూర్తిగా చెల్లించండి'' అని కార్మికులు డిమాండ్ చేశారు. ఒక్కసారిగా చంద్రబాబు ప్రస్తావన విని ఎన్డీఎస్ఎల్ సీఈవో సుబ్బరాజు, పర్సనల్ ఆఫీసర్ శ్రీధర్‌రాజు, స్థానిక అధికారి రమేష్ అవాక్కయ్యారు. ఫ్యాక్టరీ మూసివేత వల్ల తమ జీవితాలు అన్యాయమయ్యాయని, కుటుంబాలు రోడ్డున పడ్డాయని, బిచ్చమెత్తుకుని బతకాల్సిన దుస్థితి వచ్చిందని కార్మికులు కన్నీటి పర్యంతమయ్యారు. కార్మికుల వేతన, ఇతర బకాయిల చెల్లింపునకు సంబంధించి సెటిల్‌మెంట్ చేసేందుకు ఎన్డీఎస్ఎల్ అధికారులు శుక్రవారం నిజామాబాద్ జిల్లా బోధన్ ఫ్యాక్టరీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన బోధన్, ముత్యంపేట, ముంబోజిపల్లి ఫ్యాక్టరీల కార్మికులు పై విధంగా వ్యాఖ్యానించారు.

అసత్యానికి శక్తి లేదు. సత్యానికి శక్తి లేకపోవడం అంటూ లేదు.
ఈ రెండింటి అసలు స్వరూపాన్ని తత్వజ్ఞానులు దర్శించారు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 28 అక్టోబర్ 2023

ఖతార్ 'మరణ' మృదంగం!

గల్ఫ్ దేశాల్లో పనిచేయటం కత్తిమీది సాము. అక్కడ అమలయ్యే చట్టాలు, న్యాయవ్యవస్థ తీరు తెన్నులు భిన్నమైనవి. కనుక ఉపాధి కోసం వెళ్లినవారు ఎంతో జాగరూకతతో వుంటారు. అందువల్లే ఆ దేశాల్లో ఒకటైన ఖతార్‌లో అల్ దహ్రా గ్లోబల్ అనే ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న మన నావికాదళ మాజీ అధికారులు ఎనిమిది మంది గూఢచర్యం ఆరోపణల సాలెగూటిలో చిక్కుకోవటం, అక్కడి న్యాయస్థానం గురువారం వారికి మరణదండన విధించటం అందరినీ కలవరపెట్టింది. వాస్తవానికి గూఢచర్యం ఆరోపణలున్నాయని మీడియాలో కథనాలు రావటం మినహా అధికారికంగా ఖతార్ ఎలాంటి వివరణా ఇవ్వలేదు. ఖతార్‌తో నిరుడు ఆగస్టు నుంచి సంప్రదింపులు జరుపుతూ, వారి విడుదలకు కృషి చేస్తున్న మన విదేశాంగ శాఖ కూడా ఏమీ చెప్పలేదు. న్యాయస్థానంలో విచారణ సరేసరి. అంతా గోప్యంగా ముగిసిపోయింది. మరణశిక్ష పడినవారు సాధారణ వ్యక్తులు కాదు. మన నావికాదళంలో పనిచేసినన్నాళ్లూ తమ సత్తా చాటినవారు. వీరిలో తెలుగువారైన సుగుణాకర్ పాకాల కమాండర్ స్థాయిలో పనిచేసి రిటైరయ్యారు. తన సర్వీసు కాలంలో రెండుసార్లు నావికాదళ నౌక ఐఎన్ఎస్ తరంగిణిపై ఒంటరిగా వెళ్లి భూమధ్య రేఖప్రాంతంలో అట్లాంటిక్, పసిఫిక్ మహా సముద్రాలను దాటివచ్చినవారు. ఇతరులు కూడా నావికాదళ విభాగాల్లో నిపుణులు, లబ్ధ ప్రతిష్టులు. ఒక సందర్భంలో అందరినీ స్వదేశం వెళ్లేందుకు సిద్ధంగా వుండమని చెప్పిన ఖతార్ అధికారులు అంతలోనే నిర్ణయం మార్చుకున్నారని అంటున్నారు. వీరు పని చేసిన అల్ దహ్రా గ్లోబల్ సంస్థ నిర్వాహకులను కూడా అరెస్టు చేసిన ఖతార్ అధికారులు రెండు నెలలకే వారిపై ఎలాంటి విచారణ లేకుండా విడుదల చేశారు. మరి భారతీయుల విషయంలో ఈ వివక్ష ఎందుకో అర్థం కాని విషయం. ఇటలీ నుంచి ఖతార్ సమకూర్చుకున్న యు 212 జలాంతర్గామిపై ఆ దేశ నావికాదళ సిబ్బందికి శిక్షణ ఇచ్చే పనిలో ఉన్నప్పుడు హఠాత్తుగా వీరిని అరెస్టు చేశారంటున్నారు. ఆ జలాంతర్గామి సాంకేతిక వివరాలను ఇజ్రాయెల్‌కు చేరేశారన్నది ప్రధాన అభియోగమని చెబుతున్నారు.

నేరారోపణలు ఎదుర్కొన్నవారికి న్యాయసహాయం లభించిందా... అసలు వారిపై వున్న ఆరోపణలు ఏమిటన్నది వెల్లడి కాలేదు. కనీసం కుటుంబ సభ్యులకైనా ఆ వివరాలు అందించారా లేదా అన్నది అనుమానమే. సాధారణంగా గూఢచర్యం కేసుల్లో ప్రభుత్వాలు ఎక్కడలేని గోప్యతా పాటిస్తాయి. ఇందువల్ల అటు ముద్దాయిలకు అన్యాయం జరగటంతోపాటు ఆ దేశానికి కూడా అంతర్జాతీయంగా చెడ్డపేరొస్తుంది. ఖతార్‌కు ఈ విషయాలు తెలిసేవుండాలి. ఖతార్‌తో వున్న ద్వైపాక్షిక సంబంధాలను వినియోగించుకుని వీరందరి విడుదలకూ మన దేశం చేసిన ప్రయత్నాలను ఆ దేశం వమ్ముచేసింది. అక్కడి మీడియా సంస్థలో పనిచేస్తున్న మహిళా జర్నలిస్టు ఈ కేసు లొసుగులను ఎత్తి చూపుతూ రాసిన కథనం తమ జాతీయ ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్నదని ఆగ్రహించి ఆమెను సైతం అరెస్టు చేయటానికి ఖతార్ అధికారులు ప్రయత్నించారని ఒక ఆంగ్ల దినపత్రికలో ఇటీవలే కథనం వెలువడింది. దీనిపై ముందుగా ఉప్పందటంతో ఆ జర్నలిస్టు, అక్కడ వేరే ఉద్యోగం చేస్తున్న ఆమె భర్త హుటాహుటీన ఆ దేశం విడిచి భారత్ వచ్చారని ఆ కథనం తెలిపింది. ఈ కేసుపై మొత్తంగా ఏడు వాయిదాల్లో విచారణ జరిగిందని చెబుతున్నారుగానీ, దాని తీరుతెన్నులెలా వున్నాయో జర్నలిస్టుకు ఎదురైన చేదు అనుభవమే తేటతెల్లం చేస్తోంది.

ఆరోపణలొచ్చినంత మాత్రాన అన్నీ నిజమైపోవని ఖతార్‌కు తెలియదనుకోలేం. ఎందుకంటే ఆ దేశానికి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయంటూ ఆరేళ్ల క్రితం గల్ఫ్ సహకార మండలి (జీసీసీ) నుంచి దాన్ని సౌదీ అరేబియా సాగనంపింది. కానీ చివరికి మళ్లీ ఖతార్‌తో సంధి కుదుర్చుకోక తప్పలేదు. ఉగ్రవాదులుగా ముద్రపడిన తాలిబన్‌లకు ఆశ్రయం ఇచ్చి, వారితో అమెరికా చర్చలు జరిపేలా చేయటంలో ఖతార్ విజయం సాధించింది. ఇప్పుడు ఇజ్రాయెల్‌లో చొరబడి ఆ దేశ పౌరులను కాల్చిచంపి, అనేకమందిని బందీలుగా పట్టుకున్న హమాస్‌కు సైతం ఖతార్‌లో కార్యాలయం వుంది. ఖతార్ మధ్యవర్తిత్వంతోనే హమాస్ తీవ్రవాదులు బందీల్లో ఇద్దరు అమెరికన్ పౌరులను విడుదల చేశారు కూడా. వీటన్నిటినీ చూపి ఖతార్‌ను ఉగ్రవాద దేశంగా పరిగణించాల్సిన అవసరం లేదు. గల్ఫ్ దేశాల్లో ఖతార్ చూడటానికి చిన్న దేశమే కావొచ్చుగానీ, దానికుండే సహజ వనరులు అపారమైనవి. దాని తలసరి ఆదాయం చాలా ఎక్కువ. ఖతర్‌కూ, ఇరాన్‌కూ మధ్య సముద్ర జలాల్లో అపారమైన సహజవాయు నిక్షేపాలున్నాయి. అందుకే ఆ దేశంతో ఖతార్‌కు స్నేహ సంబంధాలున్నాయి. ఇతర గల్ఫ్ దేశాల తీరు ఇందుకు భిన్నం.

ఇప్పుడున్న పరిస్థితుల్లో మరణశిక్ష పడినవారికి 2015లో భారత్-ఖతార్‌ల మధ్య కుదిరిన ఒప్పందం ఒక ఆశాకిరణం. దాని ప్రకారం యావజ్జీవ శిక్ష పడినవారిని స్వదేశంలో శిక్ష అనుభవించటానికి వీలుగా వెనక్కిపంపే వీలుంటుంది. ప్రస్తుతం మరణశిక్ష పడిన ఎనిమిదిమందీ ఉన్నత న్యాయస్థానానికి అప్పీల్ చేసుకుంటే వారిని నిర్దోషులుగా విడుదల చేయొచ్చు. కనీసం దాన్ని యావజ్జీవ శిక్షగా మార్చే అవకాశం వుంటుంది. అదే గనుక జరిగితే 2015 ఒప్పందం కింద వీరిని భారత్ పంపే వీలుంటుంది. ఏదేమైనా ఈ వ్యవహారం మన దౌత్య నైపుణ్యానికి పెద్ద పరీక్ష. గత తొమ్మిది నెలలుగా తెరవెనక సాగించిన యత్నాలు పెద్దగా ఫలించలేదు. కనీసం ఇకముందైనా ఖతార్‌ను ఒప్పించటంలో, అది సహేతుకంగా వ్యవహరించేలా చేయటంలో మన ప్రభుత్వం విజయం సాధించాలని ఆశించాలి.

మద్దతు పెరగాల్సిన రంగం

విశ్లేషణ



దేవీందర్ శర్మ

రబీ పంటల పెంపు ధరలు 2 నుంచి 7 శాతం పరిధిలో ఉన్నాయి. 2022–23 సంవత్సరంలో సగటు ద్రవ్యోల్బణం పెరుగుదల దాదాపు 7.6 శాతం. అంటే కనీస మద్దతు ధరలో పెంపుదల, ద్రవ్యోల్బణం రేటును కూడా సమీపించడం లేదు. పైగా ధాన్య సేకరణ ఎక్కువగా గోధుమలు, వరికే పరిమితం అయినందున, కనీస మద్దతు ధర ప్రయోజనాన్ని పొందే రైతుల శాతం సంవత్సరాలుగా 6 శాతం నుండి 14 శాతానికి మాత్రమే పెరిగింది. 86 శాతం మంది రైతులు ఇప్పటికీ తక్కువ ధరలకే తమ ఉత్పత్తులను అమ్ముకోవలసి వస్తోంది. పైగా, కనీస మద్దతు ధరలో పెంపుదల ఇంకా ఉత్పత్తి వ్యయం కంటే తక్కువగానే ఉంటోంది. అందుకే ధరలకు సంబంధించి వ్యవసాయ రంగంలో నిర్మాణాత్మక సంస్కరణలు అవసరం.

2018లో 'కౌన్ బనేగా కరోడ్‌పతి' ఒక ఎపిసోడ్‌లో, నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్న మహారాష్ట్రకు చెందిన ఒక చిన్న రైతు తన దుఃస్థితి గురించి చెప్పినప్పుడు మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ తన చెవులను తానే నమ్మలేకపోయారు. వ్యవసాయం ద్వారా ఎంత సంపాదిస్తున్నారని అమితాబ్ అడిగిన ప్రశ్నకు ఆ రైతు, ''సంవత్సరానికి రూ. 60,000 కంటే ఎక్కువ సంపాదించడం లేదు. దానిలో సగం డబ్బు విత్తనాలు కొనడానికే పోతోంది. నేను నా కుటుంబానికి రాత్రి భోజనం మాత్రమే అందించగలుగుతున్నాను'' అని బదులిచ్చారు. ఆ రైతు సమాధానం విని అమితాబ్ నివ్వెరపోయారు. దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, దేశ రైతులను ఆదుకోవాలని ఆయన ప్రజలను కోరారు.

అప్పటి నుండి గ్రామీణ మహారాష్ట్రలో నిరాశ మరింతగా పెరిగిందే తప్ప తగ్గలేదు. ఈ ఏడాది జనవరి, ఆగస్టు మధ్య కాలంలో 1,809 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వార్తా కథనాలు చెబుతున్నాయి. గత సంవత్సరం గణాంకాలతో పోలిస్తే ఇది కాస్త తక్కువే అయినప్పటికీ సగటున రోజుకు ఏడుగురు రైతులు తమ జీవితాలను ముగించుకుంటున్నారు. ఈ ఆత్మహత్యల్లో యాభై శాతం పత్తి పండించే ప్రాంతంలోనే నమోదయ్యాయి.

రైతులకు జాక్‌పాటేనా?

శీతాకాలపు పంటల కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ)ల్లో ఇటీవలి పెంపుపై మీడియాలో వస్తున్న వార్తల్లోని ఉత్సాహం నన్ను ఆ దిశగా ఆలోచించేలా చేసింది. ఇది రైతులకు 'జాక్‌పాట్' లేదా 'అదనపు వరం' అని ప్రశంసిస్తున్నారు. కానీ ఇది కష్టాల్లో ఉన్న రైతులకు ఏదైనా సహాయం అందజేస్తుందా అనేది ప్రశ్న. ధరల పెంపుదల పెరుగుతున్న నిరాశను ఆశాజనకంగా మార్చే అవకాశమైతే కనిపించడం లేదు.

ముందుగా, ప్రకటించిన కనీస మద్దతు ధర పెరుగుదల పరిమాణాన్ని చూద్దాం. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఇతర రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. పైగా 2024 లోక్‌సభ ఎన్నికల సమయానికి రబీ పంటల కోతలు జరగనున్నాయి. రబీ పంటల ధరల పెంపు 2 నుంచి 7 శాతం పరిధిలో ఉన్నాయి. 2022–23 సంవత్సరంలో సగటు ద్రవ్యోల్బణం పెరుగుదల దాదాపు 7.6 శాతం. అంటే, కనీస మద్దతు ధరలో పెంపుదల అనేది, ద్రవ్యోల్బణం రేటును కూడా సమీపించడం లేదు.

పైగా, రైతులకు 'జాక్‌పాట్' లేదా 'అదనపు వరం' అంటూ చేస్తున్న వర్ణన వాస్తవానికి క్షేత్ర వాస్తవాన్ని నిర్లక్ష్యం చేయడం పైనే ఆధారపడి ఉంది. ప్రతి పంట సీజన్‌లోనూ, ప్రభుత్వానికి ధరలను సిఫార్సు చేసే 'కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్' (సీఏసీపీ– వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్)... ఉత్పత్తి ధరల సూచిలో వచ్చే మార్పుల శాతాన్ని, గణనలను కూడా అందజేస్తుంది.



2022–23తో పోలిస్తే, ఈ ఏడాది మిశ్రమ ఉత్పత్తి ధరల సూచీ 8.9 శాతం పెరిగింది. అంటే ఉత్పత్తి వ్యయం ఎక్కువగా ఉండగా, కనీస మద్దతు ధరల పెరుగుదల దానికి అనుగుణంగా లేదు. ఇది రైతులు హర్షించడానికి కారణం కాదు.

ఒక సంవత్సరం క్రితం, ఇది మరింత దారుణంగా ఉండేది. మిశ్రమ ఉత్పత్తి ధరల సూచీ 8.5 శాతం పెరుగుదలకు ప్రతిగా, గోధుమ కనీస మద్దతు ధర కేవలం 2 శాతం మాత్రమే పెరిగింది.

యాదృచ్ఛికంగా, ఈ ఏడాది క్వింటాల్‌కు రూ. 150 పెరగడంతో గోధుమల కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 2,275కి చేరుకుంది. 2006–07, 2007–08 తర్వాత, దేశీయ ఉత్పత్తిదారులకు ధరలను పెంచడం మినహా యూపీఏ ప్రభుత్వానికి పెద్దగా అవకాశం లేకుండా పోయిన తర్వాత, ఇది గోధుమ ధరలో అత్యధిక పెరుగుదలగానే చెప్పాలి.

ఎన్నికల సంవత్సరాల్లోనే!

రైతుల నుండి నేరుగా గోధుమలను కొనుగోలు చేయడానికి ప్రైవేట్ కంపెనీలను అనుమతించాలనే లోపభూయిష్ట నిర్ణయం జరిగిన తర్వాత, ఇది ప్రభుత్వ నిల్వల్లో భారీ అంతరానికి కారణమైంది. ఆ కొరతను తీర్చడానికి ప్రభుత్వం దాదాపు రెట్టింపు ధరలకు (స్వదేశీ రైతులకు ఇచ్చే) గోధుమలను దిగుమతి చేసుకోవలసి వచ్చింది. ప్రతిపక్ష పార్టీలు, రైతు సంఘాల నుండి వచ్చిన విమర్శల తరువాత, ముఖ్యంగా ధర సమానత్వం తీసుకురావడానికి, గోధుమలకు కనీస మద్దతు ధరను పెంచారు.

ఈ ఏడాది ధరలు మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణల్లోని ప్రధాన రబీ పంటలపై ప్రభావం చూపుతాయని పరిగణనలోకి తీసుకుంటే, ధరల పెరుగుదల ఎన్నికల ఫలితాలను ఎలా ప్రభావితం చేస్తుందనే దానిపై ఊహాగానాలు ఉన్నాయి. గోధుమలు అత్యంత ముఖ్యమైన రబీ పంట. బార్లీ(యవలు), పెసర, రేప్‌సీడ్–ఆవాలు, పప్పు (మసూర్)... ఇతర శీతాకాలపు పంటలు కావడంతో, ధరల పెరుగుదల కచ్చితంగా రాజకీయ కోణాన్ని కలిగి ఉంది.

ఆర్థికవేత్తలు సుఖ్‌పాల్ సింగ్, శ్రుతి భోగల్ 2004, 2009, 2014, 2019కి ముందు సంవత్సరాల్లో గోధుమలు, వరి కనీస మద్దతు ధర ఎంత ఎక్కువగా ఉందనే అంశాన్ని 2021 జనవరిలో స్పష్టంగా చూపించారు. ఇవన్నీ ఎన్నికలు జరిగిన సంవత్సరాలు. 2023–24 రబీ ధరల పెంపు కూడా ఇదే తరహాలో ఉంది. ఎన్నికలకు ముందు మాత్రమే రైతులకు సాపేక్షంగా అధిక కనీస మద్దతు ధరలను ప్రకటించాల్సిన అవసరాన్ని పాలకులు గుర్తించారు. దీనివల్ల కొన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రయోజనాలను పొందివుండొచ్చు. కానీ భవిష్యత్తులో పంటల ధరలను రాజకీయాలు నిర్ణయించకుండా దూరంగా ఉండేలా చూసుకోవాల్సిన సమయం ఇది.

స్వామినాథన్ ఫార్ములా అమలు కావాలి

వ్యవసాయం దానధర్మం కాదు. పంటల ధరలను రాజకీయ నాయకత్వం ఇష్టారాజ్యానికి వదిలేయలేం. వ్యవసాయానికి నిర్మాణాత్మక సంస్కరణలు అవసరం. ఎన్నికలు జరిగిన సంవత్సరంతో నిమిత్తం లేకుండా, స్వామినాథన్ ఫార్ములా ప్రకారం, 'వెయిటెడ్ యావరేజ్'కు 50 శాతం లాభం కలిపి రూపొందించిన కనీస మద్దతు ధరలు రైతులకు అందేలా ఈ సంస్కరణలు ఉండాలి.

ఏది ఏమైనప్పటికీ, ధాన్య సేకరణ ఎక్కువగా గోధుమలు, వరికే పరిమితం అయినందున, కనీస మద్దతు ధర ప్రయోజనాన్ని పొందే రైతుల శాతం సంవత్సరాలుగా 6 శాతం నుండి దాదాపు 14 శాతానికి మాత్రమే పెరిగింది. దీనివల్ల అర్థం చేసుకోవలసిన విషయమేమిటంటే, కనీస మద్దతు ధర పెంపు ఇంకా చాలావరకూ ఉత్పత్తి వ్యయం కంటే తక్కువగా ఉంది. మార్కెట్‌లు మిగిలిన 86 శాతం మంది రైతులకు నష్టాలతో కూడిన ధరలు చెల్లించడం వల్ల వ్యవసాయ కష్టాలు తీవ్ర మవుతున్నాయి. రుణభారం, ఆత్మహత్యలు పెరుగుతున్నాయి.

అంతేకాకుండా, రైతులకు సరైన ఆదాయాన్ని శాశ్వతంగా నిరాకరించిన స్థూల ఆర్థిక విధానాలపై పునరాలోచన చేయాల్సిన సమయం ఇది. ద్రవ్యోల్బణాన్ని 4 శాతం (ప్లస్ లేదా మైనస్ 2 శాతం) బ్రాకెట్‌లో ఉంచడం వ్యవసాయాన్ని దెబ్బతీసింది. వినియోగదారుల ధరల సూచిక బుట్టలో ఆహారం, పానీయాల వాటా 45.9 శాతం ఉన్నప్పటికీ, విధాన రూపకర్తలు అతిపెద్ద ద్రవ్యోల్బణ చోదకశక్తిగా ఉన్న గృహనిర్మాణంపై మాత్రం కళ్ళు మూసుకున్నారు. గృహనిర్మాణాన్ని పెట్టుబడిగా పరిగణిస్తుండగా, కనీస మద్దతు ధరలో ఏదైనా పెంపుదలను మాత్రం ఆహార ద్రవ్యోల్బణం పెరుగుదలకు కారణమని నిందిస్తుంటారు. ఇది మారాల్సి ఉంది.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ నిపుణులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మనవాళ్ల కోసం...



తన పౌరులను వెనక్కి తెచ్చుకునే మార్గం గురించి ఇండియా ఆలోచించాలి. అది పెద్ద దౌత్యపరమైన నిర్ణయం అయినప్పటికీ ప్రతి ఉన్నత కార్యాలయాల్లోనూ ఇది ఒక అజెండాగా ఉండాలి. (గూఢచర్య ఆరోపణల మీద ఎనమండుగురు మాజీ నేవీ అధికారులకు ఖతార్ మరణశిక్ష విధించింది.)

– అజీత్ సింగ్, ప్రొడక్ట్ మేనేజర్

ఎలాంటి పని?



నీ కోసమే అయితే వారానికి 70 గంటలు పనిచేసుకోవచ్చు. అది క్రమంగా ఫలితమిస్తుంది. నీ శ్రమ ఫలాలు నీకే ఉంటాయి. నువ్వు ధనవంతుడివి అవుతావు. కానీ ఇంకెవరి మరో బిలియన్ కోసమో మనం 70 గంటలు పనిచేయడం మూర్ఖత్వం: ముఖ్యంగా జీతం చిల్లర పెంకులు అయినప్పుడు.(వారానికి 70 గంటలు పని చేయాలన్న 'ఇన్ఫోసిస్' నారాయణమూర్తి వ్యాఖ్య నేపథ్యంలో.)

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

ఏనుగుల కోసం...



డా॥ వి. కృష్ణమూర్తి తన యావజ్జీవితాన్ని ఏనుగుల సంరక్షణ కోసం కేటాయించారు. జనాలు నిర్లక్ష్యంగా విసిరేసే గాజు సీసాలు వన్యప్రాణులకు ఎంత ప్రమాదకరం కాగలవో ఎప్పుడూ హెచ్చరిస్తుండేవారు. క్లిష్ట ప్రాంతాల్లో పగిలిన గ్లాసు ముక్కలను ఏరడానికి పూనుకున్న కన్యాకుమారి వైల్డ్‌లైఫ్ సాంక్చువరీ, కన్యాకుమారి నేచర్ ఫౌండేషన్, ఇంకా కళాశాల విద్యార్థులకు అభినందనలు.

– సుప్రియా సాహూ, తమిళనాడు ఉన్నతాధికారి

దీర్ఘం - శీఘ్రం



పథకాలకు దశాబ్దాలు ప్రమాణం, ఆచరణకు వారాలు ప్రమాణం. మనకు రెండూ కావాలి.

– సామ్ ఆల్ట్‌మాన్, ప్రోగ్రామర్

నా విన్నపం...



హింసను ఆపి వాళ్లను వదిలెయ్యమని హమాస్‌కు చెబుతున్నాను. ఆక్రమణను ఆపి వాళ్లను బతకనియ్యమని ఇజ్రాయిల్‌కు చెబుతున్నాను.

– సయీదా వార్సీ, యూకే ఎగువ సభ సభ్యురాలు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఎలక్ట్రానిక్స్‌లో దూసుకెళ్తున్న భారత్

ఒకప్పుడు మొబైల్ ఫోన్ అనగానే చైనాయే గుర్తొచ్చేది. డ్రాగన్ దేశం నుంచే వివిధ దేశాలకు లక్షలాదిగా మొబైళ్లు ఎగుమతి అయ్యేవి. పైగా స్మార్ట్ ఫోన్ కంపెనీలన్నీ దాదాపు చైనాలోనే ఉన్నాయి. అయితే ప్రస్తుతం భారత్ ఫోన్ల తయారీలో సరికొత్త రికార్డు సృష్టించింది. 2014–2023 మధ్య కాలంలో మొబైల్ ఫోన్‌ల ఉత్పత్తిలో 23 శాతం వార్షిక వృద్ధిరేటు సాధించుకుంటూ ప్రపంచంలో రెండవ అతి పెద్ద మొబైల్ ఉత్పత్తి దేశంగా అవతరించింది. ఈ మేరకు గ్లోబల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ 'కౌంటర్ పాయింట్' నివేదించింది. భారత్ దిగుమతి చేసుకొనే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి ఎదిగింది. కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకం విజయవంతం కావడంతో దేశంలో ఫోన్ల ఉత్పత్తి భారీగా పెరిగింది.

ఇండియాలో ఎలక్ట్రానిక్ రంగాన్ని బలోపేతం చేసేందుకు, ఫోన్ల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు కేంద్రం 2021 ఏప్రిల్లో పీఎల్ఐ పథకాన్ని ప్రవేశపెట్టింది. స్థానికంగా ఎలక్ట్రానిక్ వస్తువులను ఉత్పత్తి చేయడంలో ఆయా సంస్థలకు రూ. 40,995 కోట్ల రాయితీలు ఈ పథకం కింద ఇచ్చింది. దీంతో స్మార్ట్ ఫోన్ తయారీ దిగ్గజాలైన యాపిల్, శాంసంగ్‌లతో పాటు పలు కంపెనీలు ఫోన్‌ల ఉత్పత్తిని విపరీతంగా పెంచాయి. దేశీయ మార్కెట్‌లో విక్రయించడంతో పాటు పలు దేశాలకు ఎగుమతులు పెరిగాయి. ఈ అనూహ్య పెరుగుదలకు యాపిల్ ఐఫోన్ల ఒప్పంద తయారీ కంపెనీలైన ఫాక్స్‌కాన్, పెగట్రాన్, విస్ట్రన్‌లతో పాటు శాంసంగ్ ప్రధాన కారణం. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి సాధించేందుకు 'ఇండియా సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్' (ఐసీఈఏ) సుంకాలు తగ్గించి, మార్కెట్‌లో పోటీతత్వాన్ని పెంచాలని చూస్తోంది. ఉత్పత్తులను మెరుగుపరచడం, కార్మిక సంస్కరణలు చేయడం, ఎలక్ట్రానిక్స్ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై దృష్టి సారించింది. 2025–26 నాటికి 600 బిలియన్ డాలర్ల విలువైన ఫోన్లు ఎగుమతి అవుతాయని భారత్ అంచనా వేస్తోంది. ఒకప్పుడు మన దేశం నుంచి మధ్యప్రాచ్య, ఆఫ్రికా దేశాలకు ఫోన్లు ఎగుమతి అవ్వగా... ప్రస్తుతం అమెరికా, నెదర్లాండ్, ఆస్ట్రియా, ఇటలీ వంటి యూరప్ దేశాలకు సైతం ఎగుమతి అవుతున్నాయి.




'మేక్ ఇన్ ఇండియా', 'పేస్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రోగ్రామ్' (పీఎంపీ), 'ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్' (పీఎల్ఐ), 'ఆత్మనిర్భర్ భారత్' వంటి కార్యక్రమాలను కేంద్రం ప్రారంభించి స్థానిక తయారీ సంస్థలను ప్రోత్సహించింది. 2014లో దేశీయంగా మొబైల్ ఫోన్ల ఉత్పత్తి 19 శాతం మాత్రమే ఉండేది. 2022 నాటికి 98 శాతం స్థానికంగా తయారు చేసిన ఫోన్‌లను భారత్ ఎగుమతి చేసింది. ఇప్పటికే ఇండియాలో 5జీ సేవలు అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, కంప్యూటర్ మదర్ బోర్డులతో పాటు ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాల్లో వినియోగించే మైక్రో ప్రాసెసర్లు, చిప్‌సెట్స్ కూడా మన దేశంలోనే తయారు చేసే దిశగా భారత్ అడుగులు వేస్తోంది. ఇదే తరహాలో భారత్ ముందుకెళ్తే ఎలక్ట్రానిక్స్ రంగంలో మరింత వృద్ధి సాధించేందుకు అవకాశం ఉంది.

– తాడేపల్లి విజయ్ | 78424 85865

మనవాళ్ళకి ఎందుకంత ఆందోళన?

అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

ప్రస్తుతం ఇజ్రాయెల్– పాలస్తీనియన్ల మధ్య నెలకొన్న ఘర్షణాత్మక వాతావరణం స్వయం ప్రకటిత మేధావులమని చెప్పుకునే మనదేశంలోని కొందరికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రింట్ మీడియాలో, ఎలక్ట్రానిక్ మీడియాలో, సోషల్ మీడియాలో ఒకటే గోల! హమాస్ చర్యలను ప్రామాణీకరిస్తూ సంఘీభావ ర్యాలీలు తీయడం, హమాస్ దాడుల తరహాలో భారతదేశంలో కూడా దాడులు చేయాలంటూ దేశ సమగ్రతకు సవాలు విసిరే విధంగా వీడియోల పోస్టింగులు!!

భారతదేశం భద్రతను దృష్టిలో ఉంచుకున్న భారత ప్రభుత్వం హమాస్ తీవ్రవాద చర్యలను నిర్ద్వంద్వంగా ఖండించింది. అదే సమయంలో ఇజ్రాయెల్‌కు తన సంఘీభావాన్ని కూడా ప్రకటించింది. ఈ ఘర్షణల్లో ఇరువైపులా బలి అవుతున్న సామాన్య ప్రజల మృత్యు ఘోషకు తీవ్ర సంతాపం కూడా తెలియజేసింది. శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్న పాలస్తీనా ప్రజలకు మానవతా సహాయాన్ని కూడా అందిస్తోంది. మన దేశాన్ని పట్టి పీడిస్తున్న జిహాదీ ఉగ్రవాదాన్నీ, రక్షణ పరంగా ఇజ్రాయెల్‌కు మనకు ఉండే ఒప్పందాలను దృష్టిలో ఉంచుకొని, మన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దేశ హితాన్ని కోరే వాళ్ళందరూ స్వాగతించారు. కానీ కొందరు వ్యతిరేకిస్తున్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ హమాస్ చర్యలను సమర్థిస్తోంది. దీని వెనుక ఈ దేశంలోని ముస్లింలను సంతుష్టీకరించే ప్రయోజనం ఉంది.

ఇక అసలు విషయానికి వస్తే 1948కు ముందు ఇజ్రాయెల్ అనే పేరుతో ఒక భూభాగమే లేదనేది అక్షర సత్యం. 1947 ముందు పాకిస్తాన్, బంగ్లాదేశ్ లు ప్రపంచ పటంలో లేవు అనేది కూడా సత్యమే కదా? వాటి మునుగడను భారతదేశం కాదంటుందా? ఇజ్రాయెల్ మనుగడను ప్రశ్నించే వారికి ఈ సమాధానం సరిపోదా? పెట్టుబడిదారీ పశ్చిమ దేశాలు మధ్య ఆసియాలో తమ రాజకీయ అవసరాల కోసమే ఈజిప్ట్, జోర్డాన్, సిరియా, లెబనాన్ దేశాల మధ్యలో ఇజ్రాయెల్‌ను సృష్టించాయి.



'జెరూసలేం' ప్రాంతం తమ ఆధ్యాత్మిక, మత, సాంస్కృతిక భావాలకు కేంద్రం అని రెండువేల ఏళ్లుగా యూదు జాతీయులు చెప్పుకొంటున్నారు. యూదులపై దయతో పశ్చిమ దేశాలు వారికి ఒక భూభాగాన్ని కేటాయించాయని చెప్తే సత్య దూరమవుతుంది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో పశ్చిమ దేశాలు 60 లక్షల మంది యూదులను నిర్దాక్షిణ్యంగా, అమానుషంగా మట్టుబెట్టాయనేది చరిత్ర చెప్పే చెరపలేని సాక్ష్యం.

ఇక పాలస్తీనా ఒక స్వతంత్ర భూభాగమనీ, దానిని దురహంకార పూరితమైన ఇజ్రాయెల్ దేశం ఆక్రమించిందనీ మన దేశంలోని చారిత్రిక పరిజ్ఞానం లేని కొంతమంది మూర్ఖపు వాదనలు చేస్తూ, దేశ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారు. ప్రస్తుతం పాలస్తీనా భూభాగాలుగా చెప్పుకొనే గాజా స్ట్రిప్, వెస్ట్ బ్యాంక్ ప్రాంతాలు 1967 వరకు వరుసగా ఈజిప్టు, జోర్డాన్ దేశాలలో భాగాలు. జోర్డాన్ నదికి పడమర వైపున ఉండే ప్రాంతాన్ని వెస్ట్ బ్యాంక్ అని పిలుస్తున్నారనేది గమనార్హం. ఇస్లాం మతస్థులకు 'జెరూసలేం' పవిత్ర స్థలం కూడా. అందుకే ఇజ్రాయెల్ ఏర్పాటును ముస్లిం దేశాలన్నీ వ్యతిరేకించాయి.

ఇక క్రైస్తవులకు 'జెరూసలేం', 'బెత్లెహేము' పవిత్ర స్థలాలు. క్రైస్తవుల ప్రాబల్యం నిలుపుకోవాలంటే అక్కడ పశ్చిమ దేశాలకు తమకు అనుకూలమైన దేశం ఒకటి ఉండాలి. ఇజ్రాయెల్ ఏర్పాటు వెనుక ఉన్న సూత్రం ఇదే! అరబ్ – ఇజ్రాయెల్ ఐదు యుద్ధాల్లో ముస్లిం దేశాలను ఇజ్రాయెల్ మట్టి కరిపించడం వెనక దాగి ఉన్న రహస్యం కూడా ఇదే! పశ్చిమ దేశాలన్నీ కూడా ఇజ్రాయెలీలకు ఇతోధిక సహాయ సహకారాలు అందిస్తున్నాయనేది వాస్తవం.

ఇక హమాస్ చర్యలు పాలస్తీనియన్ల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించి వేస్తాయనేది కాదనలేని సత్యం. గాజా స్ట్రిప్‌లోని ఇంటర్నల్ బంకర్లను ధ్వంసం చేసేంతవరకూ ఇజ్రాయెల్ ఆగదు. ఇదే జరిగితే అనేకమంది సామాన్య ప్రజలు బలి అవుతారు. అంతర్జాతీయ సమాజం ఈ విషయంపై దృష్టిని సారించి, హమాస్ తీవ్రవాదుల చెరలో బందీలుగా ఉన్న యూదులను విడిపించే ఏర్పాట్లు చేయాలి. అదే విధంగా ఇజ్రాయెల్ దుందుడుకు చర్యలకు అడ్డుకట్ట కూడా వేయాలి.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

అర్థంచేసుకొని ఆచరించాలి

టామ్, డొరోతి హాప్కిన్‌సన్ అనే ఇద్దరు 'మచ్ సైలెన్స్' అనే పేరుతో ఇంగ్లీష్‌లో రచించిన మెహెర్ బాబా జీవిత చరిత్ర గ్రంథం ఆరంభంలో మానవాళి మనుగడకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు లేవనెత్తారు.

భూమ్మీద మనిషి ఆవిర్భావం ఎలా జరిగింది? ఏ పరమార్థం ఆశించి మనిషి జీవిస్తున్నాడు? చనిపోయాక అతడు ఏమవుతాడు? ఇది మంచి, ఇది చెడు అని నిర్ణయించేది ఎవరు? నీతి నియమాలు అన్నీ దేశ కాలాలకు లోబడి, వాటికి తగ్గట్టుగా మార్పు చెందే సాంఘిక కట్టుబాట్లేనా? వెయ్యి లేక పదివేల ఏండ్ల కిందటి మానవుడి కన్నా నేటి మానవుడు ఎక్కువ ప్రశాంతంగా, ఆనందంగా జీవించ గలుగుతున్నాడా? జ్ఞానవంతంగా, అర్థవంతంగా జీవించే బదులు, కేవలం మేధావిగా, సంక్లిష్టంగా తయారైనాడా? అతడి జీవిత లక్ష్యం, సంతోషమే అయినప్పుడు, దాన్ని అతడు ఎందుకు అందుకోలేకపోతున్నాడు? ప్రతి తరంలోనూ ఆలోచించగల ప్రతి మనిషినీ వేధిస్తున్న ప్రశ్నలే ఇవి.



జ్యోతిర్మయం

వీటికి సమాధానాల కొరకు ముందుగా మనం రాజకీయాల వైపు, సైన్సు వైపు చూస్తాము. రాజకీయ వ్యవస్థలు కొంత వరకు బాహ్య పరిస్థితుల్లో మార్పు తీసుకు రాగలవేమోగానీ, మనిషి ఆంతరంగిక స్థితిని సరిదిద్దలేవు. ఆ విషయంలో సైన్సు ఏమైనా పరిష్కారం చూపగలదా అంటే, సైన్సు మానవాళికి ఎంత మేలు చేయగలదో అంతకు అంత కీడు చేయగలదనే సంగతి అణు బాంబుల వంటి వాటి ద్వారా నిరూపితమైంది.

ఇక మిగిలింది మతం. ఏ ప్రశ్నకైనా సమాధానం చెబుతాను, ఏ సమస్యకైనా పరిష్కారం చూపుతాను అంటుంది మతం. వేరు వేరు మతాలు వేరు వేరు సమాధానాలు, పరిష్కారాలు ఇస్తాయని జనం సాధారణంగా అనుకొంటారు గానీ అది నిజం కాదు. అన్ని మతాల ముఖ్య సందేశం, మౌలిక సూత్రం ఒక్కటే. జీవిత ధ్యేయం భగవంతుణ్ణి ప్రేమించు, తోటి మానవుణ్ణి ప్రేమించు, సహాయపడు అనే.

బోధించటం వేరు, ఆచరించటం వేరు. బీదరికాన్ని ప్రబోధించే మత సంస్థలు అంతులేని సంపదను పోగేసుకోవటం, సాధుత్వాన్ని ప్రబోధించే మత సంస్థలు ఆధిపత్యానికి అర్రులు జాచటం చూస్తున్నాము. ఏ మతం వాడైనా, అతడు తన మతం చెప్పే మౌలిక సిద్ధాంతాల్ని సరిగా అర్థం చేసుకొని, వాటిని నిజాయితీగా ఆచరణలో పెట్టి నట్లయితే, అతడు తన తోటి మానవుణ్ణి చంపటానికి సిద్ధపడుతూ వాడి అజ్ఞానాన్ని తన స్వార్థానికి వాడుకొని లాభపడాలని కోరుకోడు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** పౌర్ణమి రా.1.57 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** రేవతి ఉ.7.56 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** రా.3.04 నుండి 4.36 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.01 నుండి 7.32 వరకు, **అమృతఘడియలు:** రా.12.01 నుండి 1.34 వరకు, పాక్షిక చంద్ర గ్రహణం. : **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.00, **సూర్యాస్తమయం:** 5.28.

క్లుప్తంగా...

శ్రీవారి సేవలో శ్రీలంక రక్షణశాఖ సహాయ మంత్రి



తిరుమల: శ్రీవారిని శుక్రవారం శ్రీలంక రక్షణ శాఖ సహాయ మంత్రి తెన్న ప్రెమిథ బండార తెన్నాకూన్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలను, టీటీడీ అధికారులు ప్రసాదాలను అందజేశారు. అలాగే, స్వామి వారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేష్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్, తెలంగాణ ఎమ్మెల్యే దానం నాగేందర్ దర్శించుకున్నారు.

తిరుమల నడకదారిలో చిరుత



నడకదారిలో చిరుత

తిరుమల: తిరుమల నడకదారిలో మరోసారి చిరుత సంచారం కలకలం రేపింది. టీటీడీ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో చిరుత, ఎలుగుబంటి కనిపించాయి. తిరుమలకు అలిపిరి నడక మార్గంలో ఈనెల 24 నుంచి 27వ తేదీ మధ్యలో శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయం నుంచి రిపీటర్ మధ్య ప్రాంతంలో ఒక చిరుత, ఎలుగుబంటి తిరుగుతున్నట్టుగా కెమెరా ట్రాప్‌లో నమోదైంది. నడకదారి భక్తులు అప్రమత్తంగా ఉండాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. భక్తులు గుంపులుగానే వెళ్లాలని సూచించింది.

న్యాయ వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలా?

- కఠిన చర్యలు తీసుకోవాలని బహుజనుల డిమాండ్
- 1,125వ రోజుకు చేరుకున్న రిలే దీక్షలు



తాడికొండ: ఆర్థిక ఉగ్రవాది చంద్రబాబునాయుడు అరెస్టు, రిమాండ్‌పై న్యాయ వ్యవస్థను కించపరిచేలా సోషల్ మీడియా వేదికగా వ్యాఖ్యలు చేస్తున్న అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,125వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని పేదల పొట్టకొట్టి దోపిడీ చేసిన గజదొంగ చంద్రబాబు అరెస్టుతో న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం మరింత పెరిగిందన్నారు. అయితే ఓ సామాజిక వర్గం న్యాయ వ్యవస్థను కించపరిచేలా తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తున్నదని, ప్రతిగా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తనపై ఉన్న ఆరోపణలు నిరూపించుకోకుండా చంద్రబాబు.. వ్యవస్థలనే తప్పు దారి పట్టించాలనుకోవడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అందరికీ ఒకే న్యాయం ఉంటుందని నారా భువనేశ్వరి తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు. ఏపీలో సామాజిక న్యాయం, బహుజన రాజ్యాధికారం దిశగా అడుగులు పడుతుండడం హర్షణీయమని, బహుజనులకు పెద్దపీట వేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలతో ఆర్థికంగా పేదలు అభివృద్ధి చెందారనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా బహుజనుల పక్షపాతికే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. నాయకులు నూతక్కి జోషి, న్యాయవాదులు సాయిరామ్, సౌమ్య, జయలక్ష్మి, ఆర్‌కే చిన్నం, క్రిష్టాఫర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికను వేధించిన యువకుడికి 20 ఏళ్ల జైలు

విశాఖ–లీగల్: ముక్కుపచ్చలారని చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ విశాఖలోని బాలలపై లైంగిక నేరాల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనందిని శుక్రవారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా చెల్లించాలని, లేనిపక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. అలాగే బాలికకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు షేక్ ఫరీద్ (29) నగరంలోని ద్వారకానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతంపేట ప్రాంతం శాంతిపురంలో ఉంటున్నాడు. స్థానికంగా అతనికి పాన్ షాపు ఉంది. బాలిక (9) కుటుంబం కూడా పాన్ షాప్ దగ్గరలో ఉంటుంది. బాలిక సోదరికి జ్వరం రాగా.. రాత్రి 7.30 గంటల సమయంలో ఆమె సోదరితో కలిసి పాన్ షాప్‌కు వచ్చింది. 20 రూపాయలు చెల్లించి కూల్ డ్రింక్ తీసుకుని ఇంటికి వెళ్లింది. ఖాళీ కూల్ డ్రింక్ బాటిల్ షాపునకు తీసుకొచ్చిన బాలికకు స్ట్రాబెర్రీ ఇచ్చి కళ్లకు గంతలు కట్టి లైంగికంగా వేధించాడు. ఫరీద్ చేష్టలకు భయపడిన బాలిక ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చి జరిగిన ఘటనను తల్లిదండ్రులకు చెప్పింది. వారు ద్వారకానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

టోఫెల్ తర్ఫీదుకు కీలక అడుగు!

'లిక్విడ్ ఇంగ్లిష్ ఎడ్జ్'తో ఒప్పందం

- అంతర్జాతీయ స్థాయి మెటీరియల్
- ఈ విద్యా సంవత్సరానికి ఉచితంగా సేవలందించనున్న 'లిక్విడ్'



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను 'టోఫెల్ సర్టిఫికేషన్'కు సన్నద్ధం చేయడంలో భాగంగా 'లిక్విడ్ ఇంగ్లిష్ ఎడ్జ్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ విద్యా సంవత్సరానికి టోఫెల్ శిక్షణకు అవసరమైన సాఫ్ట్‌వేర్, ఈ–కంటెంట్‌ను ఉచితంగా అందించడంతో పాటు, ఉపాధ్యాయులు, అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ఇప్పటికే మూడో తరగతి నుంచి తొమ్మిది వరకు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రోజుకు గంట పాటు టోఫెల్ శిక్షణ ప్రారంభించినట్టు తెలిపారు. విద్యార్థుల్లో లిజనింగ్, స్పీకింగ్ నైపుణ్యాల పెంపు, వివిధ దేశాల్లో ఇంగ్లిషు మాట్లాడే తీరును అర్థం చేసుకుని.. తిరిగి జవాబు ఇచ్చేలా తర్ఫీదు ఇస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగానే ఎస్‌సీఈఆర్టీ ద్వారా మెటీరియల్ తయారు చేశామన్నారు. అయితే అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రొఫెషనల్ ఏజెన్సీ మెటీరియల్ అవసరాన్ని గుర్తించి లిక్విడ్ ఇంగ్లిష్ ఎడ్జ్‌తో ఒప్పందం చేసుకున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులే ఎక్కువగా ఉండటంతో వారిని దృష్టిలో పెట్టుకుని లిక్విడ్ సంస్థ ఉచితంగా మెటీరియల్ ఇచ్చేందుకు ముందుకొచ్చిందన్నారు. ఈ ప్రాజెక్టుకు సమగ్ర శిక్ష పీడీ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. వాస్తవానికి టోఫెల్ సర్టిఫికేషన్ కోసం ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్(ఈటీఎస్)తో ప్రభుత్వం ఒప్పందం చేసుకోగా.. విద్యార్థులను టోఫెల్ పరీక్ష కోసం సిద్ధం చేస్తున్నామన్నారు. అయితే అంతర్జాతీయ ప్రమాణాల తో కూడిన సంస్థల నుంచి టెండర్లు పిలిచినా.. శిక్షణ ప్రక్రియ ప్రారంభించేందుకు సమయం లేదన్నారు. అందుకే ప్రస్తుత విద్యా సంవత్సరానికి మాత్రమే లిక్విడ్ ఇచ్చే కంటెంట్ వినియోగించుకునేలా ఒప్పందం చేసుకున్నట్టు వివరించారు. వచ్చే ఏడాది టెండర్లు పిలిచి కంటెంట్ ఖరారు చేస్తామని వివరించారు.

తరగతి గదుల డిజిటలైజేషన్

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చిందని ప్రవీణ్‌ప్రకాశ్ చెప్పారు. ఇందులో భాగంగానే 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 41 లక్షల మంది ఆంగ్ల మాధ్యమం అభ్యసిస్తున్నట్టు చెప్పారు. దేశంలో తొలిసారిగా సైన్స్, సోషల్ సైన్స్, గణితం సబ్జెక్టుల్లో ద్విభాషా పాఠ్యపుస్తకాలను తీసుకొచ్చినట్టు తెలిపారు. విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యం పెంపొందించడంలో భాగంగా బైజూస్ ద్వారా ఉత్తమ కంటెంట్ అందిస్తోందన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు బైజూస్ కంటెంట్‌ను ఇన్‌స్టాల్ చేసి 5.18 లక్షల ట్యాబ్‌లను పంపిణీ చేసిందని వెల్లడించారు. నాడు–నేడులో భాగంగా పాఠశాలల్లో 30,213 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్(ఐఎఫ్‌పీ), ప్రాథమిక పాఠశాలల్లో 10,038 స్మార్ట్ టీవీలతో తరగతి గదులను డిజిటలైజ్ చేసిందని చెప్పారు. డిసెంబర్ నాటికి మొత్తం తరగతి గదుల్లో హైస్పీడ్ ఇంటర్‌నెట్‌తో డిజిటల్ బోధనలు ప్రవేశపెడతామని ప్రవీణ్‌ప్రకాశ్ వివరించారు.

అంతర్జాతీయంగా గుర్తింపు

నోయిడాకు చెందిన లిక్విడ్ ఇంగ్లిష్ ఎడ్జ్.. కామన్ యూరోపియన్ ఫ్రేమ్ వర్క్ ఆఫ్ రిఫరెన్స్(సీఇఎఫ్‌ఆర్)తో పాటు బ్రిటీష్ కౌన్సిల్, పియర్సన్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్, మాక్మిలన్, ఆదిత్య బిర్లా ఫౌండేషన్, పబ్లిషింగ్ కంపెనీలకు విశ్వసనీయ సేవలందిస్తోంది. గత రెండు దశాబ్దాల్లో మిలియన్లకు పైగా అభ్యాసకులకు సేవలందించింది. విద్యార్థుల తరగతి, వయస్సును బట్టి ఈ కంటెంట్‌ను తయారు చేసి అందిస్తోంది. కెయిర్న్ ఇండియా, అలహాబాద్ యూనివర్సిటీ, ఫెయిర్ అండ్ లవ్లీ ఫౌండేషన్, ఫ్రాంక్ఫిన్, గ్లోబల్ లాజిక్, ఇండియన్ మిలిటరీ అకాడమీ, జెట్కింగ్, ఒడిశా మోడల్ ట్రైబల్ ఎడ్యుకేషనల్ సొసైటీ వంటి అనేక మందికి సేవలందిస్తోంది.

విద్య, వైద్యానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యం

- 'నాడు–నేడు'తో ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మారిపోయాయి
- 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఒక గొప్ప కార్యక్రమం
- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ప్రశంస



బీపీ పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

శ్రీశైలం: ప్రజల జీవనంలో ముఖ్యమైన విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ప్రశంసించారు. శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డ్యాం, ప్రభుత్వ వైద్యశాల నిర్మించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 28, 29వ తేదీల్లో వజ్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శ్రీశైలం చేరుకున్న లక్ష్మీనారాయణ శుక్రవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డితో కలిసి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని అక్కడ అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు–నేడులో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని చెప్పారు. కార్పొరేట్ స్కూల్స్ తరహాలో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. సాధారణంగా అనారోగ్యం కలిగితే డాక్టర్ దగ్గరకు వెళతామని, కానీ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్యులే ప్రజల వద్దకు వెళ్లి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తుండటం గొప్ప విషయమన్నారు. సామాన్య ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ఎలాంటి శ్రద్ధ వహిస్తుందో అర్థమవుతోందని అభిప్రాయపడ్డారు.

నేడు పాక్షిక చంద్రగ్రహణం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): పాక్షిక చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం 6.30 గంటల వరకు విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు. అనంతరం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఆలయాలతో పాటు ఇతర ఉపాలయాలను మూసివేయనున్నట్లు ఆలయ వైదిక కమిటీ తెలిపింది. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం దర్శనం నిలిపివేసి కవాట బంధనం (తలుపులు మూసివేయడం) చేస్తారు. గ్రహణ మోక్షకాలం అనంతరం ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి అమ్మవారికి స్నపనాభిషేకం, నిత్య అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉదయం 9 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఆదివారం తెల్లవారుజామున నిర్వహించే సుప్రభాత సేవ, వస్త్ర సేవ, ఖడ్గమాలార్చనను రద్దు చేశారు. ఉదయం 7 గంటల తర్వాత ప్రారంభమయ్యే శ్రీచక్రనవార్చన, లక్ష కుంకుమార్చన, చండీహోమం, శాంతి కళ్యాణం వంటి సేవలు యథావిధిగా నిర్వహిస్తారు.

'మణప్పురం' మేనేజర్ అరెస్ట్

ప్రియుడితో కలిసి పదినెలల్లో పది కిలోల బంగారం మాయం

- వీరికి ఫైనాన్స్ సంస్థ ఉద్యోగి, ప్రియుడి తమ్ముడి సహకారం
- ఫిర్యాదు అందుకున్న పదిరోజుల్లో మొత్తం గుట్టురట్టు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జాషువ



వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ జాషువ

కోనేరుసెంటర్: ఎట్టకేలకు మణప్పురం ఫైనాన్స్ సంస్థలో చోరీ కేసును పోలీసులు ఛేదించగలిగారు. అదే సంస్థలో పనిచేస్తున్న ఓ మాయలేడి అక్రమాలకు కృష్ణాజిల్లా పోలీసులు చెక్ పెట్టారు. ఆమెను, మరో ముగ్గురిని పట్టుకుని కటకటాల వెనక్కు నెట్టారు. దీనికి సంబంధించి కృష్ణాజిల్లా ఎస్పీ పీ జాషువా శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు.

అక్రమ మార్గంలో సంపాదన

గుడివాడ మండలం, లింగవరం గ్రామానికి చెందిన రెడ్డి వెంకట పావని డిగ్రీ వరకు చదువుకుంది. వివాహమైన కొంతకాలానికే ఆమె భర్త చనిపోయాడు. అప్పటికే ఆమె మణప్పురం ఫైనాన్స్ కంపెనీలో గోల్డ్‌లోన్ మేనేజర్‌గా పనిచేస్తోంది. జిల్లాలోని ముదినేపల్లి, పెడన, బంటుమిల్లి బ్రాంచ్‌లలో పనిచేసి, ఇటీవల కంకిపాడు బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లింది. గోల్డ్‌లోన్ కోసం తరచూ ఆఫీసుకు వచ్చే కృత్తివెన్ను మండలం, పోడు గ్రామానికి చెందిన రేవు దుర్గాప్రసాద్‌తో పరిచయం ఏర్పడింది. అదికాస్తా చనువుగా మారింది. దుర్గాప్రసాద్ ప్రైవేట్ కళాశాల నిర్వహిస్తున్నాడు. ఈ పరిచయంతో ఇద్దరూ అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలనుకుని మణప్పురం ఫైనాన్స్‌లో ఎలాంటి ష్యూరిటీ లేకుండా, ఆభరణాలు తనఖా పెట్టకుండా దుర్గాప్రసాద్‌కు పావని లక్షల రూపాయలు బదిలీ చేసింది. అలాగే తాకట్టులో ఉన్న నగలను పెద్దమొత్తంలో అప్పజెప్పింది. పది నెలల్లో సుమారు రూ.3.60 కోట్లకు పైబడి విలువ చేసే దాదాపు 10.650 కిలోల బంగారాన్ని ఇద్దరూ కలిసి అపహరించారు.

ఆడిట్‌తో గుట్టురట్టు

వీరి పన్నాగానికి బందరు మండలం, పోలాటితిప్ప గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ తమ్ముడు కొక్కిలిగడ్డ నాగబాబు, కంకిపాడు మణప్పురం ఫైనాన్స్ సంస్థ హౌస్ కీపర్ మిట్టగడుకుల ప్రశాంతి సహకరించారు. అపహరించిన నగలను దుర్గాప్రసాద్ మచిలీపట్నం సహా విజయవాడలోని కోస్టల్ సెక్యూరిటీ బ్యాంకు, సౌత్ సెంట్రల్ బ్యాంకు, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాల్లో పలు దఫాలుగా తాకట్టు పెట్టి లక్షల్లో డబ్బు తీసుకున్నాడు. ఈనెల 16న ఒకేసారి తాకట్టులో ఉన్న ఏడు కిలోల బంగారు ఆభరణాలను పావని చోరీ చేసి పరారైంది. విషయం తెలుసుకున్న మణప్పురం శాఖ అధికారులు ఆడిట్ నిర్వహించగా, విషయం బయటపడింది. దీంతో వారు కంకిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఎస్పీ జాషువా డీఎస్పీ స్థాయి అధికారులతో ఎనిమిది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం నెప్పలి గ్రామంలోని డొంకరోడ్డులో పావని, దుర్గాప్రసాద్, వారికి సహకరించిన నాగబాబు, ప్రశాంతిలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బంగారాన్ని వందశాతం రికవరీ చేశారు. నగదు కొంత వాడుకున్నట్టు గుర్తించగా, మిగిలిన సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన అధికారులందరినీ ఎస్పీ అభినందించారు.

తగ్గిన తొలగింపులు

- ఉద్యోగాల కోతను తగ్గిస్తున్న ఐటీ కంపెనీలు
- ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచి క్రమేపి తగ్గుదల
- వ్యయాల తగ్గింపునకు ఇతర మార్గాల అన్వేషణ
- టెక్ డాట్ కో సర్వేలో వెల్లడి



సాక్షి, అమరావతి: దినదినగండంగా సాగుతున్న ఐటీ ఉద్యోగస్తులకు ఓ శుభవార్తతో కాస్త ఊరట లభించింది. గతేడాది ఉధృతంగా మొదలైన ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ ప్రస్తుతం గరిష్ట స్థాయికి చేరిందని, ఆ ప్రక్రియ ఇప్పుడు తగ్గుముఖం పట్టిందని టెక్ డాట్ కో అనే సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. 2022 సంవత్సరం నుంచి 2023 తొలి త్రైమాసికం వరకు వ్యయ నియంత్రణలో భాగంగా ఉద్యోగుల తొలగింపునకు కంపెనీలు మొగ్గు చూపిన విషయం తెలిసిందే. ఈ ఏడాది రెండో త్రైమాసికంలో ఉద్యోగాల తొలగింపు ప్రక్రియ సగానికిపైగా తగ్గిందని సర్వే సంస్థ పేర్కొంది. దేశవ్యాప్తంగా సుమారు 200కు పైగా రిక్రూట్‌మెంట్ సంస్థలు, ఐటీ కంపెనీలతో టెక్ డాట్ కో ఈ సర్వే నిర్వహించింది. ఈ ఏడాది ప్రారంభంలో 49 శాతం కంపెనీలు ఉద్యోగులను తొలగించడానికి మొగ్గు చూపగా ఇప్పుడు ఆ సంఖ్య 29 శాతానికి పరిమితమైనట్లు పేర్కొంది. ప్రస్తుతం ఉధృతి తగ్గినా భవిష్యత్తులో కూడా ఉద్యోగుల తొలగింపు కొనసాగుతుందని సర్వే అభిప్రాయపడింది. కాగా, దేశంలోని టాప్ 3 ఐటీ కంపెనీలు ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్‌లు రెండో త్రైమాసికంలో 16,162 మంది ఉద్యోగులను తొలగించినట్లు ప్రకటించాయి.

వ్యయాల తగ్గింపునకు ఇతర మార్గాలు

ఉద్యోగుల తొలగింపు తర్వాత నైపుణ్యం కలిగిన మానవ వనరులను కాపాడుకోవడానికి కంపెనీలు వ్యయాలను తగ్గించుకుంటున్నాయని, దాని కోసం ఇతర మార్గాలను అన్వేషిస్తున్నట్లు సర్వేలో వెల్లడైంది. దీనిలో భాగంగా పర్యటనలను కుదించుకోవడం, ఉద్యోగులు, క్లయింట్లతో సమావేశాలను వర్చువల్‌గా నిర్వహించడం, అలాగే ఉచిత భోజనాలు, జిమ్ మెంబర్‌షిప్ వంటి ఇతర సదుపాయాలకు కోత వంటి వాటిని కంపెనీలు చేపడుతున్నాయి. మళ్లీ వర్క్ ఫ్రమ్ హోమ్, రిమోట్ విధానం కొనసాగించడానికి 54 శాతంపైగా కంపెనీలు మొగ్గు చూపుతున్నాయి. ఆఫీసుకు తప్పనిసరిగా రావాలంటే నైపుణ్యం కలిగిన మానవ వనరులు దూరమవుతాయనే ఆందోళనే దీనికి కారణంగా చెపుతున్నారు.

గతంతో పోలిస్తే తొలగింపులు తగ్గాయి

గడిచిన ఆరు నెలలతో పోల్చితే ప్రస్తుతం ఐటీ కంపెనీల్లో ఉద్యోగుల తొలగింపు నెమ్మదిగా తగ్గుతోంది. అమెరికా మార్కెట్ ఇంకా కోలుకోలేకపోవడం, బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినడంతో ఐటీ పరిశ్రమ వెంటనే కోలుకునే పరిస్థితి లేదు. కంపెనీల్లో ఉద్యోగుల తొలగింపు గరిష్ట స్థాయికి చేరడంతో ఇంత కంటే భారీగా ఇక తొలగింపులు ఉండవు. అయితే ఐటీ కంపెనీలు దేశవ్యాప్తంగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లను భారీగా తగ్గించేశాయి. ప్రస్తుతం అత్యధిక ఐటీ కంపెనీలు వేచి చూసే ధోరణితో ఉన్నాయి.

– శ్రీధర్ కొసరాజు, పాస్ట్ ప్రెసిడెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్.

టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ అవసరం

ఐటీ రంగంలో భారీగా ఉద్యోగుల తొలగింపునకు ప్రధాన కారణం నాల్గవతరం పారిశ్రామిక విప్లవం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానం వల్ల 2030 నాటికి 5 కోట్ల ఉద్యోగాలు తొలగిపోతాయని అంచనా. ఇదే సమయంలో ఏఐ రంగం 70 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుంది. రానున్న కాలంలో కంటెంట్, కోడింగ్‌పై పనిచేసే వారికి ఉద్యోగ అవకాశాలు ఉండవు కాబట్టి ఏఐ వంటి నూతన టెక్నాలజీకి అప్‌గ్రేడ్ అయితే ఉద్యోగాలను నిలుపుకోగలుగుతారు. అలాగే కొత్త అవకాశాలను అందిపుచ్చుకోగలరు. గతంతో పోలిస్తే ఐటీ ఉద్యోగుల తొలగింపు క్రమేపీ తగ్గుతూ వస్తోంది.

– శ్రీనుబాబు గేదెల, ఫౌండర్ సీఈవో, పల్సస్‌గ్రూపు.

ఫొటో మార్ఫింగ్‌పై కె.ఎ.పాల్ ఫిర్యాదు



సీపీ రవిశంకర్‌కు ఫిర్యాదు అందజేస్తున్న కె.ఎ.పాల్



లోకేశ్, పవన్‌కళ్యాణ్ మధ్య మార్ఫింగ్ చేసిన కె.ఎ.పాల్ ఫొటో

దొండపర్తి (విశాఖ దక్షిణ): అవినీతి చక్రవర్తి చంద్రబాబునాయుడు కుమారుడు నారా లోకేశ్, సినీనటుడు పవన్‌కళ్యాణ్‌ల మధ్య తన ఫొటోను మార్ఫింగ్ చేసి ప్రచారం చేస్తున్న వ్యవహారంపై దర్యాప్తు చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ, జనసేన పార్టీల రాజకీయ పొత్తుతో తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. తన మిలియన్ల భక్తులు, పవన్ ఫ్యాన్స్ కూడా వీరి ఒప్పందాలను అంగీకరించే పరిస్థితి లేదని చెప్పారు. టీడీపీ, జనసేన పార్టీల పొత్తును 27 శాతం మంది కాపు సామాజికవర్గం వారు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఇటీవల ఆంధ్రా పాలిటిక్స్ అనే సంస్థ చేపట్టిన సర్వేలో 62 శాతం మంది ప్రజాశాంతి పార్టీకి మద్దతు పలకడం పట్ల లోకేశ్, పవన్ ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో లోకేశ్, పవన్ పొత్తుల వ్యవహారంలో తన ఫొటోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేయడం తన ప్రతిష్టకు భంగం కలిగించడమేనని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపుతున్న ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఫిర్యాదును కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు కూడా పంపిస్తున్నట్లు అందులో తెలిపారు.

మూగజీవాలకూ 'సురక్ష'

వచ్చే నెలలో మూడు ప్రాంతాల్లో జగనన్న పశు ఆరోగ్య సురక్ష శిబిరాలు

- 7న తిరుపతి, 10న ఎన్టీఆర్ జిల్లా, 14న విజయనగరం జిల్లాల్లో నిర్వహణ
- ఆ తర్వాత డిసెంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య శిబిరాలు
- జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చిన పశుసంవర్ధశాఖ డైరెక్టర్

సాక్షి, అమరావతి: ప్రజల ఆరోగ్య భద్రతకు చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష తరహాలోనే పశువుల ఆరోగ్యానికి భరోసా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే నెలలో రాష్ట్రంలోని తిరుపతి జిల్లాలో 7న, ఎన్టీఆర్ జిల్లాలో 10న, విజయనగరం జిల్లాలో 14న ప్రయోగాత్మకంగా జగనన్న పశు ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ సంకల్పించింది. దీనికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ శుక్రవారం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పశు ఆరోగ్య సురక్ష శిబిరాల్లో పశువులకు పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు ఇవ్వడం, అవసరమైతే శస్త్ర చికిత్సలు నిర్వహించాలని ఆదేశించారు. మూడు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా నిర్వహించే శిబిరాలకు వచ్చే పశువుల సంఖ్య, స్పెషలిస్ట్ డాక్టర్లు ఎంత మంది అవసరం, మందులు అవసరాలను గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా అవసరమయ్యే వాటిని అంచనా వేయనున్నారు. అనంతరం డిసెంబర్ 1 నుంచి 31 వరకు రాష్ట్రమంతటా జగనన్న పశు ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించనున్నారు. డిసెంబర్‌లో ప్రతీ మండలానికి నాలుగు శిబిరాల చొప్పున ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఒకటి మెగా శిబిరం కాగా మూడు మీడియం శిబిరాలు ఉంటాయి. ప్రయోగాత్మక శిబిరాలు నిర్వహించే మూడు జిల్లాల పశుసంవర్ధక శాఖ అధికారులు ఇప్పటి నుంచే తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని అమరేంద్ర కుమార్ ఆదేశించారు. ఈ ప్రయోగాత్మక శిబిరాల నిర్వహణకు మార్గదర్శకాలను జారీ చేశారు.

మార్గదర్శకాలు ఇవీ..

- శిబిరం నిర్వహించే తేదీని ముందుగానే స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలి. మంత్రులు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించి శిబిరాలను వారితో ప్రారంభించాలి. రైతులందరికీ ముందుగానే సమాచారం తెలియజేయాలి. విస్తృత ప్రచారం కల్పించాలి.
- పశువులు ఎక్కువ సంఖ్యలో ఉన్న ప్రదేశంలో శిబిరాలు నిర్వహించాలి.
- అవసరమైన మందులన్నీ ముందుగానే శిబిరాల్లో ఉంచాలి.
- ప్రయోగాత్మక శిబిరాలకు కనీసం 500 పశువులు వచ్చేలా జిల్లా పశు సంవర్ధక అధికారి చర్యలు తీసుకోవాలి.
- అవసరమైన పశు వైద్య బృందాలను ఏర్పాటు చేయాలి.
- అసిస్టెంట్ డైరెక్టర్, స్థానిక వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ, పశుసంవర్ధక శాఖ నుంచి స్పెషలిస్ట్ వైద్యులు (గైనకాలజీ, మెడిసిన్, సర్జరీ) బృందం ఏర్పాటు, స్కానింగ్ బృందం ఏర్పాటు చేయాలి.
- శిబిరాల్లో రిజిస్ట్రేషన్ కౌంటర్, గైనకాలజీ వార్డు, సర్జికల్ వార్డు, మెడికల్ వార్డు, డయాగ్నస్టిక్ కౌంటర్, ఔషధ పంపిణీ కౌంటర్ ఏర్పాటు చేయాలి.
- వ్యాధులున్న పశువులకు నిపుణులతో అవసరమైన పరీక్షలు నిర్వహించి.. వారు సూచించిన మందులు ఉచితంగా రైతుకు ఇవ్వాలి.
- చూడితో ఉన్న పశువులకు, పాలిచ్చే పశువులకు పౌష్టికాహారం పంపిణీ చేయాలి. ప్రివెంటివ్ సీజనల్ టీకాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. నులి పురుగుల నిర్మూలన మందులు ఇవ్వాలి.
- మేజర్ చికిత్సలు అవసరమైన పశువులకు సమీపంలోని వెటర్నరీ పాలిక్లినిక్‌లో శస్త్రచికిత్సకు ముందుగానే తేదీని నిర్ధారించాలి. ఆ తేదీన పశువులను డా.వైఎస్సార్ పశు ఆరోగ్య సేవా అంబులెన్స్ (1962) ద్వారా తరలించాలి.

జీజీహెచ్‌లో 'వోకల్ పెరాలసిస్'కు
అరుదైన శస్త్రచికిత్స



అప్పయ్యతో శస్త్ర చికిత్స చేసిన రవి, వైద్య బృందం

లబ్బీపేట (విజయవాడ తూర్పు): వోకల్ కార్డు (స్వరతంత్రి) కుడి వైపు పెరాలసిస్(పక్షవాతం)కు గురై సరిగ్గా మాట్లాడలేని స్థితిలో ప్రభుత్వాస్పత్రికి వచ్చిన రోగికి ఈఎన్‌టీ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసి మరలా మాట్లాడేలా చేయగలిగారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించిన ఈ శస్త్ర చికిత్స గురించి ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ కొణిదె రవి శుక్రవారం మీడియాకు వివరించారు. ఒంగోలుకు చెందిన డ్రైవర్ అప్పయ్య స్వర సమస్యతో చికిత్స కోసం తమ విభాగానికి రాగా, అతడికి వైద్య పరీక్షలు నిర్వహించి వోకల్ కార్డు కుడివైపు పెరాలసిస్ వచ్చినట్లు నిర్ధారించామని చెప్పారు. ఈ నెల 17న వీడియో ఎండోస్కోపీ ద్వారా స్వరాన్ని విశ్లేషిస్తూ థైరోప్లాస్టీ–1 అనే అరుదైన శస్త్ర చికిత్సను నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం రోగి మామూలుగా మాట్లాడగలుగుతున్నారని చెప్పారు. ఈ శస్త్ర చికిత్సలో ఈఎన్‌టీ వైద్యులు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లీలాప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు రత్నబాబు, శ్రీనివాస్, ఆదిత్య, స్పందన, వర్ధిని, పీటర్‌లతో పాటు పీజీ విద్యార్థులు, స్పీచ్ థెరపిస్ట్ జి గాయత్రి, మత్తు వైద్య విభాగాధిపతి డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ లవకుమార్ పాల్గొన్నారు. వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేష్ అభినందించారు.

'జగనన్నకు చెబుదాం'లో టీడీపీ నేత భూమా అఖిలప్రియ

- కేసీ కెనాల్ ఆయకట్టుకు నీరు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని వినతి



కలెక్టర్, ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న అఖిలప్రియ

ఆళ్లగడ్డ (నంద్యాల): నంద్యాల జిల్లా దొర్నిపాడులో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి కలెక్టర్ మనజీర్ జిలానీ హాజరయ్యారు. మాజీ మంత్రి, టీడీపీ నేత భూమా అఖిలప్రియ ఈ కార్యక్రమానికి వచ్చి కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలో సాగు చేసిన భూములకు సక్రమంగా నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇరిగేషన్ అధికారులు సాగునీటిపై రైతులకు సరైన సమాచారం ఇవ్వడంలేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ విచారించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వారబందీ లెక్కన నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు.

క్లుప్తంగా...

పాక్ కాల్పులతో పెళ్లిళ్లకు చిక్కులు

శ్రీనగర్: అంతర్జాతీయ సరిహద్దు వెంబడి పాక్ సైన్యం జరుపుతున్న విచక్షణారహిత కాల్పులతో జమ్మూలోని పలు గ్రామాల్లో పెళ్లిళ్లకు చిక్కులొచ్చి పడ్డాయి. దాంతో చివరి నిమిషంలో పలు పెళ్లిళ్లకు వేదికను మార్చుకోవాల్సి రావడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. భారీ కాల్పుల దెబ్బకు అతిథులు పెళ్లి విందు మధ్య నుంచే అర్ధంతరంగా నిష్క్రమిస్తున్న ఉదంతాలూ చోటుచేసుకుంటున్నాయి. పాక్ రేంజర్లు ఇలా కాల్పులకు తెగబడటం 2021 కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం ఇదే తొలిసారి. గురువారం రాత్రి నుంచీ అర్నియా తదితర ప్రాంతాలపై కాల్పులు ఏడు గంటలకు పైగా కొనసాగాయి. మరోవైపు వరి కోతల వేళ కాల్పులకు భయపడి కూలీలెవరూ పొలాలకు కూడా వెళ్లడం లేదు.

బంకర్లోనే పాఠాలు!

కాల్పుల భయంతో జమ్మూ జిల్లాలో పలు స్థానిక స్కూళ్లు మూతబడ్డాయి. అయితే సరిహద్దుకు సమీపంలోని షోగ్‌పూర్‌లో ఉన్న సర్కారీ పాఠశాల మాత్రం శుక్రవారం భూగర్భ బంకర్లలో నడిచింది! తమ ఇంట్లోవాళ్లు భయపడ్డా తాను మాత్రం స్కూలుకు హాజరయ్యానని సునీతా కుమారి అనే విద్యార్థిని చెప్పింది. ఆమెతో పాటు దాదాపు 20 మంది విద్యార్థులు స్కూల్‌లోని బంకర్లో పాఠాలు విన్నారు.

ఎథిక్స్ కమిటీని వాయిదా కోరిన ఎంపీ మొయిత్రా

కోల్‌కతా: డబ్బులు తీసుకుని పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగినట్లు వచ్చిన ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ ఎదుట విచారణకు నవంబర్ 5వ తేదీన తనకు వీలవుతుందని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా చెప్పారు. ఆమెపై ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే ఇప్పటికే ఎథిక్స్ కమిటీ ఎదుట హాజరయ్యారు. ఈ నెల 31వ తేదీన తమ ముందు హాజరు కావాలంటూ ఎంపీ మొయిత్రాకు నోటీసు పంపించింది. అయితే, నవంబర్ 4వ తేదీ వరకు అధికారిక, పార్టీ సంబంధ విజయదశమి అనంతర వేడుకల్లో పాల్గొనాల్సి ఉన్నందున అక్టోబర్ 31న ఢిల్లీకి రావడం వీలుకాదంటూ ఎథిక్స్ కమిటీ చైర్ పర్సన్ వినోద్ కుమార్ సొంకార్‌కు రాసిన లేఖలో వివరించారు. నవంబర్ 5వ తేదీన విచారణకు వస్తానని తెలిపారు. అంతేకాకుండా, తనకున్న హక్కును వినియోగించుకుంటూ వ్యాపారవేత్త దర్శన్ హీరానందానిని కమిటీ సమక్షంలోనే క్రాస్ ఎగ్జామిన్ చేయడానికి అనుమతివ్వాల్సిందిగా కోరారు. ఈ మేరకు రాసిన లేఖను శుక్రవారం ఆమె 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

దుబాయ్ దీదీ..

ఎథిక్స్ కమిటీకి రాసిన లేఖలో తన పేరును దుబే బదులుగా దుబాయ్ అని రాయడాన్ని ఎంపీ నిశికాంత్ దుబే తప్పుపట్టారు. ఎంపీ మొయిత్రాను ఆమె 'దుబాయ్ దీదీ' అంటూ వ్యాఖ్యానించారు. దుబాయ్‌ని ఆమె మర్చిపోలేకున్నారంటూ ఎద్దేవా చేశారు.

రూ. 25కు కిలో ఉల్లి

న్యూఢిల్లీ: నానాటికీ పెరుగుతున్న ఉల్లి ధరలకు కళ్లెం వేసి వినియోగదారులకు ఊరట కల్పించేందుకు కేంద్రం రంగంలోకి దిగింది. శుక్రవారం ఉల్లి ధరలు దేశవ్యాప్తంగా కిలో ఏకంగా 47 రూపాయలకు చేరాయి. దాంతో గోదాముల్లోని అదనపు నిల్వలను కిలో రూ.25కే విక్రయించాలని కేంద్రం నిర్ణయించింది. ముఖ్యంగా ఉల్లి ధర ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో అదనపు నిల్వలను 25 రూపాయల సబ్సిడీ ధరకే టోకు, రిటైల్ మార్కెట్లలోకి విడుదల చేస్తున్నట్టు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి రోహిత్‌కుమార్ సింగ్ తెలిపారు. ఇలా ఆగస్టు నుంచి ఇప్పటిదాకా 22 రాష్ట్రాల్లో ఏకంగా 1.7 లక్షల టన్నుల ఉల్లిని విడుదల చేసినట్టు వివరించారు. ఎన్‌సీసీఎఫ్, నాఫెడ్ ఆధ్వర్యంలో దుకాణాలు, వాహనాల ద్వారా సబ్సిడీ ధరకు ఉల్లిని అందుబాటులో ఉంచుతున్నారు.

మానవత్వం మేల్కొనేదెప్పుడు?

న్యూఢిల్లీ: పాలస్తీనాలోని గాజాలో కొనసాగుతున్న రక్తపాతం, తీవ్ర హింసాత్మక ఘటనలపై కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా ఆందోళన వ్యక్తం చేశారు. ఉల్లంఘనకు గురికాని అంతర్జాతీయ చట్టం కానీ, నిబంధన కానీ ఒక్కటీ లేదన్న విషయం ప్రస్తుతం అక్కడ జరుగుతున్న పరిణామాలను బట్టి తేటతెల్లమవుతోందన్నారు. 'ఎందరు చిన్నారులు ప్రాణత్యాగం చేయాలి? ఇంకెందరు మరణించాలి? మానవత్వం అనేది ఉందా? మానవత్వం మేల్కొనేది ఇంకెప్పుడు?'అని ఆమె శుక్రవారం 'ఎక్స్'లో ప్రశ్నించారు. గాజాలో మూడు వేల మంది అమాయక చిన్నారులు సహా మొత్తం ఏడు వేల మందికిపై ప్రాణాలు కోల్పోయినప్పటికీ రక్తపాతం, హింసకు ఫుల్‌స్టాప్ పడకపోవడంపై ప్రియాంకా గాంధీ తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు.

పశ్చిమ బెంగాల్ మంత్రి జ్యోతిప్రియో మల్లిక్ అరెస్టు

కోల్‌కతా: రేషన్ సరుకుల కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో పశ్చిమ బెంగాల్ అటవీ మంత్రి, టీఎంసీ నేత జ్యోతి ప్రియో మల్లిక్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు అరెస్టు చేశారు. దాదాపు 18 గంటలపాటు ప్రశ్నించిన అనంతరం శుక్రవారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మల్లిక్‌ను వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు. మల్లిక్‌ను కోర్టులో ప్రవేశపెట్టి, తదుపరి విచారణ కోసం కస్టడీ కోరుతామని చెప్పారు. 18 గంటలపాటు ప్రశ్నించినా నోరువిప్పలేదని, విచారణకు సహకరించలేదని అన్నారు. కాగా, మంత్రి మల్లిక్‌ను అధికారులు కోర్టులో ప్రవేశపెట్టిన సమయంలో ఆయన హఠాత్తుగా అస్వస్థతకు గురై కుప్పకూలినట్లు తెలిసింది. ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించారు. న్యాయస్థానం ఆయనను 10 రోజులపాటు ఈడీ కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.



ఇజ్రాయెల్ హెచ్చరికలతో ఉత్తర గాజాను వీడి మరో ప్రాంతంలో వంట చేసుకుంటున్న పాలస్తీనా మహిళలు



దాడుల భయంతో ఖాన్ యూనిస్‌లోని ఆస్పత్రిలో చిన్నారులతో ఆశ్రయం పొందిన మహిళలు

గాజాలో నరకయాతన

రెండో రోజూ ఇజ్రాయెల్ సైన్యం భూతల దాడులు | పదుల సంఖ్యలో హమాస్ స్థావరాలు నేలమట్టం

- మిలిటెంట్లపై త్వరలో పూర్తిస్థాయి యుద్ధం తప్పదంటున్న ఇజ్రాయెల్
- ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో 7,300 మందికిపైగా మృతి

రఫా/టెల్ అవీవ్: ఉత్తర గాజాపై ఇజ్రాయెల్ సైన్యం భూతల దాడులు రెండో రోజు శుక్రవారం కూడా కొనసాగాయి. ప్రధానంగా గాజా సిటీ శివారు ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి. పదుల సంఖ్యలో హమాస్ మిలిటెంట్ల స్థావరాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ అధికారులు ప్రకటించారు. పూర్తిస్థాయి భూతల యుద్ధం త్వరలో ప్రారంభమవుతుందని భావిస్తున్నామని, అది సుదీర్ఘకాలం, సంక్లిష్టంగా ఉండబోతోందని ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి యోవ్ గల్లాంట్ చెప్పారు. గాజాలో హమాస్ మిలిటెంట్లు నిర్మించుకున్న సొరంగాల వ్యవస్థను పూర్తిగా నాశనం చేయడమే తమ లక్ష్యమని అన్నారు. గల్లాంట్ శుక్రవారం విదేశీ జర్నలిస్టులతో మాట్లాడారు. భారీ స్థాయిలో సైనిక బలగాలతో భూతల యుద్ధం ప్రారంభిస్తామని అన్నారు. వారికి వెన్నుదన్నుగా వైమానిక దళం కూడా ఉంటుందని చెప్పారు. తమ జవాన్లు గురువారం ఉత్తర గాజాపై భూతల దాడి చేసి, క్షేమంగా తిరిగి వచ్చారని వెల్లడించారు. శుక్రవారం కూడా ఆపరేషన్ విజయవంతంగా పూర్తయ్యిందన్నారు.

9 వేలు దాటిన మృతుల సంఖ్య

మూడు వారాల క్రితం ప్రారంభమైన ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో మృతుల సంఖ్య 9 వేలు దాటింది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో 7,300 మందికిపైగా పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో 3,000 మంది మైనర్లు, 1,500 మందికిపైగా మహిళలు ఉన్నారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య గతంలో జరిగిన నాలుగు యుద్ధాల్లో దాదాపు 4,000 మంది మృతిచెందారు. ఈ నెల 7న మొదలైన యుద్ధంలో మృతుల సంఖ్య ఇప్పటికే 7,300 దాటింది. ఇజ్రాయెల్ దాడుల్లో వెస్ట్‌బ్యాంక్‌లో మృతిచెందినవారి సంఖ్య 110కు చేరుకుంది. హమాస్ మిలిటెంట్ల దాడుల్లో ఇజ్రాయెల్ భూభాగంలో 1,400 మందికిపైగా మృత్యువాతపడ్డారు. హమాస్ వద్ద 229 మంది బందీలు ఉన్నట్లు తెలుస్తోంది. వారిని విడిపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటిదాకా నలుగురు బందీలను మిలిటెంట్లు విడుదల చేశారు. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో గాజాలో ఇప్పటిదకా 200కిపైగా పాఠశాలలు ధ్వంసమయ్యాయని 'యునెస్కో' ప్రకటించింది. అంటే గాజాలోని మొత్తం స్కూళ్లలో 40 శాతం స్కూళ్లు ధ్వంసమైనట్లు తెలియజేసింది.

ఇంధనాన్ని అనుమతించేది లేదు

సరిపడా ఆహారం, నీరు, నిత్యావసరాలు, ఔషధాలు లేక గాజాలో ప్రజల కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. జనం నరకయాతన అనుభవిస్తున్నారు. ఆసుపత్రుల్లో రోగులు, క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంక్యుబేటర్లు పనిచేయక శిశువులు కన్నుమూస్తున్నారు. ఈజిప్టు ప్రభుత్వం పరిమితంగా ఆహారం, నిత్యావసరాలను ఈజిప్టు నుంచి గాజాలోకి అనుమతిస్తోంది. మరోవైపు గాజాకు పెట్రోల్, డీజిల్ సరఫరాను అనుమతించబోమని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గల్లాంట్ మరోసారి తేల్చిచెప్పారు. ఇంధనం మిలిటెంట్ల చేతుల్లోకి చేరితే దుర్వినియోగమయ్యే అవకాశం ఉందన్నారు. మిలిటెంట్లు జనరేటర్లతో సొరంగాల్లోకి గాలిని పంపిస్తుంటారని, ఇందుకోసం ఇంధనం వాడాల్సి ఉంటుందన్నారు. ''హమాస్ మిలిటెంట్లకు గాలి కావాలంటే ఇంధనం కావాలి, ఇంధనం కావాలంటే మేము కావాలి'' అని గల్లాంట్ వ్యాఖ్యానించారు.

బందీల్లో 30 మంది పిల్లలు!

ఈ నెల 7న ఇజ్రాయెల్‌పై హఠాత్తుగా దాడి చేసిన హమాస్ మిలిటెంట్లు దొరికినవారిని దొరికినట్లు ఊచకోత కోశారు. చాలామందిని నిలబెట్టి కాల్చేశారు. వెనక్కి వెళ్లిపోతూ 229 మందిని బందీలుగా బలవంతంగా లాక్కెళ్లారు. వీరిలో ఇజ్రాయెల్ పౌరులతోపాటు విదేశీయులు కూడా ఉన్నారు. బందీలను గాజాలోని గుర్తుతెలియని ప్రాంతంలో దాచినట్లు తెలుస్తోంది. బందీల్లో 30 మంది చిన్నపిల్లలు ఉన్నారని ఇజ్రాయెల్ ప్రభుత్వం నిర్ధారణకు వచ్చింది. తమ పిల్లలను విడిపించాలంటూ వారి తల్లిదండ్రులు ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నారు. మూడేళ్ల, నాలుగేళ్ల వయసున్న చిన్నారులను కూడా మిలిటెంట్లు అపహరించడం గమనార్హం. వారి క్షేమ సమాచారాలు తెలియక కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారు. జెనీవా తీర్మానం ప్రకారం.. సాధారణ పౌరులను బందీలుగా మార్చడం ముమ్మాటికీ యుద్ధ నేరమే అవుతుంది.



గాజాలో దాడుల్లో ధ్వంసమైన భవనం నుంచి చెలరేగిన మంటలు

సిరియాలో అమెరికా దాడులు

వాషింగ్టన్: తూర్పు సిరియాలో ఇరాన్‌కు చెందిన రివల్యూషనరీ గార్డ్ సేనల స్థావరాలే లక్ష్యంగా అమెరికా ఫైటర్ జెట్లు శుక్రవారం ఉదయం నిప్పుల వర్షం కురిపించాయి. రెండు ప్రాంతాల్లో ఈ దాడులు నిర్వహించినట్లు అమెరికా రక్షణ శాఖ కార్యాలయం పెంటగాన్ ప్రకటించింది. గతవారం సిరియాలోని తమ సైనిక స్థావరాలపై ఇరాన్ అనుకూల మిలిటెంట్లు క్షిపణులు, డ్రోన్లతో దాడి చేశారని, వాటికి ప్రతిస్పందనగానే తాము వైమానిక దాడులు చేసినట్లు వెల్లడించింది. ఒకవైపు ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం కొనసాగుతుండగా, మరోవైపు అమెరికా సైన్యం సిరియాలో ఇరాన్ అనుకూల శక్తులపై విరుచుకుపడడం ఆందోళన కలిగిస్తోంది. అయితే, సిరియాలో దాడికి ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణతో ఏమాత్రం సంబంధం లేదని అమెరికా తేల్చిచెప్పింది. తమ అధ్యక్షుడు జో బైడెన్ ఆదేశాలతోనే తూర్పు సిరియాలో ఇరాన్ సాయుధ దళాలపై దాడి చేశామని అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ పేర్కొన్నారు. అమెరికా దళాలపై దాడులను సహించబోమని పేర్కొన్నారు. అక్టోబర్ 17 నుంచి ఇరాక్, సిరియాలోని తమ సైనిక స్థావరాలపై, జవాన్లపై కనీసం 19 దాడులు జరిగాయని పెంటగాన్ ఆరోపించింది. ఈ దాడులకు బాధ్యులైనవారిపై ప్రతీకారం తప్పదని హెచ్చరించింది. తాజా పరిణామాల నేపథ్యంలో అమెరికా రక్షణ శాఖ పశ్చిమాసియాలో భారీ సంఖ్యలో సైనిక బలగాలను మోహరిస్తోంది.

క్రిమినల్ బిల్లుల పరిశీలనకు మరింత సమయం

న్యూఢిల్లీ: ప్రస్తుత క్రిమినల్ చట్టాల స్థానంలో ప్రతిపాదించిన మూడు కొత్త బిల్లులపై హోం శాఖ కార్యకలాపాల పార్లమెంటరీ కమిటీ భేటీ శుక్రవారం అసంపూర్తిగా ముగిసింది. బిల్లుల డ్రాఫ్ట్‌ల అధ్యయనానికి మరింత సమయం కావాలని కమిటీలోని విపక్ష సభ్యులు కోరారు. స్వల్పకాలిక ఎన్నికల లబ్ధి కోసం వాటిని హడావుడిగా ఆమోదించొద్దని కమిటీ చైర్‌పర్సన్ బ్రిజ్ లాల్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో కమిటీ నవంబర్ 6న భేటీ అయ్యే అవకాశముందని చెబుతున్నారు. విపక్ష సభ్యుల నుంచి వ్యతిరేకత ఎదురైనా ఆ రోజు వాటిని కమిటీ ఆమోదిస్తుందని సమాచారం. బ్రిటిష్ కాలం నాటి నేర న్యాయ చట్టాలను పూర్తిగా ప్రక్షాళన చేసేందుకు మూడు కొత్త బిల్లులను పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టడం తెలిసిందే. అనంతరం వాటిని పరిశీలన కమిటీకి పంపారు. వాటిపై పరిశీలనకు మరింత కావాలంటూ కమిటీలోని విపక్ష సభ్యులు పి.చిదంబరం (కాంగ్రెస్), డెరిక్ ఒబ్రియాన్ (టీఎంసీ) చైర్మన్‌కు లేఖ రాసినట్టు సమాచారం. ముఖ్యంగా ప్రతిపాదిత చట్టాలకు హిందీ పేర్లు పెట్టడాన్ని డీఎంకే వంటి విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. వాటిని పట్టించుకోరాదని కేంద్రం నిర్ణయించినట్టు చెబుతున్నారు.

భారత దళాలు వైదొలగాలి

మాలె: మాల్దీవుల నుంచి భారత సైనిక దళాలు వైదొలగాలని ఆ దేశాధ్యక్షునిగా ఎన్నికైన మహమ్మద్ ముయిజ్జు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కొత్త అధ్యక్షుని వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే చైనా దళాలను కూడా తమ భూభాగంపైకి అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారు. భారత దళాలను వెనక్కు పంపుతానని ఎన్నికల సందర్భంగా ఆయన వాగ్దానం చేశారు. మాల్దీవుల్లో 70 మంది భారతసైనిక సిబ్బంది ఉన్నారు. భారత్ అందజేసిన రాడార్ స్టేషన్లు, నిఘా విమానాల పర్యవేక్షణ బాధ్యతలు చూస్తుంటారు. ఆ ప్రాంతంలో సైనికంగా ప్రభావం చూపేందుకు, ముఖ్యంగా మాల్దీవులపై పట్టు కోసం భారత్, చైనా దశాబ్దాలుగా పోటాపోటీగా ప్రయత్నిస్తూ వస్తున్నాయి.

'దుమ్ము' రేపిన విక్రమ్!

బెంగళూరు: చంద్రయాన్–3లో భాగంగా పంపిన విక్రమ్ ల్యాండర్ చంద్రునిపై దిగిన సందర్భంగా భారీ పరిమాణంలో దుమ్మును వెదజల్లింది. ఫలితంగా అక్కడ చిన్న గుంతలాంటి ప్రదేశం ఏర్పడినట్టు ఇస్రో శుక్రవారం వెల్లడించింది. 'ఉపరితలంలోని ఏకంగా 2.09 టన్నులకు పైగా దుమ్ము, ధూళి, ఖనిజ శకలాల వంటివి 108 మీటర్ల పరిధిలో చెల్లాచెదురయ్యాయి. దాంతో విక్రమ్ చుట్టూ భారీ వలయాకార పరిధి (గుంత వంటిది) ఏర్పడింది'' అని వివరించింది. ల్యాండింగ్‌కు ముందు, జరిగిన వెంటనే తీసిన ఫొటోలను ఉపగ్రహ ఆర్బిటార్‌లోని హై రిజల్యూషన్ కెమెరా సాయంతో హైదరాబాద్ జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రం సైంటిస్టులు ఈ మేరకు వెల్లడించారు.

కాంగ్రెస్.. కాలం చెల్లిన ఫోన్

- ప్రజలు ఎప్పుడో దాన్ని వదిలించుకున్నారు
- 2014లోనే పెనుమార్పు జరిగింది
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి
- ఢిల్లీలో 'ఇండియా మొబైల్ కాంగ్రెస్' ప్రారంభం



మాట్లాడుతున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: 2014 అనేది కేవలం ఒక తేదీ కాదని, దేశంలో అదొక పెనుమార్పు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీని కాలం చెల్లిన ఫోన్‌గా అభివర్ణించారు. 2014లో దేశ ప్రజలు ఆ ఔట్‌డేటెడ్ ఫోన్‌ను వదిలించుకున్నారని, ఇండియా దశ దిశ మార్చే ప్రభుత్వాన్ని ఎంచుకున్నారని తెలిపారు. కాలం తీరిన ఫోన్లలో ఎన్నిసార్లు బటన్లు నొక్కినా, స్తంభించిన స్క్రీన్‌ను ఎన్నిసార్లు తట్టినా ఎలాంటి ఫలితం ఉండదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రీస్టార్ట్ చేసినా, చార్జింగ్ పెట్టినా, బ్యాటరీ మార్చినా ఆ ఫోన్ పనిచేయదని పరోక్షంగా కాంగ్రెస్ పార్టీని ఎద్దేవా చేశారు. పనికిరాని ఫోన్ తరహాలోనే కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో దేశ ఆర్థిక వ్యవస్థ, పరిపాలన స్తంభించిపోయిందని అన్నారు. అలాంటి సమయంలో దేశానికి సేవ చేసే అవకాశాన్ని ప్రజలు తమకు ఇచ్చారని గుర్తుచేశారు. శుక్రవారం ఢిల్లీలో 'ఇండియా మొబైల్ కాంగ్రెస్'ను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్లలో తమ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన సంస్కరణలతో దేశం ప్రగతి పథంలో పరుగులు తీస్తోందని అన్నారు. గతంలో మొబైల్ ఫోన్లు దిగుమతి చేసుకున్న మన దేశం ఇప్పుడు ఎగుమతిదారుగా మారిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు మన దేశంలోనే ఫోన్లను ఉత్పత్తి చేస్తున్నాయని వెల్లడించారు. భారత్‌లో 5జీ మొబైల్ సేవలు అత్యంత వేగంగా విస్తరిస్తున్నాయని, ఇక 6జీ సర్వీసులకు శ్రీకారం చుట్టబోతున్నామని తెలిపారు. గతేడాది అక్టోబర్ 1న 5జీ టెక్నాలజీని ప్రారంభించామని, దేశవ్యాప్తంగా ఏడాదిలోనే 5 లక్షల 5జీ బేస్ స్టేషన్లు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. 2జీ సేవల విషయంలో ఏం జరిగిందో అందరికీ తెలుసని చెప్పారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న టెలికాం స్పెక్ట్రం కుంభకోణాన్ని నరేంద్ర మోదీ ప్రస్తావించారు. 4జీ సేవలను తీసుకొచ్చిన తమపై ఎలాంటి అవినీతి ఆరోపణలు రాలేదన్నారు. 6జీ టెక్నాలజీలో ప్రపంచాన్ని మనమే ముందుకు నడిపిస్తామన్న విశ్వాసం తనకు ఉందన్నారు.

దేశవ్యాప్తంగా 100 '5జీ ల్యాబ్‌లు'

యూపీఏ సర్కారు పాలనలో మొబైల్ ఫోన్ల తయారీ రంగాన్ని విస్మరించారని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. ప్రస్తుతం మన దేశం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్‌ఫోన్ల తయారీదారుగా మారిందని అన్నారు. అలాగే ఏటా రూ.2 లక్షల కోట్ల విలువైన ఎల్రక్టానిక్ పరికరాలను ఎగుమతి చేస్తున్నామని తెలియజేశారు. ఇండియాలో తయారైన ఫోన్లను ప్రపంచమంతటా ఉపయోగిస్తుండడం మనకు గర్వకారణమని పేర్కొన్నారు. బ్రాడ్‌బ్యాండ్ వేగంలో మన దేశం ఏడాది వ్యవధిలోనే 118వ స్థానం నుంచి 43వ స్థానానికి చేరిందని వివరించారు. ఇంటర్నెట్ అనుసంధానం, వేగంతో ప్రజల జీవనం సులభతరం అవుతోందన్నారు. విద్య, వైద్యం, టూరిజం, వ్యవసాయం వంటి రంగాల్లో మెరుగైన ఫలితాలు లభిస్తున్నాయని తెలిపారు. ఆధునిక సాంకేతికత వల్ల కలిగే ప్రయోజనాలు ప్రతి సమాజంలో ఒక్కరికీ చేరాలని, ఆ దిశగా కృషి చేస్తున్నామని వెల్లడించారు. పెట్టుబడి, వనరులు, సాంకేతికతను ప్రజలకు చేరువ చేయడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. విద్యార్థులు, స్టార్టప్ కంపెనీల కోసం దేశవ్యాప్తంగా త్వరలో 100 '5జీ ల్యాబ్‌లు' అందుబాటులోకి రాబోతున్నాయని తెలిపారు. విద్యాసంస్థల్లో వీటిని ఏర్పాటు చేస్తామన్నారు.

జమిలి ఎన్నికలకు 30 లక్షల ఈవీఎంలు కావాలి

- ఏర్పాట్లకు ఏడాదిన్నర సమయం అవసరం
- లా కమిషన్‌కు ఎన్నికల సంఘం సమాచారం



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలంటే 30 లక్షల ఎల్రక్టానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎంలు) అవసరమని అధికార వర్గాలు వెల్లడించాయి. అలాగే జమిలి ఎన్నికలకు సన్నాహాలు పూర్తిచేయడానికి దాదాపు ఏడాదిన్నర సమయం కావాలని పేర్కొన్నాయి. జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై దేశంలో చర్చ జరుగుతోంది. లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. కేంద్ర లా కమిషన్ ప్రస్తుతం జమిలి ఎన్నికల అంశంపై కసరత్తు చేస్తోంది. జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే ఈవీఎంలు ఎన్నికావాలి? ఎంత సమయం అవసరం? అన్నదానిపై ఎన్నికల సంఘం అధికారులు లా కమిషన్‌కు కొన్ని నెలల క్రితం సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఒక్కో ఈవీఎంలో భాగంగా ఒక కంట్రోల్ యూనిట్, ఒక బ్యాలెట్ యూనిట్, ఒక వీవీప్యాట్ ఉంటాయి. జమిలి ఎన్నికలకు 30 లక్షల కంట్రోల్ యూనిట్లు, 43 లక్షల బ్యాలెట్ యూనిట్లు, 32 లక్షల వీవీప్యాట్లు కావాలని చెబుతున్నారు. కొన్ని బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్లను రిజర్వ్‌లో ఉంచాల్సి ఉంటుంది కాబట్టి అదనంగా అవసరమని పేర్కొంటున్నారు. ఒకవేళ జమిలి ఎన్నికలు నిర్వహిస్తే కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్లు కలిపి దాదాపు 35 లక్షల ఓటింగ్ యూనిట్లను కొత్తగా సమకూర్చుకోవాల్సి ఉంటుందని సమాచారం.

12.50 లక్షల పోలింగ్ కేంద్రాలు

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరిగినప్పటికీ రెండు ఓట్లు వేర్వేరుగా వేయాల్సి ఉంటుంది. అందుకు రెండు ఈవీఎంలు కావాలి. జమిలి ఎన్నికల్లో ఓటింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలను భద్రపర్చడానికి తగిన వసతులు ఉండాలని ఎన్నికల సంఘం పేర్కొంది. గత లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 12.50 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో 15 లక్షల కంట్రోల్ యూనిట్లు, 15 లక్షల వీవీప్యాట్లు, 18 లక్షల బ్యాలెట్ యూనిట్లు ఉపయోగించారు. అన్నీ కలిపి కోటి యూనిట్లు కొనుగోలు చేయాలంటే రూ.15,000 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని అంచనా. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలతోపాటు మున్సిపాల్టీలు, పంచాయతీల ఎన్నికలు నిర్వహించడంపై(ఒక దేశం, ఒకే ఎన్నిక) మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ అధ్యయనం కొనసాగిస్తోంది.


చైనా మాజీ ప్రధాని లీ మృతి

బీజింగ్: చైనా మాజీ ప్రధాని, ప్రఖ్యాత ఆర్థికవేత్త లీ కీ కియాంగ్ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. 68 ఏళ్ల లీ ఒకానొక సమయంలో అధ్యక్షుడు జీ షిన్‌పింగ్‌కు గట్టి పోటీదారుగా నిలిచారు. ఆయన గురువారం గుండెపోటు బారిన పడ్డారని, అన్నిరకాల చికిత్స అందించినా ఫలితం లేకపోయిందని అధికార వార్తా సంస్థ జిన్ హువా పేర్కొంది. క్రియాశీల రాజకీయాల నుంచి గత మార్చిలో రిటైరయ్యాక ఆయన షాంఘైలో ప్రశాంత జీవనం గడుపుతున్నారు. 2013లో చైనా కమ్యూనిస్టు పార్టీ అధ్యక్ష పదవి కోసం జిన్‌పింగ్‌తో లీ హోరాహోరీ తలపడ్డారు. తర్వాత నంబర్ 2 స్థానంతో సంతృప్తి పడి 2013 నుంచి 2023 దాకా పదేళ్ల పాటు ప్రధానిగా పని చేశారు. ఆయన అద్భుతమైన కమ్యూనిస్టు కార్యకర్త అని, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పాటుపడ్డారని సీపీసీ, పార్లమెంటు, కేబినెట్ కొనియాడాయి. పెకింగ్ యూనివర్సిటీలో లా పట్టభద్రుడైన అనంతరం 1976లో లీ కమ్యూనిస్టు పార్టీలో చేరారు. ముక్కుసూటి వ్యాఖ్యలకు పెట్టింది పేరుగా నిలిచారు. చైనాలో ఏకంగా 60 కోట్ల మంది నెలసరి ఆదాయం కేవలం 140 డాలర్లు మాత్రమేనని ప్రధాని హోదాలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా పతాక శీర్షికలుగా మారి చైనా నాయకత్వాన్ని ఇరుకున పెట్టాయి. జిన్‌పింగ్‌తో ఆయన బంధం ఎప్పుడూ సజావుగా సాగలేదు. జిన్‌పింగ్‌తో పోలిస్తే లీ అతి సామాన్య జీవనం గడుపుతూ వచ్చారు. మాజీ అధ్యక్షుడు హూ జింటావో దన్నుతో లీ అంచెలంచెలుగా రాజకీయంగా ఎదిగారు. కానీ ఆయన్ను కాదని దేశ ఉపాధ్యక్షునిగా ఉన్న జిన్‌పింగ్‌ను తన వారసునిగా 2012లో జింటావో ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

ముక్తార్ అన్సారీకి పదేళ్ల జైలు

లక్నో: మాఫియా నేత, రాజకీయ నాయకుడు ముక్తార్ అన్సారీకి ఘాజీపూర్‌లోని ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. మరో రూ.5 లక్షల జరిమానా కూడా విధించింది. 2010లో కరండాలో కపిల్‌దేవ్ సింగ్ అనే టీచర్ హత్య, 2009లో మీర్ హసన్ అనే వ్యాపారిపై హత్యాయత్నంపై గ్యాంగ్‌స్టర్ చట్టం కింద అన్సారీపై కేసులున్నాయి. అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జి అరవింద్ కుమార్ కేసు విచారణ జరిపారు.

కరోనాతో మంచాన పడ్డవారికి...
లాంగ్ కోవిడ్ ముప్పు!



న్యూఢిల్లీ: కరోనా రోగుల్లో వారం పాటు, ఆపై మంచానికి పరిమితమైన వారిలో లాంగ్ కోవిడ్ లక్షణాలు ప్రస్ఫుటంగా కన్పిస్తున్నట్టు తాజా పరిశోధనలో తేలింది. వారిలో చాలామంది కనీసం రెండేళ్లపాటు విపరీతమైన ఒంటి నొప్పులు తదితర లక్షణాలతో బాధపడుతున్నారట. లాన్సెట్ రీజనల్ హెల్త్ యూరప్ జర్నల్ అధ్యయనం ఈ మేరకు తేల్చింది. లింగ, వయో తదితర భేదాలకు అతీతంగా అందరిలోనూ ఇది సమానంగా కనిపించినట్టు వివరించింది. కరోనాతో రెండు నెలలకు, అంతకుమించి ఆస్పత్రిపాలైన వారిలో ఈ సమస్యలు, లక్షణాలు మరింత ఎక్కువగా తలెత్తినట్టు పేర్కొంది...

ఇలా చేశారు...

- ➤ అధ్యయనం కోసం స్వీడన్, నార్వే, డెన్మార్క్, ఐస్‌లాండ్‌ల్లో 64,880 మంది వయోజనులను ఎంచుకున్నారు.
- ➤ వీరంతా 2020 ఏప్రిల్ నుంచి 2022 ఆగస్టు మధ్య నానారకాల కొవిడ్ తరహా శారీరక సమస్యలను ఎదుర్కొన్నవారే.
- ➤ అందరూ పూర్తిగా, లేదా పాక్షికంగా కరోనా టీకాలు వేయించుకున్నవారే.
- ➤ వీరిలో 22 వేల మందికి పైగా కరోనా కాలంలో ఆ వ్యాధితో బాధపడ్డారు.
- ➤ వీరిలోనూ 10 శాతం మంది కనీసం ఏడు రోజులు, అంతకంటే ఎక్కువ సమయం పాటు మంచాన పడ్డారు.

ఇలా మంచాన పడ్డవారిలో చాలామంది ఇతరులతో పోలిస్తే 37 శాతం ఎక్కువ లాంగ్ కోవిడ్ లక్షణాలతో సతమతమయ్యారు. అవేమిటంటే...

- ➤ శ్వాస ఆడకపోవడం
- ➤ ఛాతీ నొప్పి
- ➤ తల తిప్పడం
- ➤ తలనొప్పి

లాంగ్ కోవిడ్ అంటే...

ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం కోవిడ్ సోకిన మూడు నెలల తర్వాత దాని తాలూకు లక్షణాలు తిరగబెట్టి కనీసం రెండు నెలలు, ఆ పైనకొనసాగితే దాన్ని లాంగ్ కోవిడ్‌గా పేర్కొంటారు.

- ➤ కోవిడ్ బారిన పడ్డ వారిలో కనీసం 10 నుంచి 20 శాతం మందిలో లాంగ్ కోవిడ్ తలెత్తినట్టు పలు అధ్యయనాల్లో తేలింది. ''లాంగ్ కోవిడ్ ప్రజారోగ్యానికి పెద్ద సమస్యగా మారింది. అంతర్జాతీయంగా ఎంతోమంది దీని బారిన పడ్డారు''అని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్ డాక్టోరల్ స్టూడెంట్ ఎమిలీ జోయ్స్ వివరించారు. 'అందుకే కోవిడ్ తాలూకు దీర్ఘకాలిక ఆరోగ్య ప్రభావంపై ఓ కన్నేసి ఉంచాలి. కనీసం రెండేళ్ల దాకా శారీరక మార్పులు, సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ ఉండాలి'అని సూచించారు.

- ➤ మంచాన పడ్డ వారితో పోలిస్తే ఇతరుల్లోనూ ఇలాంటి లక్షణాలు తలెత్తినా వాటి తీవ్రత మాత్రం అంత ఎక్కువగా లేదు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
శనివారం ¦ 28 ¦ అక్టోబర్ ¦ 2023

29, 30 తేదీల్లో భారీ వర్షాలు

సాక్షి, చెన్నై: ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో ఈనెల 29, 30 తేదీల్లో భారీ వర్షాలు అనేక జిల్లాల్లో పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఆదివారం రాష్ట్రంలోకి ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించిన విషయం తెలిసిందే. అదేసమయంలో బంగాళాఖాతంలో ఓ వైపు, అరేబియా సముద్రంలో మరో వైపు ఏర్పడిన రెండు తుపాన్ల కారణంగా రాష్ట్రంలో వర్షం కరువైంది. ఈ తుపాన్లు గాలిలోని తేమను లాక్కెళ్లడంతో రాష్ట్రంలో వర్షం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఈ పరిస్థితుల్లో దక్షిణ ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం నేపథ్యంలో రాష్ట్రంలో ఈనెల 29, 30 తేదీల్లో అనేక జిల్లాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు పడే అవకాశాలు ఉన్నట్టు వాతావరణ కేంద్రం శుక్రవారం ప్రకటించింది. ఈ ప్రభావంతో నాలుగు రోజుల పాటు దక్షిణ తమిళనాడుతోపాటు సముద్రతీర జిల్లాల్లో వర్షాలకు అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

పుష్..పుల్ ట్రయల్ రన్ సక్సెస్

సాక్షి, చెన్నై: చెన్నై- అరక్కోణం మధ్య పుష్..పుల్ ట్రైన్ ట్రయల్‌రన్‌ను శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. త్వరలో ఈ రైలు పట్టాలు ఎక్కనుంది. చెన్నై ఐసీఎఫ్ నుంచి సరికొత్త రైళ్లు పట్టాలపైకి వస్తున్న విషయం తెలిసిందే. వందే భారత్ రైలుసేవలకు అమిత స్పందన వస్తున్నాయి. అయితే, ఈ రైలు చార్జీలు సామాన్యులకు భారంగా మారింది. సామాన్యులు, పేదలకు తక్కువ చార్జీతో వందే భారత్ తరహా వసతులు కల్పించే విధంగా పుష్..పుల్ రైలు సేవలకు నిర్ణయించారు. ఐసీఎఫ్‌లో రూపుదిద్దుకున్న ఈ రైలుకు ఇరువైపులా ఇంజిన్లు ఉంటాయి. 22 బోగీలతో కూడిన ఈ రైలు ట్రయల్ రన్‌ను శుక్రవారం నిర్వహించారు. చెన్నై నుంచి అరక్కోణం వరకు. అక్కడి నుంచి చెన్నైకు 130 కి.మీ వేగంతో ఈ రైలు ట్రయల్ రన్ జరిగింది. ఈ రైలులో కుషన్ సీట్లు, ఆధునిక వసతులతో మరుగుదొడ్లు, సెల్ చార్జింగ్ వసతులు ఉన్నాయి. త్వరలో ఈ రైలును పలు మార్గాలలో పట్టాలెక్కించబోతున్నారు.

కాసిమేడు పోర్టుకు మహర్దశ

- రూ.98 కోట్లు కేటాయించిన కేంద్రం

కొరుక్కుపేట: కాసిమేడు పోర్టు అభివృద్ధికి కేంద్రప్రభుత్వం రూ.98 కోట్లు కేటాయించింది. ఉత్తర చెన్నైలోని కాసిమేడ్ మత్స్యపరిశ్రమకు ప్రధాన కేంద్రంగా ఉంది. దీనిని మరింతగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దీనికి రూ.127 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈమొత్తంలో కేంద్ర ప్రభుత్వం రూ.98 కోట్లు కేటాయించింది. మిగిలిన మొత్తాన్ని ఫిషరీస్ పోర్ట్ మేనేజ్‌మెంట్ కమిటీ అంగీకరిస్తుంది. మూడు నెలల్లో పనులు ప్రారంభిస్తామని, జూన్ 2025 నాటికి అన్ని పనులు పూర్తి చేస్తామని పోర్ట్ బోర్డు చైర్మన్ సునీల్ పలివాల్ తెలిపారు. ఈ పనులను 6 విభాగాలుగా విభజించి జనవరిలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. తమిళనాడులో 9 మేజర్ ఫిషింగ్ పోర్టులు ఉన్నాయని, ఇందులో కాసిమేడు ముఖ్యమైనదని ఓడరేవు 96 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉందని తెలిపారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు దగ్ధం

- తప్పిన పెనుప్రమాదం
- 14 మంది విద్యార్థులు సురక్షితం


దగ్ధమవుతున్న బస్సు

అన్నానగర్: చిదంబరం సమీపంలో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సులో మంటలు చెలరేగి దగ్ధమైంది. పెనుప్రమాదం తప్పి 14 మంది విద్యార్థులు అదృష్టవశాత్తు సురక్షితంగా బయటపడ్డారు. కడలూరు జిల్లా చిదంబరం ప్రాంతంలో ఓ ప్రైవేట్ పాఠశాల ఉంది. పాఠశాలకు తీసుకురావడానికి శుక్రవారం పరంగిపేట ప్రాంతానికి చెందిన 14 మంది విద్యార్థులతో బస్సు బి.ముడ్లూరు మీదుగా వెళుతోంది. చిదంబరం సమీపంలోని తీర్థంపాళయం ప్రాంతానికి వెళ్తుండగా బస్సు ముందు నుంచి ఒక్కసారిగా పొగలు వచ్చాయి. గమనించిన డ్రైవర్ మురుగన్ బస్సును రోడ్డు పక్కన ఆపి కిందకు దిగి చూడగా బస్సు ఇంజిన్ మంటలు చెలరేగాయి. వెంటనే డ్రైవర్ స్పందించి 14 మంది విద్యార్థులను సురక్షితంగా బస్సులో నుంచి దించాడు. బస్సు మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. దీంతో ఆ ప్రాంతమంతా పొగతో నిండిపోయింది. సమాచారం అందుకున్న పరంగిపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. పరంగిపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థికి ప్రధాని మోదీ లేఖ

కొరుక్కుపేట: తేని జిల్లా పెరియకులానికి చెందిన పొన్నంబలం-వనిత దంపతుల కుమారుడు అభినవ్య యశ్వంత్ (15) దేవదానపట్టిలోని ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. విద్యార్థులు పరీక్షలను ఎదుర్కోవడం కోసం 'పరీక్షపే చర్చా 2023 పేరిట నిర్వహించిన కార్యక్రమంలో యశ్వంత్ పాల్గొన్నాడు. వ్యాసరచన పోటీలో ఫోకసింగ్ ఆన్ అబ్లిగేషన్స్ అనే పేరుతో తన వ్యాసాన్ని సమర్పించాడు. వ్యాసాన్ని మెచ్చుకుంటూ ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థిని అభినందిస్తూ లేఖ పంపారు. అందులో.. 'మీలాంటి నేటి తరం విద్యార్థుల శక్తి, ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలను చూసి చాలా గర్వపడుతున్నాను.. మీరు జీవితంలో ప్రతి పరీక్షలో తప్పకుండా విజయం సాధిస్తారు. మీ ఉజ్వల భవిష్యత్తుకు నా శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు.

రౌడీషీటర్ అరెస్ట్

తిరువొత్తియూరు: చెన్నై వ్యాసార్పాడిలో వరుస నేరాలకు పాల్పడుతున్న రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై, వ్యాసార్పాడి, నార్త్ అవెన్యూ రోడ్డులో కత్తులతో ప్రజలను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆనందన్ (23)ను ఎంకేబీ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతనిపై ఇప్పటికే వ్యాసార్పాడి, ఎంకేబీ నగర్‌తోపాటు పలు పోలీస్‌స్టేషన్లలో క్రిమినల్ కేసులు ఉన్నాయని విచారణలో తేలింది. పోలీసులు అరెస్ట్ చేసిన అతడిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

సవాళ్లను అధిగమించాలి

- హార్బర్ల హోదా పెరగాలి
- సరుకు రవాణాలో దూసుకెళ్లాలి
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- మారిటైమ్ వర్సిటీ స్నాతకోత్సవంలో డిగ్రీల ప్రదానం
- నీట్ రద్దుకు సీఎం స్టాలిన్ వినతి


రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రముఖులు


స్నాతకోత్సవంలో డిగ్రీ పట్టాను ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

సాక్షి, చెన్నై: సముద్ర రవాణా, ఎగుమతి దిగుమతులలో నెలకొన్న సవాళ్లను అధిగమించేందుకు చర్యలు విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వ్యాఖ్యానించారు. హార్బర్ల హోదా పెరగాలని, అతిపెద్ద సరకుల దిగుమతి, ఎగుమతి కేంద్రంగా అవతరించాలని ఆకాంక్షించారు. చెన్నై ఈసీఆర్‌లోని ఇండియన్ మారిటైమ్ వర్సిటీ 8వ స్నాతకోత్సవం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి పాల్గొన్నారు. విద్యార్థులకు డిగ్రీలను, బంగారు పతకాలను రాష్ట్రపతి ప్రదానం చేశారు. విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ మారిటైం రంగంలోని అవకాశాలు, సద్వినియోగం గురించి వివరించారు.

అద్భుత ఫలితాలు..

ప్రపంచంలోనే అతిపెద్ద సముద్ర తీరం కలిగిన భారత దేశంలో ఇక్కడి విద్యార్థులు మారిటైమ్ యూనివర్సిటీ, దాని అనుబంధ కళాశాలలలో అద్భుతమైన ఫలితాలను సాధించడం ఆహ్వానించదగ్గ విషయంగా పేర్కొన్నారు. ఈ రంగంలో ఔత్సాహిక, ప్రతిభావంతులైన వారి సంఖ్య పెరుగుతోందన్నారు. సముద్ర కార్యకలాపాల పురోగతి, మహాసముద్రంతో మానవ సంబంధం గురించి గుర్తు చేస్తూ వ్యాఖ్యలు చేశారు. మానవ నాగరికత అభివృద్ధిలో సముద్ర సంపదలు, ఖనిజాల పాత్రను, సముద్ర తీర రవాణా వ్యవస్థను గుర్తు చేశారు. భారతదేశానికి సముద్ర మార్గాలు విస్తారంగా ఉన్నాయని, అయితే, అతిపెద్ద హార్బర్లు మరింతగా అవశ్యమవుతోందన్నారు. నాటి నుంచి నేటి వరకు ఆగ్నేయాసియా దేశాలకు సాగిన వాణిజ్య సంబంధాల సముద్రమార్గాల ద్వారా రవాణా గురించి వివరించారు. నౌకాయానానికి అనుకూలమైన జల మార్గం విస్తరింప చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో హార్బర్ల నిర్మాణాలు జరగాలని కోరారు. ఓడరేవుల నిర్వహణ, సామర్థ్యం పెరగాలని, పౌర నౌకాయానానికి మార్గం సుగమం చేయాలని సూచించారు. ఇందులో అనేక సవాళ్లు ఉన్నాయని, వీటన్నింటిని అధిగమించాల్సిన అవసరం ఉందన్నారు. పోటీతత్వ యుగంలో అత్యున్నత ప్రమాణాలతో భారతీయ ఓడరేవుల నిర్వహణ విస్తృతం కావాలని ఆకాంక్షించారు.

ముర్ముతో ప్రముఖుల భేటీ..

చెన్నై పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ఉదయాన్నే పలువురు ప్రముఖులు భేటీ అయ్యారు. రాజ్‌భవన్‌లో ఆమెను దక్షిణ భారత చలన చిత్ర సూపర్‌స్టార్ రజనీకాంత్ కుటుంబానికి చెందిన వారు కూడా కలిశారు. ఇందులో రజనీకాంత్ సతీమణి లతా రజనీ కాంత్, నటి వైజయంతి మాలా బాలి, నటుడు వైజీ మహేంద్రన్, డాక్టర్ రెజీనా కలిసిన వారిలో ఉన్నారు.

నీట్ రద్దుకు వినతి

స్నాతకోత్సవం ముగించుకుని రోడ్డు మార్గంలో విమానాశ్రయానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేరుకున్నారు. ఆమెకు సీఎం స్టాలిన్, మంత్రులు పొన్ముడి, ఏవి వేలు, అన్బరసన్, మేయర్ ప్రియ, వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా రాష్ట్రపతికి సీఎం స్టాలిన్ ఓ వినతి పత్రం అందజేశారు. ఇందులో తమిళనాడుకు నీట్ నుంచి మినహాయింపు కల్పించాలని కోరుతూ, నీట్ రద్దుకు డిమాండ్ చేస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానాలను వివరించారు. ఈ తీర్మానాలన్నీ రాష్ట్రపతి భవన్‌లో పెండింగ్‌లో ఉన్నాయని వీటిని త్వరితగతిన ఆమోదించాలని రాష్ట్రపతికి సీఎం విజ్ఞప్తి చేశారు.

రైతు సంక్షేమాన్ని విస్మరించారు

- పళనిస్వామి ఫైర్


మాట్లాడుతున్న పళనిస్వామి

సాక్షి, చెన్నై: డీఎంకే పాలకులు రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి ధ్వజమెత్తారు. చేనేత కార్మికుల జీవితాలను సైతం ఈ పాలకులు నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. అన్నాడీఎంకే 52వ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా శుక్రవారం తిరుప్పూర్ జిల్లా కాంగేయంలో జరిగిన సభకు పళనిస్వామి హాజరయ్యారు. 52 అడుగుల అన్నాడీఎంకే జెండా స్థూపాన్ని ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో పళనిస్వామి ప్రసంగిస్తూ, అన్నాడీఎంకే హయాంలో రైతులకు 3 ఫేజ్‌లతో కూడిన ఉచిత విద్యుత్‌ను 24 గంటల పాటు అందించామని గుర్తు చేశారు. ఈసమయంలో రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి ఆశాజనకంగా ఉండేదన్నారు. అయితే, ప్రస్తుతం డీఎంకే పాలనలో రైతు సంక్షేమం పూర్తిగా విస్మరించబడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేరుకే ఉచిత విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేస్తున్నారని, విద్యుత్ ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఈ పాలనలో ఉందన్నారు. రైతులకు తాము మద్దతు ధర కల్పించామని, రైతు ప్రయోజనార్థం అన్ని విధాలుగా సహకారం అందించామని, అయితే, ప్రస్తుతం సాగుకు కూడా నీళ్లు ఇప్పించలేని స్థితిలో డీఎంకే పాలకులు ఉన్నారని ధ్వజమెత్తారు. చేనేత కార్మికులు సైతం విద్యుత్ సరఫరా అందకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికలలో రైతులు ఈ పాలకులకు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

గవర్నర్‌ను మార్చొద్దు!


వివాహ వేడుకలో సీఎం స్టాలిన్

- పీఎం, హోంశాఖకు సీఎం స్టాలిన్ విజ్ఞప్తి
- ఆయనతో తమకెన్నో లాభాలు

సాక్షి, చెన్నై: రాష్ట్ర గవర్నర్‌ను ఎట్టి పరిస్థితులలో తమిళనాడు నుంచి మార్చొద్దని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు సీఎం స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఆయన ఇక్కడే ఉంటే తమకు ఎన్నో ప్రయోజనాలు, లాభాలు ఉన్నాయని, అయన రూపంలో తమకు ప్రచారం మరింత ఎక్కువగానే లభిస్తున్నట్టు చమత్కరించారు. శుక్రవారం చెన్నైలో జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ, ×కొంతమందికి ద్రావిడమంటే ఏమిటో అని కూడా తెలియడం లేదని, ఇలాంటి వారంతా ఉన్నత పదవుల్లో ఉండడం శోచనీయమని పరోక్షంగా గవర్నర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ద్రావిడమంటే ఏమిటని పదే పదే ఆయన అడుగుతున్న ప్రశ్న తమకు మరింత ప్రచారాన్ని కల్గిస్తున్నట్టు పేర్కొన్నారు. తమ ప్రచారానికి మరింత బలాన్ని చేకూర్చే విధంగా గవర్నర్ ముందుకెళ్తుండడం ఆహ్వానించ దగ్గ విషయంగా పేర్కొంటూ, దయచేసి ఆయన్ను తమిళనాడు నుంచి మార్చొద్దని ప్రత్యేకంగా తాను విజ్ఞప్తి చేసుకుంటున్నానని తెలిపారు. ద్రవిడం గురించి ఇష్టం వచ్చినట్టు మాట్లాడే కొద్దీ సామాజిక మాధ్యమాలలో ఆయనకు వస్తున్న వ్యతిరేకత తమకు మరింత బలంగా మారిందన్నారు. సామాజిక మాధ్యమాలలో తమిళపౌరులు స్పందిస్తున్న అంశాలను, వారి మనోభావాలను తాను చూస్తున్నానని తెలిపారు. 2024 పార్లమెంట్ ఎన్నికలలో గవర్నర్ రూపంలో తమకు మరింత బలం చేకూరుతోందని, ఇందుకోసమైనా ఆయన్ను తమ రాష్ట్రంలోనే గవర్నర్‌గా కొనసాగించాలని స్టాలిన్ కోరారు.

రాష్ట్రంలో మహిళా ఓటర్లే అధికం

- రాష్ట్రంలో 6.11 కోట్ల మంది ఓటర్లు
- పురుషులు 3 కోట్లు, స్త్రీలు 3.10 కోట్లు
- మాదిరి జాబితా విడుదల చేసిన సాహు
- డిసెంబర్ 9 వరకు మార్పులు చేర్పులకు అవకాశం


ఓటర్ల జాబితా విడుదల చేస్తున్న ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రద సాహు

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో మరోమారు మహిళా ఓటర్లే అధికం అనేది స్పష్టమైంది. శుక్రవారం ప్రకటించిన మాదిరి జాబితా మేరకు రాష్ట్రంలో 6.11 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3 కోట్లు, స్త్రీలు 3.10 కోట్ల మంది ఉన్నారు. రాష్ట్రంలో అతి చిన్న అసెంబ్లీ నియోజకవర్గంగా నాగపట్నం జిల్లాలోని కీల్ వేలూరు జాబితాలోకి చేరింది. 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 6 కోట్ల 28 లక్షల 94 వేల 531 మందిగా జాబితాలో పేర్కొన్నారు. ఆ తర్వాత ఓటర్ల జాబితాలో కొత్త వారి చేరికతో పాటు మార్పులు చేర్పులకు చర్యలు తీసుకున్నారు. 2022లో విడుదల చేసిన జాబితాలో రాష్ట్రంలో 6 కోట్ల 36 లక్షల 25 వేల 813 మంది ఓటర్లు ఉన్నట్టు తేలింది. ఆ తర్వాత జరిగిన మార్పులు, చేర్పులు, ఇతర ప్రక్రియలతో ఈ ఏడాది ఆరంభంలో విడుదల చేసిన జాబితాలో రాష్ట్రంలో 6.12 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్టు తేలింది. ఈ మూడు జాబితాలలోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఈ హవా కొనసాగే రీతిలో శుక్రవారం విడుదల చేసిన మాదిరి ఓటర్ల జాబితాలోనూ మహిళా ఓటర్ల ఆధిక్యం కొనసాగింది. అదే సమయంలో ఓటర్ల జాబితాలో సంఖ్య పెరిగినట్టు పెరిగి, మళ్లీ తగ్గుముఖం పట్టడం గమనార్హం.

మాదిరి ఓటరు జాబితా..

2024 లోక్‌సభ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రద సాహు కసరత్తులు మొదలెట్టారు. రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోజకవర్గాలలో ఎన్నికల ఏర్పాట్ల ప్రక్రియకు శ్రీకారంచుట్టే విధంగా రెండు రోజుల క్రితం గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఓటరు జాబితాకు సంబంధించి వారి అభిప్రాయాలను సేకరించారు. మార్పులు, చేర్పుల ప్రక్రియపై దృష్టి పెట్టారు. ఇందులోభాగంగా శుక్రవారం మాదిరి ఓటరు జాబితాను ప్రకటించారు. ఇందులో రాష్ట్రంలో 6,11, 31,197 మంది ఓటర్లు ఉన్నట్టు ప్రకటించారు. వీరిలో పురుషులు 3,00,68,610 మంది, స్త్రీలు 3,10,54,571 మందిగా ఉన్నారు. ఇతరులు 8,016 మంది ఉన్నారు. రాష్ట్రంలోనే 6,52,065మంది ఓటర్లతో చెంగల్పట్టు జిల్లా షోళింగనల్లూరు అసెంబ్లీ నియోజకవర్గం అతి పెద్ద నియోజకవర్గం జాబితాలో ఉంది. 1,69,030 మంది ఓటర్లతో అతి చిన్న నియోజకవర్గంగా జాబితాలో నాగపట్నం జిల్లా కీల్ వేలూరు నియోజకవర్గం చేరింది.

మార్పులు చేర్పులు..

సత్యప్రద సాహు మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల కమిషన్ ఇటీవల తీసుకున్న నిర్ణయం మేరకు జనవరి 1వ తేదీ, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1వ తేదీల్లో అర్హతగా 18 ఏళ్లు నిండిన, నిండబోయే వాళ్లు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదుచేసుకోవచ్చని ప్రకటించారు. ప్రతి మూడు నెలలకు ఒక పర్యాయం ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, చిరునామాల మార్పులు ప్రక్రియలకు కూడా అవకాశం కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం డిసెంబర్ 9వ తేదీ వరకు ఓటరు జాబితాలో మార్పులు చేర్పులకు అవకాశం కలిపిస్తున్నామని వివరించారు. ఓటరు హెల్ప్‌లైన్ లేదా మొబైల్ యాప్‌ల ద్వారా, పోలింగ్ స్టేషన్ల పరిధిలోని బూత్‌ల వారీగా మార్పుల చేర్పుల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ మాదిరి ఓటరు జాబితాను అన్ని పోలింగ్ బూత్‌లలో ఉంచనున్నామని, ఓటర్లు ఇందులో తమ పేర్లు ఉన్నాయా అని సరి చూసుకోవాలని, ఏదేని మార్పులు చేర్పులు ఉంటే సంబంధిత అధికారులకు సూచించాలని కోరారు. నవంబర్ 4, 5, 18, 19 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్‌ల వారీగా మార్పులు చేర్పులు, కొత్త ఓటర్ల చేరికకు సంబంధించి ప్రత్యేక శిబిరాలు జరుగుతాయని వివరించారు. ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం, కొత్త ఓటర్ల చేరిక, మార్పులు చేర్పులకు సంబంధించి నెంబరు 6, 6బీ, 7 లేదా 8 ఫారంలను నింపి బూత్ స్థాయి అధికారులు, సిబ్బందికి సమర్పించాలని సూచించారు. తుది ఓటర్ల జాబితా 2024 జనవరి 5వ తేదీ విడుదల చేస్తామన్నారు. రాష్ట్ర స్థాయి జాబితా విడుదలతో ఆయా జిల్లాల వారీగా కలెక్టర్లు ఓటరు జాబితాలను ప్రకటించారు. చెన్నైలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఓటర్ల జాబితా వివరాలను కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్ విడుదల చేశారు.

శతకం కొట్టిన వారు కూడా..

తాజాగా విడుదల చేసిన మాదిరి ఓటర్ల జాబితా మేరకు రాష్ట్రంలో 120 ఏళ్లు పైబడ్డ 137 మంది ఓటర్లు ఉన్నట్టు పరిశీలనలో తేలింది. ఇందులో మహిళలు 71 మంది, పురుషులు 66 మంది ఉన్నారు. 50 ఏళ్ల నుంచి 99 ఏళ్ల వయస్సు కలిగిన కోటి 25 లక్షల 92 వేల 381 మంది ఉన్నారు. 100 ఏళ్లు దాటిన వారు 16 వేల 306 మంది ఉన్నారు. వీరిలో 100-109 వయస్సు వరకు 15 వేల 788 మంది ఉన్నారు. ఇందులో మూడో కేటగిరికి చెందిన ఒకరు కూడా ఉన్నారు. 110-119 వయస్సు కలిగిన వారు 381 మంది ఉన్నారు. ఇందులోనూ మూడో కేటగిరికి చెందిన వారు ఒకరు ఉన్నారు. అలాగే, 18-19 ఏళ్ల వయస్సు కలిగిన ఓటర్లు 3,94,909 మంది ఉన్నారు.

శాంతివనంగా రాష్ట్రం

- రాజ్‌భవన్ ట్వీట్‌పై డీజీపీ
- కరుక్కా వినోద్ వీడియో విడుదల
- శాంతి భద్రతల పరిరక్షణలో కీలకపాత్ర


మీడియా సమావేశంలో డీజీపీ, కమిషనర్

సాక్షి, చెన్నై: రాష్ట్రం శాంతివనంగా ఉందని డీజీపీ శంకర్ జివ్వాల్ అన్నారు. శాంతి భద్రతల వ్యవహారంలో రాజ్‌భవన్ చేసిన ట్వీట్‌కు వ్యతిరేకంగా పోలీసు అధికారులు శుక్రవారం మీడియా ముందుకు వచ్చారు. కరుక్కా వినోద్ నందనం సిగ్నల్ నుంచి ఒంటరిగా నడచుకుంటూ వచ్చి పెట్రోబాంబు దాడి చేసిన వీడియో, పోలీసులు అడ్డుకున్న దృశ్యాలను మీడియాకు విడుదల చేశారు. రాజ్‌భవన్ ప్రవేశ మార్గంలో రౌడీ కరుక్కా వినోద్ పెట్రోబాంబు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. అతడిని పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. అయితే ఈ వ్యవహారంలో పోలీసుల చర్యలపై రాజ్‌భవన్ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. రాజ్‌భవన్ వర్గాలు సామాజిక మాధ్యమంలో చేసిన ట్వీట్‌లు పోలీసు అధికారులలో ఆగ్రహాన్ని రేపాయి. పోలీసుల తీరును తప్పుబట్టే విధంగా ఉన్న ఈ ట్వీట్లపై పోలీసు బాసులు స్పందించారు.

మీడియా ముందుకు..

రాజ్‌భవన్ చేసిన ఆరోపణలు, విమర్శలకు సమాధానం ఇచ్చే విధంగా చెన్నై పోలీసు కమిషనరేట్‌లో డీజీపీ శంకర్ జివ్వాల్, కమిషనర్ సందీప్ రాయ్ రాథోర్ అధికారులు మీడియా ముందుకొచ్చారు. రాజ్ భవన్ చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టే విధంగా వీడియోలను విడుదల చేశారు. కరుక్కా వినోద్‌తో పాటు మరికొందరు పెట్రో బాంబు దాడిలో పాల్గొన్నారని రాజ్‌భవన్ చేసిన ఆరోపణలకు వీడియో ఆధారాలను బయటపడ్డారు. నందనం సిగ్నల్ నుంచి సైదాపేట మీదుగా చేతిలో ఒక బ్యాగుతో కరుక్కా వినోద్ ఒంటరిగా రాజ్‌భవన్ వద్దకు రావడం ఆ వీడియోలో ఉంది. అలాగే, పెట్రోబాంబును అతడు విసిరే క్రమంలో అప్రమత్తమైన పోలీసులు అడ్డుకునే దృశ్యాలను విడుదల చేశారు. ఇది వరకే మైలాడుతురైలో గవర్నర్ వాహనంపై దాడి జరిగిందంటూ చేసిన ఆరోపణలపై కూడా స్పందిస్తూ వీడియో విడుద ల చేశారు. గవర్నర్ కాన్వాయ్ భద్రతా వాహనంపై నల్ల జెండా పడిందే గానీ, గవర్నర్ వాహనంపై కాదన్న విషయాన్ని గుర్తుచేస్తూ ఈవీడియో విడుదల చేయడం గమనార్హం. ఈసందర్భంగా డీజీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో సామాన్య పౌరుడి మొదలు అత్యున్నత పదవిలో ఉన్న వారికి సైతం గట్టి భద్రతను కల్పిస్తున్నామని వివరించారు. తమిళనాడు శాంతి వనంగా ఉందని, ఇక్కడ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. కరుక్కా వినోద్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు చర్యలు తీసుకున్నామని, అరెస్టు, కోర్టులో హాజరుపరచడం, కస్టడీ ప్రక్రియ అన్నీ ఒకదాని తర్వాత మరొకటి జరుగుతాయని వివరించారు.

ఏటీఎం ధ్వంసం

తిరువొత్తియూరు: చెన్నై అన్నారోడ్డులోని నందనం వద్ద తమిళనాడు హౌసింగ్ బోర్డ్ కార్యాలయం గ్రౌండ్ ఫ్లోర్‌లో కెనరా బ్యాంక్‌కు చెందిన ఏటీఎం సెంటర్ పనిచేస్తోంది. గురువారం రాత్రి ఏటీఎం నుంచి హఠాత్తుగా శబ్దం వచ్చింది. ఆ సమయంలో హౌసింగ్ బోర్డు సెక్యూరిటీ లాలీ శివకుమార్ మొదటి అంతస్తు నుంచి కిందకు వచ్చి చూశాడు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎం లోపలి నుంచి తప్పించుకుని పారిపోయారు. లోపలికి వెళ్లి చూసే సరికి ఏటీఎం మిషన్ అద్దం (మానిటర్) పగిలి ఉంది. వాచ్‌మెన్ బ్యాంకు అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాడు. దాని ఆధారంగా తేనాంపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జైలు వార్డెన్ సస్పెన్షన్

అన్నానగర్: సేలం సెంట్రల్ జైలులో మద్యం మత్తులో విధులు నిర్వహించిన వార్డెన్‌ను శుక్రవారం సస్పెండ్ చేశారు. సేలం సెంట్రల్ జైలులో వెయ్యికి పైగా ఖైదీలు ఉన్నారు. ఈ నెల 24న సేలం జైలు సూపరింటెండెంట్ వినోద్ రాత్రి గస్తీకి వెళ్లారు. బ్లాక్ నంబర్ 7లో డ్యూటీలో ఉన్న వార్డెన్ ధనశేఖరన్ దగ్గరికి వచ్చినప్పుడు అతను మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయం గురువారం జైలు అధికారుల దృష్టికి వెళ్లింది. మద్యం మత్తులో విధులు నిర్వహించిన ధనశేఖరన్ (38)ను సస్పెండ్ చేస్తూ సూపరింటెండెంట్ వినోద్ ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థులకు కళా తిరువిళా పోటీలు

కొరుక్కుపేట: విద్యార్థుల్లో కళా నైపుణ్యాన్ని వెలుగు తీసే విధంగా రాష్ట్రవ్యాప్తంగా కళా తిరువిళా పేరిట పోటీలను నిర్వహిస్తున్నట్లు తమిళనాడు పాఠశాల విద్యాశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. తమిళనాడులోని పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో హయ్యర్ సెకండరీ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరిలో (ప్రత్యేక పిల్లలు సహా) కళాత్మక ప్రతిభను వెలికితీసేందుకు 'కళతిరువిజ'ను నిర్వహిస్తోంది. ఆ మేరకు పాఠశాల స్థాయిలో ప్రారంభమై స్థానిక, జిల్లా, రాష్ట్ర స్థాయిలో మూడు విభాగాల్లో పోటీలు ఉంటాయి. ఇందులో సంగీతం, నృత్యం, నాటకం, భాషా నైపుణ్యం వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. రెండు రోజులు వివిధ పోటీలు జరగనున్నాయి. అందుకు అనుగుణంగా శుక్రవారం జిల్లా స్థాయి కళా ఉత్సవ కార్యక్రమాన్ని చెన్నై జిల్లా కలెక్టర్, ప్రాథమిక విద్యాశాఖాధికారి, జిల్లా విద్యాశాఖాధికారులు ప్రారంభించారు.

నేడు బీజేపీ కమిటీ పర్యటన


బీజేపీ కార్యాలయం

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో బీజేపీ వర్గాలపై జరుగుతున్న దాడుల గురించి అధ్యయనం చేయడానికి ఆ పార్టీ అధిష్టానం నియమించిన కమిటీ చెన్నైలో శనివారం పర్యటించనుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై నివాసం వద్ద జెండా స్తూపం ఏర్పాటు వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. పలువురు బీజేపీ నేతలను ఈ వ్యవహారంలో అరెస్టు చేశారు. అలాగే, అనేక చోట్ల బీజేపీ జెండా స్థూపాల ఏర్పాటును పోలీసులు అడ్డుకుంటున్నారు. ఈ పరిణామాలు వివాదానికి దారి తీశాయి. తమిళనాడులో తమపై దాడులు పెరిగాయని బీజేపీ అధ్యక్షుడు అన్నామలై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. డీఎంకే పాలకులు వ్యవహరిస్తున్న తీరును అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తమిళనాడులో జరుగుతున్న పరిణామాలపై అధ్యయనం చేయడానికి ఓ కమిటీని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నియమించారు. ఈ కమిటీలో కర్ణాటక మాజీ సీఎం సదానందగౌడ, కేంద్ర మాజీ మంత్రి పురంధరేశ్వరీ, ఎంపీలు పీసీ మోహన్, సత్యపాల్‌సింగ్ ఉన్నారు. ఈ కమిటీ శుక్రవారం రాత్రి చెన్నైకు చేరుకుంది. రాత్రి స్థానికంగా ఓ హోటల్‌లో బస చేసింది. శనివారం ఉదయం పనయూరులోని అన్నామలై నివాసం నుంచి ఈ కమిటీ విచారణ చేపట్టనుంది. చెన్నైతోపాటు మరికొన్ని ప్రాంతాలలో పర్యటించిన అనంతరం పార్టీ కార్యాలయం కమలాలయంలో జిల్లాల నేతలతో భేటీ కానుంది. జిల్లాల వారీగా పార్టీ నేతలు ఎదుర్కొంటున్న సమస్యలు, డీఎంకే పాలకులు మోపిన కేసుల వివరాలను సేకరించనుంది. బీజేపీ నేత అమరప్రసాదరెడ్డిపై ఇప్పటికే పోలీసులు కేసులు నమోదు చేశారు. గతంలో నుంగంబాక్కంలో పోలీసులతో గొడవ పడ్డ వ్యవహారంపై కేసు పెట్టారు. ఈ కేసు విచారణకు అమరప్రసాదరెడ్డి ఎగ్మూర్ కోర్టుకు హాజరయ్యారు.

జైపూర్ ఆభరణాల ప్రదర్శన



జైపూర్ జ్యువెల్స్ 150 సంవత్సరాల కాలం నాటి ఏడు తరాల వారసత్వ ఆభరణాల ప్రదర్శన చెన్నై అమెథిస్ట్‌లో జరిగింది. ఇందులో సినీ, ఇతర రంగాల ప్రముఖులు టి. పూర్ణిమా భాగ్యరాజ్, అనుపమ శివరామ్, జైపూర్ జ్యువెల్స్ వినీత్ సహేతా, మోడల్ రితీషా నివేదా, రేష్మా శ్రీజయ, కరుణ్‌రామన్ ఆభరణాలను వీక్షించారు. - సాక్షి, చెన్నై

క్లుప్తంగా

హోమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు



సెంటర్‌ను ప్రారంభిస్తున్న రామసుబ్రమణియన్

సాక్షి, చెన్నై: డీఏసీ డెవలపర్స్ నేతృత్వంలో చెన్నై శివారులోని మేడవాక్కం, తాంబరంలలో హోమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేశారు. వీటిని శుక్రవారం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి వి.రామసుబ్రమణియన్ ప్రారంభించారు. ఈ సెంటర్‌లో కల్పించిన వసతులు, ఏర్పాట్లు, నిర్మాణాలు, సరికొత్త అలంకరణలకు సంబంధించిన సమగ్ర వివరాలను మాజీ న్యాయమూర్తి అడిగి తెలుసుకున్నారు. ఈ సెంటర్ల గురించి డీఏసీ ఎండీ ఎస్ సతీష్‌కుమార్ మీడియాకు వివరించారు. సొంత ఇంటి కలలను సాకారం చేసుకోదలచని వారికి ఈసెంటర్లు ఎంతో దోహదకరమని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ రీసైక్లింగ్‌లో భారత్ ఆదర్శం



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న గ్రేస్ పచువా

కొరుక్కుపేట: పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా భారతదేశంలో 75 శాతం ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేస్తూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలు వాణిజ్య శాఖ అదనపు కమిషనర్ గ్రేస్ పచువా తెలిపారు. నేషనల్ పాలిపాస్ట్ (ఇండియా) ప్రయివేట్ లిమిటెడ్ ఎండీ అలోక్ పరాక్ అధ్యక్షతన చెన్నైలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రేస్ పచువా మాట్లాడుతూ ప్లాస్టిక్ అనేది స్వతహాగా హానిచేయని పదార్థం . కానీ ప్లాస్టిక్‌ను చెత్తగా పడవేయడం వల్ల అనేక విధాలుగా ప్రమాదకరంగా మారిందని తెలిపారు. మన దేశం 75 శాతం ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. అలోక్ పరాక్ , పీవీఐ కో చైర్మన్ అనుతోష్ గోర్ మాట్లాడుతూ ఆల్ ఇండియా ప్లాస్టిక్స్ తయారీదారుల సంఘం ఆధ్వర్యంలో ముంబయ్ వేదికగా డిసెంబర్ 7 నుంచి 11వ తేదీ వరకు 12వ ఎడిషన్ ప్లాస్టివిజన్ ఇండియా (పీవీఐ)- 2023ని చేపడుతున్నామని తెలిపారు. తమిళనాడు ప్లాస్టిక్ తయారీదారుల సంఘం అధ్యక్షుడు ఎల్.మెయ్యప్పన్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా విడుదల



కాంచీపురం: ఓటర్ల జాబితా విడుదల చేస్తున్న కలెక్టర్ కలైసెల్వి

కాంచీపురం: కాంచీపురం జిల్లా ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్ కలైసెల్వి శుక్రవారం విడుదల చేశారు. డిసెంబర్ 12వ తేదీ వరకు ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పు, తొలగింపు, మార్పులు చేపట్టనున్నట్లు, ఓటర్లు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాంచీపురం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 13, 24, 581 ఓటర్లుండగా పురుషులు 6,44,802 మంది, మహిళలు 6,79,597 మంది, థర్డ్ జెండర్ 182 మంది ఉన్నారు. ఓటరును గుర్తించేందుకు వీలుగా ఫొటోతో కూడిన జాబితా సిద్ధం చేసినట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఓటరు జాబితా అందుబాటులో వుంచినట్లు, ఓటర్లు తమ



వేలూరు: ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న కలెక్టర్

పేర్లకు సంబంధించి వివరాలు సరిచూసుకోవాలని కోరారు. అలాగే నవంబర్ 4, 5, 18, 19 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటర్లు నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

వేలూరు జిల్లాలో 12.57 లక్షల ఓటర్లు

వేలూరు: ఓటర్ల తుది జాబితాలో 12.57 లక్షల ఓటర్లు ఉన్నట్లువేలూరు జిల్లా కలెక్టర్ కుమరవేల్ పాండియన్ తెలిపారు. శుక్రవారం ఉదయం వేలూరు కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లాలోని గుడియాత్తం, కేవీ కుప్పం, వేలూరు, కాట్పాడి, అనకట్టు వంటి ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 12 లక్షల 57,316 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. 6,08,639 మంది పురుషులు, 6, 48,515 మంది, థర్డ్ జెండర్ 162 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్ల జాబితాను ఆయా తాలుకా కేంద్రాల్లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. డీఆర్ఓ మాలతి పాల్గొన్నారు.

తిరుత్తణిలో ఓటర్ల జాబితా విడుదల

తిరుత్తణి: తిరుత్తణి నియోజకవర్గంలో ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాను ఆర్డీఓ దీప శుక్రవారం



తిరుత్తణి: ఓటరు జాబితా విడుదల చేస్తున్న ఆర్డీఓ దీప

విడుదల చేశారు. 2023, అక్టోబర్ 27న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం తిరుత్తణి నియోజకవర్గంలో 2,67,872 ఓటర్లలో మహిళా ఓటర్లు 1,35,775 మంది, పురుషులు 1,32,067 మంది, థర్డ్ జెండర్ 30 మంది ఉన్నారు. కాగా రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాను ఆర్డీఓ విడుదల చేశారు. ప్రజలకు అందుబాటులో వుంచే విధంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వుంచినట్లు, ఓటర్లు తమ పేర్ల వివరాలు సరిచూసుకోవాలని అధికారులు సూచించారు. ఓటరు జాబితా విడుదల కార్యక్రమంలో తహసీల్దార్ మదన్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శరవణన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

పళ్లిపట్టు: తిరుక్కురళ్ శూక్తులు ఒప్పించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బాలాపురం పంచాయతీ సర్పంచ్ బహుమతులను ప్రదానం చేశారు. ఆర్కేపేట యూనియన్ బాలాపురం ప్రభుత్వ మహోన్నత పాఠశాల విద్యార్థులకు తిరుక్కురళ్ శూక్తులు పఠనం పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈపోటీల్లో 6వ తరగతి నుంచి ప్లస్‌టూ విద్యార్థుల వరకు నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తొలి మూడు స్థానాలకు ఎంపిక చేసిన విద్యార్థులకు పంచాయతీ సర్పంచ్ తెన్నరసు మొదటి బహుమతిగా రూ.5వేలు, రెండవ బహుమతి రూ.3వేలు, మూడవ బహుమతి రూ.2వేలు ఇచ్చి విద్యార్థులను సత్కరించారు.



బహుమతులు ఇస్తున్న తెన్నరసు

ఘనంగా అష్టలింగ సన్నిధుల మహాకుంభాభిషేకం

వేలూరు: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయం పంచభూత స్థలాల్లో అగ్నిస్థలం ఉంటుంది. ఇక్కడ ఉన్న కొండను దైవంగా భావించి ప్రతి పౌర్ణమి రోజున కొండను చుట్టి గిరివలయం రోడ్డులో 14 కిలో మీటర్ల దూరం కాలి నడకన వచ్చి స్వామి వారిని దర్శించుకుంటే చేసిన పాపాలుపోయి పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. గిరివలయం రోడ్డులో అష్టలింగ సన్నిదులున్నాయి. ఎనిమిది దిశల్లో ఉన్న అష్ట లింగ సన్నిధులను భక్తులు దర్శనం చేసుకుంటూ గిరివలయం వస్తుంటారు. అదే విధంగా సూర్యలింగ, చంద్రలింగ సన్నిధులున్నాయి. గిరివలయం రోడ్డులో ఉన్న అష్టలింగ సన్నిధులకు మహా కుంభాభిషేకం జరిపించేందుకు రాష్ట్ర దేవదాయ శాఖ గత ఏడాది ప్రకటించింది. అందులో భాగంగా గత సంవత్సరం సెప్టెంబర్‌లో మరమ్మతులు ప్రారంభించి అష్టలింగ సన్నిధిలో గురువారం ఉదయం మహా గణపతి పూజ, శుక్రవారం ఉదయం సన్నిధి ముందు ప్రత్యేక హోమ



కుంభాభిషేకంలో భక్తజనం

పూజలు, రెండవ కాల పూజ, మూలవర్ అష్టలింగం , సూర్యలింగం, చంద్రలింగాల మహాకుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం అష్టలింగం సన్నధులైన ఇంద్ర, అగ్ని, యమ, నిరుది, వరుద, వాయు, కుబేర, ఈశాన్యలింగాల సన్నిధులకు మహాకుంబాభిషేక వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

దేవర్ జయంత్ ఉత్సవాలు ప్రారంభం

తిరువొత్తియూరు: పసుంపోన్ ముత్తురామలింగత్ దేవర్ జయంత్ ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. 30న ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ హాజరుకానున్నారు. రామనాథపురం జిల్లా, కముది సమీపంలోని పసుమ్ పోన్ గ్రామంలో ముత్తురామలింగత్ దేవర్ జయంతి ఉత్సవం, గురుపూజ ఉత్సవం ప్రతి ఏడాది జరుగుతాయి. ఈ ఏడాది 116వ జయంతి ఉత్సవం, 61వ గురుపూజ ఉత్సవం, 28న ఆధ్యాత్మిక, ఉత్సవాలు, 29న రాజకీయపండుగగా, 30న జయంతి, గురుపూజ ప్రభుత్వ పండుగగా నిర్వహించనున్నారు. 30వ తేదీ ఉదయం తమిళనాడు ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, రాష్ట్ర మంత్రులు పాల్గొననున్నారు.

విద్యార్థినులకు నాదస్వర పోటీలు

వేలూరు: తిరుపత్తూరు జిల్లా స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థినులు విభిన్న ప్రతభను వెలికి తీసే విధంగా కళాఉత్సవాలు నిర్వహించి తవిల్, నాదస్వర పోటీలను నిర్వహించారు. తిరుపత్తూరు మీనాక్షి ప్రభుత్వ బాలికల పాఠశాలల్లో నిర్వహించిన ఈ పోటీలను కలెక్టర్ భాస్కర పాండియన్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినుల ప్రతిభను వెలికి తీసేందుకు ఈ ఆర్ట్ ఫెస్టివెల్ ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. జిల్లా స్థాయిల్లో గెలుపొందిన విద్యార్థినులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థినులు తవిల్, సంగీతం వంటి పోటీల్లో పాల్గొని పలువురిని అలరించారు. ఎమ్మెల్యేలు దేవరాజ్, నల్లతంబి, విద్యాశాఖ సీఈఓ మునిసుబ్రమణి పాల్గొన్నారు.



నాదశ్వర పోటీల్లో విద్యార్థినులు

కాశీనాథపురంలో వీధి కుక్కల బెడద

తిరుత్తణి: తిరుత్తణి శివారులో వీధి కుక్కల బెడదతో రాత్రుల్లో గ్రామీణులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. తిరుత్తణి శివారులోని కాశీనాథపురంలో ఇటీవల వీధి కుక్కలు విపరీతంగా పెరిగాయి. కుక్కలు వీధుల్లో స్వైరవిహారం చేస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. తిరుత్తణి నుంచి నాగలాపురం వెళ్లే రహదారిలో కాశీనాథపురం ఉండడంతో రోజూ గ్రామీణులు రాకపోకలు సాగిస్తుంటారు. బైకుల్లో ఇళ్లకు వెళుతున్న వాహనచోదకులను కుక్కలు గుంపుగా చుట్టుముట్టి భయాందోళనకు గురిచేస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో వీధుల్లో నడిచి వెళ్లేందుకు చిన్నారులు,



రోడ్డుపై అడ్డంగా వీధి కుక్కలు

మహిళలు భయాందోళన చెందాల్సి పరిస్థితి. కుక్కల నుంచి గ్రామీణులు, వాహనచోదకులకు భద్రత కల్పించే విధంగా పంచాయతీ నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విలువలతో కూడిన జీవితమే ఇష్టం

కొరుక్కుపేట: విలువలతో కూడిన జీవితమే దేవునికి ఇష్టమని మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి కాపరి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. చెన్నై పులియాన్‌తోపులోని నరసింహ నగర్ కెనాల్ తెలుగు బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సువార్త సమావేశం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హోసన్నా మినిస్ట్రీస్ పాస్టర్ రమేష్ పాల్గొని దైవసందేశాన్ని అందించారు. అంతకు ముందు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌తో పాటు ఆ సంఘ నిర్వాహకులు జి.రామయ్య, ప్రభుదాస్, బాబు, మార్క్, విశ్వలను



రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

జ్ఞాపికతో నరసింహనగర్ కెనాల్ తెలుగు బాప్టిస్ట్ చర్చ్ నిర్వాహకులు పి.కె.బాబు, కొండయ్య, జి.సద్రాక్ ఘనంగా సత్కరించారు.

హీరోయిన్లకు ప్రాముఖ్యత లేదు

తమిళసినిమా: ఐర్లాండ్‌కు చెందిన మాలతి నారాయణన్ అనే మహిళ దర్శకత్వం చేతబట్టి స్వీయ నిర్మాణంలో శ్రీ సాయి ఫిలిం ఫ్యాక్టరీ పతాకంపై నిర్మించి, ముఖ్య పాత్రను పోషించిన చిత్రం మిరియం మా. సీనియర్ నటి రేఖ ప్రధాన పాత్రను పోషించిన ఈ చిత్రంలో వీజే.ఆషీక్, ఎళిల్‌దురై, స్నేహకుమార్, అనిత సంపత్ ముఖ్యపాత్రలు పోషించారు. రెహనా సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి మూన్ రాక్స్‌కు చెందిన ముగ్గురు యువకులు నేపథ్య సంగీతాన్ని అందించగా జెశన్ విలియమ్స్ ఛాయాగ్రహణం అందించారు. నిర్మాణ కార్యక్రమాలను పూర్తిచేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర ఆడియో, ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించారు. ఇందులో పాల్గొన్న రేఖ మాట్లాడుతూ తను 35 ఏళ్లుగా నటిస్తున్నానని మొదట్లో



మిరియం మా చిత్ర యూనిట్

కథానాయకిగా నటించిన ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వివిధ రకాల పాత్రలో పోషిస్తూ వస్తున్నట్లు చెప్పారు. తాను నటించిన చిత్రాల్లోని పాత్రల పేర్లతో తనను పిలుస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ఈ మిరియం మా చిత్రం కూడా ఆ కోవలో చేరుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మాలతి తనకు ఫోన్ చేసి ఈ చిత్ర కథను చెప్పగానే తన మనసులో సీతాకోకచిలుకలు ఎగురుతున్నంత ఆనందం కలిగిందన్నారు కథలో ఏదో ఉంది. ఈ అవకాశాన్ని వదులుకోకూడదని అనిపించిందన్నారు. కాగా 40 ఏళ్లు దాటిన నటీమణులను పక్కన పెట్టేస్తున్నారని, అయితే తనలాంటి చాలా మందికి మంచి మంచి పాత్రలో నటించాలనే కోరిక ఉంటుందని అన్నారు. తాను జీవించినంత కాలం నటిస్తూనే ఉంటానని చెప్పారు. ఒకప్పుడు చిత్రాల్లో కథానాయకిలకు నటించడానికి అవకాశం ఉండేదని, ఇప్పుడు కమర్షియల్ కథా చిత్రాల్లో హీరోయిన్లకు ప్రాధాన్యత ఉండడం లేదని అన్నారు. చిత్ర దర్శక నిర్మాత మాలతి మాట్లాడుతూ తాను ఈ చిత్రాన్ని నిర్మించాలని భావించలేదని, దర్శకత్వం మాత్రమే చేయాలని అనుకున్నానని, అయితే కొన్ని అనివార్య కారణాలవల్ల నిర్మాతగా మారాల్సిన పరిస్థితి కలిగిందని చెప్పారు.



అనుష్క

మాలీవుడ్లోకి స్వీటీ ఎంట్రీ షురూ!

తమిళసినిమా: భారతీయ సినిమాలో ఎందరు హీరోయిన్లు ఉన్నా స్వీటీ అంటే గుర్తొచ్చే నటి అనుష్కనే. ఈ బెంగూరు డ్యూటీ మొదట్లో యోగా టీచర్‌గా పనిచేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత సూపర్ అనే తెలుగు చిత్రంలో నాగార్జునకు జంటగా నటించే అవకాశం వరించింది. అలా తొలి చిత్రంతోనే తెలుగు ప్రేక్షకుల గుండెల్ని తన అందాలతో కొల్లగొట్టిన అనుష్క ఆ తర్వాత రెండు అనే చిత్రం ద్వారా ఎంట్రీ ఇచ్చారు. ఆ చిత్రంలో మరింతగా గ్లామరస్‌గా నటించి తడితడి అందాలతో తమిళ ప్రేక్షకులను గిలిగింతలు పెట్టించారు. ఇంకేముంది ఈ రెండు భాషల్లోనూ వరుసగా అవకాశాలు రాబట్టుకుంటూ క్రేజీ కథానాయకిగా పాపులర్ అయ్యారు. అలాంటి గ్లామరస్ నటిని అరుంధతి చిత్రం అద్భుతమైన హీరోయిన్‌ను చేసింది. ఆ చిత్రం తమిళంలోనూ అనువాదమై మంచి విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత భాగమతి చిత్రాలతో తనలోని నట దాహాన్ని తీర్చుకున్న అనుష్క, బాహుబలి చిత్రంతో నటిగా మరో అంతస్తుకు చేరుకుంది. అలా తెలుగు, తమిళం భాషల్లో ప్రముఖ హీరోలందరి సరసన నటించిన ఈ భామ సైజ్ జీరో అనే చిత్రంలో నటించడానికి ఏ హీరోయిన్ చేయని సాహసం చేశారు. అందులోని పాత్ర కోసం బరువును విపరీతంగా పెంచుకున్నారు. అయితే ఆ తర్వాత బరువు తగ్గడానికి ఇప్పటి వరకు నానా రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం మాత్రం శూన్యంగా మారింది. దీంతో అవకాశాలు ఆమెకు దూరం అయ్యాయి అనే చెప్పాలి. కాగా ఇటీవల మిస్సెస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఆ చిత్రం అనుష్కకు మంచి కమ్ బ్యాక్‌గా అమిరింది. దీంతో నూతన ఉత్సాహంతో మళ్లీ సినిమాల్లో నటించడానికి సిద్ధమయ్యారు తాజాగా ఒక మలయాళ చిత్రంలో నటించడానికి రెడీ అవుతున్నారు. హోమ్ చిత్రం ఫేమ్ రోజిన్ థామస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో జై సూర్యకు జంటగా అనుష్క నటిస్తున్నారు. ఇది చారిత్రక కథ చిత్రంగా తెరకెక్కుతున్నట్లు సమాచారం. అంతేకాకుండా రెండు భాగాలుగా రూపొందుతున్నట్లు తెలిసింది. తన పాత్ర కొత్తగా ఉండకపోతే అనుష్క ఇందులో నటించడానికి సమ్మతించి ఉండరని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు.

కోలీవుడ్ టాక్స్

సహజంగా అర్జున్ చక్రవర్తి

తమిళసినిమా: ప్రముఖ కబడ్డీ క్రీడాకారుడు అర్జున్ చక్రవర్తి జీవిత సంఘటనల ఆధారంగా రూపొందుతున్న చిత్రం అర్జున్ చక్రవర్తి. జర్నీ ఆఫ్ యాన్‌సింగ్ ఛాంపియన్. శ్రీని గుబ్బల నిర్మిస్తున్న కథ, దర్శకత్వం బాధ్యతలను విక్రాంత్ రుద్ర నిర్వహిస్తున్నారు. నటుడు విజయ రామరాజు, నటి సీజరోస్ హీరో హీరోయిన్‌లుగా నటిస్తున్న ఇందులో అజయ్, దయానంద్‌రెడ్డి, అజయ్ ఘోష్, దుర్గేష్ పోషిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ ఇది 1980 ప్రాంతంలో ప్రముఖ కబడ్డీ క్రీడాకారుడు అర్జున్ చక్రవర్తి జీవిత సంఘటనలు ఆధారంగా రూపొందిస్తున్న కథా చిత్రమని చెప్పారు. ఈ చిత్రాన్ని దర్శకత్వం వహించడం గర్వంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేసమయంలో అర్జున్ చక్రవర్తి కథను సహజత్వం ఉట్టిపడేలా తెరపై ఆవిష్కరించడం సవాల్‌గా అనిపించిందన్నారు. అయితే అంకితభావం , నిరంతర శ్రమ, ఆత్మ విశ్వాసం విజయానికి మెట్లు అనే సామెత ఉందని, అది అర్జున్‌చక్రవర్తి చిత్రానికి కరెక్ట్‌గా నప్పుతుందని అన్నారు. చిత్ర నిర్మాత శ్రీని గుబ్బల పేర్కొంటూ అర్జున్ చక్రవర్తి జర్నీ ఆఫ్ ఏ అండ్ సంగ్ చాంపియన్‌ను ఒక చిత్రంగా కాకుండా సవాళ్లను అధిగమించి మనందరినీ ప్రోత్సహించే వ్యక్తుల మనో ధైర్యాన్ని ఆవిష్కరించే చిత్రంగా దీన్ని రూపొందిస్తున్నట్లు చెప్పారు. కలలను నెరవేర్చుకోవడానికి నిరంతరం శ్రమిస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చు అని చెప్పే కథా చిత్రం ఇదని పేర్కొన్నారు. తమిళం తెలుగు భాషల్లో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని హిందీ, మలయాళం, కన్నడం భాషల్లోనూ అనువదించి విడుదల చేయనట్లు చెప్పారు. ఈ చిత్రం ఈ చిత్రానికి విగ్నేష్ భాస్కరన్ సంగీతాన్ని, జగదీష్ చాయాగ్రహణం అందిస్తున్నారు.



అర్జున్ చక్రవర్తి చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్

ఇండియన్ పనోరమ చిత్రోత్సవాలకు..

- కాదల్ ఎంబదు, పొదువుడమై

తమిళసినిమా: 2023వ సంవత్సరం 54వ ఇండియన్ మనోరమ అంతర్జాతీయ చిత్రోత్సవాలు నవంబర్ 20 నుంచి 28వ తేదీ వరకు గోవాలో జరగనున్నాయి. ఈ చిత్రోత్సవాలకు తమిళ చిత్రం కాదల్ ఎంబదు పొదువుడమై ఎంపిక కావడం విశేషం. ఇంతకు ముందు లెన్స్, మస్కిటో ఫిలాసఫీ, తలైకూత్తల్ వంటి విజయవంతమైన పలు అవార్డులను గెలుచుకున్న చిత్రాల దర్శకుడు జయప్రకాష్ రాధాకృష్ణన్ దర్శకత్వం వహించిన చిత్రం ఇది. నటి లిజోమోల్, రోహిణి, వినీత్, కలేశ్ రామనాథ్, అనుష్క, దీప ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని ది గ్రేట్ ఇండియన్ కిచెన్ చిత్ర దర్శకుడు జియో బేబీ సమర్పణలో మెన్ కైండ్ సినిమాస్, నితీష్ ప్రొడక్షన్స్, సిమెట్రీ సినిమాస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. కన్నన్ నారాయణన్ సంగీతాన్ని, శ్రీశరవణన్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రం గురించి దర్శకుడు తెలుపుతూ ఈ ఆధునికకాలంలో మనుషుల భావాలు, దురాలోచనలు, సామాజిక పరిస్థితి, విజ్ఞానం వంటి అంశాలతో కూడిన ఆధునిక ప్రేమను ఆవిష్కరించే కథా చిత్రంగా ఇది ఉంటుందన్నారు. కాగా 2023 ఏడాదిగానూ ఇండియన్ పనోరమ చిత్రోత్సవాలకు 408 చిత్రాలు నామినేట్ రాగా అందులో 25 చిత్రాలు ఎంపికైనట్లు చెప్పారు. ఆ 25 చిత్రాల్లో తమ కాదల్ ఎంబదు పొదువుడమై చిత్రం చోటుచేసుకోవడం సంతోషంగా ఉందన్నారు.



కాదల్ ఎంబదు పొదువుడమై చిత్రంలో వినీత్, రోహిణి



త్రిష

లిప్‌లాక్ అదిరిపోలా..

తమిళసినిమా: కథానాయకిగా రెండు దశాబ్దాల పాటు కొనసాగడం అంటే ఆషామాషీ కాదు అది అగ్రస్థానంలో. అది దక్షిణాది సినిమాలో ఒక్క త్రిషకే దక్కిందని గంటాపథంగా చెప్పవచ్చు. జోడి అనే తమిళ చిత్రంలో కథానాయకి సిమ్రాన్‌కు స్నేహితురాలిగా రెండు మూడు సన్నివేశాల్లో తళుక్కుమన్న త్రిష దక్షిణాదిలో ప్రముఖ హీరోలందరి తరఫున నటించిన స్టార్ హీరోయిన్ స్థాయికి చేరుకుంటుందని అప్పట్లో ఎవరూ ఊహించి ఉండరు. అలాంటి త్రిష ఒక్కో చిత్రంతో కన్నడ, హిందూ సినీ అభిమానులను పలకరిస్తుందని కూడా అనుకొని ఉండరు. ముఖ్యంగా తమిళంలో రజనీకాంత్ కమలహాసన్, విజయ్, అజిత్, ధనుష్ వంటి స్టార్ హీరోల సరసన నటించి తన ప్రత్యేకతను చాటుకున్నారు. అలా 40 వసంతాలు ఈ బ్యూటీ నేటికీ నాటౌట్‌గా నిలిచి కథానాయకిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఇటీవల మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన పొన్నియిన్ సెల్వన్ చిత్రంలో విక్రమ్, జయంరవి, కార్తీ, ప్రభు, ప్రకాష్‌రాజ్, బాలీవుడ్ బ్యూటీ ఐశ్వర్యారాయ్ వంటి దిగ్గజాలతో కలిసి నటించి యువరాణి కుందవైగా అందం, అభినయంలలో తనదే పైచేయిగా అనిపించుకున్నారు. అంతే ఆ తర్వాత త్రిషకు క్రేజీ అవకాశాలు వరుస కడుతున్నాయి. అలా విజయ్ సరసన నటించిన చిత్రం ఇటీవల విడుదలై వసూళ్ల వర్షం కురిపిస్తోంది. కాగా లియో చిత్రంలో నటుడు విజయ్‌తో లిప్‌లాక్ సన్నివేశంలో నటించి అభిమానులకు స్వీట్ షాక్ ఇచ్చారు. కాగా ఈ చిత్ర ఒక వారం వసూళ్లను నిర్మాత గురువారం అధికారికంగా విడుదల చేశారు. అది చూసిన త్రిష పోలా అదిరిపోలా అంటూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె లియో చిత్రంలో నటించిన కొన్ని ఫొటోలను వీడియోను సామాజిక మాధ్యమాలకు విడుదల చేశారు. అవి ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. త్రిష ప్రస్తుతం మరో స్టార్ నటుడు అజిత్ సరసన విడాముయర్చి చిత్రంలో నాయకిగా నటిస్తున్నారు.

క్లుప్తంగా

బస్సు ఢీకొని ఇద్దరి దుర్మరణం

అన్నానగర్: బైక్‌ను బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ ఘటన భూవంది సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. శివగంగై జిల్లా భూవంది సమీపంలోని మాథూర్ గ్రామానికి చెందిన ఆదికేశవన్ (23). ఇతను మదురై ఎయిర్‌పోర్ట్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదికేశవన్ ఇతని స్నేహితుడు శుక్రవారం మదురై నుంచి మాథూరు వైపు బైకులో వెళ్లారు. అదేసమయంలో తొండి నుంచి మదురై వైపు ప్రభుత్వ సబర్బన్ బస్సు వస్తోంది. భూవంది కుయవంకులం ఎగ్జిట్ వద్ద బస్సు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌లో వస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలిసి భూవంది పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంటైనర్ ఢీకొని స్కూటరిస్టు మృతి

కొరుక్కుపేట: బైక్‌ను కంటైనర్ లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందాడు. తిరువళ్లూరులోని అరుణాచలపురం గ్రామానికి చెందిన కుమార్ (52) ఫారెస్ట్ పవర్ బోర్డులో వైర్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం యథావిధిగా విధులకు వెళ్లి రాత్రి తన ద్విచక్ర వాహనంపై తిరుగుప్రయాణమయ్యాడు. తిరువళ్లూరు సీఎస్ఐ గౌడీ చర్చి వద్ద శ్రీపెరంబదూర్ నుంచి మాధవరం వైపు వెళుతున్న కంటైనర్ లారీ బైక్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న తిరువళ్లూరు టౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువళ్లూరు ప్రభుత్వ కళాశాల ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ యజమానిపై కేసు నమోదు చేశారు.

తల్లి, కుమార్తె ఆత్మహత్య

అన్నానగర్: చుళగిరి సమీపంలో రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతిచెందాడన్న బాధతో మృతుడి తల్లి, చెల్లెలు శుక్రవారం తెల్లవారుజామున ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కృష్ణగిరి జిల్లా చూలగిరి తాలూకా తోరిపల్లి సమీపంలోని ఉంగట్టి గ్రామానికి చెందిన వెంకట్ రామప్ప (52) డ్రైవర్. ఇతని భార్య మీనాక్షి (47). వీరికి గిరి (23) అనే కుమారుడు, కావ్య (18) అనే కుమార్తె ఉన్నారు. రెండు నెలల క్రితం గిరి రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ గత 7వ తేదీన మృతి చెందాడు. దీంతో అతని తల్లి మీనాక్షి, సోదరి కావ్య మనస్తాపంతో ఉంటున్నారు. ఈ స్థితిలో గురువారం సాయంత్రం వెంకట్ రామప్ప బయటకు వెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజామున అతను తిరిగి వచ్చేసరికి భార్య, కూతురు ఉరివేసుకుని శవాలుగా వేలాడుతూ కనిపించారు. దీనిపై పేరిగై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కృష్ణగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జంతువు దాడిలో 10 మేకలు మృతి

అన్నానగర్: కృష్ణగిరి సమీపంలో శుక్రవారం వేకువజామున గుర్తుతెలియని జంతువు దాడిలో 10 మేకలు మృతిచెందాయి. కృష్ణగిరి జిల్లా బెల్లంపల్లి సమీపం పుదుపేయనపల్లికి చెందిన శేఖర్ రైతు. ఇతను మేకలను పెంచుతున్నాడు. ఈ స్థితిలో గురువారం 23 మేకలను మేతకు తీసుకెళ్లిన అతను ఇంటి సమీపంలోని కొట్టంలో మేకలను ఉంచాడు. ఆ తర్వాత శుక్రవారం ఉదయం కొట్టానికి వెళ్లి చూడగా 10 మేకలు చనిపోయి ఉన్నాయి. గాయాలతో ఉన్న 5 మేకలను చూసి షాక్ తిన్న శేఖర్ అటవీశాఖ, క్రిష్ణగిరి డ్యాం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేశారు. విచారణలో విష జంతువు దాడికి గురై మేకలు మృతిచెందినట్లు తెలిపారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

అన్నానగర్: కల్యాణ మండపంలో భోజనం వడ్డించేందుకు వచ్చిన వంట మనుషుల మధ్య తలెత్తిన వివాదంలో యువకుడిని హత్య చేసిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. తిరుపూర్ జిల్లా అవినాసి సమీపంలోని మంగళం రోడ్డులో కల్యాణ మండపం ఉంది. ఇందులో గురువారం రాత్రి వివాహ వేడుక జరిగింది. ఈరోడ్‌లోని నసియానూర్‌కు చెందిన క్యాటరింగ్ కాంట్రాక్టర్ ఆనందన్ వంటవాళ్లను, వెయిటర్లను తీసుకొచ్చాడు. వీరిలో కరూర్ పోగలూరుకి చెందిన ప్రకాష్ (44), నామక్కల్‌కు చెందిన సుందర మూర్తి (49), బేయర్‌లు ఉన్నారు. అడ్రస్ తెలియని మరో యువకుడు కూడా వచ్చాడు. రాత్రి ఈ ముగ్గురి మధ్య వాగ్వాదం జరిగింది. అక్కడున్న వారు వారికి సర్దిచెప్పారు. హాలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత మళ్లీ గొడవకు దిగారు. ఇందులో ప్రకాష్, సుందర మూర్తి ఇద్దరూ యువకుడిపై రాళ్లతో దాడి చేశారు. యువకుడు మృతిచెందాడు. అవినాసి పోలీసులు కేసు నమోదు చేసి ప్రకాష్, సుందరమూర్తిలను అరెస్టు చేసి విచారిస్తున్నారు.

యువతిపై లైంగిక దాడి.. హత్య

అన్నానగర్: తిరుపూర్ తారాపురం రోడ్డులోని కె.చెట్టిపాళయం ప్రభుత్వ పాఠశాలలో తరగతి గది నిర్మాణం జరుగుతోంది. అందులో పనిచేస్తున్న కార్మికుల వసతి కోసం పాఠశాల ఆవరణలో టిన్‌సెట్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం సెట్‌లో ఓ యువతి శవమై కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. యువతిపై లైంగిక దాడి చేసి హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆమె వయస్సు 30 ఏళ్లు ఉంటుందని. వివరాలు తెలియరాలేదన్నారు. దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుర్వేదాన్ని ప్రపంచవ్యాప్తం చేయాలి


జ్యోతిప్రజ్వలన చేసి ఆయుర్వేద పర్వం-2023ని ప్రారంభిస్తున్న టీటీడీ జేఈవో సదా భార్గవి


టీటీడీ ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీ తయారు చేసిన రుమాశాప్ బామ్‌ను ఆవిష్కరిస్తున్న జేఈవో

- టీటీడీ జేఈఓ సదా భార్గవి పిలుపు
- రుమాశాప్ బామ్ ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్: ఆయుర్వేద వైద్య విధానాన్ని ప్రపంచ వ్యాప్తం చేయాలని టీటీడీ జేఈఓ సదా భార్గవి ఆయుర్వేద వైద్యులకు పిలుపునిచ్చారు. న్యూఢిల్లీకి చెందిన అఖిల భారత ఆయుర్వేద మహాసమ్మేళనం, భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వం శాఖ, టీటీడీ ఎస్వీ ఆయుర్వేద కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో తుడా కార్యాలయం వద్దనున్న కచ్చపి ఆడిటోరియంలో శుక్రవారం 'ఆయుర్వేద పర్వం-2023' కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. జేఈఓ మాట్లాడుతూ శ్రీవారి ఆశీస్సులతో ఆధ్యాత్మిక నగరమైన తిరుపతి నుంచి ఆయుర్వేదం విస్తృతంగా వ్యాప్తి చెందాలని ఆకాంక్షించారు. టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీనివాస ఆయుర్వేద ఫార్మసీలో 30 ఔషధాలను సొంతంగా తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. కేరళలోని ఆయుర్వేద సంస్థలతో ఒప్పందం చేసుకుని ఉన్నత ప్రమాణాలను నెలకొల్పుతామన్నారు.

రుమాశాప్ పెయిన్ బామ్ ఆవిష్కరణ

నరసింగాపురంలోని శ్రీనివాస ఆయుర్వేద ఫార్మసీలో రుమాశాప్ పేరుతో టీటీడీ సొంతంగా తయారు చేసిన పెయిన్ బామ్‌ను ఈ సందర్భంగా జేఈఓ ఆవిష్కరించారు. అదేవిధంగా టీటీడీ ఎస్వీ ఆయుర్వేద కళాశాల అలూమినీ అసోసియేషన్ లోగోను కూడా ఆవిష్కరించారు. దీనికిముందు ఎస్వీ ఆయుర్వేద కళాశాల, ఆయుష్ శాఖ ఇతర సంస్థలు ఏర్పాటు చేసిన ఆయుర్వేద, యునాని, సిద్ధ, హోమియోపతి వైద్య విధానాలకు సంబంధించిన ప్రదర్శనశాలను ఆమె తిలకించారు. ఆయుష్ మంత్రిత్వశాఖ సహాయ కార్యదర్శి బిశ్వజిత్‌కుమార్ సింగ్, రాష్ట్రీయ ఆయుర్వేద విద్యాపీఠం అధ్యక్షుడు డాక్టర్ దేవేందర్ త్రిగుణ, ఆయుష్ సలహాదారుడు డాక్టర్ మనోజ నేసరి, ఎన్‌సీఐఎస్ఎం చైర్మన్ డాక్టర్ జయంత్ డియోపూజారి, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రేణుదీక్షిత్, అధ్యాపకులు డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ నారపరెడ్డి, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ శ్రీహర్ష పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన


ఆవిష్కరణలను పరిశీలిస్తున్న ఏసీపీ అలగేషన్

కొరుక్కుపేట: చంద్రయాన్-3, సౌరశక్తి వినియోగం, తంజావూరు ఆలయాలు, వ్యవసాయం, పంటలు, నీటి పొదుపు తదితర వినూత్న ఆవిష్కరణలతో చిన్నారులు తమదైన ప్రతిభను ఆవిష్కృతం చేశారు. చెన్నై చూలైలో ఉన్న హిందూ యూనియన్ ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ టాలెంట్ ఎగ్జిబిషన్-2023 పేరుతో శుక్రవారం విజ్ఞాన ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో ఆరో తరగతి నుంచి ప్లస్ టూ వరకు చదువుతున్న విద్యార్థులు సైన్స్, గణిత ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఆయా ఆవిష్కరణల గురించి వివరిస్తూ తమదైన ప్రతిభ చాటుకున్నారు. పాఠశాల సెక్రటరీ చంద్ర శేఖరన్, ప్రధానోపాధ్యాయురాలు ఎస్.ఎస్. మాలతి నేతృత్వంలో సాగిన ఈ ఎగ్జిబిషన్‌ను పులియాన్‌తోపు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, అలగేషన్‌తోపాటు చెన్నై కార్పొరేషన్ 78వ వార్డు కౌన్సిలర్ వేలు, వ్యాపారవేత్త కేఎస్ బాలకృష్ణన్, ఇన్‌స్పెక్టర్ భువనశ్రీ ప్రత్యేక అతిథులుగా పాల్గొని చిన్నారుల ప్రతిభను కొనియాడారు. పాఠశాల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, కోశాధికారి చక్రవర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

50 కిలోల సముద్రపు నత్తలు స్వాధీనం

అన్నానగర్: రామనాథపురం జిల్లా మండపంలో కోస్ట్‌గార్డ్ హోవర్‌క్రాఫ్ట్ షిప్‌లో రామేశ్వరం, ధనుష్కోటి మధ్య ఉత్తర సముద్రంలో గురువారం గస్తీ విధుల్లో నిమగ్నమై ఉన్నారు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో చేపలు పడుతున్న ఓ పడవను అనుమానంతో నిలిపి తనిఖీ చేశారు. అందులో 50 కిలోల సముద్రపు నత్తలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్న అధికారులు మండపానికి చెందిన ఆర్ముగం (42), మురుగేశన్ (55), అరుణ్‌కుమార్ (33), శరవణన్ (44), మునియాండి (51) అనే ఐదుగురిని అరెస్టు చేశారు.


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

తాంత్రిక పూజలు చేస్తున్నాడని వ్యక్తి హత్య

తిరువొత్తియూరు: తాంత్రిక పూజలు చేస్తున్నాడనే అనుమానంతో సేలంలో వ్యక్తిని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. మల్లూరు వాళముత్తపట్టి ఎరుమనాయగం పాళయానికి చెందిన ముత్తురాజు (39) రైతు. భార్య రంజితం, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురువారం రాత్రి 7 గంటల సమయంలో ముత్తురాజు తన బైక్‌పై కుట్టపటికి పాలు తదితర వస్తువులు తీసుకోవడానికి వెళ్లాడు. తిరిగి వస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు అతన్ని అడ్డుకుని కత్తులతో దాడి చేసి హత్య చేశారు. గమనించిన కొందరు ముత్తురాజు భార్య రంజితం, బంధువులకు సమాచారం అందించారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని శవపరీక్ష కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై మల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ప్రేమ వ్యవహారంలో యువకుడి ఇంటికి నిప్పు

వేలూరు: తిరుపత్తూరు జిల్లా జోలార్‌పేట సమీపంలోని పోస్టుమాన్ వట్టం గ్రామానికి చెందిన మురుగన్ కుమారుడు విజయ్(25). ఇతను అదే గ్రామానికి చెందిన యువతి రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. విషయం తెలిసి వారి తల్లిదండ్రులు ప్రేమను వ్యతిరేకించారు. అయినా ప్రేమికులు ఇద్దరూ ఎవరికీ తెలియకుండా మాట్లాడుకునే వారు. ఇది తెలిసి తల్లిదండ్రులు ఇద్దరిని మందలించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వేకువజామున విజయ్, యువతి ఇద్దరూ కలిసి ఇంటి నుంచి పరారయ్యారు. ఆగ్రహించిన యువతి బంధువులు విజయ్ ఇంటిని పెట్రోల్ పోసి దహనం చేశారు. స్థానికులు జోలార్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంటిలోని వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఆసమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో విజయ్ కుటుంబసభ్యులు ప్రాణాలతో బయటపడ్డారు.


దహనం చేసిన ఇల్లు

గ్రామ పరిపాలనాధికారి ఆత్మహత్య

అన్నానగర్: ఊత్తంగరై సమీపంలో 10 నెలలుగా జీతం ఇవ్వకపోవడంతో గ్రామ పరిపాలన అధికారి విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మపురి జిల్లా ఆరూర్ సమీపం వాచ్చాతికి చెందిన శివలింగం (53). కృష్ణగిరి జిల్లా ఊత్తంగరై సమీపం నడుపట్టి గ్రామంలో గ్రామ పరిపాలనా అధికారి. గత 18వ తేదీన యథావిధిగా పనికి వెళ్లాడు. అనంతరం అటెండర్‌కు విషం తాగినట్లు చెప్పాడు. దీంతో సహాయకుడు శివలింగం కుమారుడు దక్షిణామూర్తికి సమాచారం అందించాడు. అనంతరం సహాయకులు, ఇరుగుపొరుగు శివలింగాన్ని ఉత్తంగరై ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హొసూరు ప్రభుత్వాస్పత్రికి, సేలం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శివలింగం గురువారం మృతి చెందాడు. దక్షిణామూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేశారు. శివలింగంకు పది 10 నెలలుగా జీతం ఇవ్వడం లేదని, తరచూ ఉద్యోగాలు మారుతుంటాడని, ఇల్లు కట్టుకోవడానికి బ్యాంకులో అప్పు చేసి తిరిగి చెల్లించలేక పోతున్నాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. దాని కారణంగా అతను జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కొండచిలువ పట్టివేత

అన్నానగర్: దువరంగురిచ్చి సమీపంలో శుక్రవారం కోతిని మింగేందుకు ప్రయత్నించిన కొండచిలువను అగ్నిమాపక సిబ్బంది పట్టుకున్నారు. తిరుచ్చి జిల్లా దువరంగురిచ్చి సమీపంలో ఉన్న మల్లికాయిపట్టి సమతువపురం ప్రాంతంలో ఓ కొండచిలువ శుక్రవారం కోతిని మింగేందుకు ప్రయత్నించింది. ఇది చూసి షాక్ తిన్న ఇతర కోతులు అరవడంతో ఆ ప్రాంత ప్రజలు దాన్ని చూసేందుకు అక్కడికి వెళ్లారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు ద్వారంకురిచ్చి అగ్నిమాపక సిబ్బంది మనోహర్, స్పెషల్ స్టేషన్ అధికారి మహేంద్రన్‌ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం పట్టుకున్న 10 అడుగుల కొండచిలువను, చనిపోయిన కోతిని అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

నామక్కల్‌లో విషాదం

- భర్త ఆత్మహత్య.. భార్య బలవన్మరణం

అన్నానగర్: నామక్కల్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అనారోగ్యంతో భర్త ఆత్మహత్య చేసుకోగా ఇది చూసిన భార్య బలవన్మరణానికి పాల్పడింది. వివరాలు.. పరమతి వేలూరు తాలూకా సమీపంలోని కూడచేరి పూసరిపట్టి పుత్తూరుకు చెందిన అంగముత్తు (60) సెలూన్ షాపు నడిపేవాడు. భార్య జయమణి (57). అంగముత్తు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నా ఫలితం లేకుండాపోయింది. ఈ క్రమంలో గురువారం రాత్రి భార్య జయమణి నిద్రిస్తున్న సమయంలో అంగముత్తు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా గమనించిన భార్య మనస్తాపంతో విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పరమతి వేలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

58 మంది రైడర్లు, నేరగాళ్లు అరెస్ట్

కొరుక్కుపేట: ఆవడిలో గురువారం అర్ధరాత్రి సెంగుండ్రం పోలీసులు జరిపిన దాడిలో 58 మందిని అరెస్టు చేశారు. వారి ఇళ్లపై పోలీసులు దాడులు చేశారు. పోలీస్ కమిషనర్ టి.శంకర్ ఆదేశాల మేరకు గురువారం అర్ధరాత్రి సోదాలు నిర్వహించారు. ఇందులో సెంగుండ్రంలో 42 మంది రైడర్లు, ఆవడిలో 16 మంది దొంగలను అరెస్టు చేశారు. హత్య కేసులో 14 మందిని అరెస్టు చేశారు. వివిధ కేసుల్లో 13 మంది నిందితులు పరారీలో ఉన్నారు. వారెంట్ నేరస్తులు, డ్రగ్ కేసు నేరస్తులు, రౌడీషీటర్లు సహా మొత్తం 58 మందిని అరెస్టు చేశారు. ఆవడి పోలీసు జిల్లా డిప్యూటీ కమిషనర్ ఎస్.భాస్కరన్, సెంగుండ్రం పోలీస్ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఎస్కే బాలకృష్ణన్ నేతృత్వంలో పోలీసులు రైడర్ల ఇళ్లపై సహాయ కమిషనర్లతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ విషయమై పోలీస్ కమిషనర్ శంకర్ మాట్లాడుతూ.. రౌడీ కార్యకలాపాలను అరికట్టేందుకు అరెస్ట్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.


లారీని ఢీకొన్న కారు

- ఒకరి మృతి
- ముగ్గురికి తీవ్రగాయాలు

అన్నానగర్: ఆగివున్న లారీని కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. చెన్నైలోని సిందతిరిపేటకు చెందిన గణేశన్ (54), ఐనావరానికి చెందిన శక్తివేల్ (51), తిరువణ్ణామలై జీవా నగర్ కు చెందిన కమలకన్నన్ (46) చెన్నై నుంచి పళనికి కారులో బయలుదేరారు. కారును చెన్నై విరుగంపాక్కంకు చెందిన రాజశేఖర్ నడుపుతున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున చెన్నై-తిరుచ్చి జాతీయ రహదారిపై అరసూర్ సమీపంలో వెళుతుండగా కారు అదుపుతప్పి ఆగివున్న లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న గణేశన్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన శక్తివేల్, కమలకన్నన్, రాజశేఖర్‌లను ముండియంబాక్కం ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ హత్య కేసులో నిందితుల అరెస్ట్

చిత్తూరు అర్బన్: ఒంటరిగా జీవిస్తున్న మహిళను ఎలా హత్య చేయాలి..? తర్వాత పోలీసుల నుంచి ఎలా తప్పించుకోవాలి..? అనే విషయాలను సినిమాల్లోని క్రైమ్ సన్నివేశాలను చూసి ఓ స్త్రీని హత్య చేసిందో గ్యాంగ్. ఏ కథలోనైనా నేరం చేసినవాళ్లు పోలీసుల కళ్లుగప్పలేరనే అంశాన్ని మాత్రం కనిపెట్టలేకపోయిందా ముఠా. చివరకు పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. వివరాలు.. కుప్పంలో పది రోజుల క్రితం సూర్యకాంత (54) అనే మహిళను హత్య చేసిన నిందితులు కె.పూర్ణచందు (23), ఆర్.సంపత్ (23), ఆర్.మురళి (24), ఎస్.నవీన్‌కుమార్ (24), తిరుపతి (25), ఎం.దినేష్ (23)ను కుప్పం పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, కుప్పం సీఐ శ్రీధర్‌తో కలిసి ఎస్పీ వై.రిషాంత్‌రెడ్డి కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. కుప్పం మండలం యలజనూరు గ్రామంలో ఈనెల 17వ తేదీన సూర్యకాంత అనే మహిళ హత్యకు గురైంది. గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను ఇంట్లో చంపేసి, నగలు, నగదుతో అపహరించినట్లు మృతురాలి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ శ్రీధర్ , ఎస్ఐ శివకుమార్ బృందంతో కలిసి దర్యాప్తు ప్రారంభించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. కుప్పం పట్టణానికి చెందిన పూర్ణచందు తండ్రి కామప్ప కొన్నాళ్ల క్రితం సూర్యకాంత భర్త శ్రీనివాస్ వద్ద రూ.7లక్షలు అప్పు చేసి ఓ స్థలం కొనుగోలు చేశాడు. కొంతకాలానికి శ్రీనివాస్ మరణించడంతో సూర్యకాంత తన భర్త ఇచ్చిన నగదును చెల్లించాలని కామప్పను ఒత్తిడి చేసింది. దీంతో పూర్ణచందు తమ స్థలం అమ్మేసి ఆమెకు నగదు ఇచ్చేశాడు. అప్పటి నుంచి సూర్యకాంత తన వద్ద ఉన్న నగదును వడ్డీలకు ఇస్తూ జీవనం సాగించేది. పూర్ణచందు మాత్రం బెంగళూరు వెళ్లిపోయి విలాసాలు, వ్యసనాలకు అలవాటు పడిపోయాడు. చివరకు ఆర్థిక ఇబ్బందుల తలెత్తడంతో సూర్యకాంతాన్ని చంపేసి ఆమె వద్ద ఉన్న నగదు, నగలను దోచుకోవాలని ప్లాన్ వేశాడు. అనుకున్నదే తడవుగా కుప్పంలోని తన స్నేహితులు ఆర్.సంపత్, ఆర్.మురళి, ఎస్.నవీన్‌కుమార్, తిరుపతి, తమిళనాడు తిరుపత్తూరుకు చెందిన మరో స్నేహితుడు ఎం.దినేష్‌తో కలిసి పథకం పన్నాడు. తర్వాత అందరూ కలిసి వివిధ రకాల క్రైమ్ సినిమాలను చూసి పక్కాగా ప్లాన్ సిద్ధం చేసుకున్నార. అనంతరం 17వ తేదీన సూర్యకాంతం ఇంటికి వెళ్లి ఆమెను మాటల్లోకి దింపారు. హఠాత్తుగా ఆమెపై పడి గొంతుకు తాగు బిగించి చంపేశారు. మృతదేహంపై ఉన్న నగలు, బీరువాలోని ఆభరణాలు, రూ.2.25లక్షల నగదును తీసుకుని అక్కడ నుంచి పారిపోయారు. ఎట్టకేలకు కుప్పం ప్రభుత్వాస్పత్రి సమీపంలో పోలీసులకు పట్టుబడ్డారు. ఈ క్రమంలో నిందితుల నుంచి 110 గ్రాముల బంగారు నగలు, రూ.2.25లక్షల నగదు, హత్య కోసం చోరీ చేసిన ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదించడంలో ప్రతిభ కనబరచిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

నదిలో మునిగి యువకుడి మృతి

అన్నానగర్: పెరియంబట్టి సమీపంలో నదిలో మునిగి ఓ యువకుడు మృతిచెందాడు. ధర్మపురి జిల్లా కారిమంగళం సమీపంలోని పెతనూరు గ్రామానికి చెందిన శివలింగం కుమారుడు సిలంబరసన్ (19). 10వ తరగతి వరకు చదివిన ఇతను గురువారం ఉదయం మేకలను మేతకు తీసుకొని వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. వెళ్లిన సిలంబరసన్ సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. ఆ సమయంలో పెరియంబట్టి పక్కనే ఉన్న పూలపట్టి నది దగ్గర మేకలు మాత్రమే మేస్తున్నాయి. అనంతరం నది వద్దకు వెళ్లి చూడగా సిలంబరసన్ శవమై తేలాడు. వెంటనే ఈ విషయాన్ని కారిమంగళం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సిలంబరసన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మపురి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీఎంకే సర్పంచ్ భర్తపై ఫిర్యాదు


కాలువ కట్ట చదును చేసి ఏర్పాటు చేస్తున్న మట్టి రోడ్డు

తిరుత్తణి: తన పొలానికి వెళ్లి వచ్చేందుకు వీలుగా కాలువ కట్ట, విద్యుత్ స్తంభం కూల్చి ఇతరుల పొలంలో మట్టి రోడ్డు ఏర్పాటు చేసినట్లు తుంబికులానికి చెందిన డీఎంకే సర్పంచ్ భర్తపై రైతులు అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. తిరువలంగాడు యూనియన్ తుంబికులం పంచాయతీ సర్పంచ్‌గా నిర్మల విధులు నిర్వహిస్తున్నారు. ఆమె భర్త గోపి డీఎంకేలో మండల స్థాయిలో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. తుంబికులం చెరువు వద్ద ఉన్న వారి పొలానికి దారి కోసం తుంబికులం చెరువుకు వెళ్లే కాలువ కట్టను, పక్కనే వున్న విద్యుత్ స్తంభాన్ని కూల్చి ఇతర రైతుల పొలంలో మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో ఆగ్రహించిన ఆ పొలాల రైతులు మట్టి రోడ్డును జేసీబీతో తొలగించారు. కాలువ కట్ట, విద్యుత్ స్తంభం కూల్చివేతకు సంబంధించి విద్యుత్‌శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.


కూల్చి వేసిన విద్యుత్ స్తంభం

నకిలీ పత్రాలతో భూ విక్రయం

- ఒకరి అరెస్టు

తిరువొత్తియూరు: నకిలీ దస్తావేజులు తయారు చేసి రూ.2.14 కోట్ల విలువైన స్థలాన్ని కాజేసిన వ్యక్తిని గురువారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై, రెడ్ హిల్స్ సమీపంలోని మన్నూరుపేటకు చెందిన జాన్ వెస్లీ 2013లో ఆవిడి సెంట్రల్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అందులో అంబత్తూర్ సమీపం మన్నూరుపేట గ్రామంలో జాన్ వెస్లీకి సొంతమైన 5825 చదరపు అడుగుల ఖాళీ స్థలం ఉందని ఆ స్థలం రూ. 2.14 కోట్లు విలువ చేస్తుందని.. దురైరాజు, బిలాల్ అహ్మద్, సతీష్ అనే ముగ్గురు నకిలీ దస్తావేజులు తయారు చేసి ఆ స్థలాన్ని కాజేశారని ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. తిరుపతిలో తిరుగుతున్న సతీష్ (42)ను ప్రత్యేక బృందం పోలీసులు గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. అతన్ని చెన్నైకి తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. మరో ఇద్దరు దురై రాజు, బిలాల్ అహ్మద్ కోసం గాలిస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 62,055 మంది స్వామివారిని దర్శించుకోగా 27,088 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.58 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పూల కోసం వెళ్లి.. కానరాని లోకాలకు

చిల్లకూరు: చెరువులోని కలువ పూలు కోసేందుకు వెళ్లి బురదలో కూరుకుపోవడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని పలమలమాల సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు వివరాలు.. పల్లమాల గ్రామానికి చెందిన పిట్టి కోటయ్య (52) అనే వ్యక్తి గ్రామానికి సమీపంలోని పెన్నాక చెరువులో కలువ పూలు కోసి మార్కెట్లో విక్రయించేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కలువ పూల కోసం చెరువులో దిగి ప్రమాదవశాత్తు బురదలో కూరుకుపోయాడు. అయితే కుటుంబ సభ్యులు పూలు కోసుకుని మార్కెట్టుకు తీసుకెళ్లి ఉంటాడని భావించారు. సాయంత్రం అటుగా వెళ్లిన వారికి మృతదేహం పైకి తేలి కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కోటయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

అగస్త్యేశ్వర స్వామికి అన్నాభిషేకం

చంద్రగిరి: తొండవాడ స్వర్ణముఖీనది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి(ముక్కోటి)వారి ఆలయంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం స్వామివారితోపాటు శ్రీఆనందవల్లీ అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. మూలవర్లకు పసుపు-కుంకుమ, విభూది, చందనాది ద్రవ్యాలతో అభిషేక సేవను కనుల పండువగా నిర్వహించారు. 11 గంటలకు అన్నాభిషేక సేవను నిర్వహించి, శోభాయమానంగా అలంకరించారు. ఉదయం స్వామి అమ్మవార్లు శేషవాహనంపై, రాత్రి భూత వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

జగనన్న ఆరోగ్య సురక్ష

నిర్వహించిన మొత్తం శిబిరాలు **12,130**

20 వ రోజు

నమోదైన ఓపీలు **52,38,177**

నిర్వహించిన వైద్య పరీక్షలు **6,33,83,849**

మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రెఫర్ చేసినవారి సంఖ్య **79,069**





గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరులో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో గ్రామస్తుడికి బీపీ పరీక్ష చేస్తున్న సిబ్బంది



తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మహిళలకు పరీక్షలు చేస్తున్న గైనకాలజిస్ట్ డాక్టర్ భార్గవి



శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం బెంకిలి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు



నంద్యాల జిల్లా మహానందిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో టోకెన్ల జారీ విధుల్లో సచివాలయ సిబ్బంది

అభివృద్ధికి రోడ్ మ్యాప్

▶ మొదటి పేజీ తరువాయి

సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

ఆహ్లాదకరంగా విజయవాడ

- విజయవాడలో అంబేడ్కర్ స్మృతి వనం, కన్వెన్షన్ సెంటర్ పనులను వేగంగా పూర్తి చేయాలి. పార్కులో పచ్చదనానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. కాలువల పరిశుభ్రతపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి. ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా అత్యాధునిక యంత్రాలను వినియోగించాలి. విమానాశ్రయానికి వెళ్లే మార్గం అంతటా ఆకర్షణీయంగా.. ప్రయాణికులను ఆకట్టుకునేలా సుందరీకరణ పనులు చేపట్టాలి. ముఖ్యంగా కృష్ణలంక ప్రాంతంలో కృష్ణానదిని ఆనుకుని నిర్మించిన రక్షణ గోడ ప్రాంతాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి.
- రాజమహేంద్రవరంలోని కంబాల చెరువు సహా వివిధ ప్రాంతాల్లో చేపట్టిన సుందరీకరణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. గోదావరి నదిపై హేవ్‌లాక్ బ్రిడ్జిని ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించాలి.
- వరదల కారణంగా నెల్లూరు మునిగిపోయే పరిస్థితి రాకూడదు. ప్రజలు ఇబ్బంది పడకుండా రక్షణ గోడ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి.



పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతస్థాయి సమీక్షలో అధికారులకు సూచనలిస్తున్న సీఎం వైఎస్ జగన్

- టిడ్కో ఇళ్ల నిర్వహణను ప్రాధాన్య అంశంగా తీసుకోవాలి. పేదల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో నీటి సంరక్షణ పద్ధతులను ప్రోత్సహించాలి.

మానవ వనరుల్లో సాంకేతిక విజ్ఞానం పెంచాలి

- నగరాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టాం. ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్, ఎస్‌టీపీల నిర్వహణ, పారిశుద్ధ్యం కోసం అత్యాధునిక యంత్రాలు తదితర వాటిని తీసుకొస్తున్నాం.
- పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థుల్లో పట్టణాభివృద్ధి ప్రాజెక్టుల కోసం అవసరమయ్యే సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించాలి. ఇలాంటి ప్రాజెక్టుల సమగ్ర నిర్వహణ కోసం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌వోపీ) పెట్టుకోవాలి.

విశాఖలో ప్రగతి వీచిక

విశాఖపట్నంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సౌకర్యాలను కల్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ముందుగా రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు విశాఖ ప్రగతిని సీఎంకు వివరించారు. నాలుగేళ్లలో రూ.3,592 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. రహదారులతో పాటు డ్రెయిన్లు, నీటి సరఫరా, వీధి లైట్లు, పార్కులు, వాటర్ బాడీలు, సుందరీకరణ, మురుగు నీటి శుద్ధి, వివిధ భవనాల నిర్మాణంతో పౌరులకు మెరుగైన సేవలు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. నాలుగు ఎకరాల విస్తీర్ణంలో రూ.100 కోట్లతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని నిర్మించామన్నారు. మరో రూ.300 కోట్లతో భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టు పనులను త్వరలో ప్రారంభిస్తున్నామని చెప్పారు. మూడు వరసల్లో పార్కు, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో కమర్షియల్ కాంప్లెక్స్, మల్టీ లెవల్ కారు పార్కింగ్, భీమిలి, గాజువాక, అనకాపల్లిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎన్.గుల్జార్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ పి.కోటేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్, అర్బన్ రీ సర్వే ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ బి.సుబ్బారావు, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ ఆర్.జె.విద్యుల్లత, ఏపీజీబీసీఎల్ ఎండీ బి.రాజశేఖరరెడ్డి, మెప్మా ఎండీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

కర్నూలు ట్రిపుల్ ఐటీలో 5జీ ల్యాబ్

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



కర్నూలు సిటీ: కర్నూలులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్‌లో ఏర్పాటు చేసిన 5జీ ప్రయోగశాలలను శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2జీ, 3జీ, 4జీ టెక్నాలజీ కోసం విదేశాల మీద ఆధారపడ్డామని, ఇప్పుడు 5జీ టెక్నాలజీని సొంతంగా అభివృద్ధి చేసుకున్నట్టు చెప్పారు. ఈ టెక్నాలజీ వచ్చిన ఏడాదిలోపే దేశ వ్యాప్తంగా నాలుగు లక్షల 5జీ బేస్ స్టేషన్లను ఏర్పాటు చేసుకోగలిగామన్నారు. బ్రాడ్‌బ్యాండ్ వేగంలో భారత్ గతంలో 118 ర్యాంక్‌లో ఉండగా.. ఇప్పుడు 43వ ర్యాంక్‌కు ఎగబాకిందన్నారు. దేశంలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థలైన ఐఐటీ కాన్పూర్, ఐఐటీ రూర్కీలాలతో పాటు కర్నూలు ట్రిపుల్ ఐటీ 5జీ ప్రయోగశాలను దక్కించుకోవడం ఆనందంగా ఉందని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య డీవీఎల్ఎన్ సోమయాజులు తెలిపారు.

క్లుప్తంగా...

పారా మెడికల్ పోస్టులన్నీ భర్తీ చేయండి

డీఎంఈ ఆదేశాలు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశం మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనాస్పత్రులు, వైద్య, నర్సింగ్ కళాశాలల్లో పారామెడికల్, నాన్-క్లినికల్ సహాయ సిబ్బంది పోస్టులన్నీ నవంబర్ నెలాఖరులోగా భర్తీ చేయాలని సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాల్స్‌ను ఆదేశిస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ నరసింహం ఉత్తర్వులిచ్చారు. బోధనాస్పత్రి, వైద్య, నర్సింగ్ కళాశాలలన్నింటికీ కలిపి డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ(డీఎస్సీ) ద్వారా కంబైన్డ్ నోటిఫికేషన్ ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ రంగంలో 17 కొత్త వైద్య కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, ఇప్పటికే 5 కళాశాలలు ప్రారంభమయ్యాయి. మరో 5 కళాశాలలు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభంకానున్నాయి. ఆయా కళాశాలలకు కొత్తగా పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటితోపాటు, ఇప్పటికే ఉన్న పాత కళాశాలలు, బోధనాస్పత్రుల్లో 1800 వరకూ పారామెడికల్, నాన్-క్లినికల్ సహాయ సిబ్బంది పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. వైద్య రంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండకుండా సీఎం జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో 2019 నుంచి ఇప్పటి వరకూ 53 వేల పోస్టులను ఒక్క వైద్య శాఖలోనే భర్తీ చేశారు. ఉద్యోగ విరమణలు, ఇతరత్రా కారణాలతో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడే భర్తీ చేసుకునేలా అత్యవసర ఉత్తర్వులిచ్చారు.

బీఎస్సీ నర్సింగ్‌లో 6,171 సీట్లు భర్తీ

సాక్షి, అమరావతి: 2023-24 విద్యా సంవత్సరానికి బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సులో ప్రవేశాల్లో భాగంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ తొలి విడత సీట్లను కేటాయిస్తూ శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. 7,158 సీట్లకు గాను 6,171 సీట్లు తొలి విడతలో భర్తీ అయ్యాయి. https://ugnursing.ysruhs.com/ugnuallotment/లో అలాట్‌మెంట్ లెటర్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. తమకు సీట్లు కేటాయించిన కళాశాలల్లో ఈ నెల 31న సాయంత్రం 6 గంటల్లోగా రిపోర్ట్ చేయాలని సూచించారు.

వాస్తవాలు కప్పిపుచ్చి కట్టుకథలా?

- ఎల్లో మీడియా తప్పుడు కథనంపై బాలినేని ఫైర్



సాక్షి, అమరావతి/ఒంగోలు: 'సీఎం వైఎస్ జగన్ తల్లి విజయమ్మకు రోడ్డు ప్రమాదం జరిగిందని సీఎం జగన్ దృష్టికి వెళ్లడంతో ఆయన స్వయంగా తల్లికి ఫోన్ చేసి మాట్లాడారు. చిన్న ప్రమాదమే అని, ఏమీ కాలేదని విజయమ్మ చెప్పారు. దీనిని కూడా వక్రీకరించి ఎల్లో మీడియా కథనాలు రాయడం దారుణం. వాస్తవాలను కప్పిపుచ్చి కట్టుకథలు రాయడం బాధాకరం' అని బాలినేని శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం హైదరాబాద్‌లో 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఎల్లో మీడియాలో వచ్చిన కథనం తనను బాధించడంతో పాటు విస్మయానికి గుర్తు చేసిందన్నారు. శుక్రవారం అవాస్తవాలతో కట్టు కథ ప్రచురితం కావడంతో.. తాను ఆ పత్రిక ఒంగోలు రిపోర్టర్‌కు ఫోన్ చేశానని, దీనికి ఆయన తనకు సంబంధం లేదని.. పైనుంచి వచ్చిన వార్తగా చెప్పినట్టు తెలిపారు. దీంతో విజయవాడలో వైఎస్సార్‌సీపీ బీట్ చూసే రిపోర్టర్‌కు ఫోన్ చేశానని, ఆయన కూడా తనకు తెలియదని.. హైదరాబాద్ నుంచి వచ్చిన వార్తగా చెప్పారని తెలిపారు. దీనిని బట్టి ఈ అవాస్తవాలను ఆ ఎల్లో పత్రిక ఎండీ రాధాకృష్ణే రాసి ఉంటారని తాను భావిస్తున్నట్టు చెప్పారు. 30 ఏళ్ల తన రాజకీయ చరిత్రలో నేరుగా రాజకీయం చేశాను తప్ప.. ఇలాంటి దారుణ, హీనమైన రాజకీయాలను ఎప్పుడూ చేయలేదని చెప్పారు. సీఎం తనకు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని రాశారు. వాస్తవానికి తాను సీఎంను కలవాలనుకుంటే నేరుగా ఎప్పుడైనా కలవగలనని అన్నారు. శని, ఆదివారాలు ఆయన ఇంట్లో ఉంటారని, మిగతా ఐదు రోజుల్లో ఏ రోజు కలవమంటారో చెప్పాలని సంబంధిత పత్రికకు సవాల్ విసిరారు. ఒకరోజు తాను జనసేనలోకి వెళుతున్నట్టు, ఇప్పుడు టీడీపీలోకి వెళుతున్నట్టు తప్పుడు కథనాలు రాయడం పట్ల ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

బెంగళూరు వెళ్లడం ఘోరమా!?

- చంద్రబాబు చీప్ పబ్లిసిటీ పిచ్చివల్ల గోదావరి పుష్కరాల్లో 29 మంది చనిపోవటం దారుణం కాదా రామోజీ?
- ఘోరం అంటే ఇది కదా..
- టీడీపీ హయాంలో కూడా పనుల కోసం వలసలు ఉన్నాయి కదా..
- రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్నవారు ఉపాధి కోసం అటూఇటు వెళ్లటం దశాబ్దాల నుంచీ జరిగేదే కదా..
- అసలు మీ బాధేంటి? చంద్రబాబు సీఎంగా లేకపోవడమా?..
- ఇంకెప్పటికీ ఆయన అధికారంలోకి రాడన్న ఆక్రోశమా?..
- మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల్ని ప్రభుత్వం ప్రశ్నించిందన్న తట్టుకోలేనితనమా?
- రామోజీరావుకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, మాజీమంత్రి కొడాలి నాని బహిరంగ లేఖ



సాక్షి, అమరావతి: కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తూ భవన నిర్మాణ కార్మికులు చనిపోవటం ఘోరమా? లేక బెంగళూరు వెళ్లడం ఘోరమా? అన్నది రామోజీరావు స్పష్టంచేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, మాజీమంత్రి కొడాలి నాని ప్రశ్నించారు. గోదావరి పుష్కరాల పేరిట రాజమండ్రిలో చీప్ పబ్లిసిటీ కోసం సాక్షాత్తూ చంద్రబాబునాయుడే 29 మందిని చంపేశారని.. ఘోరం అంటే అది అని కొడాలి నాని తెలిపారు. ఏపీ కార్మికులు కర్ణాటకలో చనిపోయిన ఘటనపై ఈనాడులో రామోజీరావు 'ఇక్కడే ఉపాధి ఉంటే.. ఈ ఘోరం జరిగేదా? అంటూ రాసిన కథనంపై శుక్రవారం కొడాలి నాని ఘాటుగా స్పందించారు. ఈ మేరకు ఆయన రామోజీరావుకు బహిరంగ లేఖ రాశారు. ఆ వివరాలు..

రామోజీరావు.. ముందుగా అసలు మీ బాధేంటో చెప్పాలి. చంద్రబాబు ముఖ్యమంత్రిగా లేకపోవడమా?.. ఇంకెప్పటికీ ఆయన అధికారంలోకి రాడన్న ఆక్రోశమా? లేక మీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల్ని ఖాతాదారుల ప్రయోజనాల దృష్ట్యా చట్టబద్ధంగా ప్రభుత్వం ప్రశ్నించిందన్న తట్టుకోలేనితనమా? వీటిపై ప్రజలకు సమాధానాలు చెప్పి తీరాలి. ఒక రాష్ట్రం వారు, ప్రత్యేకించి సరిహద్దుల్లో ఉన్నవారు మరో రాష్ట్రంలో పనులకు వెళ్లడం కొన్ని దశాబ్దాల నుంచీ జరుగుతోంది. అది చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నా, కాంగ్రెస్ ముఖ్యమంత్రులు అధికారంలో ఉన్నా కూడా ఇలా ఒక రాష్ట్రం వారు మరో రాష్ట్రంలోకి పనుల కోసం వెళ్లడం సర్వసాధారణమే. ఉదా.. ఖమ్మం జిల్లా నుంచి ప్రతిరోజూ కొన్ని వందల మంది పనుల కోసం విజయవాడ వస్తారు. అలాగే, ఒడిశా నుంచి ఉత్తరాంధ్రకు, కర్ణాటక నుంచి ఆంధ్రప్రదేశ్‌కు, ఛత్తీస్‌గఢ్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు, రాజస్థాన్ ఉత్తరప్రదేశ్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు కూడా వలస వస్తారు. దగ్గర ప్రాంతాల్లో ఉన్నవారు ఉదయం వచ్చి రాత్రికి వెళ్లిపోతే.. దూర ప్రాంతాల్లో ఉన్నవారు కొన్ని నెలల పాటు ఇక్కడే ఉంటారు. ఇవన్నీ అందరికీ తెలిసిన విషయాలే. కానీ, కర్ణాటకలో ఒక రోడ్డు ప్రమాదం జరిగితే.. ఇక్కడ ఉపాధిలేక వారు వెళ్లిపోయారా? లేక అక్కడ మెరుగైన ఉపాధి ఉందని వెళ్లారా? అని కనీసం వారి వివరణ కూడా లేకుండా రామోజీరావు రాశారు. ఇది ఎంతవరకు సమంజసం? దురుద్దేశపూర్వకంగా రాసినట్లు కన్పించటం లేదా రామోజీ? ఇలా రాస్తే ప్రజలు విశ్వసిస్తారా?.. ఒకసారి ఆలోచించండి.

చంద్రబాబు హయాంలో ఏటా కరువే..

ఇక చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న 14 ఏళ్లలో కరువు మండలాలు ప్రకటించాల్సిన అవసరంలేని సంవత్సరం ఒక్కటంటే ఒక్కటి కూడా లేదు. ఏటా కరువే. ఒక్క 2016నే తీసుకున్నా.. రాయలసీమ నుంచే 6-10 లక్షల మంది వ్యవసాయం చేసుకుంటున్న వారంతా వలసపోయారని అప్పట్లో ఆంగ్ల దినపత్రికలు రాశాయి. అంటే, వ్యవసాయం చేసుకుంటున్న వారు, వ్యవసాయం మానుకుని వేరే రాష్ట్రాలకు కూలీలుగా వలసపోతే ఆ రోజున రామోజీ ఇంకుడు గుంతల ప్రాధాన్యాన్ని వివరిస్తూ ఉద్యమం చేశారు తప్ప, ఇక్కడే ఉపాధి దొరికి ఉంటే.. ఇన్ని లక్షల రైతు కుటుంబాలు వేరే రాష్ట్రాల్లో కూలీలుగా మారేవారా? అని ఏనాడూ ప్రశ్నించలేదు. మరి తేడా ఎక్కడుంది? రామోజీరావు దగ్గరే.. ఆయన మనస్సులో, ఆలోచనల్లో, రాతల్లోనే తేడా ఉంది. ఇక గోదావరి పుష్కరాల పేరిట రాజమండ్రిలో చీప్ పబ్లిసిటీ కోసం సాక్షాత్తూ చంద్రబాబు 29 మందిని చంపేశారు. నిజానికి.. ఆ రోజు అది బాబు చేసిన ఘోరమే. కానీ, చేసింది బాబు కాబట్టి అది నేరమైనా ఘోరమైనా రామోజీకి కమ్మగా కనిపిస్తోంది, తియ్యగా అనిపిస్తోంది.

మీ వాడు కాదు కాబట్టే రాళ్లు వేస్తారా?

ఇలాంటి దుర్మార్గాలను వెనకేసుకొచ్చి, దురదృష్టవశాత్తూ భవన నిర్మాణ కార్మికులు కర్ణాటకలో చనిపోతే వారి కుటుంబాలకు ఏ ముఖ్యమంత్రీ ఇవ్వనంత నష్టపరిహారాన్ని, పైగా వేరే రాష్ట్రంలో ప్రమాదం జరిగినా ఇచ్చిన సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం మీద, మానవతా సాయం విషయంలో ఏమాత్రం వెనుకాడని నాయకుడి మీద.. తనవాడు కాదు,, గిట్టనివాడు కాబట్టి రాళ్లు వేస్తారా? మరీ ఇంత దుర్మార్గమా రామోజీ? మిగతా రాష్ట్రాలకు వెళ్లడం ఘోరం, నేరం అంటున్న వారు.. మీ తోటి ఎల్లో మీడియా అధిపతులు ఒక ప్రశ్నకు సమాధానం చెప్పాలి.. అసలు మా రాష్ట్రంతో, మీ సొంతూళ్లతో మీకున్న సంబంధం ఏమిటి? చంద్రబాబుతో ఉన్న వర్గపరమైన అనుబంధం తప్ప, రామోజీకి మా రాష్ట్రంతో ఏం అనుబంధం ఉంది? చంద్రబాబునాయుడుకు అయినా, పవన్‌కళ్యాణ్‌కు అయినా, సొంత ఇల్లు కూడా లేని ఈ రాష్ట్రంతో ఏం అనుబంధం ఉంటుంది? పవన్‌కళ్యాణ్ తమ్ముడిలా రోజూ మీ ఈనాడులో జగన్ అంటూ ఏకవచనంతో ముఖ్యమంత్రిని సంబోధించి ఆనందం పొందుతున్నారు. ఎన్టీఆర్ వెన్నుపోటు నాడే పత్రికా విలువలను హారతి పళ్లెంలో పెట్టి చంద్రబాబుకు సమర్పించేసుకున్నారు. ఇప్పుడు రామోజీరావు మానవతా విలువల్ని కూడా అదే పద్ధతిలో వదిలేసుకున్నారు. కాస్తంత మానవత్వాన్ని అయినా ఈ 90 ఏళ్ల వయసులో మీరు నిలుపుకోవాలి.

మంత్రి అంబటిపై దాడికి యత్నం

- ఖమ్మంలో ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన అంబటి రాంబాబు
- కర్రలతో దాడికి ప్రయత్నించిన టీడీపీ నేతలు
- జై టీడీపీ- జై చంద్రబాబు అంటూ నినాదాలు
- దుర్భాషలకు దిగిన వైనం



మంత్రి రాంబాబు కాన్వాయ్‌పై కర్రలతో దాడి చేసేందుకు యత్నిస్తున్న టీడీపీ నేతలు

ఖమ్మం క్రైం: జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుపై ఖమ్మంలో శుక్రవారం దాడియత్నం జరిగింది. ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన నగరంలోని హోటల్‌లో బస చేశారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు పలువురు హోటల్ వద్దకు చేరుకుని కార్యక్రమానికి బయలుదేరుతున్న మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కర్రలు చేతబూని దాడికి యత్నించారు. జై తెలుగుదేశం.. జై చంద్రబాబు అంటూ నినాదాలు చేస్తూ దుర్భాషలకు దిగారు. ఈ ఘటనతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సమాచారం అందుకున్న ఖమ్మం వన్‌టౌన్ సీఐ స్వామి అక్కడకు చేరుకుని టీడీపీ నేతలు కేతినేని హరీశ్, కాంపాటి విజయ్ కుమార్, రామాంజనేయ, జయ, నర్వనేని శంకర్, నాగండ్ల లక్ష్మణరావును అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హోటల్‌తో పాటు మంత్రి అంబటి రాంబాబు కార్యక్రమానికి వెళ్లే ప్రాంతంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నన్ను చంపడానికి చంద్రబాబు కులోన్మాదుల కుట్ర

మంత్రి అంబటి రాంబాబు ధ్వజం

సాక్షి, అమరావతి: తనను చంపాలన్న పక్కా ప్రణాళికతోనే చంద్రబాబు కులోన్మాదులు తనపై ఖమ్మంలో దాడికి తెగబడ్డారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. గతంలో ఆ సామాజికవర్గం నిర్వహించిన కార్తీక వనభోజనాల్లో ఈ మేరకు ఒక కులోన్మాదుడు తనను చంపినవారికి రూ.50 లక్షలు బహుమానం ఇస్తానని ప్రకటించాడని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఖమ్మంలో పక్కా ప్రణాళికతో తనను చంపాలని దాడికి తెగబడ్డారన్నారు. వంగవీటి రంగాను చంపడంతోపాటు ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని చిత్రహింసలకు గురిచేసిన చంద్రబాబు కులోన్మాదులు ఇప్పుడు తనను హత్య చేయడానికి ప్రయత్నిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. కులం మీకే కాదు.. మాకూ ఉందని.. దాడులు చేస్తే చేతులు కట్టుకుని కూర్చోబోమని హెచ్చరించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మంత్రి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. తన సమీప బంధువు కుమారుడి వివాహ నిశ్చితార్థంలో పాల్గొనేందుకు గురువారం రాత్రి తాను ఖమ్మం వెళ్లానన్నారు. తాను వెళ్తున్న వాహనంపై రెండు గోధుమ బస్తాలు పడటం వల్ల ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. దీంతో వాహనం దెబ్బతిందని, తాను సురక్షితంగా బయటపడ్డానన్నారు. శుక్రవారం ఉదయం ఖమ్మంలో తాను బస చేసిన హోటల్ నుంచి వివాహ నిశ్చితార్థానికి వెళ్తుండగా పది మంది టీడీపీ కులోన్మాదులు చంపేస్తామంటూ కర్రలతో దాడి చేయడానికి ప్రయత్నించారని తెలిపారు. ఖమ్మం పోలీసులు ఆ పది మందిలో ఆరుగురిని అరెస్టు చేశారన్నారు. దీన్నిబట్టి చూస్తే తనను అంతమొందించడానికి చంద్రబాబు కులోన్మాదులు పక్కా ప్రణాళికతో దాడికి తెగబడినట్లు స్పష్టమవుతోందన్నారు. తనపై దాడికి, తన వాహనం ప్రమాదానికి మధ్య లింక్ ఉందన్నారు. ఈ కుట్రపై సమగ్ర విచారణ జరిపి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఖమ్మం పోలీసులను కోరామన్నారు. ఎల్లో మీడియా ఆ దాడిని కప్పిపుచ్చేందుకు తనకు నిరసన సెగ తగిలినట్లు వక్రీకరించిందని మండిపడ్డారు.

చంద్రబాబు తప్పులను ఎత్తిచూపితే హత్య చేస్తారా?

చంద్రబాబును తానెన్నడూ అసభ్యంగా విమర్శించలేదని మంత్రి అంబటి గుర్తు చేశారు. ఆయన తప్పులను, అక్రమాలను ఎత్తిచూపినందుకే బాబు కులస్తులు తనను లక్ష్యంగా చేసుకున్నారన్నారు. దాడికి తెగబడుతూ.. 'ఏయ్.. అంబటి రాంబాబు నిన్ను వేసేస్తాం.. అందరం చందాలేసుకుని లేపేస్తాం' అని కేకలేశారని మండిపడ్డారు. కులోన్మాదుల ఉడత ఊపులకు బెదిరే ప్రశ్నే లేదని.. చంద్రబాబు అక్రమాలపై గళం విప్పుతూనే ఉంటానని తేల్చిచెప్పారు. డబ్బుమదంతో కొట్టుకుంటున్న వారికి రోజులు చెల్లాయన్నారు.

బెయిల్ కోసం బాబు అవాస్తవాలు..

జైల్లో తనకు ప్రాణహాని ఉందని ఓవైపు ఉత్తరం రాసిన చంద్రబాబు.. తనకు ఆరోగ్యం బాగోలేదని మరో వైపు చెబుతున్నారని.. ఈ రెండింటిలో ఏది నిజమో ఆయనే చెప్పాలన్నారు. జైల్లో ఆయనను ప్రత్యేక బ్యారెక్‌లో ఉంచారని.. 24 గంటలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో అత్యంత భద్రత ఉంటుందన్నారు. ఇక తనకు ఆరోగ్యపరంగా కొన్ని సమస్యలు ఉన్నట్లు చంద్రబాబే ఏసీబీ కోర్టు జడ్జికి చెప్పుకున్నారని గుర్తు చేశారు. బెయిల్ కోసం పాకులాడే క్రమంలో ఆయన చెబుతున్నవన్నీ అవాస్తవాలేనన్నారు. తన పీఏ శ్రీనివాస్‌ను విదేశాలకు పారిపోయేలా చేసిన చంద్రబాబు.. ఆయన్ను రప్పించి సీఐడీ పోలీసులకు అప్పగిస్తే బెయిల్ వచ్చే అవకాశం ఉందన్నారు.

సూపర్ స్పెషాలిటీ సేవలన్నీ ఒకే చోట..

- అభినందించిన కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి మాండవీయ
- ఏఎంసీ శతాబ్ది ఉత్సవాల్లో వర్చువల్‌గా పాల్గొన్న కేంద్ర మంత్రి



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న మంత్రి రజిని

సాక్షి, విశాఖపట్నం : ఆంధ్ర వైద్య కళాశాలలోని కేజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ సేవలన్నీ ఒకే చోట లభించడం శుభ పరిణామమని కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి మన్సుక్ మాండవీయ ప్రశంసించారు. ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన ఆంధ్రా మెడికల్ కళాశాల శత దినోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర మంత్రి వర్చువల్‌గా హాజరయ్యారు. ఉత్సవాల్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్, కలెక్టర్ డా.మల్లికార్జున, డా.వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ బాబ్జీ, మధ్యప్రదేశ్ ఆయుష్మాన్ భారత్ ముఖ్య కార్యదర్శి రమేశ్‌కుమార్, సెంటినరీ సెలబ్రేషన్స్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ రవిరాజులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేజీహెచ్‌లో రూ.23.75 కోట్లతో ఏర్పాటు చేస్తున్న 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్‌కు కేంద్ర మంత్రి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆంధ్ర వైద్య కళాశాల నుంచి వచ్చే వైద్యులకు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. మంత్రి రజిని మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నదే సీఎం వైఎస్ జగన్ ముఖ్యోద్దేశమన్నారు. ఇందులో భాగంగానే నూతనంగా వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నట్టు వెల్లడించారు. రూ.600 కోట్లతో కేజీహెచ్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలకు రూ.246 కోట్లు వెచ్చిస్తామన్నారు. అనంతరం పీజీ, డిగ్రీలో అధిక మార్కులు సాధించిన వైద్య విద్యార్థులకు మెడల్స్, అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డా.రవీంద్రబాబు, ఏఎంసీ ప్రిన్సిపల్ డా.బుచ్చిరాజు, ఎంపీ డా.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల గూండాగిరిపై కాపుల కన్నెర్ర

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): వంగవీటి రంగాను హత్య చేయడంతోపాటు ముద్రగడ పద్మనాభంను మానసికంగా చంపేశారని.. ఇలా అన్ని రంగాల్లో కాపులను టీడీపీ నేతలు అణగదొక్కుతూనే వచ్చారని అఖిల భారత కాపు అభ్యున్నతి సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా మంత్రి అంబటి రాంబాబుపై ఖమ్మంలో టీడీపీ నేతలు దాడికి ప్రయత్నించారని.. ఇకపై ఇలాంటి దాడులు చెల్లవని పేర్కొంది. గతంలో కూడా అంబటిపై దాడి చేశారని.. పదే పదే కాపులపై దాడులకు తెగబడితే తిరగబడాల్సి వస్తుందని హెచ్చరించింది. మంత్రి అంబటిపై టీడీపీ గూండాల దాడిని ఖండిస్తూ అఖిల భారత కాపు అభ్యున్నతి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కాపులు నిరసన కార్యక్రమం చేపట్టారు. టీడీపీ నేతల గూండా గిరిపై కన్నెర్ర చేశారు. ఆలిండియా కాపు అభ్యున్నతి సంఘం జిల్లా అధ్యక్షుడు, గుంటూరు మిర్చియార్డు డైరెక్టర్ సతీష్ మాట్లాడుతూ టీడీపీకి మొదటి నుంచి కూడా కాపుల పట్ల చిన్నచూపే ఉందని విమర్శించారు. కాపు నేత కాకి శ్రీను మాట్లాడుతూ తమ మౌనాన్ని చేతగానితనంగా భావిస్తే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. మిర్చియార్డు మాజీ వైస్ చైర్మన్ ఎర్రబాబు, కాపు నేతలు కోట రాందాస్, గేదెల రమేష్, యర్రిసాయి, రాతంశెట్టి మన్నార్, నరాలశెట్టి అర్జున్, కారసాని వెంకట్, రవి నాయుడు, డి.జయ, రేజేటి నవీన్ పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న కాపు నేతలు



శశాంక బినేశ్... మంచి వక్త.
సామాజిక కార్యకర్త... ఓ విజేత.
'మీ తరఫున మేము మాట్లాడుతాం' అంటోంది.
'మీ ఆరోగ్యాన్ని మేము పట్టించుకుంటాం' అంటోంది.
'ఉద్యోగినులకు అండగా ఉంటాను' అంటోంది.
'సస్టెయినబుల్ ఫ్యాషన్ కోసం పని చేస్తాను'
... అని ప్రకృతికి భరోసా ఇస్తోంది.

పేదపిల్లల గుండెచప్పుడు

శశాంక బినేశ్ సొంతూరు హైదరాబాద్, చందానగర్. బీఫార్మసీ తర్వాత యూకేకి వెళ్లి 'లండన్ మెట్రోపాలిటన్ యూనివర్సిటీ' నుంచి ఫార్మసీలో పీజీ చేశారామె. ఇండియాకి వచ్చి కొంతకాలం ఉద్యోగం చేసినప్పటికీ అది సంతృప్తినివ్వలేదు. ''సొంతంగా ఏదో ఒకటి చేయాలి, నన్ను నేను నిరూపించుకోవాలనే ఆలోచన చాలా గట్టిగా ఉండేది. ఈ లోపు మరో ఉద్యోగంలో చేరాను. ఆ ఉద్యోగంలో డిజిటల్ మార్కెటింగ్ మీద మంచి పట్టు వచ్చింది. ఇక ఆలస్యం చేయలేదు. ఇంట్లోనే ఒక గదిలో సొంతకంపెనీ 'వి హాంక్' మొదలు పెట్టాను. ఇప్పుడు ప్రతి వ్యాపారమూ బ్రాండింగ్ మీదనే నడుస్తోంది. బ్రాండ్‌కి ప్రమోషన్ కల్పించే పని మేము చేస్తాం. సింపుల్‌గా చెప్పాలంటే... మీ గురించి, మీ వ్యాపారం గురించి మేము హారన్ మోగిస్తామన్నమాట'' అంటూ తన సేవా ప్రయాణాన్ని వివరించే ముందు ఉపాధి కోసం తాను ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారిన విషయాన్ని చెప్పారామె. 'సామాజిక కార్యకర్తగా ఈ పనులు ఇప్పుడు కొత్తగా చేస్తున్నవి కావు, మా ఇల్లే నేర్పించింది'' అన్నారు శశాంక బినేశ్.

తాత... నాన్న... నేను!

నా చిన్నప్పుడు చందానగర్ నగరంలో భాగం కాదు, గ్రామం. మా తాత మందగడ్డ రాములు గ్రామానికి ఉప సర్పంచ్, సర్పంచ్‌గా ఊరికి సర్వీస్ చేశారు. పేదవాళ్లు నివసించే శాంతినగర్ కాలనీ వాళ్లకు ఇళ్లు, కరెంటు వంటి సౌకర్యాలు ఆయన హయాంలోనే వచ్చాయి. మా నాన్న విక్రమ్ కుమార్ ఇప్పటికీ గ్రామికుల ప్రయోజనాల కోసం పని చేస్తూనే ఉన్నారు. నా అడుగులు కూడా అటువైపే పడ్డాయి. యూకేలో చదువుకుంటున్నప్పుడు పార్ట్‌టైమ్ జాబ్... షెఫీల్డ్ నగరంలో ఒక వృద్ధాశ్రమంలో. పెద్దవాళ్లకు ఒళ్లు తుడవడం, దుస్తులు మార్చడం, వీల్‌చెయిర్‌లో తీసుకెళ్లడం వంటి పనులు చేశాను. ఆ ఉద్యోగం... జీవితం పట్ల నా దృక్పథాన్ని మార్చేసింది. ఇండియాలో మా నాన్న తన స్నేహితులతో కలిసి 2007లో నాదర్‌గుల్ దగ్గర ఒక ట్రస్ట్ హోమ్ స్థాపించారు. ఆ హోమ్ కోసం పని చేయడం మొదలుపెట్టాను. ఇక డిజిటల్ మార్కెటింగ్ ఉద్యోగం చేస్తున్న సమయంలో సినీనటి సమంత, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ మంజుల అనగానితో పరిచయమైంది. అప్పటినుంచి 'ప్రత్యూష సపోర్ట్' స్వచ్ఛంద సంస్థతో పని చేస్తున్నాను. పేద పిల్లలకు వైద్యసహాయం అందించడం మీద ప్రధానంగా దృష్టి పెట్టాను. ఇప్పటివరకు 650కి పైగా సర్జరీలు చేయించగలిగాను. స్ఫూర్తి ఫౌండేషన్, డిజైర్ సొసైటీతో కలిసి హెచ్ఐవీ పిల్లలకు 'విష్ ట్రూ కమ్' ప్రోగ్రామ్, అనాథ పిల్లలకు 'వింగ్స్ ఆఫ్ హోప్' ద్వారా విమాన ప్రయాణాలు చేయించడం వంటి పనులతో సేవాకార్యక్రమాల్లో ఉండే సంతృప్తిని ఆస్వాదించాను.

పేదరికం... అనారోగ్యం... రెండూ శాపాలే!

నా సర్వీస్‌ని ముఖ్యంగా ఆర్థిక వెనుకబాటుతనం, అనారోగ్యాల నిర్మూలనల మీదనే కేంద్రీకరించడానికి బలమైన కారణమే ఉంది. పేదరికమే ఒక శాపమైతే, అనారోగ్యం మరొక విషాదం. ఈ రెండూ కలిస్తే ఆ వ్యక్తి వేదన వర్ణనాతీతం. పిల్లలకు వైద్యం చేయించలేక తల్లిదండ్రులు పడే గుండెకోతను చెప్పడానికి ఏ భాషలోనూ మాటలు దొరకవు. సమాజంలో ఇన్ని సమస్యలుంటే ఇవి చాలవన్నట్లు మనుషులు ఒకరినొకరు కులాల పరంగా దూరం చేసుకోవడం మరొక విషాదం. భారతీయ విద్యాభవన్‌లో చదువుకున్నన్ని రోజులూ నాకు కులాల గురించి తెలియదు. ఇంటర్‌కి మా వాళ్లు ర్యాంకుల ప్రకటనలతో హోరెత్తించే కాలేజ్‌లో చేర్చారు. బీసీ వర్గానికి చెందిన నేను అక్కడ వివక్షను చూశాను, ఎదుర్కొన్నాను కూడా. ప్రపంచం గ్లోబల్ విలేజ్‌గా మారిన ఈ తరంలో కూడా ఇలా ఉంటే మా నానమ్మ, ఇంకా ముందు తరాల వాళ్లు ఎంతటి వివక్షకు లోనయ్యారో కదా అనే ఆలోచన మెదలుతుండేది. మా ట్రస్ట్ హోమ్‌లో కులం లేని సమాజాన్ని సృష్టించగలిగాను. నేను లీగల్ గార్డియన్‌గా 'జములమ్మ' అనే అమ్మాయిని దత్తత చేసుకున్నాను. ఆ అమ్మాయి కులమేంటో చూడలేదు. వైద్యసహాయం అందిస్తున్న వారి కులాలూ చూడం. నేను రక్తదాతల సంఘం సభ్యురాలిని కూడా. రక్తం అవసరమైన పేషెంట్‌లు రక్తదాత కులాన్ని చూడరు.

సమంత చూపిన బాట!

మేము పేషెంట్‌కి వైద్యసహాయం కోసం ఎంపిక చేసుకునేటప్పుడు త్రీ పార్టీ ఫండింగ్ విధానాన్ని అవలంబిస్తుంటాం. మూడింట ఒకవంతు మేము సహాయం అందిస్తాం, ఒక వంతు పేషెంట్ కుటుంబీకులు, ఒక వంతు హాస్పిటల్ వైపు నుంచి బిల్లులో తగ్గింపు ఉండేటట్లు చూస్తాం. సర్వీస్ విషయంలో సమంత ప్రభావం నా మీద ఎంతగా ఉందంటే... ఆమె చేనేతల ప్రమోషన్ కోసం పని చేస్తున్న సమయంలో నా వంతుగా ప్రకృతికి ఉపకరించే పని చేయాలని స్టూడియో బజిల్ హ్యాండ్‌లూమ్ క్లోతింగ్ బిజినెస్ పెట్టాను. ఇన్నేళ్ల నా సర్వీస్‌లో లెక్కకు మించిన పురస్కారాలందుకున్నాను. కానీ వాల్మీకి ఫౌండేషన్ నుంచి ఈ ఏడాది అందుకున్న 'సేవాగురు' గుర్తింపు ఎక్కువ సంతోషాన్నిచ్చింది. మావారు బినేశ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలేసి 'వి హాంక్' కోసమే పూర్తి సమయం పని చేయడం కూడా నాకు అందివచ్చిన అవకాశం అనే చెప్పాలి. నన్ను నేను మలచుకోవడంలో బినేశ్ నాకు పెద్ద సపోర్ట్'' అన్నారు శశాంక బినేశ్.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : మోర్ల అనిల్ కుమార్

'పోష్' చైతన్యం

మహిళలు పని చేసే ప్రదేశాల్లో తప్పనిసరిగా సెక్సువల్ హెరాస్‌మెంట్ రిడ్రెసల్ కమిటీ ఉండాలి. ధనలక్ష్మీ బ్యాంకు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీ సభ్యురాలిని. చాలా మంది మహిళలకు తమ పని ప్రదేశంలో అలాంటి కమిటీ ఉందనే సమాచారమే ఉండడం లేదు. ఇందుకోసం అవగాహన సదస్సుల ద్వారా మహిళలను చైతన్యవంతం చేయడం నాకు చాలా సంతృప్తినిస్తోంది.



గుండె ఆపరేషన్ చేయించిన పాపాయితో...

సమస్య ఎదురైతే గళం విప్పాలనే తెగువ లేకపోవడం కంటే గళం విప్పవచ్చనే చైతన్యం కూడా లేకపోవడం శోచనీయం. నేను ధైర్యంగా ఇవన్నీ చేయడానికి మా నాన్న పెంపకమే కారణం. 'ఆడవాళ్లు మానసికంగా శక్తిమంతులు. ఎన్ని అవాంతరాలెదురైనా అనుకున్న పనిని మధ్యలో వదలరు' అని చెప్పేవారాయన. 'మహిళ ఒకరి మీద ఆధారపడి, ఒకరి సహాయాన్ని అర్థించే స్థితిలో ఉండకూడదు. తన కాళ్లమీద తాను నిలబడి, మరొక మహిళకు సహాయం చేయగలిగిన స్థితిలో ఉండాలి. సమాజం గురించి భయపడి వెనుకడుగు వేయవద్దు. జీవితం పట్ల నీ నిర్ణయం ప్రకారం ముందుకే వెళ్లాలి. నువ్వు విజయవంతమైతే సమాజమే నిన్ను అనుసరిస్తుంది' అని చెప్పేవారు. నేను సాటి మహిళలకు చెప్పే మంచి మాట కూడా అదే.

– శశాంక బినేశ్, సోషల్ యాక్టివిస్ట్



శ్రావ్య నివాళి



లతా ఆరాధన

వారంతా స్త్రీలే. 26 దేశాల మహిళలు కలిసి దుబయ్‌లో 'ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రా'గా ఏర్పడ్డారు. తమ ప్రద్రర్శనలతో అభిమానులను సంపాదించుకున్నారు. తాజాగా లతా మంగేష్కర్‌కు నివాళిగా ఆమె పాడిన ఐదు పాటలను 'కుహు కుహు' పేరుతో ఆల్బమ్‌గా విడుదల చేశారు. ఏ.ఆర్. రెహమాన్ కుమార్తె ఖతిజా రెహమాన్ ఈ ఐదు పాటలు పాడింది. 'లతా ఒక శక్తి. మేమందరం ఈ ఆల్బమ్ ద్వారా స్త్రీ శక్తిని చాటాం' అని తెలిపింది ఖతిజా. శ్రోతలకు ఇదో శ్రావ్యమైన కానుక.

'ఆర్కెస్ట్రా అనగానే రికార్డింగ్ స్టుడియోలో, స్టేజ్ మీద మగవారు నిండిపోయి ఉంటారు. కండక్టర్‌గా ఎప్పుడూ సూట్ వేసుకున్న మగవాడే కనిపిస్తాడు. ఈ స్టీరియోటైప్ మారాలి. ప్రపంచంలో ఉత్తమమైన మ్యుజీషియన్స్‌గా స్త్రీలు ఉన్నారు. వారంతా తమ ప్రతిభను చూపాలి. మేమంతా అందుకే ఒక వేదిక మీదకు వచ్చి పెర్‌ఫామ్ చేస్తున్నాం' అంటారు దుబయ్‌లోని 'ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రా' సభ్యులు.

26 దేశాల నుంచి 51 మంది మహిళా సంగీతకారులు ఇక్కడ తమ సంగీతాన్ని వినిపిస్తున్నారు. ప్రోగ్రామ్‌లు ఇస్తున్నారు. వీరికి ఇక్కడ రికార్డింగ్ స్టుడియో ఉంది. ఇందులో సినిమాలకూ పని చేస్తున్నారు. ఎమిరేట్స్ మహిళా మంత్రి రీమ్ అల్ హష్మి ఏ.ఆర్.రెహమాన్‌ను మహిళలను ప్రోత్సహించే ఆర్కెస్ట్రాను దుబాయ్‌లో ఏర్పాటు చేయమని కోరారు. రెహమాన్ 'ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రా'ను ఏర్పాటు చేయడంలో సాయపడి పర్యవేక్షిస్తున్నారు. వారితో రికార్డింగ్స్ కూడా చేస్తున్నారు. 'పొన్నియన్ సెల్వమ్ 2' రీ రికార్డింగ్ ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రాలోని మహిళలే చేశారు.

అరెబిక్ సౌందర్యం

ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రాలో వివిధ దేశాల మహిళా సంగీతకారులు పని చేస్తున్నా ఈ ఆర్కెస్ట్రా ముఖ్య ఉద్దేశం అరబిక్ సంగీతాన్ని



పాశ్చాత్య సంగీతంతో మిళితం చేసి కొత్త అందాన్ని తీసుకురావడమే. ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రాలో తమతమ దేశాలకు చెందిన నేటివ్ ఇన్‌స్ట్రుమెంట్స్‌తో పాటు అరేబియాలో ఉపయోగించే సంగీత పరికరాలు కూడా వాడి గొప్ప మిళిత సంగీతాన్ని సృష్టిస్తున్నారు. 'మేమంతా వేరు వేరు జీవితాలు, వేరు వేరు సంగీత ధోరణుల నుంచి వచ్చాం. కాని రికార్డింగ్ థియేటర్‌లో అడుగుపెట్టి ఒక్కటిగా మారి సమష్టిగా సంగీతాన్ని సృష్టిస్తాం. ఈ అనుభూతి అద్భుతంగా ఉంటుంది' అంటారు ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రా సభ్యులు. వీరికి కండెక్టర్‌గా మోనికా ఉమ్‌మెన్ అనే మహిళ పని చేస్తోంది.

లతాకు నివాళి

తండ్రి పర్యవేక్షణలో సాగుతున్న ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రాతో కలిసి పని చేయడానికి ముందుకొచ్చింది ఖతిజా రెహమాన్. 'నేను వారితో పని చేసినప్పుడు వారు చూపిన ప్రేమ చాలా నచ్చింది' అంటుందామె. గాయని అయిన ఖతిజా ఇటీవల తమిళ సినిమాలకు సంగీతం కూడా అందిస్తోంది. లతా మంగేష్కర్‌కు నివాళిగా ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రాతో కలిసి 'కుహు కుహు' ఆల్బమ్ తయారు చేసింది. 'మేమందరం లతా పాటలను పునః సృష్టించాలనుకున్నాం' అంది ఖతీజా.

లతా పాడిన ఐదు పాటలను ఎంపిక చేసుకుని ఖతీజా ఈ ఆల్బమ్‌లో పాడింది. అవి

1. పియా తోసే నైనా లాగేరే (గైడ్),
2. ఆప్ కీ నజరోనే సంఝా (అన్‌పడ్),
3. ఓ సజ్‌నా బర్‌ఖా బహార్ ఆయీ (పరఖ్),
4. కుహు కుహు బోలే కోయలియా (సువర్ణ సుందరి),
5. బేకస్ పె కరమ్ కీజియే (మొఘల్ ఏ ఆజమ్).

ఈ ఐదు పాటలకు ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రాలోని మహిళలు సంగీతం అందించారు. బాణీలు యథాతథంగా ఉన్నా ఆర్కెస్ట్రయిజేషన్‌లో తమ సృజనను ప్రదర్శించారు. సాధారణంగా పాత పాటలు కొత్త తరహాగా పాడితే నచ్చవు. కాని ఖతీజా గళం, ఫిర్‌దౌస్ సంగీతం శ్రోతలకు శ్రావ్యమైన అనుభూతిని ఇచ్చాయి. గొప్ప గాయని లతా మంగేష్కర్‌కు ఇది ఒక మంచి నివాళిగా నిలిచిపోతుంది.

స్ఫూర్తి

అమ్మ చూపిన దారిలో అపూర్వ విజయాలతో...

అమ్మ నుంచి చందమామ కథలే కాదు స్ఫూర్తిదాయక విజయాలు ఎన్నో విన్నది ప్రియా నాయర్.

మేనేజ్‌మెంట్ ట్రైనీగా దిగ్గజ కంపెనీలోకి అడుగు పెట్టిన ప్రియా నాయర్ తన కృషితో ఉన్నతస్థాయికి ఎదిగింది,

కార్పొరేట్ ప్రపంచంలో విశేషమైన పేరు తెచ్చుకుంది.

తాజాగా...

బ్రిటిష్ మల్టీనేషనల్ కంపెనీ యూనిలీవర్‌లోని టాప్ టీమ్ యూనిలీవర్ లీడర్‌షిప్ ఎగ్జిక్యూటివ్ (యుఎల్ఈ)లో ఒకరిగా, ప్రెసిడెంట్ ఆఫ్ 'బ్యూటీ అండ్ వెల్‌బీయింగ్'గా ప్రియా నాయర్ నియామకం జరిగింది.



ప్రియా నాయర్

'మీ రోల్ మోడల్ ఎవరు?' అంటే మరో మాటకు తావు లేకుండా ప్రియా నాయర్ టక్కున చెప్పే మాట...'మా అమ్మ'

డెబ్బై ఏడేళ్ల వయసులోనూ ముంబైలో వైద్యవృత్తిలో బిజీ బిజీగా ఉండేది. అట్టడుగు వర్గాల ప్రజలకు ఉచితవైద్యం అందించేది. ఇక కోవిడ్ సమయంలో ఆమె చేసిన వైద్యసేవలు అపారం. దురదృష్టవశాత్తు ఆమె కోవిడ్ బారిన పడింది. అదృష్టవశాత్తు అందులో నుంచి బయటపడింది. 'పవర్ ఆఫ్ పర్పస్' అంటే ఏమిటో తల్లి నుంచే నేర్చుకుంది ప్రియ.

'మన ఉద్దేశం స్వచ్ఛమైనది అయితే అస్థిరత, అనిశ్చితిని అధిగమించే శక్తి దరి చేరుతుందని, ఆశావాదం మనతోనే ఉంటుందని అమ్మ నుంచి నేర్చుకున్నాను. కార్పొరేట్ జీవితంలో ఇది నాకు ఎంతగానో ఉపయోగపడింది' అంటుంది ప్రియ.

తల్లి నుంచి ఆమె నేర్చుకున్న మరో పాఠం... నిరంతరం నేర్చుకోవడం. ప్రియ తల్లి ఎప్పుడూ ఏదో ఒక సెమినార్‌కు హాజరవుతూ ఉండేది. పుస్తకాలు చదువుతూ ఉండేది. వైద్యరంగంలో వస్తున్న సాంకేతికత గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ నోట్స్ రాసుకుంటూ ఉండేది.

'క్షణం తీరిక లేని ఈ ఉరుకుల, పరుగుల కాలంలో నిరంతరం నేర్చుకోవడం అనేది కుదిరేది కాదు అనే అభిప్రాయాన్ని అమ్మ మార్చేసింది. వృత్తిరీత్యా ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఎప్పుడూ ఏదో కొత్త విషయం నేర్చుకుంటూ ఉండేది' అంటుంది ప్రియ.

తల్లి నుంచి స్ఫూర్తి పొందిన ప్రియా నాయర్ హార్వర్డ్ ఎగ్జిక్యూటివ్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌కు హాజరైంది. తనకు తిరిగి స్కూల్‌కు వెళ్లినట్లుగా అనిపించింది. 'కార్పొరేట్ రంగంలో పాతిక సంవత్సరాల అనుభవం ఉన్న నాకు ఇది అవసరం లేదు' అని అనుకోలేదు ప్రియా నాయర్. అక్కడ నేర్చుకున్న పాఠాలు ఆ తరువాత కాలంలో తనకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేసినప్పుడు వినియోగదారుల ఆలోచనలపై దృష్టి పెట్టి మార్కెటింగ్ వ్యూహాలను ఎప్పటికప్పుడూ మారుస్తూ వచ్చింది. ఫలానా ప్రాడక్ట్‌కు మార్కెట్ లేదు... అనుకున్న చోట కూడా తన వ్యూహాలతో మార్కెట్‌ను సృష్టించేది. ప్రచారంలో కూడా ప్రత్యేకత కనిపించడానికి ప్రాధాన్యత ఇస్తుంది. అందులో సామాజిక సందేశం కూడా కనిపిస్తుంది. మనకు ఓటమి అంటే భయం, చిరాకు, కోపం. పిల్లల ఓటమిని తల్లిదండ్రులు తట్టుకోలేరు. పిల్లలకు విజయం అనేది అతి పెద్ద సవాలు.

'నువ్వు ఓడిపోతే ప్రళయం ఏమీ రాదు. గెలుపులాగే ఓటమి అనేది సహజమైనది. ఓటమి నుంచి నేర్చుకునే పాఠాలు విలువైనవి' అనే భావనతో సంస్థ తరపున క్యాంపెయిన్‌ను నిర్వహించింది ప్రియ.

కోవిడ్ సమయంలో హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యుఎల్)లో పెద్ద విభాగమైన 'బ్యూటీ అండ్ పర్సనల్ కేర్' బాధ్యతల్లోకి వచ్చింది ప్రియ. కేవలం 30 రోజుల్లోనే తమ హైజీన్ బ్రాండ్‌లో కొత్తగా పదిహేను వేరియేషన్స్ తీసుకువచ్చింది. అందులో ఒకటైన హ్యాండ్ శానిటైజర్ మన దేశంలోని 'లార్జెస్ట్ సెల్లింగ్ హ్యాండ్ శానిటైజర్ బ్రాండ్'గా నిలిచింది. మేనేజ్‌మెంట్ ట్రైనీగా 'హెచ్‌యుఎల్'లోకి అడుగుపెట్టిన ప్రియా నాయర్ అడుగడుగునా పాఠాలు నేర్చుకుంది. ఎన్నో హోదాల్లో పనిచేసింది. ప్రతి హోదాలో తనదైన ప్రత్యేకత నిలుపుకుంది.

'ఏ పని అయినా సరే యాంత్రికంగా ఎప్పుడూ చేయవద్దు. మనసు పెట్టి చేయాలి' అని తన చిన్నప్పుడు ఎప్పుడో ప్రియకు అమ్మ చెప్పింది.


అందుకే ప్రియా నాయర్ ఏ హోదాలో పని చేసినా మనసు పెట్టి చేసింది. చేసే పనికి ఎప్పటికప్పుడు సృజనాత్మకమైన ఆలోచనలు జోడించింది. ఫలితం వృథా పోలేదని ఆమె విజయప్రస్థానం నిరూపించింది.

పచ్చదనం.. పచ్చధనం

పచ్చదనంతో కళకళలాడే పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు అంటారు. చాలామంది చిన్నతనమంతా పల్లెల్లోనే గడుస్తుంది. ఇప్పటి పిల్లలకు ఆ అవకాశం లేదు. పల్లెటూళ్లంటే పండగలు, పబ్బాలు, సెలవలు గడపడానికి వెళ్లే పర్యాటక స్థలాలుగా భావిస్తున్నారు. అరవైపదుల వయసు వారు మాత్రం పల్లెల మట్టివాసనలు, పచ్చదనం పరిమళాలను ఇప్పటికీ కోరుకుంటూనే ఉన్నారు. ఈ కోవకు చెందిన నీలిమా దింగ్రా... తన చిన్ననాటి పచ్చదనాన్ని ఆస్వాదించేందుకు ఏకంగా డబుల్ డెక్కర్ గార్డెన్‌నే పెంచేస్తోంది. తన లాగా పచ్చదనాన్ని ఆస్వాదించాలనుకునేవారికీ సలహాలు సూచనలు ఇస్తూ వారితో మొక్కలు నాటిస్తోంది. అరవై ఏళ్ల వయసులో ఇవన్నీ చేస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది నీలిమా దింగ్రా.

ఢిల్లీకి చెందిన నీలిమా దింగ్రా స్టాండర్డ్ సెక్యూరిటీస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఇంటర్ లిమిటెడ్‌కు మేనేజింగ్ డైరెక్టర్. దీని విలువ కోట్లలోనే ఉంటుంది. వ్యాపార భాగస్వామితో కలిసి, రూ.75 లక్షల పెట్టుబడితో నీలిమ దీనిని ప్రారంభించింది. కొద్దిసంవత్సరాల్లోనే కంపెనీని లాభాల బాట పట్టించింది. ఢిల్లీలో ప్రధాన కార్యాలయంతోపాటు, ముంబైలో మరో రెండు కార్యాలయాలు నిర్వహిస్తూ సక్సెస్‌ఫుల్ ఎంట్రప్రెన్యూర్‌గా రాణిస్తోంది. ఇంతపెద్ద వ్యాపారం చూసుకునేవారికి ఏమాత్రం తీరిక దొరికినా.. వయసు రీత్యా కాస్త విశ్రాంతి తీసుకుంటారు. కానీ నీలిమ మాత్రం ఇంట్లో డబుల్ డెక్కర్ గార్డెన్‌ను పెంచుతూ అబ్బురపరుస్తోంది.





చిన్నప్పటిలా ఉండాలని...

నీలిమ చిన్నప్పుడు హర్యాణాలోని రోహ్తక్‌లో పెరిగింది. అక్కడ ఎటుచూసిన పచ్చదనమే కనిపించేది. స్కూలు నుంచి రాగానే జామ చెట్టు కింద కూర్చుని అన్నం, స్నాక్స్ వంటివి తినేది. ఆకుపచ్చని పరిసరాల్లో పెరగడం వల్ల మొక్కల పైన ఎనలేని మక్కువ ఏర్పడింది. పెద్దయ్యి చదువులు, పెళ్లితో పెద్దపట్టణంలో స్థిరపడింది. అభివృద్ధి పేరుతో ఎక్కడ చూసిన కాంక్రీట్ నిర్మాణాలే కనిపిస్తున్నాయి. అక్కడక్కడ షో కోసం పెంచుతున్న ఒకటి రెండు మొక్కలు మాత్రమే కనిపిస్తున్నాయి. అందరికీ ప్రాణవాయువు ఇచ్చేంత పచ్చదనం మచ్చుకైనా కనిపించడంలేదు. పచ్చదనాన్ని ఇష్టపడే నీలిమ ఏ మాత్రం సమయం దొరికినా దగ్గర్లోని పార్క్‌కు వెళ్లేది. చల్లని సాయంత్రాల్లో పార్క్‌లో నడుస్తుంటే ఎంతో ఆహ్లాదంగా ఉండేది తనకు. అయితే కొద్దిరోజులకు మోకాళ్ల నొప్పులు మొదలయ్యాయి. దీంతో 2015 నుంచి పార్క్‌కు వెళ్లడం మానేసింది. పార్క్‌లో నడిచే సమయాన్నీ ఇంట్లో మొక్కలు నాటడానికి కేటాయించింది. ఇంట్లో ఒక మూలన కొద్దిపాటి స్థలంలో విత్తనాలు వేసింది. అవి చక్కగా మొలకెత్తడంతో ఆమె గార్డెన్‌ను విస్తరించడం మొదలు పెట్టింది. ఇలా విస్తరిస్తూ రెండు అంతస్తుల్లో పచ్చటి గార్డెన్‌ను అభివృద్ధిచేసింది. ఈ డబుల్ డెక్కర్ టెర్రస్ గార్డెన్‌ను పూర్తిగా సేంద్రియ పద్ధతిలో నిర్వహించడం విశేషం. ప్రారంభంలో కొన్ని సమస్యలు ఎదురైనప్పటికీ సమయం కేటాయిస్తూ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ అందమైన టెర్రస్ గార్డెన్‌ను నిర్వహిస్తోంది.

పెంచుతూ పంచుతోంది..

తన డబుల్ డెక్కర్ గార్డెన్ పచ్చదనంతో కళకళలాడుతుండడం నీలిమకు ఎంతో సంతోషాన్నిచ్చింది. ఈ సంతోషంతో మొక్కలను ఇతరులకు ఉచితంగా అందించేది. తన గార్డెన్‌లో పెరిగిన మొక్కల పిలకలు, అంటుకట్టడం ద్వారా వచ్చిన కొత్త మొక్కలను తెలిసినవారికి, గుళ్లకు ఇస్తోంది. ఇలా ఇప్పటి దాకా వెయ్యికి పైగా మొక్కలను పంచింది. నీలిమ గార్డెన్ చూసిన వారంతా మొక్కలు చక్కగా పెరగాలంటే ఏంచేయాలంటూ అని అడిగి మరీ నీలిమ దగ్గర సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు.

ఆసక్తితో శాంతి...

ఇతరులు చిట్కాలు, సూచనలు తీసుకోవడం గమనించిన నీలిమ గార్డెనింగ్ జ్ఞానాన్నీ మరింత మందికి పంచాలన్న ఉద్దేశంతో 'శాంతి క్రియేషన్స్' పేరిట యూ ట్యూబ్ ఛానల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ తెరిచి గార్డెనింగ్ చిట్కాలు చెబుతోంది. నెటిజన్లు అడిగే సందేహాలను నివృత్తి చేస్తోంది. ఎక్కువ స్థలం లేనివారు వర్టికల్ గార్డెన్‌ను ఎలా ఏర్పాటు చేసుకోవాలి, చీడపీడల నుంచి మొక్కలను ఎలా కాపాడుకోవాలి. తక్కువ ఖర్చులో అందమైన గార్డెన్‌ను ఎలా పెంచుకోవాలి, వంటి సందేహాలకు చక్కని సలహాలు ఇస్తోంది. ఆరుపదుల వయసులో పచ్చదనంతో బిజీగా ఉంటూ నేటియువతరానికి ఆదర్శంగా నిలుస్తోంది.



టీవ్రంగా మరిగించొద్దు

పొద్దున లేవగానే ఓ కప్పు గరం చాయ్ గొంతు దిగందే పనిలో దిగరు చాలామంది. అది గ్రీన్ టీ అయినా లెమన్ టీ అయినా సరే ఏదో ఒక టీ గొంతులో పడాల్సిందే. పనిలో అలసిపోయినా, కాస్త సేదదీరాలన్న ''టీ తాగొద్దాం పద'' అంటారు స్నేహితులు. ఇలా టీ అనేది దినచర్యలో భాగమైపోయింది.

టీని ఫ్రెష్‌గా కాచి తాగితేనే మంచిది. పైగా ఫ్రెష్ టీ ఫ్లేవరు, రుచే వేరు. చాలామంది ఒకేసారి టీ పెట్టేసుకుని ఫ్లాస్కులో పోసుకుని ఆరారగా తాగుతుంటారు. ఇంకొంతమంది టీ కాచి దాన్ని అలాగే ఉంచి వేడి చేసుకుని తాగుతుంటారు. కానీ అలా టీని మళ్లీ మళ్లీ వేడి చేసుకుని తాగటం మంచిది కాదట.. నాలుగు గంటల కంటే ఎక్కువసేపు ఉంచిన తర్వాత టీని మళ్లీ వేడి చేయడం ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని చెబుతున్నారు నిపుణులు.

కాచి అలా ఉంచేసిన టీలో ఫంగస్ ఏర్పడుతుంది. బ్యాక్టీరియా కూడా డెవలప్ అవుతుంది. దీంతో రుచి కూడా మారిపోతుంది. కానీ టేస్ట్ మారింది ఏంటో అనుకుంటాం గానీ కారణం మాత్రం ఇదే. కాబట్టి టీని వేడి చేసి తాగటం మంచిది కాదు.

అదే హెర్బల్ టీని అయితే మరోసారి వేడి చేసి తాగకూడదు. అలా వేడి చేడడం వల్ల దాంట్లో ఉండే పోషకాలు, ఖనిజాలు నశించిపోతాయి. అది తాగినా తాగకపోయినా ఒక్కటే. గ్రీన్ టీ అయితే వేడి చేసి తాగటం ఏమాత్రం మంచిది కాదు.

టీని ఎక్కువసేపు నిల్వ ఉంచితే టానిన్ అధికంగా విడుదల అవుతుంది. ఇది టీని చేదుగా మార్చేస్తుంది.

దీంతో అలా వేడి చేసిన టీ తాగితే కడుపు నొప్పి వచ్చే అవకాశాలున్నాయి. అంతే కాదు అతిసారానికి దారి తీయవచ్చు. కడుపు ఉబ్బరం, వికారం వంటి జీర్ణ సమస్యలు వస్తాయి. అంతేకాదు ఇలా టీని మళ్లీ మళ్లీ వేడి చేసి తాగితే మనకు తెలియకుండానే అనారోగ్య సమస్యలు వస్తాయి.

కాబట్టి టీ తాగాలనుకుంటే ఎప్పటికప్పుడు తయారు చేసుకుని తాగితే మంచిది. రుచికి రుచి ఉంటుంది. ఆరోగ్యానికి ఆరోగ్యమూ బాగుంటుంది.

ఆరోగ్యం కోసమో ఉల్లాసం కోసమో టీ తాగాలనుకున్నప్పుడు మరిగి పోయి ఉన్న టీ తాగడం వల్ల ఉత్సాహం మాటెలా ఉన్నా, ఉన్న ఆరోగ్యం దెబ్బ తినడం ఖాయం. అటువంటి చెడు ఫలితాలు పడకుండా ఉండాలంటే ఫ్రెష్ టీ తాగడం మేలు.

మీ బుజ్జాయికి జలుబా? ఇలా తగ్గించుకోండి

అప్పటివరకూ ఎక్కడ ఉంటుందో తెలియదు కాని సీజన్ మారగానే ఒక్కసారిగా వచ్చి పట్టేస్తుంది జలుబు. పెద్దవాళ్లయితే ఏదో విధంగా తట్టుకుంటారు కాని పిల్లలు నీరసించిపోతారు. ఒకరి నుంచి ఒకరికి వెంటనే వ్యాపించే ఈ జలుబు, దగ్గు, గొంతు ఇన్ఫెక్షన్ నివారణకు చిట్కాలు.



- జలుబు, జ్వరం లక్షణాలు కనిపించగానే ఎక్కువ హానికరం కాని పారాసిటమాల్ టాబ్లెట్‌లు వాడవచ్చు. జలుబు పూర్తిగా దారికి వచ్చే వరకు రోజుకు మూడుసార్లు వేడి నీళ్లలో ఉప్పు వేసుకొని పుక్కిటపట్టించాలి..
- రోజులో కనీసం మూడుసార్లయినా పసుపు లేదా, అదుబాటులో ఉండే జండూ బామ్ వేసుకుని ఆవిరి పడితే జలుబు త్వరగా తగ్గడంతో పాటు ఉపశమనం కలుగుతుంది.
- ఈ సీజన్‌లో నీళ్ల నుంచి అనేక జబ్బులు వ్యాపిస్తాయి. కాబట్టి పిల్లలు, పెద్దల దాకా అందరూ కాచి, చల్లార్చి వడపోసిన నీళ్లు మాత్రమే తాగితే మంచిది.
- జలుబు లక్షణాలను త్వరగా తగ్గించే వాటిలో ముఖ్యమైనది నిమ్మపండు.. గోరువెచ్చటి నీళ్లలో నిమ్మరసం, కాస్త తేనె కలుపుకొని రోజుకు రెండుసార్లు తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జలుబు నుంచి త్వరగా ఉపశమనం పొందుతారు.
- మిరియాలు, వెల్లుల్లి, అల్లం వంటివి ముక్కు దిబ్బడను తగ్గించడంతో పాటు, జలుబు చేసిన సమయంలో రిలీఫ్‌గా ఉండేందుకు తోడ్పడతాయి.
- జలుబు తీవ్రంగా ఉన్నప్పుడు ఆవనూనెకు వెల్లుల్లి కలిపి చిన్నారి ఛాతీపైనా, మెడ, వీపు భాగాల్లోనూ మసాజ్ చేయాలి.
- పిల్లలు జలుబుతో బాధపడుతున్నప్పుడు వారికి ఆరారగా మంచినీరు తాగిస్తుండటం వల్ల కోల్పోయిన నీటి శాతం భర్తీ అయి శరీరానికి వ్యాధితో సమర్థంగా పోరాడగల శక్తి వస్తుంది.



ఇంటిని చక్కదిద్దుకోవడం మొదలుకొని పిల్లలకు చక్కని భవిష్యత్ నిర్మాణం వరకు ఇంటి ఇల్లాలు పడే తపన అంతా ఇంతా కాదు. ఈ క్రమంలో ఎంతో ఒత్తిడికి గురై, మానసికంగా, శారీరకంగా బలహీనంగా మారుతుంటారు మహిళలు. ఇల్లాలి బాధ్యతలను చక్కగా నెరవేరుస్తూనే కొన్ని అలవాట్లను దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే శరీరం ఆరోగ్యంగా... మనసుకు ఉల్లాసంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

అభిరుచులతో ఉత్సాహంగా ఉల్లాసంగా



దైనందిన జీవితంలో ఎదురయ్యే అనేక ఆందోళనలను దూరం చేసి మనసుకు సాంత్వన నిచ్చేది మన అభిరుచులే. రోజులో కొంతసమయాన్ని ఎంతో ఇష్టమైన పనిమీద కేంద్రీకరించడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. భావోద్వేగాలు, ఒత్తిళ్లు, నిరాశలు తగ్గుముఖం పడతాయి.

యోగా...



ప్రపంచంలోనే పాపులర్ వ్యాయామం యోగా. మహిళలు అలవర్చుకోవాల్సిన అభిరుచిలో ఇది ప్రధానమైనది. యోగా చేయడం వల్ల ఫిట్‌గా, బలంగా తయారవడంతోపాటు ఒత్తిడి తగ్గి, సంతోషంగా ఉంటారు. శరీరంతో పాటు మానసిక పరిస్థితి మెరుగుపడి ప్రతికూల పరిస్థితులను తట్టుకుని నిలబడేందుకు అనువుగా మనసు మారుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది.



సిరామిక్స్ తయారీ...

ఒత్తిడిని తగ్గించడంలో సిరామిక్స్ తయారీ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. రకరకాల పాత్రల తయారీ నేర్చుకోవడంపై దృష్టి పెట్టడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. స్వయంగా అందమైన పాత్రలు రూపొందించి బహుమతిగా ఇవ్వడానికి లేదా ఇంట్లో వాడుకోవచ్చు. క్రోకరీ తయారీ సమయంలో దృష్టిమొత్తం పాత్రపై ఉండడం వల్ల మెడిటేషన్ చేసినట్లవుతుంది.





ఫొటోగ్రఫీ...

మంచి అలవాట్లలో ఫొటోగ్రఫీ కూడ ఒకటి. మనం ఎక్కడున్నా, ఏం చేస్తున్నా ఫోటోలు తీయవచ్చు. ఇప్పుడు ఖరీదైన కెమేరాలు కూడా అవసరం లేదు. ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్లు ఉంటున్నాయి. మీ అభిరుచికి తగ్గట్టుగా క్లిక్‌మనిపించాలి. తీసిన ఫోటోలను క్రియేటివ్‌గా తయారు చేసి వివిధ రకాల ప్లాట్‌ఫామ్‌లపై పెట్టుకుంటే ఆ జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచి ఉంటాయి. ఈ ఫోటోగ్రఫీ వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గి మనసు ఉత్సాహంతో నిండుతుంది.

స్విమ్మింగ్

ఈత కొట్టడం వల్ల చాలారకాల ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి. ఎండార్ఫిన్స్ విడుదలవుతాయి.

రోగనిరోధక శక్తి పెరుగుతుంది. స్విమ్మింగ్ కోసం బయటకు వెళ్లడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యాలతో పాటు కొత్త పరిచయాలతో ఉత్సాహం కలుగుతుంది.

డ్యాన్సింగ్..

నాలుగు స్టెప్పులు వేసారంటే హుషారు దానంతట అదే పరిగెత్తుకుంటూ వస్తుంది. మ్యూజిక్‌కు తగ్గట్టుగా శరీరాన్ని కదిలిస్తే ఆనందం రెట్టింపు అవుతుంది. డ్యాన్స్‌తో అధిక బరువు తగ్గి, కండరాలు బలంగా మారతాయి. మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది.

ఆభరణాల తయారీ

జ్యూవెలరీ తయారీ అలవాటు చాలా మంచిది. దృష్టిమొత్తం డిజైన్ మీద ఉంటుంది. మనలోని సృజనాత్మకతను వెలికి తీసి సరికొత్త అభరణాలు తయారు చేసి ఎవరికైనా గిఫ్ట్‌గా ఇవ్వొచ్చు. దీనిలో మంచి నైపుణ్యం సాధిస్తే ఆదాయం కూడా వస్తుంది. ఆన్‌లైన్ లో కూడా నేర్చుకోవచ్చు.

కుట్లు... అల్లికలు

ప్రస్తుత కాలంలో మహిళలు ధరించే డ్రెస్సులు దాదాపు అన్నీ ఎంబ్రాయిడరీతోనే ఉంటున్నాయి. వీటి రేటు కూడా ఎక్కువే. స్వయంగా మీ డ్రెస్ మీద మీరే ఎంబ్రాయిడరీ చేస్తే ఖర్చు ఉండదు. స్వయంగా డిజైన్ చేశామన్న సంతృప్తి కలుగుతుంది. సులభంగా వేయగలిగే ప్యాట్రన్ లేదా ఫ్లోరల్ డిజైన్‌తో మొదలు పెట్టి మెల్లగా ఎంబ్రాయిడరీలోని మెలకువలు నేర్చుకోవాలి. ఇందుకు ఏకాగ్రతతోపాటు ఓపిక కూడా కావాలి. మీరు ఎంబ్రాయిడరీ చేసిన డిజైన్ లేదా అల్లిన వస్తువు ఇతరులకు నచ్చినప్పుడు మీలో ఆత్మవిశ్వాసం పెరిగి సంతోషంతోపాటు, ఆదాయమూ వస్తుంది.

కుకింగ్, బేకింగ్... సరికొత్త కలెక్షన్..

దాదాపు మహిళలంతా వంటచేస్తుంటారు. అయితే రోజూ చేసే వంట కాకుండా... కొంచం కొత్తగా చేసి ఇంట్లోవాళ్లకు రుచులను వడ్డించండి. తిన్నవారు 'ఎంత బావుందో' అని చెప్పేమాట మీ కడుపుని నింపేస్తుంది. ఇంట్లో చేసినవి ఏవైనా ఆరోగ్యమే! అందుకే రకరకాల వంటకాలను తయారు చేయడానికి ప్రయత్నించాలి.

గార్డెనింగ్... బొకేల తయారీ

గార్డెనింగ్‌ను అలవాటు చేసుకుంటే.. ఒత్తిడి మీ దరిదాపుల్లోకి రాదు. సేంద్రియ కూరగాయలు, పండ్లు పండించడంతో పాటు, సువాసనలు వెదజల్లే పూలపరిమళాలు ఇంటి ఆవరణలో మీతోపాటు మీ కుటుంబానికీ ఉల్లాసాన్ని కలిగిస్తాయి. ఇక పూలను బొకేలుగా మార్చితే మీ నైపుణ్యాలు మెరుగుపడినట్టే. పూలను ఒకదానికి ఒకటి జత చేసే క్రమంలో మనలోని సృజనాత్మకత వెలికి వస్తుంది. మనసు ఆహ్లాదంగా మారుతుంది.



అందంగా... ఆరోగ్యంగా

ఒత్తిడి వల్ల ముఖ సౌందర్యాన్ని గాలికి వదిలేస్తుంటారు. అద్దంలో ముఖం చూసుకున్నప్పుడు మరింత నిస్సత్తువగా అనిపిస్తుంది. అందువల్ల మీ ముఖాన్ని మరింత కాంతిమంతంగా మార్చుకునేందుకు ఇంట్లోనే ఫేషియల్ తయారు చేసుకోవాలి. చర్మ సంరక్షణకు ఎటువంటి క్రీమ్‌లు, ఫేషియల్స్‌లు చేసుకోవాలో నేర్చుకుని చర్మసౌందర్యాన్ని పెంచుకోవాలి. వీటికి ఫేషియల్ యోగాను జతచేస్తే అందమూ ఆరోగ్యం మీ సొంతమైనట్టే.

వీటిలో కనీసం కొన్నింటిని అలవరచుకున్నా మీలో పేరుకుపోయిన ఒత్తిడి, నిస్సత్తువలు నియంత్రణలోకి వచ్చి ఆనందంగా జీవించ గలుగుతారు.

'మిజో జాతీయవాదం'

గట్టెక్కించేనా!?

సీఎం జోరాం ఆశలన్నీ దానిమీదే • భయపెడుతున్న ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి ఆరోపణలు

అసెంబ్లీ ఎన్నికలు మరో పది రోజుల్లోకి వచ్చిన తరుణంలో మిజోరం సీఎం, మిజో నేషనల్ ఫ్రంట్ సారథి జోరాం తంగా మరోసారి మిజో జాతీయవాదాన్ని నెత్తికెత్తుకున్నారు. బీజేపీకి మిత్రపక్షం అయ్యుండి కూడా పలు విషయాల్లో కేంద్రంతో విభేదిస్తూ వస్తున్నారు. తద్వారా తనను తాను మిజోల ప్రయోజనాల పరిరక్షకునిగా చిత్రించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అందుకోసం తనలోని ఒకప్పటి వేర్పాటువాద నాయకుడు, గెరిల్లా యోధున్ని బయటకు తెస్తున్నారు. ఇది ఆయనకు ఏ మేరకు లాభిస్తుందో చూడాలి...

మిజోరంలో అధికార ఎంఎన్‌ఎఫ్ నిజానికి ఎన్డీఏ కూటమిలో భాగస్వామే. కానీ అసెంబ్లీ ఎన్నికల వేళ మాత్రం ఎవరి దారి వారిదేనన్నట్టుగా సీఎం తంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ప్రచారం నిమిత్తం ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి వచ్చినా ఆయనతో కలిసి వేదిక పంచుకునేది లేదని కూడా ఇటీవలే ఆయన బాహాటంగా ప్రకటించారు. తద్వారా రాష్ట్ర ఓటర్ల మనసు గెలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. పొరుగు రాష్ట్రం మణిపూర్‌లో మెయితీలతో చెలరేగుతున్న హింసాకాండలో కుకీ తెగకు పూర్తి మద్దతిస్తున్నారు. కేంద్రం సూచనను తోసిరాజని మరీ 12 వేల మందికి పైగా కుకీ శరణార్థులకు రాష్ట్రంలో ఇప్పటికే ఆశ్రయమిచ్చారు. వారితో పాటు మయన్మార్‌కు చెందిన కుకీలకు కూడా ఆశ్రయమిస్తున్నారు! క్రైస్తవ మెజారిటీ రాష్ట్రమైన మిజోరంలో ఈ చర్య కచ్చితంగా ఓటర్లపై సానుకూల ప్రభావం చూపుతుందని ఆయన నమ్ముతున్నారు. ''మన మంతా క్రైస్తవులమే. మణిపూర్‌లో మెయితీలు చర్చిలను తగలబెట్టడం వంటి అనాగరిక చర్యలకు అక్కడి బీజేపీ సర్కారు పరోక్షంగా మద్దతిస్తోంది. అలాంటి పార్టీకి మన రాష్ట్రంలో సహకరించడం కల్ల''అని ఇటీవల ఒక ఎన్నికల సభలో, బీబీసీ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారాయన. అటువంటి పార్టీలకు ఓటేయొద్దని ఆయనతో పాటు మంత్రివర్గ సహచరులు కూడా జోరుగా ప్రచారం చేస్తున్నారు. అయితే కేవలం మిజో నేషనలిజం మాత్రమే పని చేస్తుందా అన్నది ప్రశ్న.

ప్రతికూలతలెన్నో...

ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తున్న ప్రభుత్వ వ్యతిరేకత ఎంఎన్‌ఎఫ్‌కు గుబులు రేపుతోంది. తీవ్ర అవినీతి ఆరోపణలు దానికి తోడవుతున్నాయి. ఇవేగాక కరోనా కల్లోలాన్ని ఎదుర్కోవడంలో తంగా సర్కారు విఫలమైందన్న ఆగ్రహం ప్రజల్లో ఇంకా బలంగా ఉంది. ఆర్థిక అవ్యవస్థ కారణంగా రాష్ట్రం రుణ భారంలో పీకల్లోతు కూరుకుపోయింది. చివరికి ప్రభుత్వోద్యోగులకు సకాలంలో వేతనాలు, పెన్షన్లు కూడా ఇవ్వలేని పరిస్థితి! ఇవన్నీ ఎంఎన్‌ఎఫ్‌కు ప్రతికూలమేనని చెబుతున్నారు. పైగా సీఎం తంగాపై వెల్లువెత్తిన అవినీతి ఆరోపణలు మరో ఎత్తు. ఆయనపై అప్పట్లో అవినీతి వ్యతిరేక విభాగం చార్జిషీట్ కూడా దాఖలు చేయడాన్ని విపక్షాలు తెరపైకి తీసుకొస్తున్నాయి. తంగా ఆశ్రిత పక్షపాతానికి పాల్పడ్డారని, మేనల్లునికి పలు కాంట్రాక్టులు కట్టబెట్టారని మిజోరం ఫస్ట్ స్వచ్ఛంద సంస్థ చేసిన ఆరోపణలు కూడా బాగానే ప్రభావం చూపుతున్నాయి. సెర్చిప్ జిల్లాకు చెందిన వన్లాల్‌సంగ అనే 27 ఏళ్ల సివిల్స్ అభ్యర్థి అదే చెప్పాడు. ''కుకీ శరణార్థులకు దన్నుగా నిలుస్తుండటం మెచ్చదగిందే. కానీ యువతకు రాష్ట్రంలో ఉపాధి అవకాశాలే లేవు. దానికి తోడు అవినీతి పెచ్చరిల్లుతోంది''అంటూ ఆగ్రహం వెలిబుచ్చడం తంగా సర్కారుకు ప్రమాద ఘంటికే. పైగా బంగ్లాదేశీ శరణార్థులకు ఆశ్రయమివ్వడంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్



మిజోరం సీఎం జోరాం

మిజోరంలో గత రెండు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు		
పార్టీ	2018	2013
ఎంఎన్‌ఎఫ్	26	5
కాంగ్రెస్	5	34
జెడ్‌పీఎం	8	-
బీజేపీ	1	0
ఇతరులు	0	1

పంచతంత్రం

కాలేజీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు.. పాత పింఛను అమలు

మరికొన్ని ఎన్నికల హామీలను ప్రకటించిన రాజస్తాన్ సీఎం గెహ్లోత్

జైపూర్: రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లోత్ అయిదు గ్యారెంటీలను ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛను విధానం అమలు, గోధన పథకం కింద ఆవుపేడను కిలో రెండు రూపాయల చొప్పున కొనుగోలు, కాలేజీ విద్యార్థులకు ల్యాప్‌టాప్ లేదా టాబ్లెట్ పీసీ పంపిణీ ఇందులో ఉన్నాయి. నవంబర్ 25వ తేదీన అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో తమ పార్టీని మళ్లీ గెలిపిస్తే వీటిని నెరవేరుస్తామని ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో హామీ ఇచ్చారు. త్వరలోనే పార్టీ మేనిఫెస్టోను విడుదల చేస్తామన్నారు. స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడతామని, ప్రకృతి వైపరీత్యాల్లో నష్టపోయిన వారికి రూ.15 లక్షల బీమా కల్పిస్తామని చెప్పారు. పాత పింఛను విధానాన్ని భవిష్యత్తులో కూడా కొనసాగించేలా చట్టం చేస్తామన్నారు. ప్రభుత్వ కాలేజీల్లో చేరే విద్యార్థులకు మొదటి ఏడాదిలోనే ల్యాప్‌టాప్ లేదా టాబ్ ఇస్తామన్నారు. ఇవికాకుండా, వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.500కే అందజేయడం, రాష్ట్రంలోని 1.05 కోట్ల కుటుంబాల్లోని ఒక్కో మహిళకు ఏడాదికి విడతలుగా రూ.10 వేల చొప్పున అందజేస్తామని ఇప్పటికే ఆ పార్టీ నేత ప్రియాంకా గాంధీ వాద్రా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం గెహ్లోత్ కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. 'దేశంలో ఈడీ వీధి కుక్కల కంటే ఎక్కువగా హడావుడి చేస్తోందని ఒక సీఎం (భూపేష్ బఘేల్) అనాల్సి వచ్చింది. ఇంతకంటే దౌర్భాగ్యం ఇంకేముంటుంది?'అని వ్యాఖ్యానించారు. అంత మాట అన్నారంటే ఆయన ఎంతగా బాధపడ్డారో అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. 'దర్యాప్తు విభాగాలు మీకు రాజకీయ ఆయుధాలుగా మారాయి. మోదీజీ, మీకు అర్థం కావడం లేదు. మీకు కౌంట్‌డౌన్ మొదలయ్యింది'అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ గోవింద్ సింగ్ దోతాస్రా ఇంటిపై గురువారం ఈడీ దాడులు జరిగిన విషయం తెలిసిందే.



బీజేపీ బహిష్కృత అభ్యర్థినికి కాంగ్రెస్ టికెట్



జైపూర్: రాజస్తాన్ బీజేపీ బహిష్కరించిన సిట్టింగ్ ఎమ్మెల్యే శోభా రాణి కుష్వాహాకు కాంగ్రెస్ పార్టీ టికెటిచ్చింది. మాజీ సీఎం వసుంధరా రాజేకు సన్నిహితురాలిగా పేరున్న శోభా రాణి కుష్వాహ 2018 ఎన్నికల్లో ధోల్‌పూర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. రాజ్యసభ ఎన్నికల సమయంలో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు ఆమెపై ఆరోపణలు రావడంతో బీజేపీ గత ఏడాది జూన్‌లో పార్టీ నుంచి బహిష్కరించింది. రాష్ట్రంలో పర్యటిస్తున్న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా సమక్షంలో బుధవారం ఆమె కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మూడో జాబితాలో ఆమెకు చోటుదక్కింది. మళ్లీ ధోల్‌పూర్ టికెట్‌ను ఆ పార్టీ ఆమెకు కేటాయించింది. శోభారాణి భర్త బీఎస్‌పీ నేత, ధోల్‌పూర్ మాజీ ఎమ్మెల్యే అయిన బీఎల్ కుష్వాహా. 2012లో జరిగిన హత్య కేసులో నిందితుడిగా తేలడంతో ఎమ్మెల్యే పదవిపై అనర్హత వేటుపడింది. అసెంబ్లీలోని 200 సీట్లకు గాను గురువారం ప్రకటించిన మూడో జాబితాలోని 19 మందితో కలిపి కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు 95 పేర్లను ప్రకటించినట్లయింది. రాష్ట్రంలో నవంబర్ 25న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

మహిళలకు ఉద్యోగాల్లో 33% కోటా


మిజోరం ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ వాగ్దానం



ఐజ్వాల్: నవంబర్ 7న మిజోరం అసెంబ్లీ జరగనున్న ఎన్నికలకు శుక్రవారం దార్శనిక పత్రం పేరుతో బీజేపీ చీఫ్ జేపీ నడ్డా మేనిఫెస్టో విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, ప్రస్తుత ఎంఎన్‌ఎఫ్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో అవినీతిపై దర్యాప్తు వంటి హామీలు ఇందులో ఉన్నాయి. వాస్తవాలకు అనుగుణంగా పూర్తిస్థాయి అధ్యయనం అనంతరమే ఈ మేనిఫెస్టోను రూపొందించినట్లు ఆయన తెలిపారు. చాలా రాజకీయ పార్టీలు ఆచరణ సాధ్యంకాని, ఆచరణకు నోచుకోని చిత్తశుద్ధి లేని ఎన్నో హామీలిస్తున్నాయని పేర్కొన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే వ్యవసాయ మౌలిక వసతుల అభివృద్ధి కోసం వెయ్యి కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుందని చెప్పారు. పూర్తిగా మహిళలతో కూడిన పోలీస్ బెటాలియన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న మిజోరం-అస్సాం సరిహద్దు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్య, విద్యారంగాలను బలోపేతం చేస్తామని జేపీ నడ్డా ప్రకటించారు.

మధ్యప్రదేశ్‌లో బీజేపీ స్టార్ క్యాంపెయినర్లు వీరే..

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ అసెంబ్లీకి నవంబర్ 17వ తేదీన జరగనున్న ఎన్నికలకు గాను శుక్రవారం బీజేపీ స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ప్రకటించింది. ఇందులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా 40 మంది పేర్లున్నాయి. యూపీ సీఎం యోగి



ఆదిత్యనాథ్, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, అస్సాం సీఎం హిమాంత బిశ్వ శర్మ, మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, స్మృతి ఇరానీ కూడా స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్నారు. వీరితోపాటు మధ్యప్రదేశ్ హోం మంత్రి నరోత్తమ్ మిశ్రా, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, యూపీ డిప్యూటీ సీఎంలు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రిజేశ్ పాఠక్ తదితరులు కూడా స్టార్ క్యాంపెయినర్లుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
28-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	635	63,783
నిఫ్టీ ▲	202	19,060

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,631	▲	38
డోజోన్స్	32,486	▼	298
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,291	▼	63
డాక్స్	14,687	▼	44
షాంఘై	3,018	▲	29
నికాయ్	30,992	▲	390

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	60,825	▼	159
బంగారం (99.5 స్వచ్ఛత)	60,740	▼	159
వెండి (కిలో)	70,906	▼	654

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.48	84.15
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	99.46	102.77
€	యూరో	ఒకటి	86.51	89.56
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.63	56.32
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.75	54.04
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.91	61.84
SAR	సౌదీ రియాల్	ఫాయిన్‌టెన్	21.24	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	ఫాయిన్‌టెన్	21.77	23.56
¥	చైనా యువాన్	ఫాయిన్‌టెన్	10.25	12.33

జీఆర్‌టీ జ్యువెలర్స్ కొత్త షోరూమ్



హైదరాబాద్: జీఆర్‌టీ జ్యువెలర్స్ తన 59వ షోరూమ్‌ను సికింద్రాబాద్‌లోని డాక్టర్ ఎ.ఎస్.రావు నగర్‌లో శుక్రవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆఫర్లు ప్రకటించింది. బంగారు నగలు కొనుగోలు చేసే కస్టమర్లు అంతే సమానమైన బరువులో వెండి ఉచితంగా పొందవచ్చు. స్వర్ణాభరణాల మార్పిడిపై గ్రాముకు రూ.50 అదనంగా అందుకోవచ్చు. వజ్రాలపై క్యారెట్‌కు 25 గ్రాముల వెండి ఉచితం. వెండి వస్తువుల తయారీ చార్జీలపై 25%, వెండి ఆభరణాల గరిష్ఠ విక్రయ ధర(ఎంఆర్‌పీ)పై 10% తగ్గింపు ఇస్తుంది. కొత్త షోరూం ప్రారంభం ద్వారా సికింద్రాబాద్‌లోని కస్టమర్లకు అసమానమైన ఆభరణాల షాపింగ్ అనుభవాన్ని అందించాలనే తమ లక్ష్యమని సంస్థ ఎండీ ఆనంద్ అనంత్ పద్మనాభన్ తెలిపారు.

ఐఫోన్ల తయారీలోకి టాటా గ్రూప్

విస్ట్రన్ ఇన్ఫోకామ్ కొనుగోలు ● ఆమోదం తెలిపిన విస్ట్రన్ కార్ప్



న్యూఢిల్లీ: ఐఫోన్ల తయారీలోకి టాటా గ్రూప్ ఎంట్రీ ఇస్తోంది. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారతీయ కంపెనీగా టాటా నిలవనుంది. ఐఫోన్ల తయారీలో ఉన్న విస్ట్రన్ ఇన్ఫోకామ్ మాన్యుఫాక్చరింగ్‌ను (ఇండియా) టాటా గ్రూప్‌నకు విక్రయించేందుకు తైవాన్‌కు చెందిన విస్ట్రన్ కార్ప్ బోర్డ్ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ డీల్ విలువ రూ.1,040 కోట్లు. ఈ మేరకు టాటా ఎలక్ట్రానిక్స్‌తో విస్ట్రన్ కార్ప్ అనుబంధ కంపెనీలైన ఎస్ఎంఎస్ ఇన్ఫోకామ్ (సింగపూర్), విస్ట్రన్ హాంగ్‌కాంగ్ మధ్య వాటాల విక్రయ ఒప్పందం కుదిరింది. విస్ట్రన్ ఇన్ఫోకామ్ మాన్యుఫాక్చరింగ్‌కు బెంగళూరు సమీపంలో అసెంబ్లింగ్ ప్లాంట్ ఉంది. 10,000 పైచిలుకు సిబ్బంది ఇక్కడ పనిచేస్తున్నారు. ఈ కేంద్రంలో ఐఫోన్ 14 సైతం తయారవుతోంది.

డాక్టర్ రెడ్డీస్ లాభం జూమ్



న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ రంగ దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ రెండో త్రైమాసికంలో మంచి ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 33 శాతం జంప్‌చేసి రూ. 1,482 కోట్లను అధిగమించింది. యూఎస్ జనరిక్స్ మార్కెట్ ఇందుకు సహకరించింది. 2022–23 ఇదే కాలంలో రూ. 1,114 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 9 శాతం ఎగసి రూ. 6,903 కోట్లకు చేరింది. అయితే మొత్తం వ్యయాలు 11 శాతం పెరిగి రూ.5,305 కోట్లను తాకాయి. కాగా.. మొత్తం టర్నోవర్ 13 శాతం పుంజుకుని రూ. 7,218 కోట్లకు చేరింది. ఒక త్రైమాసికానికి కంపెనీ చరిత్రలోనే అత్యధిక ఆదాయం, నికర లాభాలు ఆర్జించినట్లు కంపెనీ సహచైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ పేర్కొన్నారు.

డాక్టర్ రెడ్డీస్ షేరు బీఎస్ఈలో 0.7 శాతం నీరసించి రూ. 5,386 వద్ద ముగిసింది.

ఆరు రోజుల నష్టాలకు బ్రేక్

కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్లు ● ఒక శాతం పెరిగిన సూచీలు



ముంబై: స్టాక్ సూచీల ఆరు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. ఇటీవల పతనంలో భాగంగా కనిష్టాలకు దిగివచ్చిన ఆటో, ఐటీ, ఫైనాన్స్, ఇంధన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీ నుంచి సానుకూల సంకేతాలు అందాయి. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 635 పాయింట్లు పెరిగి 63,783 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 202 పాయింట్లు బలపడి 19,060 వద్ద నిలిచింది. భారీ లాభాలతో మొదలైన సూచీలు రోజంతా అదే జోరు కనబరిచాయి. ఒక దశలో సెన్సెక్స్ 765 పాయింట్లు బలపడి 63,913, నిఫ్టీ 219 పాయింట్లు బలపడి 19,076 ఇంట్రాడే గరిష్టాలను చూశాయి.

- దీపావళి నాడు గంట పాటు జరిగే 'మూహురత్ ట్రేడింగ్' నవంబర్ 12న నిర్వహిస్తున్నట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు తెలిపాయి. సాయంత్రం 6:15 గంటల నుంచి 7.15 గంటల వరకు ఈ ప్రత్యేక ట్రేడింగ్ జరుగుతుందన్నాయి. ఈ ఘడియల్లో షేర్లు కొనుగోలు చేస్తే మంచి లాభాలు గడిస్తామని మార్కెట్ వర్గాల నమ్మకం. అలాగే బలప్రతిపాద సందర్భంగా నవంబర్ 14న ఎక్స్ఛేంజీలు పనిచేయవు.
- సెన్సెక్స్ ఒక శాతం ర్యాలీతో బీఎస్ఈలో రూ.4.41 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగి రూ. 310 లక్షల కోట్లకు చేరింది.

ఆర్‌ఐఎల్ భేష్

క్యూ2 నికర లాభం రూ. 17,394 కోట్లు ● పెట్టుబడి వ్యయాలు రూ. 38,815 కోట్లు



> అన్ని విభాగాల పటిష్ట నిర్వహణ, ఆర్థిక పనితీరు కారణంగా తాజా త్రైమాసికంలోనూ రిలయన్స్ ఇండస్ట్రీస్ భారీ వృద్ధిని సాధించింది. జియోఎయిర్‌ఫైబర్, జియోభారత్ ఫోన్ ద్వారా డిజిటల్ ఇండియా విజన్‌కు రిలయన్స్ జియో కట్టుబడి ఉంది. విభిన్న ప్రొడక్టులు, ఆఫరింగ్స్ ద్వారా రిలయన్స్ రిటైల్ అటు ఆఫ్‌లైన్, ఇటు ఆన్‌లైన్ విభాగాల్లో వేగంగా విస్తరిస్తోంది.
>
> – ముకేశ్ అంబానీ, చైర్మన్, ఎండీ, రిలయన్స్ ఇండస్ట్రీస్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర లాభం 27 శాతం జంప్‌చేసి రూ. 17,394 కోట్లను తాకింది. చమురు, గ్యాస్ బిజినెస్ తిరిగి పుంజుకోవడం, ఫ్యాషన్, గ్రోసరీ కారణంగా రిటైల్ ఆదాయం బలపడటం దీనికి కారణం. 2022–23 ఇదే కాలంలో రూ. 13,656 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం దాదాపు యథాతథంగా రూ. 2.55 లక్షల కోట్లుగా నమోదైంది. అధిక వడ్డీ రేట్లు, లోన్ బ్యాలన్స్ కారణంగా ఫైనాన్స్ వ్యయాలు 26% పెరిగి రూ. 5,731 కోట్లకు చేరాయి. తరుగుదల, అమార్టైజేషన్ తదితర వ్యయాలు 30% అధికమై రూ. 12,585 కోట్లను తాకాయి. అన్ని బిజినెస్ ఆస్తులనూ విస్తరించడం, డిజిటల్ సర్వీసుల బిజినెస్‌కు హైయర్ నెట్‌వర్క్ వినియోగం ప్రభావం చూపాయి. అయితే నిర్వహణ లాభం(ఇబిటా) 30% ఎగసి రూ. 44,867 కోట్లయ్యింది. దీనిలో చమురు శుద్ధి, పెట్రోకెమికల్ ఇబిటా 36% వృద్ధితో రూ. 16,281 కోట్లను తాకింది. కేజీ డీ6 బ్లాకులో గ్యాస్ ఉత్పత్తి పెరిగిన నేపథ్యంలో ఆయిల్, గ్యాస్ ఇబిటా 50% జంప్‌చేసి రూ. 4,766 కోట్లను తాకింది. సెప్టెంబర్‌కల్లా రుణ భారం రూ. 3.18 లక్షల కోట్ల నుంచి రూ. 2.95 లక్షల కోట్లకు తగ్గినట్లు కంపెనీ వెల్లడించింది. ఈ కాలంలో దేశవ్యాప్త 5జీ సేవలు ప్రారంభించిన నేపథ్యంలో రూ. 38,815 కోట్ల పెట్టుబడులు వెచ్చించింది.

ఫలితాల నేపథ్యంలో ఆర్‌ఐఎల్ షేరు బీఎస్ఈలో 2% ఎగసి రూ. 2,265 వద్ద ముగిసింది.

జియో ఇన్ఫోకామ్ జోరు

ఈ ఏడాది క్యూ2లో ఆర్‌ఐఎల్ డిజిటల్ సర్వీసుల విభాగం జియో ఇన్ఫోకామ్ నికర లాభం 12 శాతం మెరుగుపడి రూ. 5,297 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 11 శాతం పుంజుకుని రూ. 26,785 కోట్లకు చేరింది. రిలయన్స్ జియో మాతృ సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ వినియోగదారుల సంఖ్య 7.5 శాతం(1.11 కోట్లు) పెరిగి 45.97 కోట్లను తాకింది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) 2.5 శాతం మెరుగై రూ. 181.7కు చేరింది.

రిలయన్స్ రిటైల్ భళా..

ఆర్‌ఐఎల్ రిటైల్ విభాగం.. రిలయన్స్ రిటైల్ వెంచర్ క్యూ2లో నికర లాభం 21 శాతం ఎగసి రూ. 2,790 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం 20 శాతం వృద్ధితో రూ. 68,937 కోట్లకు చేరింది. కొత్త స్టోర్ల ప్రారంభం, సందర్శకులు పెరగడం, వివిధ విభాగాలలో పుంజుకున్న వినియోగం ఇందుకు దోహదపడ్డాయి. వెరసి స్థూల టర్నోవర్ 19% పెరిగి రూ. 77,148 కోట్లయ్యింది. ఈ కాలంలో 471 కొత్త స్టోర్లను జత చేసుకుంది. మొత్తం స్టోర్ల సంఖ్య 18,650కు చేరింది.

ముకేశ్ వారసులకు గ్రీన్‌సిగ్నల్



దిగ్గజ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ వారసులు రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో పదవులు చేపట్టేందుకు వాటాదారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. బోర్డులో సభ్యులయ్యేందుకు కవలలు ఆకాశ్, ఈషా 98 శాతానికిమించి ఓట్లను పొందగా.. అనంత్‌కు 92.7 శాతం మద్దతు లభించింది. 28ఏళ్ల అనంత్‌పట్ల ప్రాగ్జీ అడ్వయిజరీ సంస్థల వ్యతిరేకత కొంత ప్రభావం చూపినట్లు ఆర్‌ఐఎల్ పేర్కొంది. ఆగస్ట్‌లో కంపెనీ చైర్మన్ ముకేశ్ అంబానీ ఆర్‌ఐఎల్ బోర్డులో తన వారసులకు చోటు కల్పిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా మరో ఐదేళ్లపాటు చైర్మన్, సీఈవోగా కొనసాగనున్నట్లు తెలియజేశారు. తద్వారా తదుపరి తరం యువనేతలకు మార్గదర్శకత్వం వహించనున్నట్లు తెలియజేశారు. ఆపై కంపెనీ పోస్టల్ బ్యాలట్ ద్వారా ఇందుకు వాటాదారుల అనుమతిని కోరింది. ఆకాశ్, ఈషాకు 98 శాతానికిపైగా ఓట్లు లభించగా.. చిన్న వయసు కారణంగా అనంత్‌కు 7.24 శాతం(41.58 కోట్ల ఓట్లు) వ్యతిరేకంగా రావడంతో 92.75 శాతం మద్దతు లభించినట్లు కంపెనీ వివరించింది.

మారుతీ లాభాల రికార్డ్

క్యూ2లో రూ. 3,717 కోట్లు ● వాహన అమ్మకాలు సైతం దూకుడు



ముంబై: కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్‌లో నికర లాభం 80 శాతం దూసుకెళ్లి రూ. 3,717 కోట్లకు చేరింది. ఒక త్రైమాసికంలో ఇది కంపెనీ చరిత్రలోనే అత్యధికం కాగా.. ఇందుకు ఊపందుకున్న అమ్మకాలు, కమోడిటీ ధరలు క్షీణత, వ్యయ నియంత్రణలు, ఇతర ఆదాయంలో వృద్ధి సహకరించాయి. 2022–23 ఇదే కాలంలో రూ. 2,062 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 28,544 కోట్ల నుంచి రూ. 35,535 కోట్లకు జంప్ చేసింది. వాహన అమ్మకాల విక్రయాలు 5,17,395 యూనిట్ల నుంచి 5,52,055 యూనిట్లకు ఎగశాయి. వీటిలో 6 శాతం వృద్ధితో దేశీయంగా 4,82,731 యూనిట్లను విక్రయించింది. వెరసి అమ్మకాలలోనూ కొత్త రికార్డు నెలకొల్పింది. ఈ బాటలో 10 శాతం అధికంగా 69,324 వాహనాలను ఎగుమతి చేసింది.



మళ్లీ చిన్న కార్ల జోరు

> జోరులో ఉన్న ఆర్థిక వ్యవస్థ, పెరుగుతున్న ఆదాయాల నేపథ్యంలో ప్రస్తుత వృద్ధి నమోదవుతోంది. దీని ప్రకారం చౌక ధరల అంశం వెనుకబడినట్లే. ఇందువల్లనే చిన్న కార్ల అమ్మకాలు తగ్గుతున్నాయ్. అయితే రెండు, మూడేళ్ల తదుపరి తిరిగి మార్కెట్లు చౌక ధరలు, చిన్న కార్లవైపు దృష్టి సారించే అవకాశముంది.
>
> – ఆర్‌సీ భార్గవ, చైర్మన్, మారుతీ సుజుకీ ఇండియా

ఫలితాల నేపథ్యంలో మారుతీ షేరు ఎన్ఎస్ఈలో 1.2 శాతం బలపడి రూ. 10,553 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-10-2023	
విశాఖ	540–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	531–00
విజయవాడ	531–00
రిటైల్ ధర (డజను)	72.00
27-10-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	518–00
వరంగల్	520–00
రిటైల్ ధర	5.80

సాక్షి స్పోర్ట్స్



రితిక 'పసిడి' పట్టు

ప్రపంచ అండర్–23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన తొలి భారతీయ మహిళా రెజ్లర్‌గా రితిక హుడా చరిత్ర సృష్టించింది. అల్బేనియాలో జరుగుతున్న ఈ టోర్నీలో హరియాణాకు చెందిన 21 ఏళ్ల రితిక మహిళల 76 కేజీల విభాగం ఫైనల్లో 9–2 పాయింట్లతో కెన్నడీ అలెక్సిస్ బ్లేడ్స్ (అమెరికా)పై గెలిచింది. 72 కేజీల విభాగంలో జ్యోతి ఫైనల్‌కు అర్హత సాధించింది.

భారత్, పాక్ హాకీ మ్యాచ్ 'డ్రా'

సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్ జూనియర్ పురుషుల హాకీ టోర్నమెంట్‌ను డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు 'డ్రా'తో ప్రారంభించింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ జట్టుతో మలేసియాలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌ను భారత జట్టు 3–3 గోల్స్‌తో 'డ్రా'గా ముగించింది. భారత్ తరఫున అమన్‌దీప్ (30వ ని.లో), ఆదిత్య (56వ ని.లో), ఉత్తమ్ సింగ్ (59వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. పాకిస్తాన్ జట్టు తరఫున అర్బాజ్ (31వ, 58వ ని.లో) రెండు గోల్స్, అబ్దుల్ (49వ ని.లో) ఒక గోల్ సాధించారు.

ఉత్కంఠను దాటి...

పాకిస్తాన్‌పై ఒక వికెట్ తేడాతో గట్టెక్కిన దక్షిణాఫ్రికా

హోరాహోరీగా సాగిన పోరు ● సఫారీని గెలిపించిన షమ్సీ, మార్క్‌రమ్



షమ్సీ, కేశవ్ మహరాజ్ గెలుపు సంబరం

చెన్నై: ఒక్కో బంతి, ఒక్కో పరుగుకు గుండెచప్పుడు పెరుగుతుంటే... మరోసారి 'చోకర్స్' అనిపించుకోరాదని దక్షిణాఫ్రికా ఒకవైపు... ఈ అవకాశం పోతే వన్డే వరల్డ్‌కప్‌లో తమ ఖేల్ ఖతమ్ అని తెలుసు కాబట్టి ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో పాకిస్తాన్ మరోవైపు... వరల్డ్ కప్ 26వ మ్యాచ్ అభిమానులకు అత్యంత ఉత్కంఠను పెంచి ఆసక్తికరంగా ముగిసింది. విజయానికి చేరువైన దశలో 10 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు కోల్పోవడం సఫారీ టీమ్‌లో ఆందోళన పెంచగా... ఆఖరి వికెట్ తీసేందుకు 11 బంతులు పోరాడిన పాక్ చివరకు తలవంచింది. 17 బంతుల్లో 4 పరుగులు కావాల్సి ఉండగా ఒత్తిడిని అధిగమించి కేశవ్ మహరాజ్ కొట్టిన బౌండరీతో ఆట ముగిసింది. శుక్రవారం హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఒక వికెట్ తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. ముందుగా పాక్ 46.4 ఓవర్లలో 270 పరుగులకు ఆలౌటైంది. సౌద్ షకీల్ (52 బంతుల్లో 52; 7 ఫోర్లు), బాబర్ ఆజమ్ (65 బంతుల్లో 50; 4 ఫోర్లు, 1 సిక్స్), షాదాబ్ ఖాన్ (36 బంతుల్లో 43; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ప్రదర్శన చేశారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తబ్రేజ్ షమ్సీకి 4 వికెట్లు దక్కాయి. అనంతరం దక్షిణాఫ్రికా 47.2 ఓవర్లలో 9 వికెట్లకు 271 పరుగులు చేసి గెలిచింది. మార్క్‌రమ్ (93 బంతుల్లో 91; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ ఓటమితో పాకిస్తాన్ సెమీఫైనల్ చేరే అవకాశాలను దాదాపుగా కోల్పోయింది.

కీలక భాగస్వామ్యం...

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్‌కు మరోసారి సరైన ఆరంభం లభించలేదు. ఓపెనర్లు అబ్దుల్లా (9), ఇమామ్ (12) సమష్టిగా విఫలమయ్యారు. తొలి బంతికే జాన్సెన్ రిటర్న్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన రిజ్వాన్ (27 బంతుల్లో 31; 4 ఫోర్లు, 1 సిక్స్) కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. అయితే రిజ్వాన్, ఇఫ్తికార్ (21)లను తక్కువ వ్యవధిలో అవుట్ చేసి దక్షిణాఫ్రికా పైచేయి సాధించింది. మరోవైపు తడబడుతూనే ఆడిన బాబర్ 64 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొని అదే స్కోరు వద్ద వెనుదిరిగాడు. 141/5 స్కోరుతో పాక్ కుప్పకూలడం ఖాయమనిపించింది. ఈ దశలో షాదాబ్, షకీల్ కలిసి జట్టును ఆదుకున్నారు. చక్కటి సమన్వయంతో పాటు వీరిద్దరు ధాటిగా బ్యాటింగ్ చేశారు. ఆరో వికెట్‌కు షకీల్‌తో కలిసి 84 పరుగులు (71 బంతుల్లో) జోడించిన అనంతరం షాదాబ్ పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత 50 బంతుల్లో షకీల్ హాఫ్ సెంచరీ పూర్తయింది. కానీ అతను అవుటైన తర్వాత పరుగులు జోడించడంలో పాక్ విఫలమైంది. 30 పరుగుల వ్యవధిలో జట్టు చివరి 4 వికెట్లు కోల్పోగా మరో 20 బంతులు మిగిలి ఉండగానే ఇన్నింగ్స్ ముగిసింది.



నిరాశలో పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్



మార్క్‌రమ్

రాణించిన మార్క్‌రమ్...

ఛేదనను దక్షిణాఫ్రికా దూకుడుగా మొదలు పెట్టింది. షాహిన్ వేసిన రెండో ఓవర్లో డికాక్ (14 బంతుల్లో 24; 5 ఫోర్లు) నాలుగు ఫోర్లు బాదగా, బవుమా (27 బంతుల్లో 28; 4 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. వీరిద్దరితో పాటు వివాదాస్పద డీఆర్ఎస్ నిర్ణయానికి డసెన్ (21), ఫామ్‌లో ఉన్న క్లాసెన్ (12) కూడా వెనుదిరగడంతో పాక్ జట్టులో ఆశలు రేగాయి. అయితే మార్క్‌రమ్, మిల్లర్ (29) కలిసి పరిస్థితిని చక్కదిద్దారు. తమ సహజశైలిలో వీరు ధాటిగా ఆడటంతో సఫారీ జట్టు గెలుపు దిశగా దూసుకుపోయింది. వీరిద్దరు ఐదో వికెట్‌కు 70 పరుగులు జత చేశారు. అయితే లక్ష్యానికి చేరువవుతున్న దశలో పాక్ బౌలర్లు చెలరేగడంతో టీమ్ తక్కువ వ్యవధిలో వరుస వికెట్లు కోల్పోయింది. 59 బంతుల్లో కేవలం 21 పరుగులు చేయాల్సిన దశలో మార్క్‌రమ్ అవుట్ కావడంతో మ్యాచ్ ఉత్కంఠభరిత ముగింపు వైపు సాగింది. ఫీల్డింగ్‌లో తలకు గాయం కావడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 15వ ఓవర్లో పాక్ బౌలర్ షాదాబ్ మైదానం వీడగా... 'కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్'గా ఉసామా మీర్ బరిలోకి దిగాడు. వరల్డ్ కప్‌లో ఇదే తొలి 'కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్' ఘటన కావడం విశేషం.

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: అబ్దుల్లా (సి) ఎన్‌గిడి (బి) జాన్సెన్ 9; ఇమామ్ (సి) క్లాసెన్ (బి) జాన్సెన్ 12; బాబర్ (సి) డికాక్ (బి) షమ్సీ 50; రిజ్వాన్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 31; ఇఫ్తికార్ (సి) క్లాసెన్ (బి) షమ్సీ 21; షకీల్ (సి) డికాక్ (బి) షమ్సీ 52; షాదాబ్ (సి) మహరాజ్ (బి) కోయెట్జీ 43; నవాజ్ (సి) మిల్లర్ (బి) జాన్సెన్ 24; షాహిన్ (సి) మహరాజ్ (బి) షమ్సీ 2; వసీమ్ (సి) డికాక్ (బి) ఎన్‌గిడి 7; రవూఫ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (46.4 ఓవర్లలో ఆలౌట్) 270.** **వికెట్ల పతనం:** 1-20, 2-38, 3-86, 4-129, 5-141, 6-225, 7-240, 8-259, 9-268, 10-270. **బౌలింగ్:** జాన్సెన్ 9-1-43-3, ఎన్‌గిడి 7.4-0-45-1, మార్క్ రమ్ 4-0-20-0, మహరాజ్ 9-0-56-0, కోయెట్జీ 7-0-42-2, షమ్సీ 10-0-60-4.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: బవుమా (సి) షకీల్ (బి) వసీమ్ 28; డికాక్ (సి) వసీమ్ (బి) షాహిన్ 24; డసెన్ (ఎల్బీ) (బి) ఉసామా 21; మార్క్‌రమ్ (సి) బాబర్ (బి) ఉసామా 91; క్లాసెన్ (సి) ఉసామా (బి) వసీమ్ 12; మిల్లర్ (సి) రిజ్వాన్ (బి) షాహిన్ 29; జాన్సెన్ (సి) బాబర్ (బి) రవూఫ్ 20; కోయెట్జీ (సి) రిజ్వాన్ (బి) షాహిన్ 10; మహరాజ్ (నాటౌట్) 7; ఎన్‌గిడి (సి) అండ్ (బి) రవూఫ్ 4; షమ్సీ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (47.2 ఓవర్లలో 9 వికెట్లకు) 271. వికెట్ల పతనం:** 1-34, 2-67, 3-121, 4-136, 5-206, 6-235, 7-250, 8-250, 9-260. **బౌలింగ్:** ఇఫ్తికార్ 3-0-23-0, షాహిన్ అఫ్రిది 10-0-45-3, నవాజ్ 6.2-0-40-0, రవూఫ్ 10-0-62-2, వసీమ్ 10-1-50-2, ఉసామా 8-0-45-2.

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X న్యూజిలాండ్
వేదిక: ధర్మశాల
ఉదయం గం. 10:30 నుంచి

బంగ్లాదేశ్ X నెదర్లాండ్స్
వేదిక: కోల్‌కతా

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
దక్షిణాఫ్రికా	6	5	1	10	2.032
భారత్	5	5	0	10	1.353
న్యూజిలాండ్	5	4	1	8	1.481
ఆస్ట్రేలియా	5	3	2	6	1.193
శ్రీలంక	5	2	3	4	-0.025
పాకిస్తాన్	6	2	4	4	-0.387
అఫ్గానిస్తాన్	5	2	3	4	-0.969
బంగ్లాదేశ్	5	1	4	2	-1.253
ఇంగ్లండ్	5	1	4	2	-1.634
నెదర్లాండ్స్	5	1	4	2	-1.902

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

శీతల్ డబుల్ ధమాకా

- రెండు చేతుల్లేకపోయినా రెండు స్వర్ణాలు నెగ్గిన భారత ఆర్చర్
- ఆసియా పారా క్రీడల్లో భారత్‌కు 99 పతకాలు



హాంగ్జౌ: తన వైకల్యమే కుంగిపోయేలా... ఆత్మవిశ్వాసానికి నిలువుటద్దంలా భారత క్రీడాకారిణి శీతల్ దేవి ఆసియా పారా క్రీడల్లో పతకాల 'హ్యాట్రిక్' సాధించింది. కశ్మీర్‌కు చెందిన 16 ఏళ్ల ఈ టీనేజ్ ఆర్చర్‌కు రెండు చేతులు భుజాల నుంచే లేవు. మరి రెండు చేతులు తప్పక కావాల్సిన విలువిద్యలో ఆమె పతకాలపై గురిపెట్టడం ఏంటని ఆశ్చర్యం కలుగకమానదు. శీతల్ కాళ్లతో విల్లును నిటారుగా నిలబెట్టి, నోటితో బాణాన్ని లాగిపట్టి... లక్ష్యంపై గురిపెట్టే ఆమె ప్రావీణ్యానికి జేజేలు పలకాల్సిందే! ఆమె ప్రదర్శన ముందు వైకల్యం పూర్తిగా ఓడిపోయింది. ఈ ఆసియా పారా క్రీడల్లో రెండు స్వర్ణాలు, ఒక రజతంతో ఆమె 'హ్యాట్రిక్' సాధించింది. ఇంతకుముందు మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో రజతం నెగ్గిన ఆమె రాకేశ్ కుమార్‌తో కలిసి గురువారం మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించింది. శుక్రవారం జరిగిన వ్యక్తిగత విభాగం ఫైనల్లో శీతల్ దేవి 144–142తో అలీమ్ నూర్ సియాదా (సింగపూర్)పై గెలిచింది. తద్వారా ఒకే ఆసియా పారా ఈవెంట్‌లో రెండు బంగారు పతకాలు గెలిచిన తొలి భారత మహిళా అథ్లెట్‌గా రికార్డుల్లోకెక్కింది. ఇదే ఈవెంట్‌లో అంకుర్ రెండు స్వర్ణాలతో పురుష అథ్లెట్‌గా నిలిచాడు. శుక్రవారం పారాలింపిక్ చాంపియన్ అయిన షట్లర్ ప్రమోద్ భగత్, మహిళల్లో తులసిమతి మురుగేశన్, పురుషుల డబుల్స్‌లో నితేశ్–తరుణ్ జోడీ బంగారు పతకాలు సాధించారు. ఒక్క బ్యాడ్మింటన్‌లోనే భారత్ ఖాతాలో తొమ్మిది పతకాలు చేరడం విశేషం. ప్రస్తుతం భారత్ 25 స్వర్ణాలు, 29 రజతాలు, 45 కాంస్యాలతో కలిపి మొత్తం 99 పతకాలతో ఆరో స్థానంలో ఉంది. నేటితో ముగియనున్న ఈ క్రీడల్లో భారత్ అధికారికంగా 100 పతకాల మైలురాయిని తొలిసారి దాటనుంది.

భారీ విజయంతో భారత్ శుభారంభం



సంగీత

రాంచీ: ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్‌లో భారత జట్టు భారీ విజయంతో బోణీ కొట్టింది. థాయ్‌లాండ్ జట్టుతో శుక్రవారం జరిగిన తమ తొలి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 7–1తో నెగ్గింది. భారత్ తరఫున సంగీత కుమారి (29వ, 45వ, 45వ ని.లో) మూడు గోల్స్ చేయగా... మోనిక (7వ ని.లో), లాల్‌రెమ్‌సియామి (52వ ని.లో), సలీమా టెటె (15వ ని.లో), దీపిక (40వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు.

భారత షూటర్ల జోరు

రెండు ఒలింపిక్ బెర్త్‌లు సాధించిన అర్జున్, తిలోత్తమ



చాంగ్వాన్ (కొరియా): ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత రైఫిల్ షూటర్లు అర్జున్ బబుతా, తిలోత్తమ సేన్ రజత పతకాలు సాధించారు. ఈ ప్రదర్శనతో భారత్‌కు రెండు ఒలింపిక్స్ కోటా బెర్త్‌లు దక్కాయి. ఇప్పటికే భారత షూటర్లు 8 బెర్తులు పొందారు. దీంతో వచ్చే ఏడాది పారిస్‌కు పయనమయ్యే షూటర్ల సంఖ్య పదికి చేరింది. శుక్రవారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో 24 ఏళ్ల అర్జున్ 251.2 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. మహిళల 10 మీటర్ల ఎయిర్‌రైఫిల్ ఫైనల్లో 15 ఏళ్ల తిలోత్తమ (252.3 పాయింట్లు) త్రుటిలో స్వర్ణం కోల్పోయింది. కొరియన్ షూటర్ కోన్ ఎంజీ (252.4) 0.1 తేడాతో బంగారం గెలుచుకుంది. ఇదే విభాగంలో టీమ్ ఈవెంట్‌లో అర్జున్, దివ్యాన్ష్, హృదయ్ హజారికా (1892.4 పాయింట్లు) త్రయం బంగారు పతకం గెలిచింది. తిలోత్తమ, శ్రీయాంక, రమితలతో కూడిన మహిళల బృందం కాంస్యంతో సంతృప్తి చెందింది. సీనియర్ స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అనంత్‌జీత్ సింగ్, దర్శన రాథోడ్ జోడీ 139 పాయింట్లతో స్వర్ణం గెలిచింది.

క్లుప్తంగా...

క్వింటా పత్తి @ రూ.7,711

ఆదోని అర్బన్: కర్నూలు జిల్లా ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం పత్తి ధర రూ.7,711గా నమోదైంది. గత వారంలో రూ.7,500 ధర ఉండగా.. ఈ వారం రోజురోజుకు రూ.50, రూ.100 చొప్పున పెరుగుతూ రూ.7,711కు చేరుకుంది. శుక్రవారం మార్కెట్‌కు 2,626 క్వింటాళ్ల పత్తి రాగా గరిష్ట ధర రూ.7,711, మధ్య ధర రూ.7,389, కనిష్ట ధర రూ.5,169 పలికింది. అలాగే, వేరుశనగ 1,437 క్వింటాళ్లు రాగా గరిష్ట ధర రూ.7,969, కనిష్ట ధర రూ.3,849.. ఆముదాలకు గరిష్ట ధర రూ.5,475, కనిష్ట ధర రూ.4,500, పూల విత్తనాలకు గరిష్ట ధర రూ.4,212, కనిష్ట ధర రూ.3,926 లభించింది.

పదో తరగతి పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

సాక్షి, అమరావతి: పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లింపునకు షెడ్యూల్ విడుదలైంది. శనివారం నుంచి నవంబర్ 10వ తేదీలోగా ఫీజు చెల్లించాలని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానంద రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11వ తేదీ నుంచి 16 వరకు రూ.50, 17వ తేదీ నుంచి 22 వరకు రూ.200, 23వ తేదీ నుంచి 30 వరకు రూ.500 ఆలస్య రుసుముతో ఫీజు చెల్లింపునకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. పాఠశాలల హెచ్‌ఎంలు నిర్ణీత సమయంలో ఫీజులు చెల్లించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు పొడిగింపు ఉండదని తెలిపారు.

రాష్ట్రంలో మహిళా ఓటర్లే అధికం

- మొత్తం ఓటర్లు 4,02,21,450
- మహిళా ఓటర్లు 2,03,85,851
- పురుష ఓటర్లు 1,98,31,791
- 18, 19 ఏళ్ల ఓటర్లు 2,88,155

2023 తుది ఓటర్ల జాబితా కన్నా 2.36 లక్షల ఓట్లు పెరుగుదల

ప్రకటించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా

జనవరి 1 వరకు అర్హతలున్న వారు ఓటర్‌గా నమోదుకు అవకాశం

డిసెంబర్ 9 వరకు నమోదు, అభ్యంతరాలకు గడువు

జనవరి 5న తుది ఓటర్ల జాబితా



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో మహిళలే నిర్ణేతలు కానున్నారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం ఓటర్లలో పురుషులతో పోలిస్తే మహిళలే అధికంగా ఉన్నారు. 2024 ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం.. రాష్ట్రంలో సాధారణ ఓటర్లు, ఓవర్సీస్, సర్వీసు ఓటర్లతో కలిపి మొత్తం 4,02,21,450 ఓటర్లున్నారు. ఇందులో అత్యధికంగా 2,03,85,851 మంది మహిళా ఓటర్లుండగా 1,98,31,791 మంది పురుష ఓటర్లున్నారు. పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లు 5,54,060 మంది అధికంగా ఉన్నారు. సర్వీసు ఓటర్లు 68,158 ఉండగా థర్డ్ జెండర్ ఓటర్లు 3,808 మంది ఉన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముసాయిదా ఓటర్ల జాబితా–2024ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా శుక్రవారం ప్రకటించారు. ఈ జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచారు. అలాగే రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముసాయిదా ఓటర్ల జాబితాను అందజేశారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి అర్హులైన ఓటర్లందరినీ నమోదు చేసేందుకు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను చేపట్టారు. శుక్రవారం నుంచి డిసెంబర్ 9 వరకు ఓటర్ల నమోదుకు, అభ్యంతరాలకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. డిసెంబర్ 26లోగా అభ్యంతరాలను, నమోదు దరఖాస్తులను పరిష్కరిస్తారు. వచ్చే ఏడాది జనవరి 5న ఓటర్ల తుది జాబితాను ప్రకటించనున్నారు.

మూడు జిల్లాలు మినహా..

రాష్ట్రంలో ప్రకాశం, శ్రీ సత్యసాయి, శ్రీకాకుళం మినహా మిగతా 23 జిల్లాల్లో పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లే అత్యధికం. పురుష, మహిళా ఓటర్లు కలిపి అనంతపురం జిల్లాలో అత్యధికంగా 19,79,775 ఓటర్లుండగా అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 7,40,857 మంది ఓటర్లు ఉన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో 18 నుంచి 19 ఏళ్ల ఓటర్లు 2,88,155 మంది ఉన్నారు. 2023 తుది ఓటర్ల జాబితాతో పోల్చితే తొలగింపులు, నమోదుల అనంతరం ముసాయిదా జాబితా–2024లో 2,36,586 మంది ఓటర్లు పెరిగారు.

నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు

వచ్చే ఏడాది ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1కి 18 ఏళ్లు నిండేవారు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా బూత్ లెవల్ ఆఫీసర్, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లతో నవంబర్ 4, 5 తేదీలు, డిసెంబర్ 2, 3 తేదీల్లో (శని, ఆదివారాలు) ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తారు. ఆయా పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాతో ఆ తేదీల్లో వారు అందుబాటులో ఉంటారు. ఆయా పరిధిలోని ఓటర్లు తమ పేర్లు ఉన్నాయా, లేవా అనే విషయాన్ని పరిశీలించుకుని, లేకపోతే దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు కూడా అవకాశం ఉంది. క్షేత్రస్థాయి డాక్యుమెంట్లతో తనిఖీల ద్వారా ఓటర్ల జాబితాలో 21.18 లక్షల ఓటర్లను తొలగించారు. 99.9 శాతం తనిఖీలు పూర్తయ్యాయి. వెయ్యి మంది జనాభాకు ఓటర్ల నిష్పత్తి 729, జెండర్ రేషియో 1,031గా ఉంది. రాష్ట్రంలో మొత్తం పోలింగ్ కేంద్రాలు 46,165 ఉన్నాయి.

జిల్లాలవారీగా సర్వీసు ఓటర్లతో కలిపి ముసాయిదా జాబితాల్లో మొత్తం ఓటర్ల సంఖ్య..

జిల్లా	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
శ్రీకాకుళం	9,24,125	9,19,078	173	18,43,376
విజయనగరం	7,55,295	7,67,507	102	15,22,904
పార్వతీపురం మన్యం	3,78,299	3,94,343	65	7,72,707
అల్లూరి సీతారామరాజు	3,57,184	3,83,640	33	7,40,857
విశాఖపట్నం	9,54,483	9,64,726	133	19,19,342
అనకాపల్లి	6,16,967	6,44,643	47	12,61,657
కాకినాడ	7,84,509	8,05,808	239	15,90,556
డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	7,41,525	7,48,049	22	14,89,596
తూర్పుగోదావరి	7,64,359	7,96,605	108	15,61,072
పశ్చిమ గోదావరి	7,10,448	7,37,854	77	14,48,379
ఏలూరు	7,79,541	8,09,640	123	15,89,304
కృష్ణా	7,21,780	7,61,546	90	14,83,416
ఎన్టీఆర్	8,02,368	8,37,019	157	16,39,544
గుంటూరు	8,41,796	8,95,437	214	17,37,447
బాపట్ల	6,21,735	6,46,112	75	12,67,922
పల్నాడు	8,35,184	8,67,308	214	17,02,706
ప్రకాశం	8,94,140	8,92,862	108	17,87,110
ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు	9,36,083	9,75,104	245	19,11,432
కర్నూలు	9,80,227	9,92,397	306	19,72,930
నంద్యాల	6,71,225	6,89,305	271	13,60,801
అనంతపురం	9,87,727	9,91,816	232	19,79,775
శ్రీ సత్యసాయి	6,86,564	6,81,846	61	13,68,471
వైఎస్సార్	7,86,262	8,12,802	246	15,99,310
అన్నమయ్య	6,69,849	6,89,492	138	13,59,479
చిత్తూరు	7,67,068	7,81,976	108	15,49,152
తిరుపతి	8,63,048	8,98,936	221	17,62,205
మొత్తం	1,98,31,791	2,03,85,851	3,808	4,02,21,450

పాచి పాటే.. మళ్లీ మీ నోటా!?

- నాలుగేళ్లపాటు ఆరోపించి అభాసుపాలైన టీడీపీ
- దాంతో పురందేశ్వరిని రంగంలోకి దింపిన బాబు
- రాజకీయ ఉనికి కోసం పాచిపాట పాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు
- బీజేపీ 'పచ్చ'బ్యాచ్‌లోకి చేరాక మరిది కోసం పసలేని ఆరోపణలు
- అస్మదీయుల డిస్టిలరీలకు అడ్డగోలుగా ప్రయోజనం కల్పించింది చంద్రబాబే
- పచ్చ పైత్యంతో ఆమె వాస్తవాలు గుర్తించడంలేదు.. అప్పట్లో కేవలం నాలుగైదు కంపెనీలకే 70% ఆర్డర్లు
- ఇది గూడుపుఠాణి కాదా? దీన్నెందుకు ఆమె అప్పట్లో ప్రశ్నించలేదు?
- రాష్ట్రంలో సమర్థంగా దశలవారీ మద్య నియంత్రణ విధానం
- డిస్టిలరీల నుంచి పారదర్శకంగా మద్యం కొనుగోళ్లు
- పురందేశ్వరి ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని బేవరేజస్ కార్పొరేషన్ పునరుద్ఘాటన

సత్ఫలితాలిస్తున్న దశలవారీ మద్య నియంత్రణ

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న దశలవారీ మద్య నియంత్రణ విధానంతో రాష్ట్రంలో మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గాయి. అందుకు ఈ గణాంకాలే సాక్ష్యం..

టీడీపీ ప్రభుత్వంలో మద్యం విక్రయాల పెరుగుదల ఇలా.. (కేసుల్లో)

ఏడాది	ఐఎంఎల్ విక్రయాలు	బీరు విక్రయాలు
2017-18	3.60 కోట్లు	2.27 కోట్లు
2018-19	3.84 కోట్లు	2.77 కోట్లు

వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం విక్రయాల తగ్గుదల ఇలా.. (కేసుల్లో)

ఏడాది	ఐఎంఎల్ విక్రయాలు	2018-19తో పోలిస్తే తగ్గిన విక్రయాలు	బీరు విక్రయాలు	2018-19తో పోలిస్తే తగ్గిన విక్రయాలు
2019-20	3.08 కోట్లు	20 శాతం	2.12 కోట్లు	23 శాతం
2020-21	1.87 కోట్లు	51 శాతం	57 లక్షలు	79 శాతం
2021-22	2.63 కోట్లు	31 శాతం	82 లక్షల	71 శాతం
2022-23	3.35 కోట్లు	13 శాతం	1.16 కోట్లు	58 శాతం
2023 (ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు)	1.45 కోట్లు	-----	54 లక్షలు	-----

సాక్షి, అమరావతి: కొత్త బిచ్చగాడు పొద్దెరగడు అంటే ఇదేనేమో.. బీజేపీలో సుజనాచౌదరి, సీఎం రమేశ్ వంటివారు చంద్రబాబు స్లీపర్‌సెల్స్‌గా ఇప్పటికే పనిచేస్తున్నారు. చంద్రబాబు రాజకీయంగా ఇబ్బందుల్లో పడ్డ ప్రతిసారి వారు బీజేపీ ముసుగులో టీడీపీ ప్రయోజనాల కోసం హైరానా పడుతూ ఉంటారు. తాజాగా.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కూడా ఇప్పుడా జాబితాలోకి వచ్చి చేరారు. బీజేపీ పచ్చబ్యాచ్‌లో కొత్తగా చేరిన ఆమె తన మరిది చంద్రబాబు వద్ద మార్కులు కొట్టేసేందుకు తెగతాపత్రయ పడుతున్నారు. రాష్ట్రంలో మద్యం విక్రయాలపై నాలుగేళ్లుగా టీడీపీ చేసిచేసి వదిలేసిన పసలేని, పాచిపోయిన ఆరోపణలనే ఆమె తాజాగా ఆలపిస్తున్నారు. రోజుకో అసత్య ఆరోపణతో పచ్చ మీడియాలో ప్రముఖంగా కనిపించేందుకు నానాపాట్లు పడుతున్నారు. కానీ, పురందేశ్వరి తాజాగా చేస్తున్న ఆరోపణలన్నీ పూర్తి నిరాధారమని ఇప్పటికే పలుసార్లు స్పష్టమైంది. గతంలో టీడీపీ, ప్రస్తుతం పురందేశ్వరి చేస్తున్న దుష్ప్రచారాన్ని రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ ఆధారాలతో సహా సమర్థంగా తిప్పికొట్టింది. ఆమె తాజాఆరోపణలు పూర్తిగా అవాస్తవమని బెవరేజస్ కార్పొరేషన్ పునరుద్ఘాటించింది.

నిజాలు చూడమ్మా.. కట్టు కథలు కట్టిపెట్టమ్మా

రాష్ట్రంలో కొన్ని డిస్టిలరీల నుంచే ప్రభుత్వం అత్యధికంగా మద్యం కొనుగోలు చేస్తోందని పురందేశ్వరి చేసిన ఆరోపణ బెడిసికొట్టింది. మద్యం కొనుగోళ్ల కోసం 2015 నుంచి రాష్ట్రంలో అమలుచేస్తున్న విధానాన్నే ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. ఇక మద్యం కొనుగోళ్లపై ఆమె చెప్పిన లెక్కలన్నీ కాకిలెక్కలేనన్నది స్పష్టమైంది. రాష్ట్రంలో ఉన్న 20 డిస్టిలరీల నుంచి పారదర్శకంగా మద్యం కొనుగోలు చేస్తున్నారని బెవరేజస్ కార్పొరేషన్ రికార్డులు వెల్లడించాయి. అవి..

- ఆదాన్ డిస్టిలరీ నుంచి ఒక ఏడాదిలోనే రూ.1,164.38 కోట్ల విలువైన మద్యం కొన్నారని పురందేశ్వరి ఆరోపించారు. కానీ, 2019, అక్టోబరు 1 నుంచి 2023, సెప్టెంబరు 30 వరకు అదాన్ డిస్టిలరీ నుంచి మద్యం కొనుగోళ్లకు ప్రభుత్వం చెల్లించింది కేవలం రూ.443.01 కోట్లు మాత్రమే.
- ఎస్‌పీవై డిస్టిలరీస్ నుంచి రూ.1,863 కోట్ల విలువైన మద్యం కొనుగోలు చేశారని పురందేశ్వరి ఆరోపించారు. కానీ, ఆ డిస్టిలరీ నుంచి కూడా ప్రభుత్వం నాలుగేళ్లలో రూ.876.38 కోట్లు విలువైన మద్యమే కొనుగోలు చేసింది.
- ఇక ఎస్ఎన్‌జీ డిస్టిలరీస్ నుంచి ప్రభుత్వం రూ.1,996.66 కోట్లు విలువైన మద్యం కొనుగోలు చేసిందని పురందేశ్వరి ఆరోపించారు. దాని నుంచి కూడా ప్రభుత్వం రూ.1,214.40 కోట్ల మద్యమే కొనుగోలు చేసింది.
- అలాగే, రాడికో ఖైతాన్ డిస్టిలరీ నుంచి రూ.948.64 కోట్ల విలువైన మద్యం కొనుగోలు చేసినట్లు పురందేశ్వరి ఆరోపించారు. కానీ, ఆ డిస్టిలరీ నుంచి ప్రభుత్వం రూ.719.92 కోట్ల విలువైన మద్యాన్నే కొనుగోలు చేసింది.

మద్యం మాఫియా ఆటకట్టించిన సీఎం జగన్..

నిజానికి.. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో మూడు మద్యం షాపులు.. ఆరు బెల్ట్ షాపులుగా యథేచ్ఛగా సాగిన మద్యం సిండికేట్ దోపిడీకి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముగింపు పలికింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క విధాన నిర్ణయంతో మద్యం సిండికేట్ దోపిడీని నిర్మూలించారు. రాష్ట్రంలో ప్రైవేటు మద్యం దుకాణాల విధానాన్ని ఆయన రద్దుచేశారు. 2019, అక్టోబరు 1 నుంచి మద్యం దుకాణాలన్నీ ప్రభుత్వపరం చేసేశారు. అంతేకాక..

- మద్యం విక్రయాల సమయాలను బాగా కుదించారు. ఉ.10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకే విక్రయాలను అనుమతించి ఆ వేళలను కచ్చితంగా అమలుచేస్తున్నారు.
- చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ప్రైవేటు మద్యం దుకాణాలకు అనుబంధంగా రాష్ట్రంలో కొనసాగిన 43 వేల బెల్ట్ దుకాణాలను సమూలంగా తొలగించారు.
- అలాగే, మద్యం దుకాణాలకు అనుబంధంగా ఉన్న 4,380 పర్మిట్ రూమ్‌లను రద్దుచేశారు.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రైవేటు మద్యం దుకాణాలను పూర్తిగా తొలగించి ప్రభుత్వపరం చేసింది.
- అంతేకాక, మద్యం దుకాణాలను క్రమంగా తగ్గిస్తూ వస్తోంది. 2019లో రాష్ట్రంలో 4,380 ప్రైవేటు మద్యం దుకాణాలు ఉండగా ప్రస్తుతం 2,934 ప్రభుత్వ మద్యం దుకాణాలే ఉన్నాయి.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బార్ల సంఖ్యను కూడా పెంచలేదు. 2019లో ఖరారుచేసిన 840 బార్లే ఇప్పటికీ ఉన్నాయి. కొత్త బార్లకు లైసెన్సులూ ఇవ్వలేదు.
- ఒక్కో వ్యక్తికి గరిష్టంగా ఆరు బాటిళ్లు అమ్మేందుకు ఉన్న పరిమితిని మూడు బాటిళ్లకు కుదించింది. మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగానే మద్యపాన వ్యసనాన్ని నిరుత్సాహ పరిచేందుకు మద్యం ధరలు షాక్ కొట్టేలా పెంచారు. ఏఆర్ఈటీ పన్నుతో రాబడి పెరుగుతున్నట్లు కనిపిస్తున్నా వాస్తవానికి మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గాయి.

చంద్రబాబు హయాంలో అడ్డగోలుగా కొనుగోళ్లు..

పచ్చ పైత్యంతో పురందేశ్వరి వాస్తవాలను గుర్తించడంలేదు కానీ.. మద్యం కొనుగోళ్లలో అస్మదీయుల డిస్టిలరీలకు అడ్డగోలుగా ప్రయోజనం కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. ఎందుకంటే.. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే చంద్రబాబు అత్యంత సన్నిహితులైన వారికే ఎక్కువ మద్యం ఆర్డర్లనీ కట్టబెట్టారు. కేవలం నాలుగైదు కంపెనీలకు మాత్రమే 70శాతం ఆర్డర్లు ఇచ్చారు. తన సన్నిహితులు, బినామీలకు ఏకపక్షంగా ఆర్డర్లు ఇచ్చేసి అడ్డగోలుగా ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. అది ఎలాగంటే..

- చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత 2014–15 నుంచి 2018–19 వరకూ ఇష్టారాజ్యంగా మద్యం కొనుగోళ్లు చేశారు. టీడీపీ ప్రభుత్వం తొలి ఏడాదిలో యునైటెడ్ స్పిరిట్స్‌కు 46.01%, రెండో ఏడాది 45.31%, మూడో ఏడాది 44.29%, నాలుగో ఏడాది 37.69%, ఐదో ఏడాది 31.9% ఆర్డర్లు ఇవ్వడమే దీనికి నిదర్శనం.
- అలైడ్ బ్లెండర్స్ మరియు డిస్టిలరీస్‌కు వరుసగా ఆ ఐదేళ్లలో 9.43%, 13.41%, 10.04%, 10.73%, 7.53 శాతం ఆర్డర్లు దక్కాయి. ఇలా మొదటి నాలుగైదు కంపెనీలకే దాదాపు 70శాతానికి పైగా ఆర్డర్లు దక్కాయి. మిగిలిన కంపెనీలకు అరకొరగా ఇచ్చేవారు.

ఆ మతలబును ఎందుకు ప్రశ్నించలేదు?

చంద్రబాబు ప్రభుత్వంలో కూడా 100కు పైగా మద్యం డిస్టిలరీలు ఉన్నాయి. కానీ, వాటిలో కేవలం నాలుగైదు డిస్టిలరీలకే 70శాతానికి పైగా మద్యం ఆర్డర్లు ఇవ్వడం వెనుక ఉన్న గూడుపుఠాణి ఏమిటన్నది పురందేశ్వరి ఏనాడూ ప్రశ్నించలేదు. మరి దీనివెనుక మతలబు ఏమిటి? ఇది కుంభకోణం కాదా? మరి ఆనాడు ఎందుకు ప్రశ్నించలేదో పురందేశ్వరే సమాధానం చెప్పాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని డిస్టిలరీలకు దాదాపు సమానంగా మద్యం ఆర్డర్లు ఇస్తూ పారదర్శక విధానాన్ని పాటిస్తుంటే ప్రశ్నించడం విడ్డూరంగా ఉంది.

- ప్రజలను మద్యం మహమ్మారి నుంచి దూరం చేసేందుకు మద్య విమోచన కమిటీని ఏర్పాటుచేసి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.
- ప్రత్యేకంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను ఏర్పాటుచేసి గంజాయి, అక్రమ మద్యం, సారా దందా ఆటకట్టిస్తోంది.

నగదు, డిజిటల్ విధానంలో చెల్లింపులు..

రాష్ట్రంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నగదు చెల్లింపులతోపాటు డిజిటల్ చెల్లింపుల విధానాన్ని కూడా బెవరేజస్ కార్పొరేషన్ ప్రవేశపెట్టింది. నగదు విక్రయాల ద్వారా వచ్చిన మొత్తాన్ని ఏ రోజుకా రోజు ఆ సమీపంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలోజమచేస్తున్నారు. రోజువారి మద్యం నిల్వలు, అమ్మకాలు, బ్యాంకులో జమచేసిన నగదు వివరాలన్నీ కూడా బెవరేజస్ కార్పొరేషన్ పారదర్శకంగా వెల్లడిస్తోంది.

నాణ్యతలోనూ రాజీలేకుండా..

ఇక రాష్ట్రంలో విక్రయిస్తున్న మద్యం నాణ్యత విషయంలో ప్రభుత్వం ఏమాత్రం రాజీ పడటంలేదు. మద్యం నాణ్యతను పరీక్షించేందుకు బెవరేజస్ కార్పొరేషన్ రూ.12.5 కోట్ల వ్యయంతో అత్యాధునిక ల్యాబొరేటరీలను నెలకొల్పింది. టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 96,614 శాంపిల్స్‌ను మాత్రమే పరీక్షించగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సగటున ఏడాదికి 1,26,083 శాంపిల్స్ పరీక్షిస్తోంది.

రాష్ట్రంలో మద్యం వినియోగం తగ్గిందన్న కేంద్రం..

మరోవైపు.. రాష్ట్రంలో మద్య వినియోగం గణనీయంగా తగ్గిందని కేంద్ర ప్రభుత్వ నివేదికే వెల్లడించింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) నివేదిక ప్రకారం 2015–16లో రాష్ట్రంలో 34.9 శాతం మంది పురుషులు, 0.4 శాతం మంది మహిళలు మద్యం సేవించేవారు. అదే 2019–21 నాటికి పురుషులు 31.2 శాతానికి, మహిళలు 0.2 శాతానికి తగ్గారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా అమలుచేస్తున్న దశల వారీ మద్య నియంత్రణ విధానంతోనే ఈ సత్ఫలితాలు సాధ్యమయ్యాయి.

అవన్నీ చంద్రబాబు అనుమతిచ్చిన డిస్టిలరీలే..

నిజానికి.. రాష్ట్రంలో ప్రస్తుతం మద్యం తయారుచేస్తున్న డిస్టిలరీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుమతివ్వలేదు. వాటన్నింటికీ అనుమతినిచ్చింది చంద్రబాబు ప్రభుత్వం, అంతకుముందున్న ప్రభుత్వాలే. రాష్ట్రంలో 20 మద్యం డిస్టిలరీలు ఉంటే వాటిలో 14 డిస్టిలరీలకు చంద్రబాబు సీఎంగా ఉండగానే అనుమతినిచ్చారు. మిగిలిన ఆరు డిస్టిలరీలకు అంతకుముందు ప్రభుత్వాలు అనుమతినిచ్చాయి. ఇక చంద్రబాబు టీడీపీ కీలక నేతలకు, వారి కుటుంబ సభ్యులకు చెందిన కంపెనీలకే అనుమతులిచ్చారు. ఉదా..

- పీఎంకే డిస్టిలరీ టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అల్లుడు పుట్టా మహేశ్ కుమార్‌ది. ఆయన టీడీపీ నేత పుట్టా సుధాకర్‌కు కుమారుడు కూడా.
- శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ టీడీపీ మాజీ ఎంపీ దివంగత డీకే ఆదికేశవులనాయుడు కుటుంబానిది. ఎస్పీవై ఆగ్రో ప్రొడక్షన్స్ టీడీపీ నేత, మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డి కుటుంబానిది. వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీగా గెలిచిన ఎస్పీవై రెడ్డి టీడీపీలో చేరినందుకు నజరానాగా ఆ డిస్టిలరీకి చంద్రబాబు అనుమతిచ్చారు. ఇక బాబు ప్రభుత్వం 2019 ఎన్నికలకు ముందు ఆగమేఘాల మీద 2019, ఫిబ్రవరి 25న అనుమతినిచ్చిన విశాఖ డిస్టిలరీస్‌లో టీడీపీ సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు వాటాదారుగా ఉన్నారు. .. ఇలా చంద్రబాబు అనుమతిచ్చిన డిస్టిలరీల నుంచే రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం మద్యం కొనుగోలు చేస్తోంది. అందులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందేముంది? ఈ వాస్తవాలు కనిపించవా.. పురందేశ్వరి!?

దేశం అనుకరించేలా ఏపీ విజన్ ప్రణాళిక-2047

- ఆ మేరకు విజన్ డాక్యుమెంట్ రూపొందించాలన్న నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి వి.రాధా



నీతి ఆయోగ్ అధికారులతో మాట్లాడుతున్న సీఎస్

సాక్షి, అమరావతి: దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజన్ ప్రణాళిక-2047ను అనుకరించేలా అద్భుతమైన విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాలని నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి వి.రాధా.. రాష్ట్ర ఉన్నతాధికారులకు సూచించారు. ప్రాథమిక, ఉత్పాదక, సామాజిక రంగాలకు సంబంధించి పలు అంశాలపై వర్క్‌షాపులో ఫలవంతంగా చర్చలు జరిగాయన్నారు. రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న నీతి ఆయోగ్ వర్క్ షాపులో భాగంగా శుక్రవారం రాష్ట్ర విద్యా రంగంపై సుదీర్ఘ చర్చ జరిగింది. వి.రాధా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అమలు చేయాల్సిన సంస్కరణలపై విద్యా వేత్తలు, మేధావులు పలు సూచనలు చేశారని, వాటిని అమలు చేయాలంటే కేంద్ర స్థాయిలోని పలు విద్యా సంస్థల్లో వ్యవస్థాగతంగా కీలక మార్పులు, చేర్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతకు ముందు రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్ర పాఠశాల విద్యా విభాగంలో అమలు పరుస్తున్న పలు విద్యా సంస్కరణలను వివరించారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు, అక్షరాశ్యత శాతం పెంపుతో పాటు రాష్ట్ర విద్యార్థులు ప్రపంచ స్థాయి పోటీ పరీక్షల్లో దీటుగా నిలబడేందుకు అవసరమైన అన్ని రకాల శిక్షణలను ప్రాథమిక స్థాయి నుంచే అందజేస్తున్న విషయాన్ని తెలిపారు. రాష్ట్ర విజన్ ప్రణాళిక-2047లో భాగంగా పాఠశాల విద్యా విభాగం లక్ష్యాలు, అమలు చేయనున్న వ్యూహాత్మక ప్రణాళికలను వివరించారు. ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ కమిషనర్, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్, పలువురు ఉన్నతాధికారులు, విద్యా వేత్తలు ప్రసంగించారు. నీతి ఆయోగ్ డీఎంఈవో డైరెక్టర్ జనరల్ సంజయ్ కుమార్, ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, ఏపీఎస్ఎస్‌డీసీ సీఈవో ఎండీ డా.వినోద్ కుమార్, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి.నాగరాణితో పాటు నీతి ఆయోగ్ సలహాదారులు సీహెచ్ పార్థసారథిరెడ్డి, పబ్లిక్ పాలసీ నిపుణుడు అమ్రిత్ పాల్ కౌర్, సీనియర్ కన్సల్టెంట్ శైలీ మణీకర్, పర్యవేక్షణ, మూల్యాంకన నిపుణుడు బిప్లవ్ నంది, బోస్టన్ కన్సల్టెంట్ గ్రూపు ప్రతినిధి అభిషేక్ పాల్గొన్నారు.

కేంద్ర నిధులకు సిఫార్సు చేయండి: సీఎస్

విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో నీతి ఆయోగ్ ప్రతినిధి బృందం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కే ఎస్ జవహర్‌రెడ్డిని కలిసింది. నిధులు సమకూర్చేందుకు నీతి ఆయోగ్ కేంద్రానికి తగిన సిఫార్సులు చేయాలని సీఎస్ విజ్ఞప్తి చేశారు.

ఉత్పత్తి ధరలకే చేనేత వస్త్రాల విక్రయం

- ఏపీ చేనేత, జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి సునీత
- హైదరాబాద్‌లో 2 వరకు చేనేత ప్రదర్శన

సాక్షి, హైదరాబాద్: ఉత్పత్తి ధరలకే అందిస్తున్న చేనేత వస్త్రాలను ఆదరించి, నేత కార్మికులకు సహకరించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత చెప్పారు. హైదరాబాద్ శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళిశాఖ, ఆప్కో సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబరు రెండోతేదీ వరకు జరిగే ఈ ప్రదర్శనలో వినియోగదారులకు ప్రత్యేక రాయితీలు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత ప్రదర్శనలో దాదాపు 40 చేనేత పారిశ్రామిక సహకార సంఘాలు పాల్గొంటున్నాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు జరిగే ఈ ప్రదర్శన, విక్రయాలను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆ కార్యక్రమంలో చేనేత, జౌళిశాఖ అదనపు సంచాలకుడు శ్రీకాంత్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

కాంగ్రెస్‌లో చేరిన మోత్కుపల్లి, విద్యాసాగర్

- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో రాజగోపాల్‌రెడ్డి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ/యాదాద్రి/పటాన్‌చెరు టౌన్: గురువారం రాత్రి ఢిల్లీలో కాంగ్రెస్‌లో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. శుక్రవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మరికొందరు ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ ఎమ్మెల్సీలు టి.సంతోష్‌కుమార్, కపిలవాయి దిలీప్, ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు నీలం మధు ముదిరాజ్, నకిరేకల్ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి, ఆమె భర్త గంగాధర్‌రావు తదితరులకు ఖర్గే పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనుగోడు స్థానాన్ని రాజగోపాల్‌రెడ్డికి ఖర్గే ఖరారు చేశారు. పార్టీ అభ్యున్నతికి, గెలుపు లక్ష్యంగా చేయాలంటూ ఖర్గే సూచించారు.

మేమొస్తే బీసీ సీఎం

- సూర్యాపేట జనగర్జన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటన
- బీఆర్ఎస్ గెలిస్తే ఈసారైనా దళితుడిని సీఎం చేస్తావా? అని కేసీఆర్‌కు సవాల్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ/ సూర్యాపేట: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ఆ పార్టీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించారు. ప్రజలు బీఆర్ఎస్‌ను గద్దె దించి, బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఏర్పడితే దళితుడిని సీఎం చేస్తానని చెప్పిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక మోసం చేశారని మండిపడ్డారు. ఒకవేళ ఈసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఈసారైనా దళితుడిని సీఎం చేస్తావా చెప్పాలని కేసీఆర్‌కు సవాల్ చేశారు. కేసీఆర్‌కు తన కొడుకు కేటీఆర్‌ను సీఎం చేయడం లక్ష్యమైతే.. కాంగ్రెస్ లక్ష్యం రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమని.. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ బీసీ, దళిత వ్యతిరేక పార్టీలేనని విమర్శించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన జనగర్జన సభలో అమిత్‌షా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ''బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు కూడా కుటుంబ సంక్షేమం కోసం పనిచేస్తుంటే ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ దేశంలో, రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతోంది. సీఎం కేసీఆర్ దళితులకు ఇస్తామన్న మూడెకరాల భూమి హామీ ఎక్కడికి పోయింది? దళితుల ప్రత్యేక అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.50వేల కోట్లతో పెడతానన్న ప్రత్యేక బడ్జెట్ హామీ ఏమైంది? బీసీల సంక్షేమం కోసం రూ.10వేల కోట్లతో ఏటా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతానని చెప్పిన కేసీఆర్ ఏం చేశారు?'' అని ఆయన నిలదీశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943